# విశ్వనాథ్ విశ్వరూపం




అనామకుడు

(డా. ఎ. ఎస్. రామశాస్త్రి)


Jagadguru and Jagat
Art Exhibition
By
Mother and Daughter
Art Exhibition by
Mother and Daughter

# విశ్వనాథ్ విశ్వరూపం

అనామకుడు
(డా. ఎ. ఎస్. రామశాస్త్రి)

అపరాజిత పబ్లికేషన్స్

**Visvanath Visvaroopam**
By Anamakudu
(Dr A S Ramasastri )

First Edition October 2021

@ Author

Cover:
**Allamraju Aparajitha**

Layout:
**Ganji R L Varaprasad**

Publisher:
**Aparajitha Publications**
Hyderabad, INDIA

For Copies:
All Major Bookshops
80085 99901
Price : ₹ 1000 / $ 30

For Digital Copies:
**kinige.com**
**asramasastri.com**
Price : ₹ 500 / $ 15

# అంకితం

ఐదు దశాబ్దాలుగా
నా జీవితాన్ని

ఆర్ద్రతతో
నింపుతున్న

దర్శకులు
**శ్రీ కె. విశ్వనాథ్** గారి

మేధకీ, సృజనకీ
అంకిత భావానికీ

అభిమాని
**అనామకుడు**
(డా. ఎ. ఎస్. రామశాస్త్రి)

K. VISWANATH

శ్రీ శాస్త్రి గారికి,

నమస్కారములు.

మీరు నా గురించి, నా చిత్రాల గురించి
ఎంతో కూలంకషంగా, వైవిధ్యభరితంగా -
ఒక M.Phil కి థీసిస్ వ్రాసినట్లుగా రాసినందుకు
నేనెంతో కృతజ్ఞుడను. ఇది అంత తేలికైన -
- రచన కాదు. ఏ రామాయణానికో అంతరార్థ -
- రామాయణం రాసినంత కష్టతరమైనది.
ఈ రచనలో మీరు కృతకృత్యులయ్యారని -
- భావిస్తున్నాను.

వయసులో పెద్దవాడిగా మీకు -
- నా శుభాశీస్సులు.

ఇట్లు
భవదీయుడు.
Viswanath [signature]
కె. విశ్వనాథ్

KASINADHUNIS
Plot No : 53-A, Road No : 11, Film Nagar, Jubilee Hills, Hyderabad - 500 096

# ఓం శ్రీ లలితాదేవ్యై నమః

'అనామకుడు' చాలా మంచి పేరు. మంచి అనడం కన్న సత్యం అనడం సముచితం.

అనామకుడు అంటే మనిషి తాలూకు తొలిపేరు. సహజమైనపేరు. అసలైనపేరు.

శ్రీ రామశాస్త్రిగారు తన "మనిషితనం" తనంతో పూజ్యులు శ్రీ కాశీనాథుని విశ్వనాథ్ గారి "కళాతపస్సు" ను చూసారు.

శ్రీ విశ్వనాథ్ గారి సినిమాలు "మనిషితనం" గురించి. దానికి ఆధారభూతమైన జీవుడు గురించి.

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి భాషలో చెప్పాలంటే "జీవుడివేదన" గురించి.

జీవుడు బుద్ధి, చిత్తము, మనస్సు, అహంకారం ఇత్యాది నామాంతరాలతో పిలవబడుతున్న బద్ధచైతన్యం.

అంటే అనంతమూ, అవ్యయమూ అయిన శుద్ధచైతన్యం పాంచభౌతికమైన ఉపాధిలో బందీ అయిఉండడం.

మామూలు లౌకిక భాషలో అనుకోవాలంటే సూర్యుడి ప్రతిబింబం చిన్న నీటి చెలమలో కనిపించడం లాంటిది.

శ్రీ విశ్వనాథ్ గారి నిర్దేశకత్వంలో, దర్శకత్వంలో, దార్శనికతలో సాకారమైన భావాలను అంతశ్చక్షువులతో చూడగలగాలి. ఆత్మసాక్షిగా దర్శించగలగాలి. మనస్సుతో అనుభూతించగలగాలి.

అలాచేసి,

శ్రీ రామశాస్త్రి గారు (సనామకులు) శ్రీ విశ్వనాథ్ గారి తపస్సునీ, ఆ తపః ఫలాల్నీ తెలుగు ప్రజలకీ, చలనచిత్ర వీక్షకులకీ

సముచితంగా అందించగలిగారు.





ముందుమాట

# విశ్వ-వీణకు విశిష్ట తంత్రి

ఏదైనా విషయం మీద పరిశోధన చెయ్యాలంటే మనకి దానిమీద ఆసక్తి ఉండాలి... అవగాహన ఉండాలి... ఇష్టం ఉండాలి... ప్రేమ ఉండాలి...

'అనామకుడు' అని పేరు పెట్టుకున్న రామశాస్త్రిగారికి... వీటన్నిటితో పాటు... విశ్వనాథ్ గారి మీద అపారమైన 'భక్తి' ఉంది...

శంకరాభరణంతో... విశ్వవ్యాప్తమైపోయిన కళాతపస్వి విశ్వనాథ్ గారంటే... మాకూ ప్రేమ, గౌరవం... కానీ, రామశాస్త్రి గారికి... మరోస్థాయి పెరిగీ... 'పిచ్చి'గా స్థిరపడింది...

ప్రేమ- పిచ్చీ... ఒకటే అన్నాడో మహాకవి... అల్లాగే... పిచ్చంటే పరాకాష్ట... అందువల్లే ఇలాంటి... ఉద్గ్రంథం రాయగలిగారు రామశాస్త్రి గారు....

విశ్వనాథ్ గారి సినిమాలను... పరమ పవిత్రమైన మనస్సుతో చూసీ... పరిశీలించి... పరీక్షించి... పరామర్శించి... పరవశం చెందిన తర్వాత తప్ప ఇలాంటి... పుస్తకం రాయడం అసాధ్యం...

విశ్వనాథ్ గారి సినిమాలని... రామశాస్త్రి గారు స్పృశించని కోణం లేదు... ఒక్కోసారి బహుశా... విశ్వనాథ్ గారే ఆశ్చర్యపోయేంత పరిశీలన చేశారు... నిజంగా ఇదొక పరిశోధక గ్రంథం... ఒక 'పీ.హెచ్.డి'; అంతకన్నా తక్కువ ఎంత మాత్రం కాదు..

ఒక విధంగా... ఇది... విశ్వనాథ-కాళిదాసుకి... అనామకుడు-మల్లినాథ సూరి వ్యాఖ్య... అంత గొప్పగా ఉంది..



శివోహం
తనికెళ్ళ భరణి

# విశ్వనాథ్ విశ్వరూపం

## అనుక్రమణిక


ప్రవేశిక ..... 01

పది ప్రత్యేకతలు ..... 19

శంకరాభరణం ..... 41

అటూ ఇటూ ఐదేసి చిత్రాలు ..... 75

పది చిత్రాలు - పది పాటలు ..... 115

మరపురాని సన్నివేశాలు ..... 143

సహ కళాకారులు ..... 173

అందానికి అందాలు ..... 191

అనుబంధం ..... 205

# ప్రవేశిక



# ప్రేరణ

కేలండర్ 1970 దశకానికి చేరినప్పటికి నాకు పదమూడేళ్ళు .

చిత్రాలకి అసలు హీరోలు తెరమీద కనిపించే నటీనటులు కాదు - తెర వెనక ఉంటూ చిత్రాన్ని నడిపించే దర్శకులే అని అప్పుడప్పుడే అర్థం చేసుకుంటున్నాను. ప్రతి సన్నివేశంలో కనిపించకుండా కనిపించేది దర్శకులే అని తెలుసుకుంటున్నాను.

ఆ దశకం తొలి సగంలోనే చెల్లెలి కాపురం, నేరము శిక్ష, కాలం మారింది, శారద, జీవనజ్యోతి లాంటి చిత్రాలు తీసారు విశ్వనాథ్. ఆ చిత్రాలు చూస్తూ - ఆయన దర్శకత్వ ప్రతిభకి ఆశ్చర్యపోతూ, ఆనందపడిపోతూ వయస్సులో, మనస్సులో, అనుభవంలో ఎదుగుతూ వచ్చాను. విశ్వనాథ్ గారి చిత్రాలు నన్ను ఆయన అభిమానిని చేసాయి.

ఆ చిత్రాలు నా ఆలోచనలనీ, అభిరుచులనీ నెమ్మది నెమ్మది గా అభివృద్ధి చేసాయి. విభిన్న భాషలలో వివిధ చిత్రాలని అర్థం చేసుకోడానికే కాకుండా ఆయన చిత్రాలలో ప్రత్యేకతలని అవగతం చేసుకుందుకు కూడా ఆయన చిత్రాలే దోహదం చేసాయి.

1970 దశకం మలి సగంలో తీసిన సిరిసిరిమువ్వ, సీతామాలక్ష్మి, శంకరాభరణం తర్వాత 1980 దశకంలో తీసిన సప్తపది, శుభలేఖ, సాగరసంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, శ్రుతిలయలు, స్వర్ణకమలం వంటి చిత్రాలన్నీ సినిమా అంటే ఇదీ అని అనుకునేలా చేసాయి.

ఆయన సినిమాలు చూస్తూ, ఆనందిస్తూ, కన్నీళ్ళు కారుస్తూ - నేను పొందుతున్న అనుభూతిని అక్షరబద్ధం చెయ్యాలని ఆలోచించడం మొదలెట్టాను. కాలం గడుస్తున్న కొద్దీ ఆ ఆలోచన బలపడుతూ వచ్చింది.

2017 జనవరిలో నా షష్టిపూర్తి సందర్భంగా నా శ్రీమతి డా. గాయత్రీదేవి, మా అమ్మాయి అపరాజిత జగత్-జగద్గురు శీర్షికతో తాము వేసిన చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేసారు. నా అరవయ్యో పుట్టినరోజుకి వాళ్ళిద్దరూ నాకు అందించిన అపురూపమైన కానుక అది.

ఆ చిత్రప్రదర్శన ప్రారంభోత్సవానికి విశ్వనాథ్ గారు వచ్చి మా కుటుంబాన్ని ఆశీర్వదించారు. అది మాకు మరపురాని అనుభవం. అయుర్వేద వైద్యురాలిగా నా శ్రీమతి ఆయనకి తెలిసి ఉండడం వల్ల కాస్త ధైర్యం చేసి మేము ఆహ్వానిస్తే అంతటి మహానుభావుడు పెద్ద మనస్సుతో అంగీకరించారు. నిజానికి ఆ పెద్ద మనస్సే ఆయన్ని మహానుభావుణ్ణి చేసింది.

ఆ సందర్భంలో ఆయనతో మాట్లాడుతూ మీ చిత్రాల మీద ఒక పుస్తకం రాయాలని ఉందని చెప్పాను. ఆయన ఆయన సరళిలో నిశ్శబ్దంగా హాయిగా నవ్వేసారు. ఇలాంటి మాటలు ఎంతో మంది దగ్గర ఎన్నో సార్లు విని ఉంటారు ఆయన. అందుకే నా మాటలకి నవ్వుకుని ఉంటారు.



అప్పటి నుండి విశ్వనాథ్ గారి మీద పుస్తకం రాయాలన్న ఆలోచన నన్ను వదలలేదు సరి కదా పెరుగుతూ వచ్చింది. ఆ ఆలోచన ఒక్కోసారి ఇంకా రాయవేం అని గారంగా అడిగేది. ఇంకో సారి ఇంక రాయి అని గద్దించేది. మరోసారి ఇంకేం రాస్తావ్ అని హేళన చేసేది.

ఈ మధ్య కాలంలో విశ్వనాదామృతం, విశ్వనాథ శాస్త్రీయం, గురుర్బ్రహ్మ కార్యక్రమాల విడియోలు చూస్తూనే ఉన్నాను. అలాగే శంకరాభరణం నలభై ఏళ్ళ సంబరాల విడియో కూడా.

ఆయన మీద ఎన్ని పరిశోధనలో, పరిశీలనలో, భాషణలో, సంభాషణలో. ఎందరెందరో పేరెన్నిక గన్న కళాకారులు, ఆయనతో సాన్నిహిత్యం ఉన్నవారు, కలిసి పనిచేసిన వారు ఆయన గురించి ఎంతెంతో చెప్పేస్తే ఇంక నేనేం రాస్తాను అని నా ఆలోచనకి జోల పాడదాం అని అనుకున్న ప్రతీసారీ - ఆయన చిత్రం చూడ్డమో, చిత్రంలో పాట వినడమో జరిగి నా ఆలోచన నన్ను వేడుకుంటూ, వేధిస్తూ, వెక్కిరిస్తూ తలెత్తేది.

ఇంక ఇలా కాదనుకుని రాయడానికి కంప్యూటర్ ముందు కూచున్నాను. ఆయన మేధ ఆకాశమంత విశాలంగా, ఆయన కళ సముద్రమంత లోతుగా కనిపించాయి. ఆయనలో ఏ పార్శ్వం గురించి రాయాలన్నా వేయేసి పుటల గ్రంథాలు తయారవుతాయని అనిపించింది. మహాపర్వతాన్ని అద్దంలో చూపే ప్రయత్నం మొదలెట్టాను.

ఆయన చిత్రాలలో చూపించినవన్నీ నేనెలాగూ చూపించలేను. అందుకని నేనెన్నో సార్లు చూసుకుని ఆనందించిన చిత్రాలనూ, సన్నివేశాలనూ ఎన్నుకున్నాను. ఎప్పుడైతే కొన్నింటిని ఎన్నుకున్నానో అప్పుడు అవే ఎందుకు ఎన్నుకున్నాను అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ఎంపికలు నా అనుభూతికి సంబంధించినవి. తార్కిక విశ్లేషణా ఫలితాలు కావు. అంకాధారిత శ్రేణులు కానే కావు.

నాకు తెలుసు - ఆయన చిత్రాలెన్నో ఆణిముత్యాలు. ఎన్నెన్నో సన్నివేశాలు మనోరంజకాలు. పాటలు అజరామరాలు.

ఆయన చలనచిత్రాల ఉద్యానవనంలో విహరిస్తూ నా మనస్సుకి ఆహ్లాదాన్నో, ఆనందాన్నో, ఆర్ద్రతనో ఇచ్చిన కొన్ని పువ్వులని కోసుకుని ఆయనకి సమర్పించుకుంటున్న మాల ఇది. ఈ మాలలో ఆయన మీద నాకున్న గౌరవం, ప్రేమా, అభిమానం మాత్రమే ఉన్నాయి.

ఈ పుస్తకం చదివే పాఠకుల కన్న విశ్వనాథ్ గారి చిత్రాల గురించి నాకు ఎక్కువ తెలుసునేమోనన్న భ్రమ కానీ, తెలుసునన్న అహంకారం కానీ అణువంత కూడా లేవు నాకు. ఆయన దర్శకత్వ సౌందర్యాన్ని ఆయన అభిమానులం అందరం కలిసి ఆస్వాదించడానికి ఈ చిరుపుస్తకం ఒక ఉపకరణం అవుతుందనీ, అవాలనీ నా ఆశ.



# సినిమా

నాకు పది పన్నెండేళ్ళు వచ్చినప్పట్నుంచీ తెలుగు సాహిత్యంతో సాన్నిహిత్యం ఉంది. పోతన భాగవత పద్యాలతో ప్రారంభమయ్యుంటుంది. తెలుగు సినిమా పాటలతో పెరుగుతూ వచ్చింది. రేడియోలో ఏ సినిమా పాట విన్నా అది ఎవరు రాసుంటారా అని ఊహించుకునేవాడిని. చాలాసార్లు నా ఊహ నిజమయ్యేది.



నాకు పధ్నాలుగేళ్ళ వయసప్పుడు వచ్చింది చెల్లెలికాపురం చిత్రం. అందులో కథా నాయకుడు ఒక కవి. నేను అప్పటికే ఛందోబద్ధమైన పద్యాలు రాస్తూండేవాడిని. సినిమాలో శోభన్ బాబులా జుబ్బా వేసుకుని ఫొటో కూడా తీయించుకున్న అమాయకపు వయస్సు అది. విడుదలైన రెండువారాలలో మూడు సార్లు ఆ సినిమా చూసేసిన ఆవేశపు ప్రాయం అది.

ఆచిత్రంలో సినారె కవితలూ, పాటలూ నన్నెంతో ఆకర్షించాయి. ముఖ్యంగా చరణకింకిణులు ఘల్లుఘల్లుమన అన్న పాట లోని భాష నన్ను ఎంతో ఆకట్టుకుంది. దీర్ఘ సమాసాలు నన్ను పరవశుణ్ణి చేసాయి. ఇంక ఆ పాట వింటున్నంతసేపూ నేను తెలియని ఉత్సాహంలో, ఉద్రేకంలో, ఉద్వేగంలో మునిగిపోయేవాణ్ణి.

రాగయుక్తంగా ఆ పాట వింటున్నప్పుడు నాకో సంగతి అర్థం అయింది. పాటంటే ఒక్క సాహిత్యమే కాదు. సంగీతం కూడా అని. సినిమా పాటంటే సాహిత్య సంగీతాల సమ్మేళనం అని.

అసలు మాటే లేకుండా నేపథ్య సంగీతంతోనే బాధనీ, సంతోషాన్నీ, సరసాన్నీ, వియోగాన్నీ, విప్లవాన్నీ వినిపించ వచ్చునని తెలిసింది. కవి రాసిన సాహిత్యానికి సంగీత దర్శకుడు రాగాలు కూర్చి సరికొత్త వన్నెచిన్నెలు చేర్చడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అలా రాగం కూర్చబడ్డ పాట గాయనీ గాయకుల కంఠాలలో ఎన్ని కొత్త పోకడలు పోతుందో అవగతం అయింది.

పుస్తకాలలో చదువుతున్న కవితలూ, పద్యాలూ ఒక కవి సృష్టించినవి. ఐతే సినిమా పాట సృష్టి ఒక్క రచయిత కృషితో ఆగిపోదు. అది కవి సృజనతో పాటు సంగీత దర్శకుడూ, గాయనీ గాయకులూ, తోటి వాయిద్య సహకారులూ అందించే కళాకృతులని  కలుపుకుని పరిపూర్ణమవుతుంది.

ఈ పాఠం నేను చెల్లెలి కాపురం సినిమా చూస్తూ, పాటలు వింటూ నేర్చుకున్నాను.

కవిత్వం, సంగీతం, గానం అన్నీ కళలే. ఐతే సినిమాలో ఇవి కాకుండా ఇంకా ఎన్నెన్నో కళలు ఉంటాయి. ఇంకెందరో కళాకారుల కృషి ఉంటుంది. కథా, మాటలూ, నృత్యం, ఛాయగ్రహణం, కూర్పు వంటి వాటిలో నిష్ణాతులు ఎందరో సినిమాకి తెరవెనక పనిచేస్తూ ఉంటారు. వాటికి తెరమీద కనిపించే నటీనటుల ఆంగిక వాచిక సాత్విక ఆహార్య అభినయాలు తోడౌతాయి.



ఇందరి కళాకారుల సమష్టి కృషి సినిమా. ఇన్ని కళల సమాహారం సినిమా.

అన్ని కళలని అందంగా అవిష్కరించే కళ కాబట్టే సినిమా పుట్టిన కొన్ని సంవత్సరాలకే జనజీవనంలో భాగమై పోయింది. తెలుగు వారికి జీవితమే ఐపోయింది.

అంతవరకూ అందరూ చూసి ఆనందించిన హరికథలనూ, బుర్రకథలనూ, తోలుబొమ్మలాటలనూ, నాటకాలనీ సినిమా పక్కకి తోసేసింది. ఇది కొందరికి బాధ కలిగించవచ్చు. ఐతే సినిమా ఆ కళలని తోసి ముందుకు రాడానికి ముఖ్యకారణం - సినిమాలో అన్ని కళలూ కలిసిపోవడం. చలనచిత్రం ఒక సంపూర్ణ కళాకృతిగా ఎదగడం. వినోదానికీ, వికాసానికీ మారుపేరైపోవడం.

పరీక్ష పాసైతే సినిమా. పుట్టినరోజైతే సినిమా. సెలవొస్తే సినిమా. ఇద్దరు స్నేహితులు కలిస్తే సినిమా. బంధువులు ఇంటికి వస్తే సినిమా. కుటుంబ సభ్యులు కలిసి వెళ్ళే విహారయాత్ర సినిమా.

రేడియోలో సినిమా పాటలు వినడం, సినిమా హాళ్ళకి వెళ్ళి సినిమాలు చూడడం, సినిమాల గురించి మాట్లాడుకోడం సర్వసాధారణమైపోయింది.

ఇదంతా తెలుగులో తొలి తెలుగు చిత్రం భక్తప్రహ్లాద 1932 లో విడుదలైన పది పదిహేను ఏళ్ళ లోపే జరిగిపోయింది. భక్తప్రహ్లాద విడుదలైన మూడు దశాబ్దాలకి తొలి రంగుల చిత్రం లవకుశ విడుదలయ్యే సరికి పాటలు పల్లెటూళ్ళ లో కూడా ప్రవేశించడమే కాకుండా బహుళ ప్రజాదరణ పొందాయి. ఘంటసాల, లీల, సుశీల అందరి ఇళ్ళ లో కుటుంబ సభ్యులైపోయారు. పాటలు విన్న జనం లవకుశ సినిమా చూడ్డానికి ఆ సినిమా పాటలే పాడుకుంటూ ఎడ్లబళ్ళ మీద మైళ్ళ దూరం ప్రయాణం చేసుకుంటూ వెళ్ళ డం కని విని ఎరుగని మహాద్భుతం.

నేను 1960-70 లలో వేసవి సెలవులకి మద్రాస్ నుండి రాజమండ్రి వెళ్ళి నప్పుడు మా మావయ్యలతో కలిసి రోజుకి మూడు ఆటలు మూడు సినిమాలు చూసిన రోజులు కూడా ఉన్నాయి. అదీ సినిమా మీద మన తెలుగు వాళ్ళకి ఉన్న ప్రేమా, మమకారం.

సావిత్రీ, జమునా, ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి నటీనటులందరూ అభిమానుల హృదయాల్లో పీట వేసుకున్న ఆ రోజులు తెలుగు సినిమాకి స్వర్ణయుగం రోజులు.

ఆ రోజుల్లో విశ్వనాథ్ సినిమా దర్శకత్వం ప్రారంభించారు. ఆ రోజుల్లోనే నేను సినిమాలని అర్థం చేసుకుని ఆనందించడం ఆరంభించాను.

# దర్శకుడు

సినిమా అంటే ఎన్నెన్నో కళల సమాహారం. ఎందరెందరో కళానిష్ణాతుల సమష్టి కృషి.

ఐతే సినిమా వాళ్ళలో ఏ ఒక్కరిదీ కాదు. అది దర్శకుడిది. తన మనస్సులో బీజం వేసుకున్న - తనకి మాత్రమే స్పష్టంగా కనిపిస్తున్న - తన సినిమా స్వరూపాన్ని - సన్నివేశాలుగా ఊహించుకునేది దర్శకుడు. ఏ సన్నివేశానికి ఏ కళాకారుడు ఏం చెయ్యాలో ఆలోచించుకునేది దర్శకుడు. తన సినిమాకి సరిపోయే కళాకారుల్ని సమకూర్చుకునేదీ దర్శకుడే.

తన ఊహలో ఉన్న సినిమాను తను ఎంచుకున్న కళాకారులందరితో విడివిడిగానూ కలివిడిగానూ పంచుకుని, ఒక్కొక్కరి దగ్గర నుండి తన సినిమాకి ఏం కావాలో అంతా - ఎంత కావాలో అంతే - చేయించుకునే వాడు దర్శకుడే. దిగ్గజాల వంటి కళాకారులలో ఏ ఒక్కరి సృజనాత్మతనీ తగ్గనీయకుండా - ఐతే అది మాత్రమే విడిగా కనిపించిపోనీయకుండా - అందరి సృజనా సినిమాలో కలిసిపోయేట్లు చేసుకోడమే దర్శకుడి ప్రతిభ. అందరికీ మార్గదర్శనం చేసేవాడు దర్శకుడు.

ఓ కథారచయితగా నేను రాసిన కొన్ని కథలలో నా మనస్సులోని ఆలోచన స్పష్టంగా చెప్పలేకపోయానే అని అనుకున్న సందర్భాలు లేకపోలేదు. నేను నా మనస్సులోని నా కథనే సరిగ్గా చెప్పలేకపోతుంటే - ఒక దర్శకుడు తన మనస్సులోని ఊహాచిత్రాన్ని అంతమందితో పంచుకుని, వారందరి చేతా తనకి కావల్సినట్లు చేయించుకుని, మంచి చలనచిత్రంగా మలచుకోడం ఎంత కష్టమో కదా అని అనిపిస్తుంది నాకు.

ఉదాహరణకి బి ఎన్ రెడ్డి మల్లీశ్వరి. ఆ చిత్రానికి మాటలూ పాటలు రాసింది భావకవుల దిగ్గజం దేవులపల్లి కృష్ణశాస్త్రి. సంగీతం అందించింది స్వర రాజేశ్వరుడు సాలూరి రాజేశ్వరరావు. నాయకీ నాయకులు - నటనకి మారుపేరైన అగ్రనటి భానుమతీ, అందాలనటుడిగా ఎదుగుతున్న నందమూరి. గాయనీ గాయకులు భానుమతీ, ఘంటసాల. వారందరి చేతా అత్యద్భుతంగా కళాసృజన చేయించి శాశ్వతంగా నిల్చిపోయే దృశ్యకావ్యంగా మల్లీశ్వరిని మలిచారు బి యెన్ రెడ్డి.

అంతెందుకు - అంతర్జాతీయంగా అందరి ఆదరణా అందుకుంటున్న బాహుబలి చిత్రానికి అసలైన నాయకుడు రాజమౌళే. తెరమీద కనిపించే నటీనటులూ, తెరవెనక పనిచేసిన సాంకేతిక నిపుణులూ - ఏ ఒక్కరు తక్కువ చేసినా, ఎక్కువ చేసినా ఆ సన్నివేశం దెబ్బ తిని ఉంటుంది. ఆ చిత్రం దారి తప్పి ఉంటుంది. అలా జరక్కుండా అందర్నీ తనతో నడిపించుకున్న ఘనత దర్శకుడు రాజమౌళిదే.

అందుకే నాకు ఏ సినిమా ఐనా దర్శకుడిదే అని అనిపిస్తుంది. విశ్వనాథ్‌గారు దర్శకత్వం వహించిన సినిమా ఒక్కొక్కటీ నా అభిప్రాయాన్ని నిరూపిస్తూనే ఉంది.

# తెలుగు సినిమా మార్గ దర్శకులు



**బి ఎన్ రెడ్డి**
కళ కళ కోసమే



**కె వి రెడ్డి**
ప్రేక్షకుడి పక్కనే కూచుని
సినిమా చూపించే మాయగాడు



**వేదాంతం రాఘవయ్య**
హాయిహాయిగా సంగీత నృత్యాలు



**కమలాకర కామేశ్వరరావు**
పౌరాణిక బ్రహ్మ



**బి విఠలాచార్య**
ఆలోచనలో హాలీవుడ్ కన్న
ముందున్న జానపదుడు



**ఆదుర్తి సుబ్బారావు**
మంచి సినిమాలతో పాటు
విశ్వనాథ్ గారిని కూడా ఇచ్చిన ఘనుడు



**కాశీనాథుని విశ్వనాథ్**
శంకారభరణం
ముందు వెనుకల వారధి



**సింగీతం శ్రీనివాసరావు**
నిత్య నూతన ప్రయోగాలు
ప్రయోగాలు ప్రయోగాలు



**బాపు - రమణ**
నీడల్లోంచి వెలుగుల్లోకి
వర్ణచిత్ర ప్రస్థానం



**శేఖర్ కమ్ముల**
మంచి కాఫీ లాంటి సినిమా



**రాజమౌళి**
ఆలోచనలోనూ ఆచరణలోనూ
ఆకాశమే హద్దు



**త్రివిక్రమ్ శ్రీనివాస్**
మాటల మాంత్రికుడు

# విశ్వనాథ్

2017 జనవరిలో నా షష్టిపూర్తి సందర్భంగా నిర్వహించిన చిత్రకళాప్రదర్శనకి విశ్వనాథ్ గారు వచ్చారు. ఆ సందర్భంలో సభాముఖంగా నేనన్న మాటలని మళ్ళీ పునశ్చరణ చేసుకుంటాను.

"నాగరికత నేర్చిన మనిషి నెమ్మదినెమ్మదిగా సంస్కృతిని పెంచుకున్నాడు. అందులో భాగంగా కళలని తీర్చిదిద్దుకున్నాడు. ఆహారం ఎంత అవసరమో ఆహ్లాదం కూడా అంతే అవసరం ఐంది మనిషికి. లలిత కళలు మనిషి మానసికావసరాలని తీరుస్తున్నాయి. అవే మనిషి జీవితాన్ని సంపూర్ణం చేస్తున్నాయి. విశ్వనాథ్ గారి సినిమాలు మన మనస్సులని రసానందంలో ముంచుతాయి. అవి మన జీవితాలకి అర్థం పరమార్థం ఇస్తాయి"



కొన్ని దశాబ్దాలుగా నా జీవితాన్ని కళామయం చేసిన వారు విశ్వనాథ్. తన చిత్రాలతో, చిత్రాలలోని పాటలతో నాలో సౌకుమార్యాన్నీ, సౌందర్యాన్నీ నింపుతున్న దర్శకులు ఆయన. నాకు ఉదాత్తమైన, ఉన్నతమైన ఆలోచనలనీ, అనుభూతులనీ అందిస్తున్నారు విశ్వనాథ్.

ఆయనతో మీరు చిత్రం బాగా తీసారు, ధన్యవాదాలు అని అంటే - నాకేం ధన్యవాదాలు చెప్పనక్కరలేదు - నేనేం ఊరికే తియ్యడంలేదు - సినిమాలు తియ్యడం నా వృత్తి ధర్మం - నేను డబ్బులు తీసుకున్నందుకు నా పనికి నేను న్యాయం చేస్తున్నాను - అని అంటారు. అలా అనుకోవడం, అనడం ఆయన క్రమశిక్షణకీ, పని నిబద్ధతకీ ఋజువు.

ఆయనకి వృత్తి మీద ఉన్న గౌరవానికి అందరికీ కనిపించే నిదర్శనం ఆయన సెట్ల మీద ధరించే ఖాకీ దుస్తులు. ఆ దుస్తులు తన్ని తానొక కార్మికుడినని గుర్తుచేస్తూ ఉంటాయి అని అంటారు. అలా అనుకోవడం, అనడం సామాన్యమైన విషయం కాదు. ఆయన అసామాన్యుడు అవడం వల్లే అందరూ ఆయన్ని కళాతపస్వి అని అంటారు.

కళాతపస్వి అన్న మాటకి కూడా ఆయన అభ్యంతర పెడతారు. తనేం పెద్ద ఋషీ, మునీ, తపస్వీ కాదంటారు. సినిమా దర్శకత్వ పనిని ఏకాగ్రతతో తపస్సులా చెయ్యడం వల్ల కొందరు కళాతపస్వి అని అంటున్నారేమో కానీ అంతకు మించి ఇంకేం లేదని అంటారు. అలా అనడం ఆయన వినమ్రతకీ, నిరాడంబరతకీ పరాకాష్ట.

ఆయన చెప్పింది వింటే నిబద్ధతతో పని చేసే ఎవరైనా ఆయనలా చిత్రాలు తియ్యచ్చు అని అనిపిస్తుంది. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్న వాక్యం గుర్తొస్తుంది.

ఐతే సాధన చేత సగటు పనులూ, సాధారణమైన పనులూ సాధించవచ్చు. ఒక్కోసారి కొంచెం కష్టసాధ్యమైనవి కూడా సమకూర్చుకోవచ్చు. కానీ సృజన అలా సాధ్యం కాదు.

కాదన్నది కవికోకిల జాషువా అభిప్రాయం. రససృష్టి చదువుతోనో, సాధనతోనో కలిగేది కాదని అన్నారు జాషువా. అది స్రష్టకి మాత్రమే ప్రత్యేకంగా ఉన్న సృజనశక్తి వల్లే సాధ్యపడుతుంది.

ఈ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. విశ్వనాథ్ గారి సృజన ఆయనకి సహజసిద్ధంగా ఉన్నది. అది ఆదుర్తి వంటి వారి దగ్గర చేసిన శిష్యరికంతో మెరుగులు దిద్దుకుంది. ఆపైన కృషితో వాసికెక్కింది. ఆయన చిత్రాలే ఆయన సృజనశక్తికి నిదర్శనాలు.

విశ్వనాథ్ గారు దర్శకత్వంలో అంతలా రాణించడానికి ముఖ్యకారణం ఆయనకున్న సహజ సామర్థ్యం. దానికి తోడు చలన చిత్రానికి సంబంధించిన శాఖలన్నింటినీ నేర్చుకోగలిన నైపుణ్యం. నాకు తెలియదు, నాకు రాదు అని ఆయన అంటున్న శాఖలన్నింటితోనూ ఆయనకి కావల్సినంత పరిచయం ఉంది.

ఆయన చిత్రాలలో సుమారు అన్నింటికీ ఆయనే కథ రాసుకున్నారు. కొన్నింటికి సంభాషణలు రాసారు. ఎన్నో చిత్రాలకి స్క్రీన్ ప్లే ఆయనదే. సాహిత్యం, సంగీతం ఆయనకి తెలియనివి కావు. సహాయ దర్శకుడిగా పని చెయ్యడానికి ముందు సౌండ్ రికార్డిస్టు గా పనిచేసిన అనుభవం ఉంది. కెమెరా మీద మంచి పట్టు ఉంది. నటన ఆయనకి వెన్నతో పెట్టిన విద్య.

(అంత గొప్ప కళాసృష్టి చెయ్యగల దర్శకులైనా విశ్వనాథ్ తనకి బాలచందర్ దగ్గరా, బాపు దగ్గరా సహాయ దర్శకులుగా పనిచేసే అవకాశం దొరికితే బావుండును అని సభాముఖంగా ఏ మాత్రం మొహమాటం లేకుండా అంటూంటారు).





# విశ్వనాథ్ సినిమాలు

ఈ పుస్తకం ప్రతి పుటా విశ్వనాథ్ గారి సినిమాల గురించే. వాటిని పూర్తిగా ఆస్వాదించడానికి ముందు ఆయన చిత్రాలలోని కొన్ని ప్రత్యేకమైన ప్రత్యేకతలని పరిశీలిద్దాం.

1. కులం మీదా కులం పేరిట ప్రబలి ఉన్న అసమానతల మీదా విశ్వనాథ్ గారి చిత్రాలు ఒక్కో సారి మృదువుగా ఒక్కో సారి కరకుగా ధ్వజం ఎత్తుతూనే ఉంటాయి. కాలం మారింది చిత్రంలో మారలేదులే ఈ కాలమూ అని రాజేశ్వరరావు చేత కులం పేరిట విడదీయబడ్డ అనాథలకోసం అభాగ్యులకోసం పాడించారు. సప్తపది చిత్రంలో ఏ కులమూ నీదంటే గోకులమూ నవ్వింది అని అందంగా అర్థవంతంగా జానకి చేత ఆలపింపచేసారు. ఇంక శంకరాభరణంలో ఐతే తులసితో ఎప్పుడూ మాటాడని శంకరశాస్త్రి గళంలో కులం మనుషులని వేరు చెయ్యడానికి కాదని గంభీరంగా చెప్పించారు.

2. వివాహం పేరిట స్త్రీకి మాంగల్యం వేసి స్త్రీ మనస్సుతో సంబంధం లేకుండా జీవితకాలం ఇష్టంలేని మొగుడితో సంసారం చేస్తూండడాన్ని విశ్వనాథ్ సమర్థించరు. తన అనంగీకారాన్ని ఒక్కో చిత్రంలో ఒక్కోలా చూపిస్తారు. మాంగల్యానికి మరో ముడి చిత్రంలో వివాహానికి ఉండవలసిన అసలు ముడి ప్రేమ గా చూపిస్తారు. జీవితనౌక చిత్రంలో తాళి కట్టి తనతో కాపురం చేస్తున్న భర్తని అతను అంతకు ముందు ప్రేమించిన లక్ష్మితో పంపిస్తుంది డాక్టర్ పద్మ. ఇంక సప్తపది చిత్రంలో హేమ మనసుకీ మనువుకీ మధ్య మౌనంగా జరిగే సంఘర్షణని అర్థం చేసుకున్న సత్సంప్రదాయ కుటుంబీకుడు యాజులు తన ఆప్తుడైన రాజులు సలహాతో హేమని హరిజనుడు హరిబాబుకి ఇచ్చి పెళ్ళి చెయ్యడం చిత్రానికి తలమానికంగా చిత్రీకరించారు.

3. విశ్వనాథ్ గారి చిత్రాలలో కొన్ని ప్రధాన పాత్రలకి అంగవైకల్యం ఉంటుంది. సిరిసిరిమువ్వలో హైమ మూగది. అంతకు ముందే కాలం మారింది చిత్రంలో పనివాడు మూగవాడు. పని వాడి మూగతనాన్ని విశ్వనాథ్ హాస్యానికి వాడుకోరు. అదో పాత్ర. ఆ పాత్రని కూడా జాగ్రత్తగా చూసుకుంటారు. సిరివెన్నెలలో హరిప్రసాద్ అంధుడు. సుభాషిణి మూగది. హిందీలో తీసిన సంగీత్ చిత్రంలో సంగీత గుడ్డిది.

   శారీరక అంగవైకల్యమే కాదు మానసిక అంగ వైకల్యాన్ని కూడా పాత్రలకి సహజంగా చూపిస్తారు విశ్వనాథ్. స్వాతిముత్యంలో శివయ్యా, ఓ సీత కథలో సుందరీ మానసికంగా ఎదగని వ్యక్తులు. శారదలోనూ, జీవనజ్యోతిలోనూ ఆపద్బాంధవుడులోనూ పరిస్థితుల ప్రభావం వల్ల నాయికలకి మనస్థిమితం పోతుంది. ఏ వైకల్యాన్నీ విశ్వనాథ్ తిరస్కారంతో చూడరు. వారి మీద గౌరవం పెరిగేటట్లే చిత్రీకరిస్తారు.

4. ఘోరమైన నిజం కన్న అందమైన అబద్ధమే మేలు అని ప్రేమబంధం చిత్రంలో ఒక గొప్ప వాక్యాన్ని రాయించుకున్నారు విశ్వనాథ్. అది ఆ చిత్రంలో పాత్రలకీ సన్నివేశాలకీ అనుగుణంగా అనిపిస్తుంది. ఐతే ఆయన చిత్రాలు ఎన్నింటిలోనో ఈ



మహా వాక్యం వినిపిస్తూనే ఉంటుంది. శారద చిత్రంలో శారద భర్త చనిపోయాడన్న నిజాన్ని శారద తట్టుకోలేదేమో అని శారద దగ్గర దాస్తారు. జీవనజ్యోతిలో లక్ష్మి బతికి ఉందన్న నిజాన్ని శోభ భవిష్యత్తుకోసం శోభకి తెలియనివ్వరు. సాగరసంగమం లో బాలు బాధ పడతాడని చెరిగిపోయిన కుంకుమని పెట్టుకుందుకు వెనకాడదు మాధవి. శుభసంకల్పం చిత్రంలో రాయుడి ఆయురారోగ్యాలు నిలపడానికి గంగ మరణం గురించి ఆయనకి చెప్పకుండా ఎంతో క్షోభ అనుభవిస్తారు దాసూ, సంధ్యలు.

అలాగని విశ్వనాథ్ గారు సత్యాన్ని అణగదొక్కేస్తారనీ, అసత్యాన్ని అందలమెక్కిస్తారనీ  కానే కాదు. అవసరానికి అవతలవారికి శాంతినీ, సంతోషాన్నీ ఇస్తుందనిపించినప్పుడు అది ఎవ్వరికీ హాని కలిగించనప్పుడు నిజాన్ని దాచడంలో ఆయన పాత్రలు ఏవీ వెనకాడవు.

5. శీలానికి ఇవ్వవలసిన మర్యాదా, గౌరవం ఇస్తూనే విశ్వనాథ్ శీలం పోయిందని అమ్మాయిలు అఘాయిత్యాలూ, ఆత్మహత్యలూ చేసుకోడాన్ని సమర్థించరు. ఆయన చిత్రాలలో అలాంటి పాత్రలూ, ఆ పాత్రల వెనక నిలిచే సహపాత్రలూ ధైర్యంగా నిలబడి జీవితాన్ని ముందుకు నడిపించుకుంటాయి.

చిన్ననాటి స్నేహితులులో పెళ్ళి అవడానికి ముందే అరుణ రవి ద్వారా గర్భవతి అవుతుంది. అనుకోకుండా రవి మరణిస్తాడు. గర్భవతి ఐన అరుణని ఓదార్చి కానుపు అయ్యే మార్గాన్ని వెదకుతాడే తప్ప శ్రీనివాసరావు దుర్భాషలాడడు. అరుణ కూడా ఆ మార్గంలోనే వెళ్తుంది. శంకరాభరణం చిత్రంలో తులసి పైన దౌర్జన్యం జరిగినా తులసి పవిత్రంగానే ఉంటుంది. కొడుకుని శంకరశాస్త్రికి సంగీత వారసుడిని చేస్తుంది. సూత్రధారులు చిత్రంలో యశోదమ్మ నీలకంఠం బలాత్కరిస్తే, సదాచారసంపన్నుడైన తన భర్త ఆచార్యులకి దూరంగా వెళ్ళి పోతుందే తప్ప ప్రాణం తీసుకోదు. అంతే కాదు తిరుమలదాసుని తన దగ్గర ఉంచుకుని చదువు చెప్పిస్తుంది.

విశ్వనాథ్ గారి చిత్రాలు అమ్మ ఆప్యాయంగా వండి వడ్డించే భోజనాలు. కుటుంబం అంతా హాయిగా కూచుని కలిసి తినే ఇంటి భోజనాలు. అందుకే ఎన్ని సార్లు తిన్నా రుచిగా తృప్తిగా అనిపిస్తాయే కానీ విసిగించవు. వెగటు పుట్టవు.

ఐతే ఆయన వండి వడ్డించే సాత్త్విక చిత్రాలు చాలామందికి రుచింపకపోవచ్చు -  అని కొంత మంది అనుకోవచ్చు.

ఆ అభిప్రాయాన్ని తారు మారు చేసింది శంకరాభరణం చిత్రం. అప్పటివరకూ వచ్చిన చిత్రాలకి పూర్తి భిన్నంగా సాంప్రదాయ సాహిత్య-సంగీత-నాట్య త్రివేణీ సంగమంలా ప్రవహించిన శంకరాభరణ చిత్ర ప్రవాహంలో ఇప్పటికీ తానమాడుతూనే ఉన్నారు. రుచినీ, అభిరుచినీ మార్చడం, పెంచడం దర్శకుని లక్ష్యం ఐతే ప్రజలు అందుకు సంసిద్ధంగా ఉంటారు. ఐతే అలా మార్చేందుకు దర్శకర్షులు కావాలి. వారి చిత్రాలు కావాలి.

విశ్వనాథ్ గారి చిత్రాలు అవి. మనలో మనకే తెలియకుండా స్తబ్ధంగా నిశ్శబ్దంగా దాగున్న స్పందనలని తట్టి లేపి బయటకి తీసుకు వచ్చి మనమంటే ఏమిటో మనకే చూపించే మణిదీపాలు.





# ఈ పుస్తకం

ఈ పుస్తకం విశ్వనాథ్ గారి బయోగ్రఫీ కాదు. ఈ పుస్తకంలో ఆయన జన్మస్థలం జన్మదినం వంటి జీవిత విశేషాలు ఉండవు. ఆయన తీసిన చిత్రాల విడుదల తేదీలూ విజయాల వివరాలూ ఉండవు. ఆయనమీదో ఆయన తీసిన చిత్రాల మీదో అంతకు ముందు ఎవరో చెప్పిన అభిప్రాయాలు ఉండవు.

ఈ పుస్తకం విశ్వనాథ్ గారి చిత్రాల సంక్షిప్త సమీక్ష కాదు. అలాగని సవిస్తర పరిశోధనా వ్యాసమూ కాదు.

విశ్వనాథ్ గారి చిత్రాలు కురిపిస్తున్న రసగంగలో తానమాడుతున్న ఓ ప్రేక్షకుడి హృదయస్పందన ఈ పుస్తకం.

ఆయన చిత్రాలని చూసినప్పుడు కలుగుతున్న అనిర్వచనీయమైన అనుభూతుల్ని పంచుకోడానికి ఓ అభిమాని చేసిన ప్రయత్నం.

ఆలోచనలకి అక్షరరూపం ఇవ్వడమే కష్టం. అలాంటిది అనుభూతులని మాటలలో వాక్యాలలో బంధించడం అంటే మాటలా? ఒక కథా రచయితగా నాకు ఆ ప్రసవ వేదన బాగా తెలుసు.

అదృష్టం కొద్దీ ఆలోచనలు వ్యక్తీకరించడానికి భాషలో కొత్త కొత్త మాటలు పుట్టించుకుంటూ భాషను సుసంపన్నం చేసుకుంటున్నాం మనం. ఆ కారణంగా ఆలోచనల వ్యక్తీకరణలో సఫలీకృతం అవడానికి అవకాశం ఎక్కువ.

ఐతే అనుభూతుల వ్యక్తీకరణకి ఆ భాష చాలదు. భాషకి ఉన్న ఎన్నో పరిమితులు అడ్డు వస్తాయి. కానీ అనుభూతి వ్యక్తీకరణలో ఒక సౌలభ్యం ఉంది. పాఠకులు ఆ అనుభూతులకి అంతకు పూర్వమే లోనై ఉంటే వారు చదువుతున్నప్పుడు రచయిత అనుభూతి వాక్యాలతో మమేకం అవగలరు. ఆ ఆలోచనతోనే, ఆ ఆశతోనే నేనీ పుస్తకం రాసే పనికి పూనుకున్నాను.

విశ్వనాథ్‌గారు దర్శకత్వం వహించిన చిత్రాలు చాలా ఉన్నాయి. అన్నింటికీ భాష్యం రాయడం సులభం కాదు. అది నా అభిమతం కూడా కాదు.

ఏం రాయాలన్నదానికి ఒక పరిధి గీసుకున్నాక చెప్పాలనుకున్న విషయాలకి ఒక ఆకారం దిద్దుకుని భాగాలుగా విడగొట్టుకున్నాను. ఒక విధంగా చెప్పాలంటే పుస్తకానికి స్క్రిప్ట్ రాసుకున్నాను. ఆ స్క్రిప్ట్ ప్రకారం పుస్తకానికి ఏడు ప్రధాన భాగాలు. ఒక అనుబంధం.

మొదటి భాగం విశ్వనాథ్ గారి చిత్రాలలో కొన్ని ప్రత్యేకతల మీద. పది ప్రత్యేకతలు తీసుకుని, ప్రతి ప్రత్యేకతనూ ధృవీకరించడానికి దృష్టాంతాలుగా ఆయన చిత్రాల సన్నివేశాలను చర్చించాను.



రెండవ భాగం శంకరాభరణం చిత్రం. ఆ చిత్రం గురించి రాయడానికి కూడా ఆ చిత్రంలోని పది సన్నివేశాలను ఎన్నుకుని, ఒక్కోసన్నివేశం నాలో కలిగించిన అనుభూతుల్ని పంచుకున్నాను.

మూడవ భాగం విశ్వనాథ్ గారి పది చిత్రాల గురించి. ఆ పది చిత్రాలలో ఐదు శంకరాభరణం ముందువి. ఇంకో ఐదు తర్వాతవి.

పది చిత్రాలలోని ఆహ్లాదకరమైన పదిపాటల ఆస్వాదన నాల్గవ భాగం.

ఐదవ భాగం విశ్వనాథ్ గారి చిత్రాలలోని పది ముఖ్యమైన సన్నివేశాల సందర్శనం. అందులో కొన్ని పతాక సన్నివేశాలు. మరికొన్ని ఆయా చిత్రాలలో ప్రధానమైన సన్నివేశాలు.

ఆరవ భాగం విశ్వనాథ్ గారితో కలిసి పనిచేసిన కళాకారుల గురించి. కళలను పది విభాగాలుగా విడదీసుకుని ఒక్కో విభాగంలో కొందరి కళాకారుల ప్రస్తావన చేసాను.

విశ్వనాథ్ గారి చిత్రాలలో కథానాయికలు అంతర్బాహ్య సౌందర్యాలకి ప్రతిరూపాలు. అందుకే ఏడవ భాగం విశ్వనాథ్ చిత్రాలలోని పదిమంది కథానాయికల పరిచయం.

అనుబంధం విశ్వనాథ్ గారి సినీ ప్రస్థానం.

విస్తృతమైన విషయాన్ని విభాగాలుగా విడగొట్టకుండా రాయడం కష్టం. చదవడం అంతకన్న కష్టం. ఈ విభజన పుస్తక పాఠకులకి సౌలభ్యంగా ఉంటుందని ఆశ. ఎవరు ఎప్పుడు ఏ భాగం చదువుకున్నా దానికది సమగ్రంగా ఉంటుంది. పుస్తకాన్ని వరసగా చదవాల్సిన అవసరం లేదు.

ఈ పుస్తకం నేను రాసుకున్నది నా ఆత్మానందం కోసమే. రాసినందుకు నాకెంతో తృప్తిగా ఉంది. జీవితాంతం ఆయన దగ్గర పుచ్చుకోవడమే కానీ ఇవ్వనేమో అనుకునేవాడిని – ఆరున్నర దశాబ్దాలు దగ్గరపడుతున్న వయస్సులో ఈ చిన్ని పుస్తకాన్ని ఇవ్వగలుగుతున్నాను. అంతకన్న కావల్సింది ఏముంది?

నన్ను విశ్వనాథ్ గారి చిత్రాలకి పరిచయం చేసిన చెల్లెలి కాపురం చిత్రం విడుదలై ఐదు దశాబ్దాలు గతించాయి. విశ్వానికి విశ్వనాథ్ గారి విశ్వరూపం చూపిన శంకరాభరణం విడుదలై నాలుగు దశాబ్దాలు గడిచిపోయాయి. ఇంతకన్న గొప్ప సందర్భం ఏముంటుంది ఈ పుస్తకం రాయడానికి? ఆయనకి చిరుకానుకగా ఇవ్వడానికి?

# కృతజ్ఞతలు

పుస్తకాన్ని స్వీకరిస్తూ

ఆశీస్సులు అందించిన

**కాశీనాథుని విశ్వనాథ్ గారికి**

ముందుమాట రాసిచ్చిన

**'సిరివెన్నెల' సీతారామశాస్త్రి గారికి**
**తనికెళ్ల భరణి గారికి**

ముఖచిత్రం గీసిచ్చిన

మా అమ్మాయి **అల్లంరాజు అపరాజిత కి**

అరుదైన ఫొటోలు అందించిన

**సూర్యపాలెం మధుబాబు కి**

పుస్తకాన్ని తీర్చిదిద్దిన

**గంజి రామలక్ష్మి వరప్రసాద్ కి**

ఓపిగ్గా చదివి సలహాలిచ్చిన

**రాయవరపు సత్యనారాయణ గారికి**
**యారాసి జయకుమార్ కి**

అచ్చు తప్పులు సవరించిన

**ఏనుగులపల్లి రవీందర్ కి**
**పురాణపండ వైజయంతి కి**

నన్ను కట్టుకుని

చెయ్యి పట్టుకుని

నడిపిస్తూనే ఉన్న

**గాయత్రీదేవి కి**

**అనామకుడు**

(అల్లంరాజు రామశాస్త్రి)

# పది ప్రత్యేకతలు

# పది ప్రత్యేకతలు

విశ్వనాథ్ గారి చిత్రాలని కొన్నింటిని ప్రత్యేకంగా ప్రస్తావించుకునేందుకు ముందుగా ఆయన చిత్రాలు చాలా వాటిలో సాధారణంగా ఉండే అసాధారణ ప్రత్యేకతల గురించి చూద్దాం.

అలాంటి అసాధారణ ప్రత్యేకతలు కూడా చాలా ఉంటాయి. అన్నింటి గురించీ ముచ్చటించుకోవడం సాధ్యం కాదు కనక నేను ముఖ్యమైనవి అనుకున్న ఒక పది ప్రత్యేకతలు ఎంచుకున్నాను. అవి:

- ★ కళల సమాహారం
- ★ చిత్రమైన చిత్రానువాదం
- ★ సన్నివేశ సహజత్వం
- ★ పాత్రల వైవిధ్యం
- ★ ప్రత్యేక ప్రతీకలు
- ★ అంతా మంచివారే
- ★ నటీనటుల నటుడు
- ★ బలమైన బంధాలు
- ★ శ్రుతి మించని శృంగారం
- ★ హద్దులు దాటని హాస్యం

ఈ పదింటినీ కూడా విస్తృతంగా చర్చించుకోవడం ఒక పుస్తకంలో అయ్యే పని కాదు. కొన్ని ఉదాహరణలతో స్థాలీపులాక న్యాయంగా దర్శించుకుందాం.





# కళల సమాహారం

తన తొలి చిత్రం నుండీ సాహిత్యానికి అగ్రపీఠం వేస్తూనే ఉన్నారు విశ్వనాథ్. రచయితలచేత చక్కని మాటలూ పాటలూ రాయించుకునేవారు. సంగీతం కూడా సాహిత్యానికి తగ్గట్టుగా చేయించుకునేవారు. ఆయన చిత్రాలలో పాటలన్నీ అర్థవంతంగా భావయుక్తంగా ఉండేవి.

విశ్వనాథ్ గారి చిత్రాలలో శాస్త్రీయ నృత్య ప్రాధాన్యత మొదలైంది చెల్లెలి కాపురం చిత్రంతో అని అనిపిస్తుంది. సిరిసిరిమువ్వ చిత్రంలో అది పూర్తి ప్రాముఖ్యత సంతరించుకుంది.

శాస్త్రీయ నృత్యంతో పాటు శాస్త్రీయ సంగీతానికి అగ్రస్థానం వచ్చింది శంకరాభరణం చిత్రంతో. అప్పటి నుండి ఆయన తీసిన సప్తపది, సాగరసంగమం, శ్రుతిలయలు, స్వర్ణకమలం, స్వాతికిరణం లాంటి చిత్రాలు అన్నీ సంగీత-నృత్య-సాహిత్యాల సమాహారాలు అయ్యాయి. ఆయన తెలుగు సినీ ప్రేక్షకులకి కళాతపస్వి అయ్యారు.

ఆయన చిత్రాలలో సంగీతానికి, నృత్యానికి అనువుగా సభావేదికలు ప్రధాన పాత్రలు పోషిస్తూనే ఉంటాయి. చెల్లెలికాపురం, శంకరాభరణం, సాగరసంగమం, శ్రుతిలయలు వంటి చిత్రాల పతాక సన్నివేశాలన్నీ వేదికల మీదే సాగుతాయి.

విశ్వనాథ్ గారి చిత్రాలలో నృత్యాలకి విశ్వమంతా వేదికే. సిరిసిరిమువ్వలో హైమ వెన్నెలలో వనంలో నృత్యం చేస్తుంది. శంకరాభరణంలో తులసి ఇసుక తిన్నె మీద అద్భుతంగా అడుగులు వేస్తుంది. సప్తపదిలో హేమ గర్భగుడిలో నాట్యం చేస్తుంది. సాగరసంగమంలో బాలకృష్ణ కొండలమధ్యా, స్వర్ణకమలంలో మీనాక్షి హిమవత్సానువులలోనూ మైమరచిపోయి నాట్యం చేస్తారు.

విశ్వనాథ్ గారి చాలా చిత్రాలలో కథాంశం కళ ఒక తరం నుండి మరో తరానికి నిరంతరంగా సాగుతుండడమే. శంకరాభరణంలో కట్టెలమీద తన కట్టెతో పాటు కాలిపోవాలనుకున్న గండపెండేరాన్ని తన వారసుడిలా పాడిన చిన్న శంకరం కాలికి తొడగడం తన శాస్త్రీయ సంగీత జ్ఞానాన్ని మరో తరానికి శంకరశాస్త్రి అందించడమే. సాగరసంగమంలో బాలకృష్ణ తన అనారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా శైలజకి నృత్యం నేర్పించి మరీ ప్రాణాలు వదలడం కూడా తన నృత్యానికి తగిన వారసురాలిని తయారు చెయ్యడమే. తల్లి తన తనయుణ్ణి తండ్రికి తగిన వారసుడిగా తీర్చిదిద్ది, తండ్రికీ లోకానికీ చూపించడమే శ్రుతిలయలు చిత్రం పతాక సన్నివేశం. స్వర్ణకమలం చిత్రంలో మీనాక్షి పతాక సన్నివేశ నృత్యం తన తండ్రి నాట్యానికి తను వారసురాలినని గ్రహించడమే.

సంగీతమైనా నృత్యమైనా కళ అనంతంగా సాగుతూ ఉంటుందన్నదే విశ్వనాథ్ గారి చిత్రాల సందేశం.

ఒక విధంగా ఆ సందేశాన్ని తెలుగు నాట పిల్లలు ఆచరిస్తున్నారేమో అనిపిస్తుంది. పిల్లలు శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం



నేర్చుకుంటూ ఉండడానికి 1980 లలో విశ్వనాథ్ గారు అందించిన చిత్రాలు దోహదం చేసాయనుకోవడంలో అతిశయోక్తి లేదనిపిస్తుంది.

విశ్వనాథ్ గారి చిత్రాలలో శాస్త్రీయ సంగీత నృత్యాలే కాకుండా - హరికథలు వినిపిస్తూనే ఉంటాయి. ఓ సీతకథ, స్వాతిముత్యం, స్వయంకృషి, సూత్రధారులు చిత్రాలలో మలుపు తిరిగే సన్నివేశాలు హరికథలతోనే ముడిపడి ఉంటాయి.

మరుగున పడిపోతున్న కళలని వీలైనంతవరకూ చిత్రాలలో పరిచయం చేస్తూనే ఉంటారు విశ్వనాథ్. సూత్రధారులు చిత్రంలో కథానాయకుడు గంగిరెద్దులను ఆడించేవాడు. సిరిసిరిమువ్వ చిత్రంలో చెక్కభజనల పాట ఉంటుంది. శుభసంకల్పం చిత్రంలో జాలరి నృత్యాలు చూపించారు.

సాంప్రదాయకమైన ఏ విద్య ఐనా కళ ఐనా గౌరవించదగ్గవే కానీ తిరస్కరించదగినవి కావని కళాతపస్వి చిత్రాలు చెప్తూనే ఉంటాయి.

జనంలో మరుగునపడిపోతున్న వేదాధ్యయనం గొప్పతనం గురించి స్వర్ణకమలం చిత్రంలో ఒకే ఒక్క సన్నివేశంలో ఒక ఘనాపాఠీ పాత్ర ద్వారా కళ్ళ కి కట్టినట్లు చూపించారు విశ్వనాథ్.

(వేదిక మీద నృత్యానికీ, చలనచిత్రంలోని నృత్యానికీ చాలా తేడా ఉంటుంది.

చలన చిత్రంలో గోదావరి గట్టునా, హిమవత్పర్వతాల పక్కనా నాట్యం చేయించవచ్చు. ఎన్నిసార్లైనా ఆహార్యాన్ని మార్చవచ్చు. వేదిక మీద అటువంటి సహజ నేపథ్యాలు ఉండవు. ఆహార్యం వెంటవెంటనే మార్చే అవకాశం తక్కువ.

చలనచిత్రంలో కెమెరా నాట్యకత్తెని ఏ కోణంలోనైనా చూపించవచ్చు. ఏ భంగిమని ఎంతసేపు ఏ పక్కనుండి చూపించాలని అనుకుంటే అలా చూపించవచ్చు. నాట్యకత్తె ముఖకవళికలని అతి దగ్గరగా చూపించవచ్చు. అవసరమైనప్పుడు కళ్ళ నో, పెదవులనో మాత్రం చూపించవచ్చు. వేదిక మీద అది సాధ్యం కాదు.

అందుకని చలనచిత్రంలో నాట్యాన్ని చాలా అందంగా చూపించడానికి ఆస్కారం ఎక్కువ ఉంది. ఐతే అది కళాకారుల నైపుణ్యం మీద ఆధారపడి ఉంటుంది. అంతకు మించి దర్శకుడి సౌందర్య దృష్టి మీద ఆధారపడి ఉంటుంది.

తన చిత్రాలలో నృత్యాన్ని అత్యద్భుతంగా చూపించడంలో విశ్వనాథ్ నిష్ణాతులు. సిరిసిరిమువ్వ, శంకరాభరణం, సప్తపది, సాగరసంగమం, స్వర్ణకమలం, శ్రుతిలయలు చిత్రాలు ఆయన ప్రజ్ఞకి నిలువెత్తు నిదర్శనాలు).





# చిత్రమైన చిత్రానువాదం

జరిగిన సంఘటనల్ని యథాతథంగా అదే వరసలో చెప్పడం చాలా మంది రచయితలూ, దర్శకులూ అవలంబించే పద్ధతి. ఒక్కోసారి కొన్ని చిత్రాలలో కొందరు దర్శకులు రహస్యంగా ఉంచదలచుకున్న విషయాన్ని మాత్రం ప్రేక్షకులకి ముందుగా చెప్పకుండా తర్వాత ఫ్లాష్ బాక్ పద్ధతిలో చూపిస్తారు – ఉత్కంఠని నిలపడానికి.

అలా కాక చాలా భాగాన్ని ఫ్లాష్ బాక్ లో చూపించడం విశ్వనాథ్ గారి ప్రత్యేకత. కథని ఎక్కడో మొదలెట్టి, కొంత చెప్పి, తర్వాత జరిగిన కథని చూపించి మళ్ళీ వర్తమానానికి వచ్చి కథని నడిపించే ప్రక్రియలో విశ్వనాథ్ సిద్ధహస్తులు.

వర్తమానంలో మొదలయ్యే కథని ఒక్కోసారి పది పదిహేను నిమిషాలు మాత్రమే చూపించి, తర్వాత చిత్రం చాలా భాగం ఫ్లాష్ బాక్ లో చెప్పి, మళ్ళీ వర్తమానంలోకి తీసుకు వస్తారు కథని.

ఆ ముందు చూపించే పది పదిహేను నిమిషాల్లో చూపించే పాత్రలూ, సంఘటనలూ ప్రేక్షకులకి కుతూహలం కలిగిస్తాయి. అవే చిత్రానికి తొలి సన్నివేశాలు అవడం వల్ల చూసే వారిలో ఈ పాత్రలు ఇలా ఉన్నాయేమిటి, అసలేం జరిగి ఉంటుంది అన్న ఆలోచనలు రేకెత్తిస్తాయి. ఫ్లాష్ బాక్ మొదలయ్యే సరికి వాళ్ళు చిత్రంలోకి పూర్తిగా జారుకుంటారు.

విశ్వనాథ్ కథని మనస్సులో ఊహించుకుంటున్నప్పుడే ఫ్లాష్ బాక్ పద్ధతి అనుకుంటారేమో - ఉండమ్మా బొట్టుపెడతా చిత్రంతో మొదలెట్టి - శారద, జీవనజ్యోతి, శంకరాభరణం, సాగరసంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, శుభసంకల్పం, స్వాతికిరణం - లాంటి చిత్రాలు అన్నింటినీ ఆ ఒరవడిలోనే అద్భుతంగా మలిచారు. అలా తియ్యడం వల్లనే ఆ కథలు అజరామరంగా నిలిచిపోయాయేమో అని అనిపిస్తుంది.

ఫ్లాష్ బాక్ పద్ధతిలో ప్రేక్షకులకి గజిబిజిగా అనిపించకుండా కథని నడిపించడం అంత సులభం కాదు. ఈ ప్రక్రియని అతి సహజంగా సవ్యంగా సఫలీకృతం చేసింది మూగమనసులు చిత్రంలో ఆదుర్తి సుబ్బారావు. మూగ మనసులు చిత్రం నాయికా నాయకుల మూడు జన్మల కథ.

మూడు జన్మల కథని ఫ్లాష్ బాక్ పద్ధతిలో అతి సరళంగా సాఫీగా ప్రేక్షకులకి గందరగోళంగా అనిపించకుండా తీసారు ఆదుర్తి. ఆ చిత్రానికి ఆదుర్తి దగ్గర ఒక యూనిట్ దర్శకుడిగా పనిచేసారు విశ్వనాథ్. ఆ ఒరవడి విశ్వనాథ్ కి ఎంత నచ్చి ఉంటుందో - తన చిత్రాలలో వాడుకుంటూనే ఉన్నారు. తన గురువు ఆదుర్తి లానే ప్రేక్షకులకి ఏ మాత్రం తికమక లేకుండా కథని చూపించడమే కాకుండా ఆ పద్ధతి వల్ల కథనానికి వేగం, ప్రేక్షకులకి ఉద్వేగం వచ్చేలా తీస్తూనే ఉన్నారు.

ఇలాంటి చిత్రమైన చిత్రానువాదం ఆయనకి కొట్టిన పిండి.

# సన్నివేశ సహజత్వం

చలన చిత్రం ఎప్పుడూ ఉన్నది ఉన్నట్లు చూపించే ప్రక్రియ కానే కాదు. కథలోనూ కథనంలోనూ కొంత నాటకీయత ఉంటూనే ఉంటుంది. అసలు నాటకీయతే లేని చిత్రాలు చిత్రాలు కావు. అవి డాక్యుమెంటరీలు అవుతాయి.

నాటకీయతని దర్శకుడు సజావుగా నడిపించలేకపోతే పాత్రలు కృత్రిమంగా కనిపిస్తాయి. తెరమీద  నటీ నటులు కెమెరా కోసం నటిస్తున్నట్లు ఉంటుంది. తమ సంభాషణలకోసం ఎదురు చూస్తున్నట్లు ఉంటుంది.

విశ్వనాథ్ గారి చిత్రాలలో నటీనటులు ఆయా పాత్రలై పోతారు. ఉదాహరణకి సప్తపది చిత్రంలో పువ్వులమ్మే అమ్మాయి. ఆ అమ్మాయి పాత్ర చాలా చిన్నది. ఐతే ఉన్నంతసేపూ ఆ అమ్మాయి పువ్వులమ్మే అమ్మాయిలానే ఉంటుంది. తన దగ్గర ఉన్న దండలని సర్దుకుంటూ ఉంటుంది. తన వృత్తికి సంబంధించిన పని చేస్తూనే ఉంటుంది. ఆ పనులతో పాటు చిత్రంలో పాత్రపరమైన సంభాషణలు చెప్తుంది. హావభావాలు ప్రదర్శిస్తుంది.

స్వర్ణకమలంలో మీనాక్షి పక్కింటి భార్యాభర్తలూ అంతే. మీనాక్షి అక్క సావిత్రి పెళ్ళి గురించి మాట్లాడుకునే సన్నివేశంలో తన పనులు నెమ్మది నెమ్మదిగా చేసుకుంటూ తన తొలి సంతానం పడుకున్న మంచానికి దోమతెర కప్పుతూ ఉంటుంది గర్భవతిగా ఉన్న భార్య. పక్కనే మంచం మీద కూచుని లెక్కలు రాసుకుంటూ ఉంటాడు భర్త. ఆ పనులు చేసుకుంటూనే వాళ్ళు సావిత్రి పెళ్ళి సంబంధాల గురించి మాట్లాడుకుంటూ ఉంటారు.

శుభలేఖ చిత్రంలో మూర్తి కేటరింగ్ సామగ్రిని సుజాత ఇంట్లోకి తీసుకొస్తున్నప్పుడు చేతులు కడుక్కుంటున్న సుజాత కళ్ళద్దాలపై నీళ్ళు పడడం ఎంతో సహజంగా ఉంటుంది. సుజాత కళ్ళజోడు తుడుచుకుంటోంటే జుట్టు పై సబ్బునురుగు ఉన్నట్లు మూర్తి చూపించడం సుజాత చేత్తో తుడిచేసుకోవడం మామూలుగా ఐపోతాయి. అక్కడే బల్ల మీదున్న ఒక చిన్న పువ్వుని తీసిచ్చి మూర్తి సుజాతకి కంగ్రాచులేషన్స్ చెప్పడం, సుజాత తీసుకుంటూ నవ్వెయ్యడం ఎదిగిన మనస్సులున్న ఇద్దరి మనుషుల మధ్య ఏ మాత్రం కల్మషం లేకుండా అసాధారణంగా సాగిన సాధారణ సన్నివేశం.

పాత్రల నిడివితోనో ప్రాముఖ్యతతోనో సంబంధం లేకుండా అందరూ అందులో ఇమిడిపోతారు. సమయం సందర్భం బట్టి - మాలలు కడుతూనో, బియ్యం ఏరుతూనో, పుస్తకం చదువుతూనో కనిపిస్తారు. ఏ సన్నివేశమూ కృత్రిమంగా ఉండదు. ఒక గదిలోనో, హాలులోనో ఒక కుటుంబాన్ని మనం ఎలా చూస్తామో అంత సహజంగా చూపిస్తుంది కెమెరా.

పాత్రలూ, సన్నివేశాలూ సహజంగా చూపించడం ఒక్కో దర్శకుడూ ఒక్కో రకంగా సాధిస్తారు. సత్యజిత్ రాయ్ చిత్రాలు సహజత్వానికి చాలా దగ్గరగా సాగుతాయి. ప్రేక్షకుడు ఆ పాత్రల పక్కన కూచుని వాళ్లతోనే ఆ పరిసరాల్లో తిరుగుతూ చిత్రాన్ని

చూస్తున్నట్లు అనుభూతి పొందుతాడు. పథేర్ పాంచాలి చిత్రంలో రైలు చూడ్డానికి చిన్నపిల్లలు పరిగెడుతోంటే మనమే అమాయకంగా పరిగెత్తి రైలుని చూసిన అనుభవం కలుగుతుంది. అదో అందమైన చిత్రీకరణ. అది రాయ్ కి మాత్రమే సాధ్యమైన సహజ దర్శకత్వ శైలి.

సత్యజిత్ రాయ్ చిత్రాల అనుకరింపు కొన్నాళ్ళు సాగింది. ఆ చిత్రాల శైలికి రకరకాల పేర్లు పెట్టుకున్నారు. న్యూ వేవ్ అనీ, పేరలల్ సినిమా అనీ, ఆర్ట్ ఫిల్మ్ అనీ. ఆ శైలిలో కొందరు దర్శకులు కొంత కృతకృత్యులయ్యారు. ఐతే అవి కొన్నాళ్ళకి మూస ధోరణిలో పడి ఆ తరహా చిత్రాల అభిమానులకి కూడా దూరమయ్యాయి.

విశ్వనాథ్ గారి సహజ సన్నివేశ చిత్రీకరణలో ఆ దర్శకుల ధోరణి ఉండదు. కావల్సినంత - కావల్సినంతే - నాటకీయత ఉంటుంది.

కళనీ, కామర్సునీ సరిపాళ్ళ లో సమన్వయం చేసీ, సామరస్య పరిచీ, చిత్రాలు నిర్మించడం విశ్వనాథ్ గారి మార్గం. ఆ మార్గంలో ఆయన చాలా వరకూ విజయవంతమయ్యారనే చెప్పాలి. ఈ సమన్వయంలో కొన్ని సన్నివేశాలలో కొంత సెంటిమెంట్, కొంత మెలోడ్రామా ఉన్నట్లు అనిపించవచ్చు. ఐతే అది మన జీవితాలలో లేనిది కాదు. మన మనస్సులని కదలించనిది కాదు.

ఆదుర్తి చిత్రాలలో ఉన్న సహజత్వం, నాటకీయతా విశ్వనాథ్ గారి తొలి చిత్రాలలో కనిపిస్తే - శంకరాభరణం ఆదిగా వచ్చిన శాస్త్రీయ సంగీత నృత్య ప్రధాన చిత్రాలలో ప్రఖ్యాత దర్శకులు శాంతారాం ప్రభావం అంతర్లీనంగా ఉందేమో అని అనిపిస్తుంది.

ఎందరో దర్శకులు సాధించలేనంత నాటకీయతా, సహజత్వం సమ్మేళనాన్ని విశ్వనాథ్ సాధించారన్నది నా ప్రగాఢ విశ్వాసం. నేను ఉదహరించిన సన్నివేశాలు అందుకు సాక్ష్యాలు.



# పాత్రల వైవిధ్యం

విశ్వనాథ్ గారి చిత్రాలు కొన్నింటిలో విషయ సామీప్యం ఉన్నా కథలో, కథనంలో, పాత్రలలో, పాత్రల నేపథ్యంలో వైవిధ్యం ఉంటుంది.

శారద చిత్రంలో భర్తపోయినా ఉన్నాడని నమ్ముతున్న శారద ఉంటుంది. ఓ సీత కథలో తన్ని తాను ఒక మగ పశువు నుండి కాపాడుకోవడం కోసం వాడి తండ్రినే వివాహం చేసుకున్న సీత ఉంటుంది. శుభలేఖలో కట్నం తీసుకున్న మామగారిని ముప్పుతిప్పలు పెట్టే లక్ష్మి ఉంటుంది.

చెల్లెలికాపురం చిత్రంలో రాము నల్లగా ఉంటాడు. స్వాతిముత్యంలో శివయ్య బుద్ధి వికసించని యువకుడిలా ఉంటాడు. నేరము శిక్షలో దేవుడయ్య తను చేసిన నేరానికి తనే స్వయంగా శిక్ష అనుభవిస్తూ ఉంటాడు.

సిరిసిరిమువ్వ చిత్రంలో సాంబయ్య డప్పు వాయించి డబ్బు సంపాదిస్తోంటే స్వయంకృషిలో సాంబయ్య చెప్పులు కుట్టి డబ్బు సంపాదిస్తూంటాడు. శారదలో ప్రజలకు సేవచేస్తూ పేరు తెచ్చుకున్న పేరులేని డాక్టరు ఉంటాడు. ఐతే వారి వారి వృత్తులు ఊరికే చెప్పుకోడానికి కాక చిత్రానికీ, చిత్రగమనానికి ఉపకరంగా ఉంటాయి.

ఎన్ని చిత్రాలలో నాయికానాయకులు గుడ్డివారో, చెవిటివారో, మానసిక వికలాంగులో, మతిచలించిన వాళ్ళో. ఆపాత్రలు అన్నింటి మీదా విశ్వనాథ్ గారికి అపరిమితమైన ఆనురాగం, అభిమానం ఉంటాయి. వారెవ్వరిలోనూ ఆత్మన్యూనత మచ్చుకైనా చూపించరు.

మనిషిలో అంతర్గతంగా ఉన్న అరిషడ్వర్గాలు కూడా విశ్వనాథ్ గారి చిత్రాలలో ప్రధాన పాత్రధారులు అవుతూంటాయి.

1. ఓ సీత కథలో గోపాలకృష్ణ కామం కథకి మూలం.
2. సప్తపది చిత్రం నేపథ్యం తన కూతురి వివాహ విషయంలో యాజులి క్రోధం.
3. సిరిసిరిమువ్వలో త్రిపుర లోభమే హైమని కష్టాల్లో తోస్తుంది.
4. శ్రుతిలయలు లో నారాయణ మూర్తి మోహం ముఖ్య పాత్ర.
5. సాగరసంగమంలో మాధవి కూతురు శైలజ మదం బాలకృష్ణని అగౌరవ పరుస్తుంది.
6. స్వాతికిరణం చిత్రంలో ప్రధాన పాత్ర అనంతరామ శర్మ మాత్సర్యం.

# ప్రత్యేక ప్రతీకలు

చిత్రాలలో ఎన్నాళ్ళ గానో దీపం ఆరిపోవడం ప్రాణం పోడానికీ, సముద్రం అలలు మనస్సు అలజడికీ సంకేతంగా వాడుతూనే ఉన్నారు. ఒక్కోసారి ఆ ప్రతీకలు ఆ చిత్రానికి సరిపోతాయి. ఒక్కోసారి వాడినవే మళ్ళీ మళ్ళీ వాడడంతో పాతబడిపోయినట్లు ఉంటాయి.

ప్రతీకలు వాడడం కొందరి దర్శకుల ప్రత్యేకత. బాలచందర్ అందులో అగ్రగణ్యులు. తన చిత్ర నేపథ్యానికి సరిపోయే ప్రతీకల్ని సందర్భోచితంగా వాడుతూ ఉంటారు.

విశ్వనాథ్ తన చిత్రాలెన్నిటిలోనో భిన్నవిభిన్నమైన ప్రతీకల్ని చూపించారు.

సిరిసిరిమువ్వ చిత్రంలో హైమతో సాంబయ్యని వివాహం చేసుకొమ్మని ప్రకృతే చెప్పినట్లు గాలికి హైమ గజ్జెలు సాంబయ్య డప్పు మీద పడినట్లు చూపించారు. అది చూసి హైమ సాంబయ్యతో తన వివాహం గురించి నిర్ణయించుకుంటుంది. మూగా, బిడియం అడ్డు రాకుండా ఆ గజ్జెలకీ, డప్పుకీ కలిపి పువ్వులదండ వేసి సాంబయ్యకి చూపిస్తుంది హైమ. అంత సున్నితమైన భావననీ అంతే లలితమైన ప్రతీకలతో చూపించడం విశ్వనాథ్ గారికే చెల్లింది.

స్వర్ణకమలంలో మీనాక్షి పౌడర్ రాసుకోవడంలోని మార్పుతో మీనాక్షి వ్యక్తిత్వంలో వచ్చిన మార్పును సూచించడం అమోఘం. పౌడర్ రాసుకోవడం ఒక అమ్మాయి మామూలు దినచర్య. అది చిత్రంలో చొప్పించబడింది కాదు. అలాంటి సాధారణ ప్రతీకలతోనే జరిగిందీ, జరగబోయేదీ సూచించడం విశ్వనాథ్ గారికి వెన్నతో పెట్టిన విద్య.

ఇంక శుభసంకల్పంలో గంగకి ప్రతీకగా పీటలమీద కూచోపెట్టిన అస్తికల కలశం - గుండె లోతుల్లోంచి తన్నుకుని వచ్చి కళ్ళల్లో పెల్లుబికిన గంగ.

ఓ సీత కథ చిత్రం చివరలో అమాయకురాలైన సుందరి కథ చెప్పడానికి ఎన్నుకున్న చేప కథ ప్రతీకలలోకెల్ల ప్రతీక. ఆ పోలికతో గుండెల్ని పిండేసే పాటని రాయించుకుని చిత్రీకరించడం విశ్వనాథ్ గారి ప్రతిభ.

శంకరాభరణం చిత్రంలో తులసి భక్తి పారవశ్యంతో పాడుకుంటూ ఉంటే బలాత్కరించడానికి వస్తున్న జమీందారుకి కనిపించిన బొమ్మలో గద్ద పాముని పట్టుకుని ఉంటుంది. బలవంతుడు బలహీనుల్ని చేసే వేటకి చిహ్నంగా కనిపిస్తుంది.

ఐతే ఆబొమ్మలో పాము ప్రతిఘటన కూడా గోచరిస్తుంది. పాము శంకరుడికి ఆభరణం. శంకరాభరణమైన సర్పం గద్ద దాడిని ఎదిరిస్తున్నట్లు అనిపిస్తుంది. రాబోయే సన్నివేశాలకి సూచనగా సరిపోతుంది.

ఈ పాముా గద్దల ప్రతీక చిరకాలం గుర్తుండిపోతుంది.













# అంతా మంచివారే

విశ్వనాథ్ గారి చిత్రాలలో విలన్లు చాలా తక్కువ. పరిస్థితుల ప్రభావంతో కష్టసుఖాలు వస్తూ పోతూ ఉంటాయి. ఆ పరిస్థితుల్లో ఆ సందర్భాలలో  కొందరు చెడు పనులు చేస్తున్నట్లూ కీడు కలిగిస్తున్నట్లూ కనిపిస్తారు. ఐతే వారు చిత్రం అంతా క్రూరంగా ఉండరు. కావాలని అవతలి వాళ్ళ కి హాని చెయ్యరు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో ఎవ్వరూ నిరంతరం చెడు ఎలా చెయ్యాలా అని ప్రణాళికలు వేస్తూ ఉండరు. మర్డర్ పథకాలు ఆలోచిస్తూ కనిపించరు. వికటాట్టహాసాలు చెయ్యరు. వాళ్ళు మామూలు సినిమా విలన్లు కారు. చిత్రం అంటే హీరో విలన్ల మధ్య జరిగే పోరాటంలా తియ్యడం విశ్వనాథ్ జోనర్ కాదు.

తన జోనర్ కాని చిత్రాలు కొన్ని (చాలా కొన్ని) తీసారు విశ్వనాథ్. అవి ఎన్ని తక్కువంటే వాటిని మనం పరిగణనలోకి తీసుకోకపోయినా ఫరవాలేదు. వాటిని అపవాదులుగానే అనుకోవాలి కానీ ఆయన పద్ధతిగా అనుకోకూడదు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో విలన్లు తక్కువగా ఉండడమే కాదు -  పాత్రలు చాలా వరకూ చాలా మంచివే ఉంటాయి. ఒకరిని ఒకరు అర్థం చేసుకునే వారూ, ఒకరికి ఒకరు సాయం చేసుకునేవారూ ఎక్కువగా ఉంటారు. వారిలో ఉదాత్తతా, ఔన్నత్యం ఉంటాయి.

టీవీ సీరియళ్ళ లో కనిపించే క్రూరమైన మనస్తత్వాలు ఉన్న మనుషులు మన నిత్య జీవితాలలో మనకి అరుదుగా తారసపడతారు. ఎక్కువమంది ఎప్పుడూ చెడు ఆలోచనలే చేస్తూ ఉండరు. మనుషులనీ, వారి ప్రవర్తనలనీ పరిశీలించిన విశ్వనాథ్ గారు లోకంలో చెడు కన్న మంచే ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయాన్ని ఏర్పరుచుకుని ఉంటారు. అదే ఆయన దృక్పథం అయిపోయుంటుంది. ఆయన మనస్సులో మనుషులమీదా, సమాజంమీదా నమ్మకం, గౌరవం అపరిమితంగా ఉండి ఉంటాయి. అందుకే ఆయన మంచి పాత్రలనే సృష్టిస్తారు.

ప్రేక్షకుల్ని అధికంగా ప్రభావితం చేసే ప్రసార సాధనం సినిమా. అది మనుషుల్ని చెడు వైపుకు తీసుకుని వెళ్ళ కూడదన్నది విశ్వనాథ్ గారి విశ్వాసం అయ్యుంటుంది. అ-ఆలు (అక్కినేని - ఆదుర్తి) తీర్చిదిద్దిన ఉత్తమోత్తమమైన సుడిగుండాలు చిత్రానికి ట్రీట్మెంట్ తయారు చేసింది  విశ్వనాథ్. అప్పటికే ఆయన దర్శకుడిగా చిత్రాలు తీస్తున్నారు. ఐనా అలాంటి ప్రయోజనాత్మక చిత్రానికి పని చెయ్యడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం.

విశ్వనాథ్ గారి చిత్రాలలో పాత్రలన్నీ స్వాభావికంగా మంచిగానే ప్రవర్తిస్తాయి. ఒక్కోసారి కొన్ని పాత్రలు పరిస్థితుల ప్రభావం వల్ల కొంత చెడుగా ప్రవర్తించినా అది వాళ్ళ సహజమైన ప్రకృతిగా అనిపించదు. వారిలో పరివర్తనా, పశ్చాత్తాపం కనిపిస్తాయి. అలా కాని పాత్రలూ, చిత్రాలూ అతి కొద్దిగా అక్కడక్కడా కనిపించ వచ్చు. అలా కనిపించడం మినహాయింపే కానీ నియమం కాదు.



# నటీనటుల నటుడు

ఒక చిత్రానికి నటీనటులని ఎన్నుకోవడంలో విశ్వనాథ్ గారు నిష్ణాతులు. ఏ చిత్రంలోనూ ఏ నటీనటులూ ఆ పాత్రకి సరిపోలేదేమో అని అనిపించదు. చిన్న పాత్రలు వేసే వారిని ఎన్నుకోడంలో, వారి మేకప్పులలో, సంభాషణలలో కూడా ఎంతో శ్రద్ధ చూపిస్తారు. ఎంత చిన్న పాత్ర ఐనా చిరస్థాయిగా నిల్చిపోయేటట్లు చేస్తారు. శంకరాభరణంలో శ్రీగోపాల్, సాగరసంగమంలో పొట్టి ప్రసాద్ వంటి ఉదాహరణలు ఎన్నో ఎన్నెన్నో.

విశ్వనాథ్ గారి చిత్రాలలో హీరోలుగా నటించిన వారిలో ముఖ్యులు - అక్కినేని, నందమూరి, శోభన్ బాబు, కృష్ణ, కృష్ణంరాజు, చిరంజీవి, కమల్ హసన్, సోమయాజులు, చంద్రమోహన్, బాలకృష్ణ, రాజశేఖర్, వెంకటేష్, శ్రీకాంత్, అల్లరి నరేష్, సర్వదమన్, మమ్ముట్టి.

విశ్వనాథ్ గారు దర్శకత్వం వహించిన చిత్రాలలో నటించిన ప్రముఖ హీరోయిన్లు - సావిత్రి, జమున, కాంచన, వాణిశ్రీ, శారద, భారతి, రోజారమణి, జయసుధ, జయప్రద, తాళ్ళూరి రామేశ్వరి, కవిత, మంజుభార్గవి, సబిత, సుమలత, సుహాసిని, భానుప్రియ, రాధిక, విజయశాంతి, రమ్యకృష్ణ, ఆమని, ప్రియా రామన్, లయ.

చంద్రమోహన్ , అల్లు రామలింగయ్య, సాక్షి రంగారావు, సత్యనారాయణ, కాంతారావు, రావుగోపాలరావు, రమణమూర్తి, దేవదాస్, మిశ్రో, జిత్మోహన్ మిత్రా, గిరీష్, వంకాయల, శుభలేఖ సుధాకర్, రమాప్రభ, నిర్మల, శుభ, ముచ్చర్ల అరుణ, ఝాన్సీ, జానకి వంటి నటీనటులందరూ ఆయన ఆస్థాన విద్వాంసులే.

తులసి, షణ్ముఖ శ్రీనివాస్, మంజునాథ్, వరలక్ష్మి, మీనా, చక్రి తోలేటి, కార్తీక్ వంటి బాల నటీనటులు విశ్వనాథ్ గారి చిత్రాలలో ముఖ్యమైన పాత్రలు చక్కగా పోషించారు.

ఏ నటి ఐనా, ఏ నటుడైనా - ఎంత గొప్పవారైనా - ఎవరికి తోచినట్లు వారు గొప్పగా చేసుకుంటూ పోతే సన్నివేశాలు పండవు. చిత్రం రాణించదు. దర్శకుడు ఏ నటుడు ఏ సంభాషణ ఎలా చెప్పాలో, ముఖకవళికలు ఎలా ఉండాలో, శరీరం ఎలా కదలాలో ఊహించుకుని, వారికి చెప్పి చేయించుకోవాలి. అలా చేస్తేనే సన్నివేశాలైనా, చిత్రమైనా ఆకట్టుకునేది.

అసలు ఏ దర్శకుడైనా నటీనటులకి ఎలా నటించాలో ఎలా చెప్తారు? కొందరు దర్శకులు సన్నివేశం పూర్వాపరాలూ, నేపథ్యం, పాత్ర స్వభావం చెప్పి నటీనటుల్ని చెయ్యమని చెప్పి, వారు చేసింది చూసి, నగిషీలు చెక్కచ్చు. మరి కొందరు అలా చెయ్యాలి, ఇలా చెయ్యాలి అని చెప్పి చేయించుకోవచ్చు. కొందరు తమ అసిస్టెంట్ల ద్వారా చేయించి నటీనటులకి చూపించవచ్చు.

విశ్వనాథ్ తనే నటించి చూపిస్తారుట. నటీనటులు ఆయన చేసింది చూసి, తమ తమ అనుభవాలను జోడించి సన్నివేశాలు పండిస్తారుట. ఆ తర్వాత మెరుగులు మామూలే. అందుకే నటీనటుల నటన పరిపూర్ణంగా కనిపిస్తుంది, విశ్వనాథ్ గారి చిత్రాలలో.





ఎంత పేరు సంపాదించుకున్న హీరో హీరోయిన్లైనా ఆయన చిత్రాలలో ఆయన చేసి చూపించినట్లే చేస్తాం అని ఏమాత్రం మొహమాటపడకుండా అందరి ముందూ చెప్పడం వింటూంటాం. అంతే కాదు. ఆయన చేసిన దాన్లో పదోవంతు చెయ్యగలుగుతాం - దానికే మాకింత పేరు వస్తోంది - ఆయన చేసి చూపించినంతా మేం చెయ్యగలిగితే - ఇంకెలా ఉంటుందో - అని కూడా అంటారు కొందరు .

విశ్వనాథ్ గారు నటీనటులకి నటించి చూపించడం ఆయన ఆదుర్తి దగ్గర సహాయదర్శకుడిగా పనిచేస్తున్నప్పుడే జరిగి ఉండచ్చు. ఆదుర్తి సుబ్బారావు తేనె మనసులు చిత్రానికి అంతా కొత్త నటీనటులని ఎన్నుకునే రోజులలో - ఇతర పాత్రలకి కొత్త నటీనటులు దొరికినా ఒక హీరో పాత్రకి ఇంకా ఎవ్వరూ దొరకలేదుట. అప్పుడు ఎవరో ఆదుర్తిని ఎవరూ దొరక్కపోతే ఏం చేస్తారు అని అడిగితే - ఎవరూ దొరక్కపోతే విశ్వం ఉన్నాడుగా అని అన్నారుట. విశ్వనాథ్ గారి నటన మీద ఎంత నమ్మకం లేకపోతే ఆదుర్తి అలా అని ఉండచ్చు? ఇది నేను విన్న పిట్టకథ. నిజం అయ్యే అవకాశం ఉన్న కథ.

ఆయన శుభసంకల్పం చిత్రం తీస్తున్నప్పుడు రాయుడు పాత్రని వేసేవారు కమల్ హసన్ కి దీటుగా ఉండాలని కమల్, బాలూలు విశ్వనాథ్ గారినే నటించమని అర్థించి, బలవంత పెట్టి ఒప్పించారు. అదే తెలుగు ప్రేక్షకుల పాలిటి వరం అయింది. ఆ తర్వాత ఎన్నో చిత్రాలలో హీరోలకీ, హీరోయిన్లకీ ఆయనే తాతయ్య. ఆ తాతయ్యలో మార్దవం, గాంభీర్యం, ఆప్యాయతా, ఆగ్రహం అన్నీ ఎంత ఉండాలో అంతా - అంతే కనిపిస్తాయి. ఆయా పాత్రలలో విశ్వనాథ్ కనిపించరు. తాతయ్యే కనిపిస్తారు.

నటీనటుల నటుడు విశ్వనాథ్ గారు.

(ఆయన చిత్రాలలో తరచు కనిపించే కొన్ని అతిథి "నటీనటులు" ఉన్నాయి. అందులో మొదటిది గోదావరి. ఎన్ని చిత్రాలలో ఎన్ని సందర్భాలలో సన్నివేశ పరమైన భావోద్వేగాలని అందిస్తూ వచ్చిందో గోదావరి.

గోదావరి కనిపించి అలరిస్తే, గంగ ఆయన చిత్రాలలో ధ్వనిస్తూ పావనం చేస్తూ ఉంటుంది. రసగంగ, స్వరగంగ ఆయన చిత్రాలలో చిరంతర నటి. కొన్ని చిత్రాలలో పాత్రల పేరు గంగ. ఎన్ని పాటలలో, మాటలలో గంగా నది పేరు వినిపిస్తూ ఊంటుందో.

ఇంక ఆహ్లాదాన్నిచ్చే కొండలూ, వాగులూ, పొలాలూ, మబ్బులూ, ఇంద్రధనుస్సులూ ఆయన చిత్రాలలో అలరిస్తూనే ఉంటాయి.

ఇంకా వీణా, వేణువూ, డప్పూ, మువ్వలూ విశ్వనాథ్ చిత్రాలలో ప్రాణం పోసుకుని అభినయిస్తాయి)















# బలమైన బంధాలు

విశ్వనాథ్ గారి చిత్రాలలో అక్కా చెల్లెళ్ళ , బామ్మా / అమ్మమ్మా మనవళ్ళ , స్నేహితుల బంధాలు బలంగా ఉంటాయి. వారి మధ్య సాన్నిహిత్యాన్ని మనోరంజకంగా చిత్రీకరిస్తారు విశ్వనాథ్.

## అక్కా చెల్లెళ్ళు

విశ్వనాథ్ గారి చిత్రాలలో అక్కాచెల్లెళ్ళ ని చూస్తే చాలా ముచ్చటేస్తుంది. వాళ్ళ మధ్య ఉండే అనురాగాలు ఎంతో అందంగా ఉంటాయి.

ఓ సీత కథలో శుభా, రోజారమణులు ఒకరంటే ఒకరికి ప్రాణంగా ఉంటారు. అక్కచెల్లెళ్ళ కి ఒకరి మీద ఒకరికి ఎంతో అక్కర. రోజారమణి ఒక సారి హరికథలు చెప్పే అక్క శుభతో హరికథలు చెప్తూనే ఉంటావు అని హాస్యం చేస్తుంది. ఇంకో సారి ఒక్క అబద్ధం చెప్పానంటే చాలు - నిజం నీకు తెలిసిపోతుంది అని అంటుంది. ఎంత హాయిగా ఉంటుందో అలాంటి అక్కా చెల్లెళ్ళ సంభాషణ వింటోంటే.

శుభలేఖ చిత్రంలో సుమలతా, తులసీ అసలు సిసలైన అక్కాచెల్లెళ్ళ లానే ఉంటారు. ఇద్దరివీ ఒకటే అభిప్రాయాలు. ఐతే వాటిని ప్రకటించే పద్ధతులు వేరు. సుమలత నిండు గోదావరిలా ఉంటే, తులసి సుడులెత్తే కిన్నెరసానిలా ఉంటుంది. ఎవరి మార్గంలో వారు కట్నానికి వ్యతిరేకంగా నడుస్తారు. అనుకున్నది కలిసి సాధిస్తారు.

స్వర్ణకమలం చిత్రంలో అక్కాచెల్లెళ్ళైన దేవీలలిత, భానుప్రియల మనస్తత్త్వాలు పూర్తిగా భిన్నధృవాలు. అక్క ఒద్దికగా పొందికగా ఉంటే చెల్లెలు అల్లరిగా, నిర్లక్ష్యంగా ఉంటుంది. అక్క ఇంటి బాధ్యతలు తీసుకుంటే చెల్లెలు కలల్లో బతికేస్తూ ఉంటుంది. అక్క వంశపారంపర్యంగా వచ్చిన సంగీత సాధన చేసుకుంటోంటే చెల్లెలు నాట్యసాధనని మొక్కుబడిగా చేస్తుంది. ఐతే ఇద్దరికీ ఒకరంటే ఒకరికి అభిమానం. దేవీలలితకి భానుప్రియ అంటే వల్లమాలిన వాత్సల్యం. భానుప్రియకి అక్కంటే చెప్పలేనంత ప్రేమ. అర్థం చేసుకోవూ అని భానుప్రియ అక్కని గారంగా విసుక్కున్న ప్రతీసారి అందులో ఆప్యాయతే వినిపిస్తుంది.

ప్రేమబంధంలో అక్క వాణిశ్రీ. చెల్లెలు జయప్రద. చెల్లెలు జీవితం పాడయిపోతోందన్న ఆవేదనతో అక్క ఒక హత్య కూడా చేస్తుంది. అంత అనురాగం చెల్లెలంటే. ప్రేమబంధం లో వాణిశ్రీ జయప్రదలను అక్కా చెల్లెళ్ళు గా చూస్తోంటే ఒక తరం హీరోయిన్ తరవాత తరం హీరోయిన్ కి బేటన్ అందించినట్లు అనిపిస్తుంది.



## బామ్మా / అమ్మమ్మా మనవళ్ళు

మనవళ్ళతో మాతామహుల, పితామహుల సంబంధం మాటల్లో చెప్పలేనిది. పెద్దవాళ్ళకి చిన్నవాళ్ళంటేనూ, చిన్నపిల్లలకి పెద్దవాళ్ళంటేనూ ప్రేమానురాగాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

ఒక్కో సారి మనవడికి తల్లితండ్రులు లేకపోతే అమ్మమ్మో, నాయనమ్మో అన్నీ తానే ఐ పెంచుకుంటుంది. ఆవిడ ప్రాణమంతా మనవడి మీదే. మనవడి అభిమానమంతా ఆవిడ మీదే. విశ్వనాథ్ గారి  చిత్రాలలో ఈ బంధం బలీయంగా ఉంటుంది.

కాలం మారింది చిత్రంలో సూర్యకాంతం అమ్మమ్మ. శోభన్ బాబు మనవడు. వారిద్దరి మధ్యా గారాలూ, పై పై అలకలూ, సరదాలూ ఎంతో ప్రేమతో సాగిపోతాయి. నువ్వు నా మాట వినకపోతే ఆస్తంతా ఏ ఆశ్రమానికో ఇచ్చేస్తానని సూర్యకాంతం బెదరింపూ, నేనసలు పెళ్ళే చేసుకోనని శోభన్ బాబు భీష్మింపూ వారి మధ్య ఉన్న ఆప్యాయతని చక్కగా ఆవిష్కరిస్తాయి.

అలాంటి సంబంధమే శంకరాభరణం లో నిర్మలకీ చంద్రమోహన్ కీ మధ్య చూపిస్తారు. అన్నవరం మెట్లెక్కుతూ మరచెంబుని చంద్రమోహన్ పడెయ్యడం, అది మా పుట్టింటి ఆస్తి అని నిర్మల నిష్ఠూరాలాడడం రమణీయంగా సాగిపోయే బామ్మా మనవళ్ళ సరదాలే.

శుభలేఖలో నిర్మల మనవడు చిరంజీవి. తన ఆరోగ్యం బాలేదని టెలిగ్రామిప్పించి రప్పించిన మనవడిని తన మాటలతో మెప్పించగల బామ్మ నిర్మల. బామ్మ దగ్గర గారాలు పోతూ అల్లరి చేసే మనవడు చిరంజీవి. మనవడు తనకి చెప్పకుండా పెళ్ళి చేసుకుంటున్నా కోడలు సుమలతని చూసి సంతోషపడిపోయే ప్రేమ నిర్మలది.

స్వాతిముత్యంలో నానమ్మ నిర్మలకి అమాయకుడైన కమల్ హసన్ ప్రాణం. తను బతికేదే మనవణ్ణి బతికించుకోవడం కోసం. తన ప్రేమంతా మనవడికి ధారపోస్తుంది. అంతా అర్థం కాకపోయినా మనవడికి నానమ్మే జీవితం, జీవనాధారం. హృద్యంగా ఉంటుంది వారిద్దరి సంబంధ చిత్రీకరణ.

శుభసంకల్పం చిత్రంలోనూ నిర్మలా, కమల్ నానమ్మా మనవలే. ఒకరిని ఒకరు సరదాగా కొట్టుకుంటూ, కొట్టించుకుంటూ. ఆట పట్టించుకుంటూ ఒకరికి ఒకరుగా ఉంటారు.

## స్నేహితులు

ఒకటీ రెండూ మూడూ అవి విడిగా ఉంటే అంతే అని కలిసి ఉంటే విలువ పెరుగుతుందని అర్థం వచ్చేలా పాడుకుంటూ ఉంటారు ఎన్ టి రామారావు, శోభన్ బాబు, చలం నిండుహృదయాలు చిత్రంలో. ముగ్గురూ చిన్ననాటి నుండి మిత్రులు. ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ ఉంటారు. అలాంటి వారి మధ్య అనుకోకుండా అపోహలు

రావడం, అవి మళ్ళీ సద్దు మణగడం, ముగ్గురూ హాయిగా కలిసిపోవడం ఆ చిత్ర కథ. స్నేహం విలువని చాటి చెప్పే చిత్రం అది.

చిన్ననాటి స్నేహితులు చిత్రంలో ఎన్ టి రామారావు, జగ్గయ్య చిన్ననాటి నుండి స్నేహితులు. ఆ స్నేహం ఎంతది అంటే జగ్గయ్య తన ఆస్తి వ్యవహారాలన్నీ రామారావుకే అప్పచెప్పేస్తాడు. అంతే కాదు. తన ఒక్క కూతురు వాణిశ్రీ బాధ్యత కూడా రామారావుకే ఇచ్చేస్తాడు. రామారావు ఆ స్నేహానికి గౌరవాన్ని ఇచ్చి, తను కష్టాలు పడినా తన స్నేహితుడు జగ్గయ్య ఆస్తినీ, అమ్మాయినీ భద్రంగా చూసుకుంటాడు. కథంతా స్నేహితుల చుట్టూనే.

విశ్వనాథ్ గారి చిత్రాలలోనే స్నేహానికి పరాకాష్ట శంకరాభరణం చిత్రంలో సోమయాజులు అల్లు రామలింగయ్యల మధ్య కనిపించే సంబంధం. సోమయాజులి గాంభీర్యానికి కాస్త భయపడుతున్నట్లు కనిపించే అల్లు రామలింగయ్య ఒక్కడికే సోమయాజులుకి నచ్చచెప్పడానికైనా, నొక్కిచెప్పడానికైనా చనువూ, దగ్గరతనం ఉన్నాయి. వారిద్దరిదీ శివకేశవుల సంబంధం. అల్లు రామలింగయ్యకి సోమయాజులు మీదా, సోమయాజులు కూతురి మీదా వల్లమాలిన ప్రేమా. సోమయాజులుకి కూడా అల్లు రామలింగయ్య అంటే హద్దులు లేని ఆప్యాయతా. వారిద్దరి స్నేహం సప్తపదిలోనూ అలాగే కొనసాగింది.

సాగరసంగమం లో శరత్ బాబూ, కమల్ హసన్ స్నేహంలో కూడా ఒకరంటే ఒకరికి ఉన్న ఆప్యాయత అడుగడుగునా కనిపిస్తూనే ఉంటుంది. ఒకరి కోసం ఒకరు ఎంత త్యాగం చెయ్యడానికైనా సిద్ధపడే స్నేహితులు వాళ్ళిద్దరూ. చిత్రం చివరి సన్నివేశంలో కమల్ ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాక శైలజ నాట్యానికి అంతరాయం రాకూడదని వీల్ చెయిర్లో కమల్ శరీరాన్ని ఆడిటోరియం నుండి తీసుకు వచ్చేస్తాడు శరత్ బాబు. ఆరుబయట వాన పడుతూ ఉంటుంది. ప్రాణం లేని దేహమైనా, కమల్ తడవకూడదని తన చేతుల్నీ, తలనీ అడ్డంగా పెడతాడు శరత్ బాబు. స్నేహానికి అంతకన్న పెద్ద నిర్వచనం ఏ చిత్రంలోనూ, ఏ దర్శకుడూ చూపించి ఉండడు.

## నిష్కామ ప్రేమ

ప్రేమని అనుభవించగలమే తప్ప నిర్వచించలేం. సామాన్యంగా ఒక ఆడా మగా మధ్య ఉన్న దగ్గరతనాన్ని ప్రేమగా అనుకుంటాం. అందులో కొంత కామం ఉంటుందని ఊహిస్తాం. కొన్ని ప్రేమలు నిష్కామంగా పుట్టచ్చు. లేక మధ్యలో పరిస్థితుల ప్రాబల్యం వల్ల నిష్కామ ప్రేమలుగా మారచ్చు. విశ్వనాథ్ గారి చిత్రాలలో ఈ నిష్కామ ప్రేమలు అద్భుతంగా వికసిస్తాయి. వాటిని బహు సున్నితంగా చిత్రీకరించడంలో విశ్వనాథ్ సిద్ధహస్తులు.

దీనికి మొదటి ఉదాహరణ స్వయంకృషి చిత్రంలో చిరంజీవి సుమలతల మధ్య ఉన్న సంబంధం. ముందు తను సుమలతని వివాహం చేసుకోవాలని అనుకున్నా సుమలత మరొకరిని ప్రేమిస్తోందని తెలియగానే చిరంజీవి ఆ ఆలోచనని విరమించుకుంటాడు. ఐనా సుమలతని ఆదరంగా చూస్తూనే ఉంటాడు. వారిద్దరి మనస్సులూ ఎంతో నిర్మలంగా అనిపిస్తాయి. ఎక్కడా హద్దు దాటని ప్రేమ అది!

శుభసంకల్పం చిత్రంలో ప్రియా రామన్ మనస్సు నిండా కమల్ అంటే ప్రేమే. ఐతే కమల్ మనస్సులో ఆమని ఉందని కమల్ ని పెళ్ళి చేసుకునే ఆలోచనే పెట్టుకోదు. భౌతికంగా దూరంగా ఉన్నా మనస్సు నిండా ప్రేమతో బతకడానికి నిశ్చయించుకుంటుంది.

సాగరసంగమంలో కమల్ హసన్ జయప్రదల వివాహం జరిగిపోవాలని అనిపిస్తున్న సమయంలో జయప్రద భర్త తెర మీదకి వస్తాడు. అప్పటి నుండి కమల్ హసన్ మనస్సులో జయప్రద ఒక దేవత. అంతే. ఎక్కడా తను వివాహం చేసుకోదలచుకున్న అమ్మాయి అన్న భావమే ఉండదు. జయప్రదకి కూడా అంతే.

నాకూ తులసికీ ఉన్న బాంధవ్యం ఆ పరమేశ్వరుడికి తెలుసు, నాకు తెలుసు అని శంకరశాస్త్రి మాధవుడితో అన్నట్లు సోమయాజులు తనదైన గంభీర కంఠంతో ప్రేక్షకులు అందరితోనూ అంటాడు. తరచి తరచి ఆలోచిస్తున్న కొద్దీ అందులో ఎంత లోతు ఉందో తెలుస్తుంది. ఊటబావిలో నీళ్ళు ఎంత తోడినా ఊట తరగనట్లు, ఆ వాక్యంలో అర్థం ఎంత తీసినా తరగదు.

(శాస్త్రీయ సంగీత ప్రధానమైన శంకరాభరణంతో పాటు విశ్వనాథ్ గారి చిత్రాలు అన్నింటిలోనూ పాటలు పాడి మెప్పించిన బాలూ - విశ్వనాథ్ గారి కజిన్ అని విన్నాను నేను. వాళ్ళిద్దరూ నిజజీవితంలో కలిసి ప్రయాణం చేసారు. వాళ్ళకి ఒకరంటే ఒకరికి గౌరవం, అభిమానం. బాలూ విశ్వనాథ్ గారిని అన్నయ్యా అనే సంబోధిస్తారు. వాళ్ళిద్దరిదీ ఎంతో అపురూపమైన అన్నదమ్ముల అనుబంధం. బలమైన బంధం)







# శ్రుతి మించని శృంగారం

చిత్రాలు తియ్యడం మొదలెట్టినప్పటినుండీ ఏ చిత్రంలోనూ అశ్లీలతని జొరపడనియ్యలేదు విశ్వనాథ్ గారు. అలాగని ఆయన చిత్రాలలో శృంగారం లేదని కాదు. ఐతే అది భార్యాభర్తల మధ్య సహజంగా జరిగే సున్నితమైన శృంగారం.

ఆయన సినిమాలలో దంపతుల పడగ్గది సరదాలూ, సరసాలూ, సాన్నిహిత్యాలూ పుష్కలంగానే ఉంటాయి. శోభన్-వాణిశ్రీ, శోభన్-శారదలు నాయికా నాయకులుగా నటించిన చిత్రాలలో అవి అందంగా ఒద్దికగా అమరిపోయాయి. అవి పాత్రలకీ సందర్భాలకీ సరిపోయినట్లే ఉంటాయి. ఆ శృంగారం దాంపత్య జీవితంలో ప్రధానాంశంగా కలిసిపోతుంది.

ఆ దాంపత్య సన్నివేశాలు ఒక్కోసారి కుటుంబ సభ్యులంతా కలిసి చూడడానికి కొంత (చాలా కొంత) అభ్యంతరం కలిగేలా ఉండచ్చు. ఐతే అలాంటి సన్నివేశాలు కూడా తర్వాత చిత్రాలలో బాగా తగ్గిపోయాయి. తనకు తానే గీసుకున్న లక్ష్మణరేఖని ఆయన దాటలేదు.

స్వాతిముత్యంలో అమాయకుడైన శివయ్యకి దాంపత్య జీవిత పాఠాలని లలిత నేర్పించే సందర్భం తెలుగు చలనచిత్ర చరిత్రలోనే ఒక అనన్యసాధ్యమైన ప్రయోగం. అది ఎంత లలితంగా, ఎంత సున్నితంగా, ఎంత హృద్యంగా ఉంటుందో మాటలతో చెప్పలేం. ఆ పాట చిత్రీకరణని మళ్ళీ మళ్ళీ చూస్తూంటే - లలిత మీద ఆరాధన పెరుగుతుంది తప్ప మరోభావం కలగదు. ఆ చిత్రీకరణ అలానే ఉండాలి అని అనిపిస్తుంది.

సిరివెన్నెల చిత్రంలో హరిప్రసాద్ తన సంగీతాన్ని ప్రకృతిలోంచే సాధించుకోవాలి అని గుర్తించిన జ్యోతిర్మయి - అంధుడైన అతనికి ప్రకృతి హొయల్ని పరిచయం చెయ్యడానికి - తన శరీరం లోని అవయవాల్ని అతని చేత తాకించి చూపించడం విశ్వనాథ్ అమలిన దృష్టికి పరాకాష్ట. జ్యోతిర్మయి గుండె ఎంత విశాలం. హరిప్రసాద్ మనస్సు ఎంత నిర్మలం. విశ్వనాథ్ కల్పన ఎంత స్వచ్ఛం.

కొన్ని ప్రత్యేక సన్నివేశాలలో, పాత్రల మనోభావాలకి అనుగుణంగా కొన్ని చిత్రీకరణలు కొందరి మనస్సులకు అశ్లీలంగా కనిపించవచ్చు. ఐతే అందులో ఆ పాత్రకీ, నేపథ్యానికీ సరిపడని అశ్లీలం ఉండదు. ఉదాహారణకి సాగరసంగమంలో మాధవి స్నానం. మాధవి మానసికస్థితికి సరిగ్గా సరిపోయేటట్లే ఉంటుంది ఆ దృశ్యం. సప్తపది చిత్రంలో సుమారు అలాంటి పరిస్థితుల్లో హేమ కూడా స్నానం చేస్తుంది. అందులో అశ్లీలత కనపడితే అది చూసేవారి మనస్సులోదే కానీ తీసిన విశ్వనాథ్ మనస్సులోది కాదని నా ప్రగాఢ నమ్మకం.

విశ్వనాథ్ గారి చిత్రాలలో హీరోయిన్లు చాలా అందంగా కనిపిస్తారు. ఐతే అందులో నిండుతనం ఉంటుంది. ఔన్నత్యం ఉంటుంది. నిర్మలత్వం ఉంటుంది. అందరి అందాన్నీ మరింత అందంగా తీర్చి దిద్దారే కానీ ఆకర్షణ కోసం ఆరెయ్యలేదు.



# హద్దులు దాటని హాస్యం

ఇప్పటికీ టోల్లో ఎవరి మొహమో కాలో చెయ్యో సరిగ్గా రాకపోతే వెంటనే అనే మాట భంగిమ. సాగరసంగమం చిత్రంలో ఇమిడిపోయే చిన్న సన్నివేశం. అందులో హాస్యాన్ని పండించారు విశ్వనాథ్.

శంకారభరణంలో శాస్త్రీయ సంగీతాన్ని అపహాస్యం చేయబోయి హాస్యం పాలైన శ్రీగోపాల్ పాత్ర పుట్టించిన హాస్యం ఎన్నటికీ మరిచిపోలేనిది.

ఆయన చిత్రాలలో విడిగా కామెడీ ట్రాక్ అని ఉండదు. అలానే హాస్యనటులు కేవలం హాస్యం కోసమే ఉండరు. చిత్రాలలోని పాత్రలన్నీ తమ తమ పాత్రలకి అనుగుణంగా హాస్యం అందిస్తూ ఉంటాయి. నిజానికి మన జీవితాల్లో మనం కూడా మన మాటల్లో కొంత హాస్యం మిళితం చేస్తూనే ఉంటాం. ఆయన చిత్రాలలోనూ అంతే.

మధ్యమధ్యలో భార్య అంతరాయాలతో అల్లు రామలింగయ్య పార్టీతో తికమక పడ్డం (శంకరాభరణం), ఉద్యోగం అంటూ కమల్ హసన్ సోమయాజులుని ఎక్కడపడితే అక్కడ ఎప్పుడుపడితే అప్పుడు అడుగుతూ ఉండడం (స్వాతిముత్యం), ఐ లవ్ హర్ అంటూ కట్నం కోరుకునే తండ్రిని సుధాకర్ ఏడిపించడం(శుభలేఖ), తోకా తొండమా అని శ్రీలక్ష్మి సాక్షి రంగారావుతో తగవులాడడం (స్వర్ణకమలం) వంటి సన్నివేశాలు ఎన్నేళ్ళు గడిచినా ప్రేక్షకుల మనస్సుల్లో, మాటల్లో చిరస్థాయిగా నిలిచిపోయే హాస్య గుళికలు. ఐతే అవేవీ చిత్రగమనానికి అడ్డు వచ్చేవి కావు. కాకపోవడమే కాకుండా చిత్రగమనానికి దోహద పరిచేవి కూడా.

విశ్వనాథ్ గారి చిత్రాలలో హాస్యం ఎప్పుడూ అపహాస్యం కాదు. అది ఎవరినీ కించ పరచదు. ఒకరిని ఒకరు తిట్టడం, కొట్టడం, తోసుకోడం వంటి వెకిలి హాస్యం కనపడదు. అవిటితనాన్ని అవహేళన చెయ్యడం అసలు ఉండనే ఉండదు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో హాస్యం చిత్రాన్ని కానీ, సన్నివేశాన్ని కానీ పక్క దారి పట్టించలేదు. అలాగే ఏ నాడూ ఎవ్వరినీ అపహాస్యం చెయ్యలేదు. హద్దులు దాటలేదు.

హాస్యం ఆరోగ్యకరం. ఆరోగ్యకరమైన హాస్యం మరీ ఆరోగ్యకరం.

# శంకరాభరణం

# శంకరాభరణం

విశ్వనాథ్ గారు దర్శకత్వం వహించిన చిత్రాలలో ఏదో ఒక చిత్రాన్ని అన్ని కోణాల నుంచి కూలంకషంగా ఈ పుస్తకంలో దర్శించాలని అనుకున్నప్పుడు అది ఏ చిత్రం అన్న ప్రశ్న తలెత్తింది.

చూసిన చిత్రాలని మళ్ళీ మళ్ళీ చూస్తూంటే అన్ని చిత్రాలలోనూ ప్రత్యేకతలు కనిపిస్తూనే ఉన్నాయి. అంతకు ముందు రెండు మూడు సార్లు చూసిన చిత్రంలో సైతం ఏదో ఒక కొత్త విషయం కనిపిస్తూనే ఉంటోంది.

నేతినేతి అని అనుకుంటూ మంచిచిత్రాలను కూడా బాధగా పక్కన పెట్టేసుకుంటూ వెళ్ళ గా వెళ్ళ గా తీసెయ్యలేకుండా మిగిలిన చిత్రం శంకరాభరణం. అంటే విశ్వనాథ్ గారి ఇతర చిత్రాలు ఈ చిత్రం స్థాయిలో లేవని కాదు. అన్ని చిత్రాలలో శంకరాభరణం చిత్రాన్ని ఎన్నుకోడానికి కారణం - తెలుగు చలనచిత్ర చరిత్రలో శంకరాభరణం ఒక మైలు రాయి కావడం. కథాత్మకంగా కళాత్మకంగా, సందేశాత్మకంగా ఉదాత్తమైనదీ, ఉన్నతమైనదీ అవడం.

అంతకు ముందు తెలుగు చిత్రాలకి రాష్ట్రాంతర దేశాంతర ఆదరణ లేకపోలేదు. ఐతే అన్ని ప్రదేశాల వారినీ, భాషలవారినీ అంతస్థాయిలో ఆకట్టుకున్న మొట్టమొదటి తెలుగు చిత్రం శంకరాభరణమే. దేశవిదేశాలలో ప్రేక్షకులని అందరినీ కట్టిపడేసింది. అన్నిచోట్లా అందరినోటా ఒకటే మాట - శంకరాభరణం ఒక అద్భుతం. అలాంటి చిత్రం ఇంతకు ముందు లేదు. ఇక రాదు.



శంకరాభరణం చిత్రం విడుదలైనప్పటికి నా వయస్సు ఇరవైమూడు. విడుదలైన కొన్ని నెలల్లోనే - విజయవాడ, రాజమండ్రి, తణుకు, మద్రాసు, బొంబాయి నగరాల్లో బంధువులతో, స్నేహితులతో కలిసి పదిసార్లు పైనే చూసాను ఆ చిత్రాన్ని. ఆ తర్వాత టీవీలో, సీడీలో, యూట్యూబ్లో ఎన్ని సార్లు చూసి ఉంటానో లెక్క తెలియదు.

చిత్రం చూడ్డం మొదలెట్టడమే నా పని. ఆ తర్వాత ఆ చిత్రమే నన్ను తనలోకి లాగేసుకుంటుంది. ఒక్కో సన్నివేశం మళ్ళీ మళ్ళీ చూస్తున్నా కొత్తగా చూస్తున్నట్లే ఉంటుంది. గగుర్పాటూ, కంటతడీ, చిర్నవ్వూ, రసానందం రకరకాల అనుభూతుల్లో ముంచేస్తుంది.

ఇంతకీ ఆ చిత్రంలో అంత ఆకట్టుకునేది ఏముంది?

ఒక వయస్సు పైబడ్డ సంగీత విద్వాంసుడు కథానాయకుడు. వేశ్యకుటుంబంలో జన్మించిన సంగీతనృత్యాభిమాని కథానాయిక. కథానాయకుడి పాత్ర ధరించిన సోమయాజులు అంతకు ముందు హీరోగా పేరుప్రతిష్ఠలు ఉన్నవారేం కాదు. అలాగే కథానాయిక పాత్రలో నటించిన మంజుభార్గవి తెరమీద అడపా దడపా శృంగార నాట్యాలలో కనిపించిన తార.

వారిద్దరి మధ్యా పాటలు కాదు కదా మాటలు కూడా ఉండవు. చిత్రం అంతా శాస్త్రీయ సంగీత నృత్యాలతోనే నడుస్తుంది.

చిత్రం విడుదల చేసేందుకు ముందుగా బయ్యర్లు దొరకలేదు. విడుదలైన కొత్తలో సినిమా చూసే ప్రేక్షకులు దొరకలేదు. సినిమా హాళ్ళు నిండలేదు.

కొన్నాళ్ళ కి విడుదల చేసేందుకు హాళ్ళు దొరకలేదు. హాళ్ళ లో టిక్కట్లు దొరకలేదు. ఆ సినిమా ఒక్కసారైనా చూడని ప్రేక్షకుడు దొరకలేదు.

చిన్ని జలధారగా మొదలైన ప్రజాదరణ వాగులా, ఏరులా, నదిలా, సముద్రంలా పోటెత్తింది. చిత్రం విడుదలైన కొన్నాళ్ళ కి అందరి మధ్యా కుశలప్రశ్న ఒక్కటే శంకరాభరణం చూసావా అని. మరి కొన్నాళ్ళ కి ఆ ప్రశ్న ఎన్ని సార్లు చూసావు గా మారింది. సంభాషణలన్నీ ఆ చిత్రం మీదే. ప్రజల నోటిమాటలే ఆ చిత్రానికి ప్రకటనలు.

ఆ చిత్రవిజయోత్సవాలు ఊరూరా జరిగాయి. దర్శకులకి ఎన్నెన్ని సన్మానాలో, గజారోహణలో, గండపెండేరాలో, కనకాభిషేకాలో. ఇంక అవార్డులు ఎన్ని వచ్చాయో ఎవరికైనా తెలుసో లేదో.

ఈ సందర్భంలో నా జీవితంలో నేను చూసిన ఒక సంఘటన గుర్తుకు వస్తోంది. నేను మద్రాస్ లయోలా కాలేజీలో చదువుతున్నాను. కాలేజీ సాంస్కృతిక కార్యక్రమం పాశ్చాత్య సంగీతంతో, హిందీ సినిమా పాటలతో, గిటార్లతో విద్యార్థులకి వినోదంగా సాగిపోతోంది. అప్పుడు నిర్వాహకులు వేదిక మీదకి ఒక యువకుణ్ణి ఆహ్వానించారు. అతను కర్నాటక సంగీతం పాడుతాడని ప్రకటించారు. ఆడిటోరియం అంతా నవ్వులూ, వెక్కిరింతలూ, వద్దంటూ చప్పట్లు. అతను వేదిక ఎక్కి మైకందుకుని ఆలాపన మొదలెట్టాడు.

అదేం కంఠస్వరమో, అదేం రాగాలాపనో హాలంతా నిశ్శబ్దం ఐపోయింది. అసలు ఏం అవుతోందో ఎవరికీ అర్థం కాలేదు. అందరినీ సమ్మోహనాస్త్రం కమ్మేసినట్లైపోయింది. అతని గొంతులోంచి అలవోకగా వస్తున్న సంగీత స్వరాల మత్తులో పడ్డ విద్యార్థులు వివశులైపోయారు. హాలంతా చప్పట్లే. ఐతే పాట వద్దని కాదు. పరవశమైపోయిన విద్యార్థులు అసంకల్పితంగా కొడుతున్న చప్పట్లు అవి.



పదిహేను నిమిషాల ఆ సంగీత రస గంగా స్నానం చేసిన విద్యార్థులు అందరూ ఆ పాట ఐపోయిన తర్వాత చాలా సేపు లేచి నిలబడి చప్పట్లు కొడుతూనే ఉన్నారు. అంటే విద్యార్థులలో తెలియకుండా అలాంటి సంగీతం వినాలన్న తపన ఉందన్న మాట. దాన్ని జాగృతం చేసింది అ కుర్రాడు. ఆ సంఘటనకి ప్రత్యక్ష సాక్షిని నేను. అతనూ, అతని రూపం, అతని పాటా నా మెదడు లోపలి పొరల్లో స్థిరంగా ముద్రించుకుపోయాయి. ఆరోజు అతని పాట వింటూ విద్యార్థులలో కలిగిన రసానందానికి నా కళ్ళ లో కారిన కన్నీళ్ళు ఈరోజు ఆ సంఘటనని తలచుకుంటూ రాస్తున్నప్పుడు కూడా కారుతున్నాయి.

శంకరాభరణం చిత్రం కూడా అంతే. ప్రజల మనస్సుల్లో నిద్రాణమై ఉన్న ఆలోచనలనీ అనుభూతులనీ తట్టి లేపింది. జనంలో మంచి అవగాహనా, అభిరుచీ లేదంటూ పదహారేళ్ళ ఆడపిల్లలు పైటలు ఆరేసుకుంటూ పారేసుకుంటున్నారని ఇతర దర్శకులు పాటలు రాయించుకున్న వేటూరిచేతే అద్వైతసిద్ధికి అమరత్వలబ్ధికి అన్న తాదాత్మ్యపు గీతాలని రాయించుకుని వాటిని ప్రజలకి దగ్గరగా చేరవేసిన మహానుభావుడు విశ్వనాథ్.

శంకరాభరణం కథని ఊహించడమే ఊహాతీతం. ఒక సంగీత విద్వాంసుడు ఒక వేశ్యని చేరదీసి ఆదరించిన కథ విప్లవాత్మకం. ఐతే సందేశాలూ, ప్రసంగాలూ, సంఘర్షణలూ లేవు.  అలాంటి కథని చిత్రంగా తీద్దామని ఎంత మనోధైర్యంతో విశ్వనాథ్ అనుకున్నారో, తీసారో. ప్రేక్షకుల మీద ఆయనకున్న నమ్మకాన్ని వమ్ము పోనియ్యలేదు రసహృదయులైన ప్రేక్షకులు.

శంకరాభరణం తర్వాత ఖండఖండాతరాలలో అంతో, అంత కన్న ఎక్కువగానో ఆదరణ పొందిన చిత్రం బాహుబలి. రాజమౌళి బాహుబలిని తియ్యాలని సంకల్పించుకున్నప్పుడే దాన్ని హాలీవుడ్ స్థాయి చిత్రంగా అనుకున్నారు. ఆ చిత్రం కాన్వాస్ చాలా పెద్దది. గ్రాఫిక్స్ అద్భుతమైనవి. కథేమో ఎప్పుడూ జనాదరణ పొందే ఫేంటసీ. ఇంక అందులో నటించిన వారు అందరూ ఎంతో పేరున్నవారే. వీటన్నింటికీ తోడు పరిమితిలేని బడ్జెట్. ఆ సినిమా విడుదలయ్యాక బాగా ఆడదని ఎవ్వరికీ అనుమానం లేదు. ఎంత బాగా ఆడుతుందన్న ఆలోచనే తప్ప.

శంకరాభరణం దానికి పూర్తిగా విరుద్ధం. తన మనస్సులోని కథని నమ్ముకుని దర్శకులూ, దర్శకులని నమ్ముకుని నిర్మాతలూ, వారిద్దరినీ నమ్ముకుని నటీనటులూ సాంకేతిక నిపుణులూ - ఎవ్వరికీ ఆ చిత్రానికి కేటాయిస్తున్న సమయానికి ధన రూపేణా, కీర్తి రూపేణా ఎంత గిట్టుబాటు అవుతుందో తెలియదు. తన కథ మీద ఉన్న నమ్మకం వల్లా, ప్రజల అభిరుచి మీద ఉన్న విశ్వాసం వల్లా - దర్శకులకి మాత్రం మనస్సులో ఆశాజనకమైన అంచనా కొంత ఉండి ఉండచ్చు.

ఆ చిత్రంలో పనిచేసిన వారికి తమకెంత సువర్ణావకాశం లభించిందో ఆ చిత్రం విడుదలై విజయవంతమయ్యాక తెలిసి వచ్చుంటుంది. వారికి అలాంటి అవకాశం అంతకు ముందెప్పుడూ రాలేదు. మళ్ళీ వచ్చే అవకాశం కనుచూపు మేరలో లేదు. సోమయాజులూ, మంజుభార్గవీ, తులసీ - తెలుగు వాళ్ళందరి మనసుల్లో చిరకాలం నిలిచిపోయే అభిమానం సంపాదించుకోవడం శంకరాభరణం వల్లే అని అనడం అతిశయోక్తి కానేకాదు.

ఎవ్వరూ ఆ చిత్రం అలాంటి ఘనవిజయం సాధిస్తుందని ఊహించి ఉండరు. అంత కన్న ముఖ్యంగా చిత్రం విడుదలైన నాలుగు దశాబ్దాల తర్వాత కూడా ఆ చిత్రం విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకుంటుందని అసలు అనుకుని ఉండరు.

కొన్ని గొప్ప సంఘటనలు అసంకల్పితంగా జరుగుతాయి. శంకరాభరణం కూడా అంతే - ఇట్ జస్ట్ హేపెన్స్

చిత్రం చూస్తూ పొందిన అనుభూతుల్ని అక్షరీకరించడం అంత తేలిక కాదు. ఆ అనుభూతులని కింది పది సన్నివేశాల ద్వారా మీ ముందు ఉంచడానికి ప్రయత్నిస్తాను.

★ అంతా నాదమయం
★ ఓంకారనాదాను సంధానమౌ
★ భూపాలం
★ రాగం తానం పల్లవి
★ శంకరాభరణం
★ శంకరా నాదశరీరా
★ ఏ తీరుగ నను దయచూచెదవో
★ బ్రోచేవారెవరురా
★ సామజవరగమనా
★ దొరకునా ఇటువంటి సేవ



(చిత్ర సన్నివేశాలలోకి వెళ్ళడానికి ముందు - ఒక చిన్న సరదా సంఘటన పంచుకుంటాను.

నేను బొంబాయిలో ఆ చిత్రం చూడ్డానికి స్నేహితులతో కలిసి వెళ్ళాను. చిత్రం ఐపోయి హాలు బయటకి వచ్చేస్తోంటే కొందరు నన్ను చూస్తూ చంద్రమోహన్ సినిమా హాలుకి వచ్చారని చెప్పుకున్నారు. అప్పుడు నేను కొంచెం అలా ఉండి ఉంటాను. దానికి తోడు ఆ చిత్రంలో చంద్రమోహన్ వేషంలా ఉన్నాయి నా జుట్టూ, జుబ్బా, కళ్ళజోడూ. శంకరాభరణం ఎప్పటికీ మరిచిపోలేను. అలాగే ఆ సంఘటన కూడా).

# అంతా నాదమయం

ఏ చిత్రానికైనా ఆరంభం చాలా ముఖ్యం. ఆరంభం ఆసక్తిని కలిగించాలి. చూడబోతున్నది ఏమిటన్నదాని మీద ఒక అంచనా ఇవ్వాలి. మరో ఆలోచనకి ఆస్కారం ఇవ్వకుండా ప్రేక్షకుడిని తనలోకి లాగేసుకోవాలి.

శంకరాభరణం ప్రారంభమే శాస్త్రీయ సంగీతమనే రసధారని ఆస్వాదించడానికి రసహృదయులకి దర్శకుల ఆహ్వానం. తమ చిన్ని ప్రయత్నాన్ని మనసారా ఆశీర్వదించమని అభ్యర్థన. ఎంత విలక్షణమైన ఆరంభం. ఆ మాటల్లో చూడబోయే చిత్రాంశమే కాకుండా దర్శకుల నమ్మకమూ, నమ్రతా మనకి స్పష్టంగా వినిపిస్తాయి.

దర్శకుల ఆహ్వానానంతరం మనల్ని ఆహ్వానిస్తాయి మబ్బుల ఆకాశం, ప్రవహించే గోదావరీ, అందమైన కొండలూ.

బాలూ మహేంద్ర ప్రఖ్యాత ఛాయాగ్రాహకుడు. స్వయంగా దర్శకుడు. ప్రకృతిని అందంగా చూపించడం ఆయనకి వెన్నతో పెట్టిన విద్య. ఒక్క అందమే కాకుండా ఆ సన్నివేశానికి మనలో కలగాల్సిన స్పందనని చూపించే నైపుణ్యం ఆయన కెమేరా ప్రత్యేకత. శంకరాభరణం చిత్రం ప్రారంభంలోనే ఆయన కెమేరా మనల్ని గాఢతా, ప్రశాంతతా నిండిన వాతావారణంలోకి తీసుకు వెళ్తుంది.

అప్పుడు నెమ్మదిగా ఒక లాంచీ శబ్దం వినిపిస్తుంది. ఆ లాంచీ శబ్దంలో ఒక విలక్షణమైన లయ ఉంటుంది. లాంచీలో కూచున్న ఒక అబ్బాయి లాంచీ చేసే లయతో పాటు తను స్వరాలు ఆలపిస్తూ చేతిలో ఉన్న కర్రతో రేకు మీద లయబద్ధంగా వాయిస్తూ ఉంటాడు. లాంచీలో ఉన్న ప్రయాణికులు ఒక ప్రయాణికురాలిని మీ అబ్బాయా అన్నట్లు అడగడం, ఆవిడ తలాడించడం - అన్నీ నిశ్శబ్దంగా మాటల్లేకుండా జరిగిపోతాయి.

లాంచీ ముందుకు సాగుతోంటే వెనక్కి పారే గోదావరి నీళ్ల లయ లాంచీ శబ్దంతో, అబ్బాయి స్వరంతో కలిసిపోతుంది. అగ్గిపెట్టె మీద వేళ్ళ తాకిడిలోనూ, రెండు బిందెలు ఒకదానికి ఒకటి తగలడంలోనూ, తాళం చెవుల గుత్తి కదలికలోనూ కూడా లయే.



లాంచీ దిగి గోదావరి ఒడ్డునే ఉన్న ఒక చెట్టు కింద రాత్రంతా కాలక్షేపం చేస్తారు ఆ తల్లీకొడుకులు. పిల్లవాడు నిద్రపోతోంటే తల్లి వెనక్కి వాలి పైకి చూస్తూంటుంది. అల్లుకుపోయిన కొమ్మలు ఆవిడ మనస్సులో ఉన్న అల్లకల్లోలాన్ని సూచిస్తున్నట్లు ఉంటాయి.

సూర్యోదయం అవుతూండగా ఆవిడ తనకి కావల్సిన వారెవరికోసమో ఎదురు చూస్తున్నట్లు చూస్తూంటుంది. సరిగ్గా అప్పుడే ఒక వయస్సు పైబడ్డాయన గంభీరంగా నడిచి వస్తూంటాడు. ఆయన దుస్తుల్లోనే కానీ మొహంలోనూ నడకలోనూ దైన్యం కనిపించదు.



ఆయన అడుగుల్లో సరిగమలు ధ్వనిస్తాయి ఆవిడకి. ఆయన్ని అలా భక్తితో చూస్తూండిపోతుంది. ఆయన పంచె ఆరవేస్తున్నప్పుడు కనిపించిన చిరుగులు ఆవిడని బాధపెడతాయి. ఇక వర్తమానం చూడలేనట్లు గతంలోకి జారుకుంటుంది.

అప్పుడు విశ్వనాథ్ గారి ప్రత్యేక ఒరవడి ఐన ఫ్లాష్ బాక్ పద్ధతిలో జరిగిపోయిన కథ మొదలౌతుంది.

ఈ ప్రారంభ సన్నివేశం ఒక ఏడెనిమిది నిమిషాలు ఉంటుంది. అంతసేపూ ఎవ్వరూ మాట్లాడరు. ఐతే మాటల్లేనట్లు అనిపించదు. వెనక వినిపించే వాయిద్యాలూ, మంజుభార్గవి ముఖకవళికలు బోలెడు కథ చెప్తాయి.

విశ్వనాథ్ మంజుభార్గవిని ఆ పాత్రకి ఎందుకు ఎన్నుకున్నారో అని ఎవరికైనా సందేహం ఉంటే ఆ ఒక్క ప్రారంభ సన్నివేశంతోనే పటాపంచలైపోతుంది. నిండైన విగ్రహం, నిర్దిష్టమైన వ్యక్తిత్వం, నిష్కళంకమైన నిండుతనం, నిర్మలమైన సౌందర్యం పుష్కలంగా కనిపిస్తాయి. దానికి తోడు ప్రత్యేకంగా ఆ పాత్రకి అమర్చిన బొట్టూ, చీరకట్టూ, ముక్కుపుడకా, దుద్దులూ, గాజులూ మంజుభార్గవిని దర్శకుల తలపులో ఉన్న తులసిని చేసేసాయి.

మనుషుల మధ్య మాటలే లేకపోయినా నిశ్శబ్దమే తెలియకుండా వాయిద్యాలతో గారడి చేసిన మహానుభావుడు కె వి మహదేవన్. శంకరశాస్త్రి అడుగులకి సప్త స్వరాలు వీణలో వినిపించడం రసహృదయుల రసలోక విహారానికి ఆరంభమే. ఆస్వాదించబోయే సంగీతామృతానికి సంకేతమే.

# ఓంకారనాదాను సంధానమౌ

ఒక సంగీత విభావరి విరామానంతరం తెర తీయడంతో ఫ్లాష్ బాక్ కథ మొదలవుతుంది. వేదిక మీద తంబురా శ్రుతి చేస్తూ శంకరశాస్త్రి. శంకరాభరణ రాగాన్ని ఆలపించడానికి సన్నద్ధమౌతున్న ఆనందంతో ఆయన ముఖం నిండా బ్రహ్మ తేజస్సు. శ్రుతిచేసిన తంబురాని తనవెనక కూచున్న కూతురు శారదకి ప్రసన్నతా పూర్వక చిరునవ్వుతో అందించి కచేరీ మొదలు పెడతాడు.



వేదిక మీద శంకరశాస్త్రిని చూడగానే ఆ పాత్రకి సోమయాజులుని ఎందుకు విశ్వనాథ్ ఎన్నుకున్నారో ప్రేక్షకులకి అర్థం ఐపోతుంది. ఇంక ఏ లబ్దప్రతిష్ఠుడైన నటుడైనా ఆ నటుడు కనిపించి ఉండేవాడు. శంకరాభరణం చిత్రంలో మనకి ఎక్కడా సోమయాజులు కనిపించరు. శంకరశాస్త్రే కనిపిస్తాడు.

పొడుగూ, ఒడ్డూ, గంభీరమైన మొహం, లోతైన కంఠస్వరం సోమయాజులుకి సహజ లక్షణాలు. దర్శకులు నిర్దేశించిన ఆహార్యాలు తలపాగా, విభూతీ, కోటూ, కండువా. వెరసి శంకరశాస్త్రిలో సోమయాజులు పరకాయప్రవేశం.

ఆంగికంతో వాచికంతో ప్రతి ఫ్రేంలోనూ శంకరాభరణం శంకరశాస్త్రిని చూపించారు సోమయాజులు. పాట పాడుతున్నంతసేపూ, ముఖం, పెదవులూ, చేతులూ, శరీరం మనకి వేదిక మీద ఒక శాస్త్రీయ సంగీత కళాకారుడిని చూపిస్తాయి.

శంకరశాస్త్రి -

ఓంకారనాదాను సంధానమౌ గానమే శంకరాభరణము

- పల్లవిని అందుకుని చూపించిన అభినయంలో కచేరీ చేస్తున్న ఒక సంగీత విద్వాంసుడే కనిపిస్తాడు.

కచేరీలో మొదటి వరసలో కూచున్న తులసి చూపంతా తను తన మనస్సులోనే భగవంతుడిలా కొలుచుకుంటున్న శంకరశాస్త్రి మీదే. తులసి పక్కన కూచున్న తల్లి చూపంతా తులసి అందం మీదా, నగల మీదా, వచ్చిపోయే ధనవంతుల మీదా.

పాట వింటూ తులసి తన హస్తముద్రలతో నాట్యాభినయం చేస్తూ సంగీతానికి అనుగుణంగా నాట్యం చేస్తున్నట్లు ఊహించుకుంటూ ఉంటుంది.

శంకరశాస్త్రి తన గానాన్ని కొనసాగిస్తూ -

శంకర గళ నిగళము శ్రీహరి పద కమలము
రాగ రత్న మాలికా తరలము శంకరాభరణము

- అని పాడతాడు. శంకరుడి కంఠాభరణం సర్పం. సర్పమైన ఆదిశేషుడే విష్ణుమూర్తికి శయ్యా, పద కమలం. శంకరాభరణ రాగం శివుడి ఆభరణమనీ, శ్రీహరి పదకమలమనీ వేటూరి ఊహ.

పాటకి అనుగుణంగా అభినయం చేసుకుంటున్నట్లు ఊహించుకుంటూ ఉంటుంది తులసి.

మొదటి చరణం లో మొదటి వాక్యం -

శారద వీణా రాగ చంద్రికా పులకిత శారద రాత్రము

- అని పాడుతూ ప్రేమగా తన ముద్దుల కూతురు శారద వంక చూస్తాడు శంకరశాస్త్రి.

ఆ చరణంలోనే -
రస గంగలో తానమై
- అని వస్తుంది. ఈ వాక్యం, పాటా, చిత్రం రసికులకి రస గంగలో తానమే.

రెండవ చరణం మొదలే -

అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానమె సోపానము

- అని వస్తుంది. అద్వైత సిద్ధికి అంటే మనం రకరకాలుగా అన్వయించుకోవచ్చు. ఒకటి జీవాత్మ పరమాత్మలో విలీనం ఐపోవడం. రెండవది సంగీత నాట్యాల అద్వైతం. మూడవది శివకేశవుల అద్వైతం. దానికి సూచన శంకరాభరణం శివుడి ఆభరణం, శ్రీహరి పదకమలం అన్న పదాల్లో ఉంది. అలాగే శంకరశాస్త్రీ, మాధవుల స్నేహంలో ఉంది.

ఇంకో అద్వైతసిద్ధి సంగీతజ్ఞుడైన శంకరశాస్త్రీ, నాట్యకారిణి తులసీ సాధించినది. ఈ అన్వయం ఈ పల్లవి తర్వాత పంక్తి ఐన త్యాగరాజ హృదయం, రాగరాజ నిలయంలో కొంత స్ఫురిస్తుంది. చిత్రం చివరలో త్యాగరాజ హృదయం శంకరశాస్త్రిగానూ, రాగరాజ నిలయం తులసిగానూ చూపించినపుడు ఈ స్ఫురణ ధృవపడుతుంది.

అద్వైత సిద్ధి అన్న మాటలు వస్తున్నప్పుడు తన ఊహలో నాట్యం చేసుకుంటున్న తులసి ప్రతిబింబం నీటిలో చూపించడం బింబ ప్రతిబింబాల అద్వైతానికి ఒక రకమైన ప్రతీక.

అమరత్వ లబ్ధికి గానమె సోపానము లో ఉన్న సోపానము మాటని వేటూరి మళ్ళీ దొరకునా ఇటువంటి సేవ పాటలో ఇదే అర్థంలో వాడారు -

నీ పద రాజీవముల చేరు నిర్వాణ సోపానమధిరోహణము చేయు త్రోవ
- అని.

రెండవ చరణం ఆఖరి వాక్యంలో -

త్యాగరాజ హృదయమై రాగరాజ నిలయమై

- అని శంకరశాస్త్రి పాడుతున్నప్పుడు తులసి తల్లి దగ్గరకి వచ్చిన ఒక జమీందారు కుర్చీ జరుపుతూ చేసిన ధ్వని తన సంగీత తపోనిష్ఠకి భంగంలా తోచి పాటని అప్పటికప్పుడు ఆపేసి ఆగ్రహంతో సభావేదికని వదిలి ఇంటికి వెళ్ళిపోతాడు శంకరశాస్త్రి. బేలగా చూస్తూండిపోతుంది తులసి.

ఇంటికి ఆగ్రహంతో వస్తున్న శంకరశాస్త్రికి ఎదురు పడడానికి మృదంగ విద్వాంసుడు గోపాలానికి కానీ వంటలక్క జానకమ్మకి కానీ సాహసం చాల లేదు.

ఆగ్రహంతో పనివారిమీద హూంకరిస్తూ వస్తున్న శంకరశాస్త్రికి అమాయకంగా స్వరాలు పాడుకుంటున్న కూతురు శారద కనిపిస్తుంది. కోపం అంతా దిగిపోతుంది. కన్నకూతురి మీద ప్రేమ. ఆ కూతురు స్వరాలు పలుకుతోంటే కలిగే అనుభూతి. వెన్నలా కరిగిపోతాడు శంకరశాస్త్రి.

ఉగ్రరూపంలో ఉన్న నరసింహస్వామిని శాంత పరచడానికి దేవతలకూ, మునులకూ, చివరికి శ్రీదేవికి కూడా భయం వేసిన సమయాన బాలుడు ప్రహ్లాదుడు చేసిన స్తోత్రాలకు కరిగి విష్ణువు తన నిజస్వరూపం ధరించడం గుర్తొస్తుంది చిన్నారి శారదని చూసి శంకరశాస్త్రి కరిగిపోవడం.

ఈ సన్నివేశం శంకరశాస్త్రి వ్యక్తిత్వాన్ని మనకి పరిచయం చేస్తుంది. సంగీత సాధన శాస్త్రికి తపస్సే. ఏ మాత్రం భంగం ఐనా సహించలేడు. అలాగే పైకి ఎప్పుడూ గంభీరంగా కనిపిస్తాడు కానీ మనస్సునిండా ప్రేమే. అది కూతురి పైన ఐనా, సహ కళాకారుల పైన ఐనా సరే.

శంకరశాస్త్రి మాట కటువు. మనసు వెన్న. మనిషి శొంఠికొమ్ము. కళ్ళలో వేసినప్పుడు ముందు మంట పెడుతుంది. తర్వాత మంచులా చల్ల పరుస్తుంది.

# భూపాలం

గోదావరి నది. తెల్లవారి వెలుగు. నది నీళ్ళ లో కంఠం వరకూ మునిగి కూర్చుని సంగీత సాధన చేస్తూంటుంది చిన్నారి శారద. ఉదయసంధ్యకు అనువైన భూపాల రాగ స్వరాలు గంభీరమైన తన స్వరంలో శంకరశాస్త్రి శారదకి నేర్పుతూ ఉంటాడు. నీళ్ళ లో కూర్చున్న శారద గొంతు వణుకుతూ తండ్రి చెప్పిన స్వరాలను పలుకుతూ ఉంటుంది.

ప్రశాంత వాతావరణంలో ఆ తండ్రీ కూతుళ్ళు ప్రకృతి మాతకు చేస్తున్న ప్రభాత స్వరార్చనలా వినిపిస్తూ ఉంటుంది భూపాలం.

తను అంత ప్రేమించే కూతురైనా సరే స్వరం సరిగ్గా పలకకపోతే సహించలేడు శంకరశాస్త్రి. కసురుతున్నట్లు హూంకరించి తప్పు దిద్దుతాడు. శారద తప్పు దిద్దుకుని సరిగ్గా పాడుతుంది. ఇది చిత్రంలో రాబోయే ఒక ముఖ్యమైన సన్నివేశానికి ముందు సూచన.

వాళ్ళిద్దరికీ దూరంగా నిలబడి స్వరాలు వింటూ చూస్తూ ఉంటుంది తులసి. శంకర శాస్త్రి సుస్వరం తులసి తనువును అభినయించమంటుంది. తులసి మనసు ఆగలేకపోతుంది.

ఒక పక్క గొంతెత్తి శంకరశాస్త్రి గానం. మరో పక్క ఆ గానానికి అనుగుణంగా తులసి నాట్యం. ఎంత అందమైన సన్నివేశం అది? ఎంతటి అమోఘమైన కల్పన అది?

నిలువెత్తు శంకరశాస్త్రి. సంగీతంతో తాదాత్మ్యం చెందిన ఆయన గొంతులోంచి గంగలా పొంగుకొస్తున్న సంగీతం.

సౌందర్య రాశి తులసి. సంగీత నాట్యాలు తప్ప మరో గమ్యం గమనం లేని తులసి తనువూ మనసూ కలిసి భక్తితో చేస్తున్న నాట్యం.

ఇసుక మీదే నాట్యం చేస్తూ తులసి నాట్యపు నడకలతోనే నెమ్మదిగా శంకరశాస్త్రిని సమీపిస్తుంది. నేపథ్యంలో అడుగులకు తగినట్లు వీణపై స్వరాలు. దగ్గరకి వెళ్ళి శంకరశాస్త్రి పాదాలకి ప్రణమిల్లుతుంది తులసి.



అదే మొదటి సారి ఒకరిని ఒకరు కలవడం. ఒకరికి దగ్గరగా ఒకరు నిల్చోడం. అలా కలుసుకున్న వాళ్ళిద్దరి మధ్యా ఏర్పడ్డ సంబంధం వారిద్దరి జీవితాంతం నిలిచిపోతుంది.

బాలూ మహేంద్ర టోగ్రఫీ, మహదేవన్ సంగీతం, శేషు నృత్య దర్శకత్వం - వారిద్దరి కళలనీ ఆత్మలనీ ఒక్కటి చేసేసాయి. వారితో ప్రేక్షకుల్ని మమేకం చేసేసాయి.

## రాగం తానం పల్లవి

భూపాల రాగాలాపనకి అనుగుణంగా గోదావరి తిన్నెలపైన నృత్యం చేస్తూ తులసి శంకరశాస్త్రిని కలిసిన ముహూర్తబలం ఎంతటిదో కానీ వాళ్ళిద్దరూ అనుకోకుండా మళ్ళీ కలుస్తారు.

ఎక్కడో కన్నడ దేశస్తులు శంకరశాస్త్రి మీద గౌరవంతో సన్మాన సభ ఏర్పాటు చేస్తారు. తన స్నేహితుడు మాధవుడి బలవంతం వల్ల శంకరశాస్త్రి వెళ్ళడానికి ఒప్పుకుంటాడు. అక్కడే సంగీత కచేరీ కూడా ఉంటుంది.

వేశ్యకులంలో పుట్టిన తులసిని తల్లి కులవృత్తి చేసుకుంటూ డబ్బు సంపాదించుకోమని ప్రోత్సహిస్తూ ఉంటుంది. నెమ్మదిగా చెప్తే వినదని బలవంతంగా ఒప్పించడానికి తయారవుతాడు తులసి మావయ్య.

ఏ రోజు రాత్రికి తులసి దగ్గరకి జమీందారుని పిలుస్తారో, ఆ రాత్రికే తులసి ఇంటి నుండి పారిపోతుంది. రైల్వే స్టేషన్లో కదలడానికి సిద్ధంగా ఉన్న రైలు ఎక్కుతుంది. వెతుకుతూ వచ్చిన తల్లీ, మావయ్యా తులసి కనిపించక వెళ్ళి పోతారు.



తులసి ఎక్కిన రైల్లో, అదే కంపార్ట్మెంట్లో శంకరశాస్త్రి కర్నాటకకి వెళ్తూ ఉంటాడు. తులసిని చూసి గుర్తించి తనతో తీసుకుని వెళ్తాడు. వారిద్దరి మధ్యా సంభాషణ ఉండదు. ముఖకవళికలే వారి మనోభావాలని చూపిస్తాయి.

రైలు దిగాక తులసిని తనతో రమ్మని సంజ్ఞ చేస్తాడు. సహకార కళాకారులు వింతగా చూస్తారు.

శంకరశాస్త్రికి సన్మానం ఘనంగా జరుగుతుంది. కాలికి గండపెండేరం తొడుగుతారు. తులసి ఆనందంగా చూస్తుంది. అనంతరం శంకరశాస్త్రి కచేరీ మొదలవుతుంది. పల్లవిగా -

రాగం తానం పల్లవీ
నా మదిలోనె కదలాడి కడతేరమన్నవి

- అని శంకరశాస్త్రి గానం ప్రారంభించగానే అందులో తన్మయమైపోయిన తులసి ఆ గానానికి తను నాట్యం చేస్తున్నట్లు ఊహించుకుంటూ ఉంటుంది.

ఊహలో తులసి నృత్యం శిల్పకళతో విరాజిల్లుతున్న బేలూరు, హాళేబీడు ఆలయ ప్రాంగణాలలో సాగుతుంది. ఆలయ శిల్పాల నాట్య భంగిమలని అనుకరిస్తూ అభినయిస్తుంది తులసి.

కృష్ణా తరంగాల సారంగ రాగాలు

– అని మొదలయ్యే చరణానికి నేపథ్యంలో కృష్ణానది కనిపిస్తూ ఉంటుంది. నది ఒడ్డున మెట్లమీద తులసి అభినయిస్తూ ఉంటుంది.

ఆ పల్లవి చివర –

క్షీరసాగరశయన దేవగాంధారిలో

– అని వస్తుంది. వేటూరి చమత్కారం ఏమిటంటే క్షీరసాగరశయన అన్న త్యాగరాజస్వామి కీర్తన రాగం దేవగాంధారి!

శ్రుతి లయలే జననీ జనకులుకాగ

– అని మొదలయ్యే రెండవ చరణంలో శ్రుతి లయలే జననీ జనకులు అన్న వాక్యాలు ఎంత అర్థవంతమైనవో.

కర్నాటకలో సన్మానాలూ, కచేరీలూ సాగుతూ ఉంటాయి. తులసి శంకరశాస్త్రి దగ్గరే ఉంటుంది. ఈ కార్యక్రమాల వివరాలు తెలుసుకుని తులసి తల్లీ, మావయ్యా నిర్వహణా స్థలానికి వచ్చి శంకరశాస్త్రిని నానా దుర్భాషలూ ఆడి తులసిని ఇంటికి తీసికెళ్ళి పోతారు.

నిస్సహాయంగా వెళ్ళి పోతుంది తులసి.

నిశ్చేష్టుడై చూస్తూండి పోతాడు శంకరశాస్త్రి.

(విశ్వనాథ్ గారు తీసిన నిండుహృదయాలు చిత్రంలో చంద్రకళ వేశ్యల కుటుంబంలో జన్మిస్తుంది. అయినా ధనవంతుల ప్రాపులో కాసులు సంపాదించుకోవడంలో ఆసక్తి అసలు ఉండదు. ఆ చిత్రంలో చంద్రకళ తల్లి ఛాయాదేవి వయస్సులో ఉన్నప్పుడే డబ్బులు చేసుకోవాలని కూతురికి హితబోధ చేస్తుంది. ఛాయాదేవి ధోరణే శంకరాభరణం చిత్రంలో మంజుభార్గవి తల్లి ఝాన్సీ ప్రవర్తనలో కనిపిస్తుంది. కొన్ని సన్నివేశాలలో వారిద్దరి సంభాషణలు, హావభావాలు చాలా దగ్గరగా అనిపిస్తాయి.)

# శంకరాభరణం

తులసి తల్లీ, మావయ్యా తులసిని తమతో తీసుకు వచ్చేస్తారు.

తూగుటుయ్యాల మీద శంకరశాస్త్రి ఫోటోని పెట్టుకుంటుంది తులసి. ఫోటోతోపాటు కృష్ణుని విగ్రహం, పువ్వులూ, అగరొత్తుల ధూమం. ఎంతో ప్రశాంతమైన వాతావరణం.

రికార్డు ప్లేయర్లో శంకరశాస్త్రి పాడిన ఓంకారనాదాను సంధానమౌ పాట వినిపిస్తూ ఉంటుంది. ఆ పాటని వింటూ శంకరశాస్త్రి ఫోటో ముందు కూచుని తను కూడా పాడుకుంటూ ఉంటుంది. చేతిలో తంబురా మీద శ్రుతించుకుంటున్న తులసి మొహమంతా భక్తి తన్మయత్వం.

చెవులకి జూకాలతో, మెళ్ళో హారాలతో, చేతులకి గాజులతో, ముక్కు పుడకతో, నిండైన బొట్టుతో, చీర కట్టులో ఎంతో పవిత్రంగా కనిపిస్తుంది తులసి.

వేదిక మీద జమీందారు చేసిన శబ్దానికి పాట ఏ చరణం దగ్గర శంకరశాస్త్రి ఆగ్రహించి ఆపేసాడో ఆ చరణం రికార్డులో వస్తూ ఉంటుంది. అదే తులసి పాడుతూ ఉంటుంది -



అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానమె సోపానము
సత్త్వ సాధనకు సత్య శోధనకు సంగీతమే ప్రాణము
త్యాగ రాజ హృదయమై రాగ రాజ నిలయమై
ముక్తి నొసగు భక్తి యోగమార్గము
మృతియె లేని సుధాలాప స్వర్గము శంకరాభరణము
పాదాని శంకరాభరణము
పమగరి, గమపదని శంకరాభరణము

- మనస్సునిండా శంకరశాస్త్రి మీద భక్తిప్రపత్తులతో పారవశ్యంతో తులసి పాడుకుంటున్న సమయానికి, ఆ యింట్లోకి అడుగు పెడతాడు జమీందారు. వస్తున్న దారిలో వేలాడుతున్న గద్దా, పామూ బొమ్మను దాటుకుని తులసి ఉన్న గదిలోకి వస్తాడు. ఆ బొమ్మలో గద్ద పాముని పట్టుకున్న దృశ్యం కనిపిస్తుంది.

ఏకాగ్రతతో స్వరాలు వింటూ, అంటున్న తులసి జమీందారుని గమనించదు.

జమీందారే తులసిని బలవంతంగా పట్టుకుంటాడు. తులసి తన చేతిని తొలగించుకుని జమీందారు నుండి తప్పించుకోడానికి పక్కగదిలోకి పరిగెడుతుంది. వెనకే వెళ్ళి తలుపు వేసేస్తాడు జమీందారు.

రికార్డు మీద శంకరాభరణం స్వరాలు వినిపిస్తూంటాయి.

లోపల జరుగుతున్న దౌర్జన్యం మనకి కనిపించదు. కానీ గదిలో తులసి శరీరం మీద జరుగుతున్న దురాక్రమణ మన మనస్సులని కలవర పరుస్తుంది. తులసి మనస్సు అనుభవిస్తున్న బాధ మన గుండెల్ని పిండేస్తుంది.

అగరొత్తులు కాలుతూ బూడిదగా రాలిపోతూంటాయి.
పాట ఐపోయి రికార్డు మీద ముల్లు గరగర శబ్దం చేస్తుంది.
అప్పుడు జమీందారు తలుపు తీసుకుని బయటకి వస్తాడు.
లోపల మంచం మీద చెదరిన జుట్టుతో, చెరిగిన బొట్టుతో తులసి.

జమీందారు తులసితో అశ్లీలమైన మాటలు అని వెళ్ళిపోబోతూ శంకరశాస్త్రి   టో చూసి, వీడు నీకు దేవుడా, కావలిస్తే వాడితోనే పో అని అంటూ ఆ   టోని కాలితో తన్నేస్తాడు.   టో నేల మీద పడుతుంది. దానికి ఉన్న అద్దం పగులుతుంది.

తన మీద జరిగిన అన్యాయానికి ఎదురు తిరగలేదు తులసి. తనతో అసభ్యకరమైన మాటలు అన్నప్పుడు కూడా ఏమీ అనలేదు. ఎప్పుడైతే తను ఆరాధించే శంకరశాస్త్రిని అగౌరవ పరచి, కాలితో తన్ని   టో విరక్కొట్టాడో అప్పుడు తులసిలో ఆగ్రహం తలెత్తుతుంది.

ఐనా ఏ మాత్రం తొందరా, తొట్రుపాటూ లేకుండా లేస్తుంది. వంగి   టో తీసి పక్కన పెడుతుంది. చేతిలోకి పెద్ద గాజుముక్క తీసుకుంటుంది. నెమ్మదిగా జమీందారు నిల్చున్న చోటుకి నడుస్తుంది.

కళ్ళ లో రౌద్రం. చేతిలో ఆయుధం. శాంతికి మరో పేరైన తులసి భద్రకాళిలా మారుతుంది. వెనక నేపథ్య సంగీతం తులసిలోని ఆవేశానికి తగినట్లుగా వినిపిస్తూ ఉంటుంది.

బాల్కనీలో సిగరెట్ కాల్చుకుంటూ నిల్చున్న జమీందారు వెనక నుండి గాజు ముక్కతో బలంగా పొడుస్తుంది.

జమీందారు చావు కేక వినిపిస్తుంది.
పాము గద్ద బొమ్మ గిరిగిర తిరుగుతుంది.

ఆ బొమ్మలో గద్ద పాముని పట్టుకున్నట్లు ఉంటుంది. అదే బొమ్మలో పాము గద్ద మీద తిరుగుబాటు చేస్తున్నట్లు కూడా ఉంటుంది.

ఆ పామే శంకరాభరణం!



# శంకరా నాదశరీరా

కుర్చీలో కూచున్న శంకరశాస్త్రి ఒళ్ళో శారద నిద్రపోతుంది. పక్కనే తులసిమొక్క.

పనివాడికి శారదని లోపల పడుకోపెట్టేందుకు ఇచ్చి తను కూడా లేవబోతోంటే ఇంట్లోకి పరిగెత్తుకుని వస్తున్న తులసి కనిపిస్తుంది.

తులసి శంకరశాస్త్రి దగ్గరకి వచ్చి, వంగి, జమీందారుని చంపినప్పుడు తన చేతులకి అంటిన రక్తాన్ని శాస్త్రి పాదాలకి శ్రద్ధగా రాస్తుంది. దేవుడికి జరిపే పాదాభిషేకంలా భక్తిగా చేస్తుంది.

జరిగింది తెలుసుకున్న శంకరశాస్త్రి తన స్నేహితుడు లాయరు మాధవుడిని తులసిని ఎలాగైనా రక్షించమంటాడు. ఒప్పుకున్న లాయరు లోకం ఏమనుకుంటుందో అని అంటాడు. అందుకు సమాధానంగా శంకరశాస్త్రి -

> లోకేశ్వరుడికి తప్ప లోకానికి భయపడనురా మాధవా...
> నాకూ తులసికీ ఉన్న బాంధవ్యం ఆ పరమేశ్వరుడికి తెలుసు, నాకు తెలుసు

- అని, కేసు సంగతి చూసుకోమని మాధవుడితో చెప్తాడు.

శంకరశాస్త్రి ఈ మాటలలో చిత్రానికి మూలస్తంభాలైన రెండు విషయాలని వినిపించారు సంభాషణల రచయిత జంధ్యాల.

ఒకటి. శంకరశాస్త్రి వ్యక్తిత్వం. అది ఎంత బలమైనదంటే - భగవంతుడికి తప్ప ఇంకెవ్వరికీ భయపడనంత. చిత్రమంతా శంకరశాస్త్రి ఈ గుణం కనిపిస్తూనే ఉంటుంది.

రెండు. తులసీ శంకరశాస్త్రిల మధ్య ఉన్న బాంధవ్యం. అది శారీరకం కాదు. అది మానసికం కూడా కాదు. ఆ రెంటికి పైనది ఏదో. కళాత్మక బాంధవ్యం. భగవంతుడికి మాత్రమే తెలిసిన బాంధవ్యం.

జమీందారుని చంపడంలో తులసి చేసిన నేరం ఏమీ లేదని, నేరం ఏదైనా ఉంటే అది తులసి తల్లిదే అని వాదించి తులసిని నిర్దోషిగా విడుదల చేయిస్తాడు మాధవుడు. తులసిని ఇంటికి తీసుకు వెళ్తాడు శంకరశాస్త్రి. గుర్రబ్బండిలో వెళ్తున్న వారిని చూసి జనం నోళ్ళు నొక్కుకుంటారు.

మడీ ఆచారం లేని ఇంట్లో తను ఉండలేనని వెళ్ళి పోతుంది వంటలక్క. నైవేద్యపు వంట చెయ్యడానికి మడి కట్టుకుని బిందెతో నీళ్ళు తీసుకు వస్తూ మొయ్యలేక పడిపోతుంది శారద. అసహాయంగా చూస్తూ ఉండిపోయిన తులసితో -

ఏం నీకు వంట చెయ్యడం చేత కాదా

– అని అడుగుతాడు శంకరశాస్త్రి. వచ్చునన్నట్లు తలొంచుకుని తలూపుతుంది తులసి.

పసిపిల్ల, అది మడికట్టుకుని వంట చెయ్యడానికి అవస్థ పడుతోంటే చేతనైన వాళ్ళు వెళ్ళి సహాయం చెయ్యవచ్చు కదా



– అన్న శంకరశాస్త్రి మాటలకి తను మడి కట్టుకుని శంకరశాస్త్రి వంటి సదాచార సంపన్నుల ఇంట వంట చెయ్యడమా అని నివ్వెరపోతుంది తులసి. నేనా అన్నట్లు చేతులు గుండెల మీద పెట్టుకుంటుంది. అది చూసి –

ఆచార వ్యవహారాలు మనసుల్ని క్రమమైన మార్గంలో పెట్టడానికి తప్ప మనుషుల్ని కులమనే పేరుతో విడదియ్యడానికి కాదు తులసీ

– అని తన పూజకి వెళ్ళిపోతాడు. ఈ చిత్రానికి మూలస్తంభమైన మాటలు జంధ్యాల కలం నుండి జాలువారాయి. ఈ చిత్రంలో తులసి శంకరశాస్త్రితో ప్రత్యక్షంగా మాట్లాడిందే లేదు. శంకరశాస్త్రి తులసితో మాట్లాడిన ఒకే ఒక్క సందర్భం ఇదే. ఈ సందర్భాన్ని కులాల గురించీ, ఆచారాల గురించీ ప్రేక్షకులకి తెలియచెయ్యవలసిన మాటలతో పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారు విశ్వనాథ్, జంధ్యాలలు.

ఎంతో ఆనందంతో స్నానం చేసి, తులసి మొక్కకి నీళ్ళు పోసి, కుంకుమ బొట్టు పెట్టుకుని, వంటింట్లోకి కుడికాలు పెట్టి, పొయ్యి వెలిగిస్తుంది తులసి.

ఐతే ఆ ఆనందం ఎంతో సేపు ఉండదు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలకి శివాలయంలో శంకరుడి ముందు పాడడానికి కూచున్న శంకరశాస్త్రి పక్కన సహ కళాకారులు కూచున్నాక శంకరశాస్త్రి ఆనతి మీద తంబురాతో వచ్చి కూచుంటుంది తులసి. వెంటనే నిరసనగా సహ కళాకారులూ, ప్రేక్షకులూ లేచి వెళ్ళిపోతారు. తన వల్లే ఇలా జరుగుతోందని బాధపడుతూ తులసి కూడా వెళ్ళిపోతుంది.

ఒంటరిగా ఉండిపోయిన శంకరశాస్త్రి ఎదురుగా శంకరుడు. తన మనస్సులోని ఆవేదనని ఆ శంకరుడికే విన్నవించుకుంటున్నట్లు –

శంకరా నాదశరీరా పరా
వేదవిహారా హరా, జీవేశ్వరా

– అని పాడడం మొదలెడతాడు శంకరశాస్త్రి.



వేటూరి శబ్దార్థాలంకారాల చతురుడు. మొదటి చరణంలో –

ప్రాణము నీవని, గానమె నీదని, ప్రాణమె గానమని
మౌన విచక్షణ ధ్యాన విలక్షణ రాగమె యోగమని
నాదోపాసన చేసిన వాడను నీ వాడను నేనైతే
ధిక్కరీంద్రజిత హిమగిరీంద్రసిత కంధరా, నీలకంధర
క్షుద్రులెరుగని రుద్రవీణ నిర్ణిద్ర గానమిది
అవధరించరా విని తరించరా

– అని తన చాతుర్యం అంతా చూపించారు. అది ఎంతవరకూ అంటే శంకరుడితో నా గానం విని తరించమని శంకరశాస్త్రి అడిగేంత.

తనని తరించమన్న శంకరశాస్త్రి మాటలకి శిరసూపిన శివుడి జటాజూటంలో ఉన్న గంగ వానగా కురిసింది. దాన్నే –

మెరిసే మెరుపులు మురిసే పెదవుల చిరు చిరు నగవులు కాబోలు
ఉరిమే ఉరుములు సరి సరి నటనల సిరి సిరి మువ్వలు కాబోలు
పరవశాన శిరసూగంగా, ధరకు జారెనా శివ గంగా
నా గాన లహరి నువ్వు మునుగంగా
ఆనంద వృష్టినే తడవంగా

– అన్న వేటూరి ఊహకి ఇంకేం అనగలం, ఆహా తప్ప!

శంకరశాస్త్రి ఆ గంగలో తడుస్తూ, పాడుతూ, నాట్యం కూడా చేస్తాడు. ఆ వర్షంలో సోమయాజులు నాట్యం చేస్తున్నట్లు అడుగులు వేస్తోంటే సినిమా హాళ్ళలో జనం తమ హర్షం చప్పట్లతో చూపించడం నేనెన్నో సార్లు చూసాను, విన్నాను. అంతటి శక్తివంతమైన సన్నివేశం అది.

విశ్వనాథ్ సృష్టి అది. వేటూరీ, కెవీ, బాలూ, సోమయాజుల కళావృష్టి అది.

శంకరశాస్త్రి తన ఆరాధ్య దైవమైన శంకరుడి ముందు తన సంగీతరసధారను సమర్పిస్తున్నవేళే – ఇంట్లో తన ఆరాధ్య దైవమైన శంకరశాస్త్రి పటం ముందు కన్నీటి వీడ్కోలు తీసుకుంటుంది తులసి.

# ఏ తీరుగ నను దయచూచెదవో

శంకరశాస్త్రి ఇంటి నుండి వచ్చేసిన తులసి రోడ్లో నడుస్తూ నలతగా అనిపించి ఆస్పత్రికి వెళ్ళి డాక్టర్ని కలిసి వస్తుంది. ఎదురుగా తల్లి ఒళ్ళో ఆడుకుంటున్న పిల్ల కనిపిస్తుంది. తులసి ఆలోచనాత్మకంగా పిల్లని చూస్తుంది. తులసి చూసిన చూపులతో ప్రేక్షకులకి ఏం జరిగిందో అర్థం అవుతుంది.

ఆస్పత్రి ముందు ఉన్న గుర్రపు బండిని ఎక్కబోతున్న తులసికి ఆ బండి మీద ఉన్న శంకరశాస్త్రి కచేరీ ప్రకటన కనిపిస్తుంది. శంకరశాస్త్రి చిత్రం ముందు నిల్చుని –

> బాబుగారూ, ఓ దౌర్భాగ్యుడి పాపానికి రూపం నా కడుపులో ఊపిరి పోసుకుంది.
> అదృష్టానికి మించి ఆశించానేమో.
> జీవితాంతం మీ పాద సేవ చేసుకోవాలనే నా కోరిక కోరికగానే మిగిలిపోయింది.
> పుట్టబోయే నా బిడ్డకి మీ పేరు పెట్టుకుంటే మీకు అభ్యంతరమా బాబుగారూ?
> మీరే చెప్పే వారు శంకరాభరణం అంటే విష నాగని.
> ఆ విషకీటకం శంకరుడికే ఆభరణం అయింది.
> నాలో రూపు దిద్దుకుంటున్న విషబీజం ఈ శంకరుడి పాదాల చెంతకి చేరుకోగలిగితే నాకా ఆనందం చాలు

– అని బండి ఎక్కేస్తుంది.

శంకరశాస్త్రితో తులసి ప్రత్యక్షంగా మాట్లాడింది లేదు. పరోక్షంగా మాట్లాడిన మాటలు ఇవే. రాబోయే చిత్రం కథంతా ఈ మాటల మీదే ఆధారపడింది.

ఇక్కడితో ఫ్లాష్ బాక్ కథ ముగుస్తుంది. కథ వర్తమానంలోకి వస్తుంది. తులసి కొడుకుతో లాంచీ దిగి, గోదావరి ఒడ్డున ఒక రాత్రి గడిపి, మర్నాడు ఉదయమే శంకరశాస్త్రిని చూస్తున్న సన్నివేశానికి వస్తుంది చిత్రం.

ఈ పదేళ్ళ లో శాస్త్రీయ సంగీతం మీద అభిమానం తగ్గి, పాశ్చాత్య సంగీతం జోరందుకుంటున్నట్లు బొమ్మలతో చూపిస్తారు. సంగీత ప్రపంచంలో ఒక వెలుగు వెలిగిన శంకరశాస్త్రి కచేరీల అవకాశం లేక ఇంట్లోనే సంగీత సాధనా, సరస్వతీ ఆరాధనా చేసుకుంటూ ఉంటాడు.

ఆ ఇంటికి తన కొడుకు శంకరాన్ని పంపుతుంది తులసి. పంపుతూ నాకు దక్కని భాగ్యం నీకు దక్కితే చాలు అంటుంది. నువ్వేం భయపడకమ్మా ఆయన దగ్గర సంగీతం నేర్చుకుని ఆయన అంతటి వాడిని అవుతాను అని అమ్మకి ధైర్యం చెప్తాడు శంకరం.

శంకరం ఇంటి దగ్గర రాడానికి ముందే శంకరశాస్త్రి ఇంటి ముందున్న ఒక మేడ మీద పాశ్చాత్య సంగీతం వాయిస్తున్న నలుగురు కుర్రాళ్ళు శంకరశాస్త్రిని వెక్కిరిస్తూ పాడుతారు. కోపంతో తన ఇంటి తలుపు వేసేసుకుని తన సంగీత సాధనా నిష్ఠలో ఉంటాడు శంకరశాస్త్రి. అది ఎంత నిష్ఠ అంటే కూతురు శారద శాస్త్రి పక్కన నడుస్తున్నప్పుడు తన కాలి గజ్జెలు చప్పుడవకుండా జాగ్రత్త పడేటంత.

సరిగ్గా ఆ సమయానికి తలుపు కొట్టిన శంకరం శంకరశాస్త్రి తలుపు తీసేలోగా ఎదురింటి కుర్రాళ్ళ పాటకి డాన్స్ చేస్తూంటాడు. తలుపు చప్పుడు తన ఏకాగ్రతని భంగం చేసిందన్న కోపంతో తలుపు తీసిన శంకరశాస్త్రి శంకరం డాన్స్ చూసి మరింత కోపంతో శంకరం చెంప మీద కొడతాడు. దూరం నుండి ఆ చెంపదెబ్బను చూసిన తులసి నిరాశా నిస్పృహలతో నిరుత్సాహ పడుతుంది.

కానీ శంకరం తను తల్లికి ఇచ్చిన మాటని మర్చిపోడు. కార్యసాధకుడిలా మళ్ళీ ప్రయత్నం చేస్తాడు. శంకరశాస్త్రి ఇంట్లో లేని సమయంలో శంకరశాస్త్రి ఇంటికి బయల్దేరుతాడు.



చేత చిన్న తంబురాతో, మెడలో తుండుతో, నుదుటన చందనం బొట్టుతో వచ్చి ఏ గుమ్మం దగ్గర శంకరశాస్త్రి చేత చెంపదెబ్బ తిన్నాడో అదే గుమ్మం పక్కన అరుగు మీద కూచుంటాడు. కూచుని –

ఏ తీరుగ నను దయచూచెదవో
ఇనవంశోత్తమ రామా

– అని భక్త రామదాసు కీర్తన పాడడం మొదలెడతాడు. లోపల పని చేసుకుంటున్న శారద పసివాడి పాట విని గుమ్మం దగ్గరకి వస్తుంది. వచ్చి ఈ పాట పాడుతున్నావు నీకు భవసాగరం అంటే అర్థం తెలుసా అని అడుగుతుంది. శంకరం తెలియదంటే పెద్ద వాళ్ళ కి వచ్చే కష్టాలు అని చెప్తుంది.

నాకూ కష్టాలు చాలా ఉన్నాయి అంటూ శంకరం తానొక అనాథననీ, ఆకలి వేసినా తిండి పెట్టే నాథులు లేరనీ తన భవసాగరాలని ఏకరువు పెడతాడు. నేను నీకు వండి పెడతానని శారద ఇంట్లోకి వెళ్తుంది.

శంకరం శంకరశాస్త్రి ఇంట్లోకి ప్రవేశిస్తూ తులసి చెప్పిన విషయాలు గుర్తు చేసుకుంటాడు –

ఆ యింటి గడప తాకితేనే చాలు తంబుర నాదం వినిపిస్తుంది. ఆ నాలుగ్గోడల మధ్య ఎక్కడ అడుగు పెట్టినా సప్తస్వరాలు వినిపిస్తాయి. ఆ ఇల్లే సంగీత సరస్వతికి ఆలయం బాబూ

- గుర్తు చేసుకుంటూ



గడప మళ్ళీ మళ్ళీ తాకి తంబుర నాదం వింటాడు. గదిలో అడుగులు వేస్తూ సప్తస్వరాలు వింటాడు. ఆ ఇంట్లోంచి వచ్చే ఆలయ మంగళ వాద్యాలు వింటాడు.

గలగల నవ్వుతూ కలకల కబుర్లు చెబుతున్న శంకరాన్ని చూసి ముచ్చట పడుతుంది శారద. ఇంటికి వచ్చిన తండ్రితో ఇంట్లో ఉంచుకుందామని అడుగుతుంది. శంకరం పనితనం చూసి శంకరశాస్త్రి సరేనంటాడు. సరేనంటున్న శంకరశాస్త్రి మొహంలో ప్రేమానురాగాలు పుష్కలంగా కనిపిస్తాయి. తెలియకుండా ఆయన మనస్సులో కుర్రవాడంటే అవ్యాజానురాగమైన అభిమానం పెల్లుబుకుతుంది. ఆ కుర్రవాడితో తనకి ఏదో తెలియని బాంధవ్యం ఉన్నట్లనిపించినట్లుంది శంకరశాస్త్రి చిరునవ్వు.

మర్నాడు గోదావరి నదికి స్నానానికి వెళ్తూ శంకరాన్ని తనతో తీసుకుని వెళ్తాడు. శంకరం తన వీపు తోముతోంటే సంతోషంగా చూస్తాడు.

ఆ సన్నివేశాన్ని గట్టు మీద నుండి చూసిన తులసి తన జీవితలక్ష్యం నెరవేరినందుకు మహదానంద పడుతుంది.

శంకరం వేషం వేసింది బేబీ తులసి. బేబీ తులసి విశ్వనాథ్ గారి సీతామాలక్ష్మి చిత్రంలో నటించి మెప్పు పొందారు. శంకరాభరణంలో తులసి నటన అద్వితీయం. ఏ విధమైన భావమైనా ప్రదర్శించగలవు బేబీ తులసి కళ్ళూ , మొహం. అవి ఎప్పుడూ నవ్వుతూ హాయిగా మాట్లాడుతాయి. వాటికి తోడు బేబీ తులసి మాటలు. చాలా పేరు తెచ్చుకున్న ఎందరో పెద్ద నటులకి ఏ మాత్రం తీసిపోకుండా శంకరాభరణం శంకరంలా చాలా బాగా నటించారు బేబీ తులసి. ఏ తీరుగ నను దయ చూచెదవో పాట సన్నివేశం బేబీ తులసి నటనకి పరాకాష్ట.



# బ్రోచేవారెవరురా

శంకరశాస్త్రి దగ్గర శంకరం శిష్యరికం ప్రారంభించాక ఒకరోజు ఇద్దరూ కలిసి నది నుండి ఇంటికి నడుస్తున్నప్పుడు ఒక అరుగు మీద ఒక సంగీతం మాస్టారు ఒక విద్యార్థినికి సంగీతం నేర్పిస్తూ కనిపిస్తాడు.



మాస్టారు ఆ విద్యార్థినిని బ్రోచేవారెవరురా పాడమంటాడు. ఆ అమ్మాయి శాస్త్రీయబద్ధంగా పాడుతుంది. మాస్టారు ఆ అమ్మాయి పాడుతున్న రాగం ఎప్పుడో పడవల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు కట్టిన రాగం అంటాడు.

అని తను కట్టిన కొత్త రాగంలో ఆ కీర్తనని పాడుతూ ఉంటాడు. అప్పుడే అక్కడకి వచ్చిన శంకరశాస్త్రి -

అక్షరాలు నీ ఇష్టం వచ్చినట్లు విరిచేసి భావాన్ని
నాశనం చెయ్యడమేనటయ్యా ప్రయోగం?
ఆకలేసిన బాబు అమ్మా అని ఒకలా అంటాడు.
ఎదురు దెబ్బ తగిలిన బిడ్డ అమ్మా అని మరోలా అంటాడు.
నిద్రలో ఉలిక్కి పడి లేచిన పాపడు అమ్మా అని మరొక విధంగా అంటాడు.
ఒక్కొక్క అనుభూతికీ ఒక్కో నిర్దిష్టమైన నాదం ఉంది.
శ్రుతి ఉంది. స్వరం ఉంది.
ఆ కీర్తనలోని ప్రతి అక్షరం వెనకా ఆర్ద్రత నిండి ఉంది.
తాదాత్మ్యం చెందిన ఒక మహా మనీషి గుండె లోతుల్లోంచి
తనకి తానే గంగా జలంలా పెల్లుబుకిన గీతం అది. రాగం అది.

- అని అంటాడు.

అవకాశం దొరికితే సంభాషణల రచయిత ఎంత లోతైన భావాలని రాయగలుగుతాడో అన్న దానికి ఇది ఒక నిదర్శనం. కొత్త రాగాల పేరున సత్సాంప్రదాయ సంగీతాన్ని అపహాస్యం చేస్తున్న సంగీతం మాస్టారుకి చెప్తున్నట్లు శంకరశాస్త్రి అందరికీ చెప్పిన ఘాటైన సమాధానం. చిన్నపాపడు అమ్మా అని అనడంలో భేదాలని ఉదాహరణగా తీసుకుని అక్షరం వెనక ఉన్న ఆర్ద్రత గురించి ఒక టీచరు పిల్లలకి చెప్పినంత సులువుగా అరటి పండు చేతిలో వలిచి పెట్టినట్లు శంకరశాస్త్రి చేత చెప్పించారు జంధ్యాల.

మనం ఇక్కడో విషయం ఆలోచించాలి. కొన్నేళ్ళు గా శంకరశాస్త్రి గోదావరి నదికి స్నానానికి వెళ్ళి వస్తున్నాడు. ఆరోజు మొదటి సారి కాదు. దాసు పాతాలు చెప్పడం అంతకు ముందు కూడా విని ఉంటాడు. కానీ అంతకు ముందు రాగాల గురించి భావాల గురించి దాసుకి విడమరచి చెప్పలేదు. ఇప్పుడు అలా చెప్పడానికి కారణం ఏంటి?

ఏ మనిషికైనా, చివరకి శంకరశాస్త్రి వంటి వ్యక్తిత్వం ఉన్న వారికైనా - పక్కన ఒక ఆసరా ఉంటే - ఏదైనా చెప్పడానికైనా, చెయ్యడానికైనా ఉండే ఉత్సాహం వేరు. ఇన్నాళ్ళ ఒంటరితనం తర్వాత శంకరం శంకరశాస్త్రికి శిష్యుడిగా తోడు దొరికాడు. శంకరం పక్కన ఉండడంతో శంకరశాస్త్రికి దాసు చెప్తున్నది, చేస్తున్నది తప్పని దాసుకి విడమరచి చెప్పాలన్న ఆలోచన వచ్చింది.

శంకరశాస్త్రిలో ఈ మార్పు పాశ్చాత్య సంగీతం పాడే నలుగురు కుర్రాళ్ళ దగ్గర మరీ స్పష్టంగా తెలుస్తుంది. ఆ కుర్రాళ్ళు శంకరశాస్త్రిని ప్రత్యక్షంగానే వెక్కిరిస్తూ ఉంటారు. వాళ్ళు వాళ్ళింట్లో సంగీతం గట్టిగా పాడుతూ శంకరశాస్త్రి ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ ఉంటారు. ఐతే ఎప్పుడూ శంకరశాస్త్రి వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళకి సంగీతం గురించి చెప్పింది లేదు. శంకరం తనకు తోడుగా ఉండడం మొదలుపెట్టాకనే వాళ్ళింటికి వెళ్ళాడు.

వాళ్ళు పాడిన రాగాన్ని తను అవలీలగా పాడేస్తాడు. తను ఒక కర్నాటక రాగాన్ని పాడి వాళ్ళని పాడమంటే వాళ్ళు పాడలేకపోతారు. నివ్వెరపోయిన వాళ్ళతో -

మ్యూజిక్ ఈజ్ డివైన్ వెదర్ ఇటీజ్ వెస్టర్న ఆర్ ఇండియన్

- అని హితబోధ చేస్తాడు. తనని అవహేళన చెయ్యబోయిన ఆ కుర్రాళ్ళ నోరు మూయిస్తాడు. కళ్ళు తెరిపిస్తాడు.

ఆ బూచాళ్ళ దగ్గర సోమయాజులు రాగం పాడుతూ చేసిన అభినయం, ఆ రాగాలు వింటూ బేబీ తులసి చూసిన ఆనందాశ్చర్యకరమైన చూపులూ - మనల్ని కట్టి పడేస్తాయి.



శంకరం ఆర్ద్రత అన్న మాటకి అర్థం అడిగినట్లు అడిగి నెమ్మదిగా శంకరశాస్త్రి చేత బ్రోచేవారెవరురా కీర్తన పాడించుకుంటాడు. శంకరశాస్త్రి పాడుతోంటే వెనకే తనూ పాడుతూ నేర్చుకుంటూ ఉంటాడు. గురుశిష్య పరంపరకు వాళ్ళిద్దరూ ప్రతినిధులుగా కనిపిస్తారు.

వత్తులు చేసుకుంటూ అక్కడకి వచ్చిన శారదని నేను పాడుతున్నాను సుమా అన్నట్లు నవ్వుతో చూస్తాడు శంకరం.

కీర్తన స్వరాలు వెంటనే అనలేక పుస్తకంలో శారద చేత శంకరం రాయించుకుంటున్న సన్నివేశం చాలా ఆహ్లాదంగా ఉంటుంది. శారద పాడబోతోంటే శంకరం శారద నోరు మూసెయ్యడం ఎంతో ముచ్చటగా అనిపిస్తుంది.

కీర్తన కొంత అయ్యాక సన్నివేశం గోదావరి గట్టు మీద ఉన్న తులసి ఇంటికి మారుతుంది. ఇంటి పెరట్లో మంచం మీద బట్టలు మడత పెట్టుకుంటున్న తులసి పాదాలని మంచం మీద పెట్టి గజ్జెలు తొడుగుతాడు శంకరం. తొడిగి -

సీతాపతే నాపై నీకు అభిమానము లేదా

- అని అభినయిస్తూ కీర్తనని ఆలపిస్తాడు. తులసి చేత అభినయింప చేస్తాడు. ఎంత కమనీయమైన దృశ్యమో. ఎన్ని రోజులుగానో తులసి ఎదురు చూస్తున్న రోజు. తను కన్న కలలను తన కన్న కొడుకు నెరవేర్చిన రోజు. తులసి ఆనందానికి అవధులు లేవు. నాట్యాభినయానికీ అవధులు లేవు.

తులసి నాట్యం చేస్తోంటే శంకరం మంచం మీద కూచుని పాడుతూ ఉంటాడు. తులసికి శంకరం స్థానంలో శంకరశాస్త్రి కనిపిస్తాడు. ప్రణమిల్లుతుంది తులసి.

కీర్తన ముగిసే సరికి ఆనందం పట్టలేక శంకరాన్ని దగ్గరకి తీసుకుని ముద్దాడుకుంటుంది తులసి.

ఆకాశంలో హరివిల్లు విరుస్తుంది.

మనందరి హృదయాలలో కూడా హర్షాల హరివిల్లు విరుస్తుంది.

వాగ్గేయకారుడు మైసూర్ వాసుదేవాచార్ గుండె లోతుల్లోంచి తనకి తానే గంగాజలంలా పెల్లుబికిన గీతం, రాగం, నాదం.

గానానికీ, రాగానికీ, స్వరాలకీ, చేతులతో, ముఖకవళికలతో సోమయాజులు చూపిన నటన ఒక సంగీత విద్వాంసుడు చేసినట్లే ఉంటుంది. వాసుదేవాచార్ స్వయంగా మన ముందుకు వచ్చి కూచుని అభినయిస్తున్న అనుభూతి కలుగుతుంది.

భాసురముగ కరి రాజును బ్రోచిన వాసుదేవుడవు నీవు అన్న వాక్యంలో కరి రాజుకి అన్నప్పుడు ఏనుగు ఆకారంలో ఒకపక్కకి వంగి, వాసుదేవుడవు అన్నప్పుడు అనంతశయనుడి ఆకారంలా మరొకపక్కకి వంగి, భంగిమలు చూపిన మంజుభార్గవి శరీరం నాట్యానికి ఎంత అనువైనదో!

శంకరంగా బేబీ తులసి చేసిన నటనని చూస్తున్న కొద్దీ ముద్దొస్తుంది.

ఈ చిత్రం ద్వారా ఆర్ద్రత అంటే భాషకు అందని భావం, మనస్సును ద్రవింపచేసే భావన అనే అర్థం చాలా మంది మనస్సులకి హత్తుకుంటుంది. అలాగే ఈ చిత్రంలో, ఈ కీర్తన చిత్రీకరణలో ఉన్న ఆర్ద్రత మనస్సులని ద్రవింపచేస్తుంది.





# సామజవరగమనా

శిష్యుడు శంకరం ఒక రాత్రి నిద్రపోతున్న గురువు శంకరశాస్త్రి మంచం దగ్గర మంచినీళ్ళ చెంబు పెట్టడానికి వెళ్తాడు. గదిలో ఏదో నాదం వినిపిస్తున్నట్లు నాలుగు పక్కలా చూస్తాడు. అది ఎక్కడి నుంచి వస్తోందో గ్రహించి గురువు తల దగ్గర చెవి పెట్టి



వింటాడు. వింటూ వినిపించిన కీర్తనని స్మరించుకుంటాడు. శంకరశాస్త్రి అంటే సంగీత సరస్వతే. అనునిత్యం ఆయన అణువణువునా గీతాలే, రాగాలే, స్వరాలే.

గురువు కాళ్ళ దగ్గర కూచుని కాళ్ళ ని నొక్కుతూ సదాశివ బ్రహ్మేంద్ర మానస సంచరరే పాడుకుంటూ ఉంటాడు. పాడుతూ మధ్యలో ఒక చోట గుర్తు రాక ఒకమాటనే మళ్ళీ మళ్ళీ అనుకుంటూ ఉంటాడు. నిద్రమగతలో ఉన్న శంకరశాస్త్రి శంకరం మర్చిపోయిన చోట పాట అందుకుంటాడు. ఆ సన్నివేశం ఒక్కటి చాలు శంకరశాస్త్రికి సంగీతం మీద ఉన్న మమకారాన్నీ, అధికారాన్నీ మనకి తెలియచెప్పడానికి. ఎవరికైనా ఏ విద్యైనా చాలా బాగా వస్తే నిద్రలో లేపి అడిగినా చెప్పేస్తాడు అని అంటాం. అంటే ఇదే.

మహాకవి కాళిదాసు మాణిక్యవీణాం శ్లోకాలతోపాటు వాగ్గేయకారులు భక్తరామదాసు ఏ తీరుగ నను దయ చూచెదవో, మైసూర్ వాసుదేవచార్ బ్రోచేవారెవరురా, సదాశివ బ్రహ్మేంద్ర మానస సంచరరే కీర్తనలు ఉన్న అపూర్వమైన చిత్రం శంకరాభరణం. ఉంచిన అపురూప దర్శకులు విశ్వనాథ్.

వీటితోపాటు త్యాగరాజస్వామి సామజవరగమనా, దొరకునా ఇటువంటి సేవా పల్లవులని చిత్రంలో వాడడం ఒక విశేషం. అందునా సామజవరగమనా పల్లవిని ఒక యుగళ గీతానికి వాడిన విశ్వనాథ్ గారి అభిరుచిని ఏమని పొగడగలం?

శంకరశాస్త్రి స్నేహితుడు మాధవుడు భార్యా సమేతంగా అన్నవరం వెళ్తూ ఎక్కడకీ ఎప్పుడూ వెళ్ళ ని శారదని తమతో తీసుకుని వెళ్తాడు. శారద అన్నవరం మెట్లు ఎక్కుతూండగా కామేశ్వరరావు అనే కాముడు తన బామ్మతో అవే మెట్ల మీద శారదని చూస్తాడు. అన్నవరంలో వాళ్ళిద్దరూ విడివిడిగానే తిరిగినా చాలా సార్లు కలుస్తారు. అలా కలిసిన వారి మనసులు కూడా కలుస్తాయి.

శంకరశాస్త్రికి నచ్చ చెప్పి శారదకి పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తాడు మాధవుడు. తీరా చూస్తే ఆ పెళ్ళి కొడుకు కావుడే. వారిద్దరికీ అన్నవరం సంఘటన గుర్తుకొస్తుంది. కామేశ్వరరావుకి చెంబు అన్నవరం మెట్ల మీద జారడం గుర్తొస్తుంది. శారదకి చెంబుని ఒక గట్టు మీద ఉంచి పారిపోవడం గుర్తొస్తుంది. అన్నవరంలో వారిద్దరి మధ్యా జరిగిన ప్రేమ కథ మొదలు చెంబు జారడం. చివర చెంబు గట్టు మీద ఉంచెయ్యడం. వారిద్దరికీ ఆదీ అంతం గుర్తొచ్చినట్లు చూపించి జరిగినదంతా ఇద్దరికీ గుర్తొచ్చినట్లు చూపించారు విశ్వనాథ్. ఇలాంటి సన్నివేశాలు ఆయన చిత్రాలలో కోకొల్లలు.

ఒకరినొకరు చూసుకున్న శారదా కామేశ్వరరావులు ఒకరంటే ఒకరికి ఇష్టమని సూచన ప్రాయంగా చేప్పేస్తారు.

అప్పుడు కావుడి నాయనమ్మ కోరిక మీద శారద ఒక పాట పాడుతుంది. శారద ఎన్నుకున్న కీర్తన సామజవరగమనా. ఐతే ఆ పాట వస్తున్నప్పుడు శారదా, కామేశ్వరరావులు తమ అన్నవరం సరదాకి కొనసాగింపుగా సరసమైన యుగళాన్ని ఊహించుకుంటారు. సామజవరగమనా పల్లవి తర్వాత పాటంతా వారిద్దరి హృదయాల సున్నిత శృంగార కల్పనే. వేటూరి చమత్కార రచనే.



చిక్కంతా ఆ ఊహతోనే వస్తుంది. మధురోహలలో మునిగిపోయిన శారద పొరపాటున హిందోళంలో రిషభం పాడుతుంది. సంగీతం నరనరాలలో ప్రవహిస్తున్న శంకరశాస్త్రి స్వరసంకరం సహించలేడు. అది కూతురు చిన్నతనంలో సంగీతం నేర్చుకుంటున్నప్పుడైనా, కూతురు పెళ్ళి చూపులప్పుడైనా. పాడుతున్న శారదని ఆపమన్నట్లు శారదా అని అరిచి పిలిచి, తప్పు పాడుతున్నందుకు గట్టిగా మందలిస్తాడు.

తను నేర్చుకున్న రాగాల పరిజ్ఞానంతో పరిస్థితిని చక్కదిద్దబోయి ఇరకాటంలో పడతాడు కావుడు. రిషభాన్ని వృషభం అనీ, కాపీ రాగాన్ని కాఫీ రాగం అని పలికిన కావుడికి తన పిల్లని ఇయ్యనంటాడు శంకరశాస్త్రి. పెళ్ళి చూపులు ఆగిపోతాయి.

అప్పుడు మాధవుడు - కూతురికి ఒక రవికెల గుడ్డ ఐనా కొనివ్వలేని సంగీతం మీద నీకెందుకురా వ్యామోహం, ఇంకా ఎందుకురా ఈ కంచిగరుడ సేవ - అని మొదలు పెట్టి - ఇలాంటి తండ్రికి పుట్టినందుకు పెళ్ళి కాక ఆ పిల్ల ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటుంది అప్పుడు శవాన్ని ఒళ్ళో పెట్టుకుని సంగీతం పాడుకుందువుగానీ - అని అసహాయతలోంచి వచ్చిన బాధలోంచి వచ్చిన కోపంతో శంకరశాస్త్రిని గట్టిగా మందలిస్తాడు.



ఆ హితబోధ వాళ్ళిద్దరి మధ్యా ఉన్న ఆత్మీయ స్నేహానికి మచ్చుతునక. మనం ఎన్నటికీ మరువలేని సంభాషణల దీపకళిక. ఆ సంభాషణ రాసిన జంధ్యాలా, చెప్పిన అల్లు రామలింగయ్య ధన్యజీవులు.

మాధవుడి మాటలతో తను శారదకి చేసిన అన్యాయనికి ప్రాయశ్చిత్తంలా తన అరచేతిలో దీపం వెలిగించుకుని తన పూజామందిరంలోని తన ఆరాధ్య దైవమైన శంకరుడికి హారతి ఇస్తాడు. శారదా, శంకరం బాధతో చూస్తూండి పోతారు.

ఇంట్లోని అందరి మనస్సుల్లోనూ ద్రవిస్తున్న శోకాశ్రువులకి దుఃఖపడుతున్న ప్రకృతి కార్చిన కన్నీటిలా కొబ్బరి ఆకుల మీద మంచుబిందువులు కారుతూ ఉంటాయి.

శారద తన పాడిన తప్పుని సరి దిద్దుకుంటూ హిందోళరాగ స్వరాలు పాడుతూ కాలిన శంకరశాస్త్రి అరచేతికి వెన్న రాస్తుంది. శంకరశాస్త్రి మనస్సు వెన్నలా కరిగిపోతుంది. కోపం ఆవిరై పోతుంది. శారదని దగ్గరకి తీసుకుంటాడు.

ఆ తర్వాత కావుడు ఆలయంలో రాగసహితంగా, దోషరహితంగా మాణిక్యవీణాం పాడి శంకరశాస్త్రిని మెప్పిస్తాడు. శారదతో తన వివాహానికి ఒప్పిస్తాడు.





# దొరకునా ఇటువంటి సేవ

అనుకోకుండా తులసిని కలిసిన మాధవుడు, తులసి తల్లి చనిపోతూ ఎంతో బాధ పడిందని చెప్తాడు. అంతే కాకుండా తులసి తల్లి తులసికి తన ఆస్తినంతా రాసి పోయిందని ఆ వీలునామా కాగితాలు తులసికి అందిస్తాడు. ఆస్తిని తనేం చేసుకుంటానని అన్న తులసితో ఏ సత్కార్యానికో వినియోగించమని సలహా ఇస్తాడు.

తనకి వచ్చిన ఆస్తితో తులసి ఊళ్ళో ఉన్న పాత శేషాచలం హాలుని కొని, రిమోడలింగ్ చేయించి, రంగులు వేయించి, అందంగా తయారు చేయిస్తుంది. ఐతే తను కొన్నట్లు కానీ, బాగు చేయించినట్లు కానీ, తనకీ మాధవుడికీ తప్ప ఇంకెవ్వరికీ తెలియనియ్యదు.

ఆ హాలు పునఃప్రారంభోత్సవ ముహూర్తం శారదా కామేశ్వరరావుల వివాహం రోజునే పెడుతుంది. ఆ ఉత్సవం శంకరశాస్త్రి కచేరీతో ప్రారంభించాలని కోరుకుంటుంది. మాధవుడి ద్వారా శంకరశాస్త్రిని ఆహ్వానిస్తుంది. ఐతే ఇదంతా తను చేయిస్తున్నట్లు శంకరశాస్త్రికి తెలియనివ్వదు.

తన కొడుకుతో ఆ ఊరికి వచ్చాక కొడుకుని శంకరశాస్త్రి దగ్గరకు చేర్చడమే కానీ తులసి శంకరశాస్త్రిని కలవదు. కలిసే సందర్భాలు వచ్చినప్పుడు కూడా పక్కకి తప్పుకుంటుంది. వెనక నుండే శారద వివాహానికి సహాయం చేస్తుంది.

వివాహం అయ్యాక, శంకరశాస్త్రిని ఆదరపూర్వకంగా కొత్త హాలు దగ్గరకి తీసుకు వెళ్తారు. నాదస్వర నాదంతో ఆహ్వానిస్తారు. తలెత్తి చూసిన శంకరశాస్త్రికి ఆ హాలు పేరు శంకరాభరణం శంకరశాస్త్రి కళామందిరం అని కనిపిస్తుంది. అనుకోని ఆదరణకి శంకరశాస్త్రి ఆనందంగా తలూపుతాడు. ఆ హాలు పైనుండి చూస్తున్న తులసి వినయంతో తల వంచుకుంటుంది.

వేదమంత్రాలతో వేదిక దగ్గరకి తీసుకు వెళ్తారు శంకరశాస్త్రిని. వేదికకి ఒక పక్క నిల్చుని తులసి తన్మయురాలై చూస్తూ ఉంటుంది. హాలులో తన పటాలని చూసి తల పంకించి వేదిక మీద కచేరీ చెయ్యడానికి కూచుంటాడు శంకరశాస్త్రి.



ఇక్కడొక విషయం. మనం చలనచిత్రం చూస్తున్నప్పుడు ఇదంతా తులసి చేయించినదని శంకరశాస్త్రికే కాదు, మనకి కూడా తెలియదు. ఏం జరుగుతోందో, ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠతోనే పతాక సన్నివేశం అంతా నడుస్తుంది.

వేదిక మీద కూచున్న శంకరశాస్త్రి గురించి రెండు ముక్కలు మాట్లాడి, చివరగా మాధవుడు -

నిరాదరణ పొందుతున్న సంగీతానికి ఆదరణ లభించడంతో ఈ బ్రహ్మర్షి మొహంలో కొత్త తేజస్సు కనపడుతోంది

- అని అంటాడు. శంకరశాస్త్రిని కచేరీ ప్రారంభించమని అడుగుతాడు.

కచేరీ ప్రారంభించడానికి ముందుగా శంకరశాస్త్రి -

పాశ్చాత్య సంగీతపు పెనుతుఫానుకి రెపరెపలాడుతున్న సత్సాంప్రదాయ సంగీత జ్యోతిని ఒక కాపు కాయడానికి తన చేతులు అడ్డుపెట్టిన ఆ దాత ఎవరో వారికి శతసహస్ర వందనాలు అర్పిస్తున్నాను

- అని అనగానే తులసి మీరలా అనకూడదన్నట్లు మొహంలో బాధతో తల అడ్డంగా ఊపుతుంది. తులసికి శంకరశాస్త్రి ఆరాధ్య దైవం. శంకరశాస్త్రి తులసి గురించే అంటున్నానని తెలిసి అన్నా తెలియక అన్నా, వందనాలు అర్పిస్తున్నాను అని అనడం తులసి అంగీకరించలేదు. తులసి మనస్సు ఆ వందనాలని స్వీకరించలేదు.

శంకరశాస్త్రే **–**

శుష్కించిపోతున్న భారతీయ సంస్కృతినీ, సాంప్రదాయాన్నీ పునరుద్ధరించడానికి నడుం కట్టిన ఆ మహామనీషికి శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నాను.

- అని అనగానే తులసి బాధతో చేతులు అడ్డంగా ఊపుతుంది. శంకరశాస్త్రి తనకి శిరసు వంచి పాదాభివందనమా? కలలో కూడా ఊహించలేదు తులసి.

ఐతే శంకరశాస్త్రి దృష్టిలో తులసి చేసిన కార్యం, కార్యక్రమం చాలా గొప్పవి. అది చేసిన మనిషిని మహా మనీషిగా గుర్తిస్తాడు ఆయన. అటువంటి మనిషికి పాదాభివందనం చెయ్యడం శంకరశాస్త్రికి తప్పుగా కాదు, తన కర్తవ్యంలా అనిపిస్తుంది.

తన మాటలను కొనసాగిస్తూ -

ఈ కళ జీవకళ. అజరామరమైనది. దీనికి అంతం లేదు. నిరాదరణ పొందుతున్న ఈ సంగీతాన్ని పోషించడానికి కోటికి ఒక్క వ్యక్తి ఉన్నా సరే ఈ అమృతవాహిని అనంతంగా ఇలా ప్రవహిస్తూనే ఉంటుంది. మనిషి నిలువెత్తు ధనం సంపాదించినప్పటికీ

- అని మాటలని ఆపి -
దొరకునా ఇటువంటి సేవా
- అని పాట అందుకుంటాడు.

ఎక్కడ జంధ్యాల మాట ఆగి వేటూరి పాటగా మారుతుందో తెలియనంతటి అందమైన మాటా-పాటా.

పల్లవికి కొనసాగింపుగా -
నీపద రాజీవముల చేరు నిర్వాణ సోపాన మధిరోహణము సేయు త్రోవ
- అని పాడతాడు.

ఓంకారనాదాను సంధానమౌ అన్న పాటలో కూడా అద్వైతసిద్ధికి అమరత్వ లబ్ధికి గానమె సోపానము అని సోపానము ప్రస్తావన వస్తుంది. నిర్వాణానికైనా, అమరత్వానికైనా గానము సోపానము. అదే పరమపదము. శంకరశాస్త్రి జీవితమే అది.

తులసి జీవితమూ అదే. తులసి జీవితం సంగీత సరస్వతి శంకరశాస్త్రికి అంకితం. తన సోపానము ఆయనని చేరే మార్గమే. అదే తులసికి అద్వైత సిద్ధి.

శంకరశాస్త్రి పాడుతోంటే ఆయనకి కనపడకుండా నిలపడి పారవశ్యంతో వింటూ ఉంటుంది. శంకరశాస్త్రి తనున్న వైపుకి తల తిప్పినప్పుడు తను చాటుకి వెళ్ళిపోతుంది. శంకరాన్ని శంకరశాస్త్రికి అప్పచెప్పడమే తులసి జీవితాశయం. తను నిమిత్తమాత్రురాలు.

శంకరశాస్త్రి -

రాగాలనంతాలు నీ వేయి రూపాలు
భవరోగ తిమిరాన పోకార్చు దీపాలు
నాదాత్మకుడవై నాలోన చెలగి
నా ప్రాణదీపమై నాలోన వెలిగే

- అని పాడుతున్నప్పుడు నాదాత్మకుడవై అన్న చోట హఠాత్తుగా గుండె పట్టుకుంటాడు. దగ్గు వస్తుంది. పాడలేకపోతాడు. ఐనా ప్రయత్నిస్తాడు. నాలోన వెలిగే దగ్గర ఇంక ఆగిపోతాడు. అందరూ కంగారుగా శంకరశాస్త్రినే చూస్తుంటారు.



అప్పుడు తులసి శంకరం భుజాల మీద చేతులు వేస్తుంది. తనేం చెయ్యాలో అర్థం ఐనట్లు శంకరం తన చేతులు రెండూ పైకెత్తి, గొంతెత్తి -

నిను కొలుచువేళ దేవాధిదేవా

- అని పాట అందుకుంటాడు.

నేను ఈ సినిమా చూసిన ప్రతీసారి శంకరం అలా పాట అందుకోగానే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. కంఠంలో ఏదో అడ్డుకొన్నట్లు అవుతుంది.

మొదటి సారి చూసినప్పుడు అలా శంకరం పాడుతాడని తెలియకపోవడం వల్ల అలా అవడం సహజమే. ఐతే తర్వాత కూడా ఎప్పుడు చూసినా అలాంటి స్పందనే కలుగుతోంది. ఇప్పుడు కూడా కలుగుతుంది. అది ఆ సన్నివేశంలో, ఆ సందర్భంలో, వాణీ జయరాం గొంతులో, బేబీ తులసి నటనలో ఉన్న మాయ వల్లనే అని నా నమ్మకం!

శంకరం పాడుతోంటే పక్కకి తిరిగి చూసిన శంకరశాస్త్రికి తులసి కనిపిస్తుంది. తల తులసి వైపూ, శంకరం వైపూ తిప్పి అవునా అన్నట్లు ప్రశ్న అడుగుతాడు మాధవుడిని. అవునన్నట్లు తలూపుతాడు మాధవుడు. శంకరశాస్త్రికి శంకరం తులసి కొడుకు అని తెలుస్తుంది. ఎంత హృదయ సంవాదమైన మౌన భాష!

శంకరం –

సోపానమధిరోహణము సేయు త్రోవ

– అని పాడుతూ వేదిక మెట్లెక్కి శంకరశాస్త్రి దగ్గరికి వెళ్ళి పాటను కొనసాగిస్తాడు. వైద్యుడిని తీసుకు వస్తున్న కామేశ్వరరావుతో అక్కరలేదన్నట్లు చెయ్యూపుతాడు శంకరశాస్త్రి. శంకరశాస్త్రి మొహం నిండా శంకరం పాటని వింటున్న ఆనందం. వాడు తులసి కొడుకన్న ఆనందం. అంతకు మించి కావల్సింది ఏమీ లేదన్న ఆనందం.

శంకరం పాడిన వాక్యాలన్నీ శంకరశాస్త్రి శరీరమంతా సంగీతమయం, సంగీత వాయిద్యాలనిలయం అన్న అర్థాన్ని ఇచ్చేవే –

ఉచ్ఛ్వాస నిశ్వాసములు వాయులీనాలు
స్పందించు నవనాడులె వీణాగానాలు
నడలు యెదలోని సడులే మృదంగాలు

– ఇంక చివరికి శంకరశాస్త్రికి నమస్కరిస్తూ –

నాలోని జీవమై నాకున్న దైవమై
వెలుగొందు దేవా మహానుభావా

– అని శంకరశాస్త్రిని తన దైవంగా భావిస్తూ పాడతాడు. నిజానికి ఆ భావమే తులసి మనస్సు నిండా ఉన్నది.

శంకరశాస్త్రి శంకరాన్ని దగ్గరగా తీసుకుని, నుదుటన ముద్దెట్టుకుంటాడు. పెట్టుకుని శంకరం కాలిని తన దగ్గరకి తీసుకుంటాడు.

ఏ గండపెండేరాన్ని తన శరీరంలో భాగం అనుకున్నాడో, ఏ గండపెండేరం కట్టెల మీద తన కట్టెతో పాటు కాలి బూడిదైపోతుందనుకున్నాడో ఆ గండపెండేరాన్ని తన కాలి నుంచి తియ్యడం మొదలెట్టాడు. ఆ దృశ్యం చూసి ఇక ఆగలేక తులసి శంకరశాస్త్రి దగ్గరకి వచ్చి, శంకరం వెనక కూర్చుని, నమస్కరిస్తుంది. వారిద్దరూ ఒకరిని ఒకరు ఆదరాభిమానాలతో చూసుకుంటారు.



శంకరశాస్త్రి తన గండపెండేరాన్ని శంకరం కాలికి తొడుగుతాడు. తొడుగుతూ శతమానం భవతి అని ఆశీర్వదిస్తాడు.

అలా ఆశీర్వదిస్తూనే నేలకి ఒరిగిపోతాడు. శంకరశాస్త్రి నేలకి ఒరిగిన సమయానికే తులసి నేలకి ఒరుగుతుంది. తులసి చేతులు శంకరశాస్త్రి పాదాల దగ్గర ప్రణమిల్లుతున్నట్లు వాలిపోతాయి. శంకరాన్ని తమ వారసుడిగా చూసుకున్న ఆనందంతో, ఆత్మతృప్తితో వారిద్దరి ప్రాణాలూ ఒకేసారి అనంత వాయువుల్లో కలిసిపోతాయి.

ఓంకారనాదాను సంధానమౌ పాటలోని అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి అన్న వాక్యాలు నేపథ్యంలో వినిపిస్తాయి. త్యాగరాజ హృదయమై అన్నపుడు కెమేరా శంకరశాస్త్రి మీదా, రాగరాజ నిలయమై అన్నప్పుడు కెమేరా తులసి మీదా ఉంటుంది. వారిద్దరిదీ కళాత్మకమైన బాంధవ్యం. నాట్య సంగీతాల అద్వైతం.

వేదిక మీద తెర పడుతుంది.

ఒక చెరువుగట్టున, చెట్టునీడన తంబురా శృతి చేసుకుంటూ కనిపిస్తాడు శంకరం.

సంగీత జీవ కళని నిర్విరామంగా కొనసాగించడానికి తులసి గర్భంలో జన్మించిన శంకరశాస్త్రి మానస పుత్రుడు.

# అటూ ఇటూ
# ఐదేసి చిత్రాలు

# అటూ ఇటూ ఐదేసి చిత్రాలు

విశ్వనాథ్ గారు దర్శకత్వం వహించిన చిత్రాలలో శంకరాభరణం ఒక మైలు రాయి. విశ్వనాథ్ గారి కథల ఎంపికలో, చిత్ర నేపథ్యంలో చాలా మార్పు ఆ చిత్రం తీసుకు వచ్చినట్లు అనిపిస్తుంది.

ఆయన శంకరాభరణం ముందు తీసిన ఐదు చిత్రాలనూ, తర్వాత తీసిన ఐదు చిత్రాలనూ పరిశీలించుకుందాం. కథలో, కథనంలో ఉన్న వైవిధ్యాన్నీ, నాకు కలిగిన అనుభూతినీ దృష్టిలో ఉంచుకుని వీటిని ఎంచుకున్నాను.

★ చెల్లెలి కాపురం - 1971

★ కాలం మారింది - 1972

★ నేరము శిక్ష - 1973

★ ఓ సీత కథ - 1974

★ సిరిసిరిమువ్వ - 1976

శంకరాభరణం 1980

★ సప్తపది - 1981

★ శుభలేఖ - 1982

★ స్వాతిముత్యం - 1985

★ సిరివెన్నెల - 1986

★ స్వాతికిరణం - 1992

# చెల్లెలి కాపురం

నల్లని రూపూ. తెల్లని మనసూ.
పల్లెలో జీవనం. చెల్లెలే జీవితం.
మది నిండా కలలు. కలం నిండా కవితలు.
అన్నీ కలసి రాము.




చెల్లెలి పెళ్ళి చెయ్యడానికి కావల్సిన డబ్బు సంపాదించడానికి పల్లె నుండి పట్నం వెళ్తాడు రాము. అక్కడ తన చిన్ననాటి నేస్తం శ్రీరాంని కలుస్తాడు.

తన కవితలు అచ్చువేయించుకుందుకు రాము ప్రయత్నిస్తాడు. ఐతే ఆకారాన్నీ, ఆహార్యాన్నీ మాత్రమే ఆదరించే లోకం అతన్నీ అతని కవిత్వాన్నీ పట్టించుకోదు.

ఇలాంటి లోకంలో వేషమే మనిషికి గౌరవం ఇస్తుందని గ్రహించిన శ్రీరాం అదే కవిత్వాన్ని తను తీసికెళ్ళి ప్రచురణ సంస్థలకి ఇచ్చి తగినంత ప్రతిఫలం తీసుకుని వస్తాడు.

ఐతే ఆ కవితలు శ్రీరాం కవితలుగా ప్రచురించ బడతాయి. రాము అందుకు బాధ పడడు. చెల్లెలి పెళ్ళి చెయ్యడానికి ధనం సమకూరుస్తున్నందుకు స్నేహితుడు శ్రీరాంకి కృతజ్ఞతలు కూడా చెప్తాడు.

ప్రపంచం వస్తువు విలువని వస్తువును బట్టి కాక వస్తువుకి చుట్టిన రంగు కాగితంతో కొలుస్తుంది. అలాగే మనిషి రంగుని బట్టి, రూపాన్ని బట్టి, కట్టుకున్న బట్టలని బట్టి మనిషి విలువని గుర్తిస్తుంది.

ఇది సినిమా మొదటి భాగంలో దర్శకులు సూచించే సందేశం.

ఈ కథ ఇలా నడుస్తున్న సమయంలోనే శ్రీరాం పేరన రాము రాస్తున్న రచనల్ని చదివి ముగ్ధురాలైన రాధ ఒక అభిమానిగా రచయితకి ఉత్తరం రాస్తుంది. ఆ ఉత్తరం అసలైన రచయిత రాముకే అందుతుంది. అతను కవితాత్మకంగా సమాధానం రాస్తాడు. కవీ, అభిమానీ మధ్య కవితల రూపంలో లేఖలు ఇద్దరి మనస్సులనీ దగ్గర చేస్తాయి.

అదే సమయంలో రాము చెల్లెలితో శ్రీరాం వివాహం అవుతుంది. వాళ్ళిద్దరూ శృంగార యాత్రకి వెళ్ళినప్పుడు అనుకోకుండా రాధ రాము దగ్గరకి వస్తుంది. రాధ రాము దగ్గర గడిపిన కొద్ది సమయంలో రామూయే అసలు కవియేమో అన్న అనుమానం కలుగుతుంది రాధకి.



శృంగార యాత్రలో రాము చెల్లెలికి ఎవరితోనో సంబంధం ఉందన్న అనుమానం కలుగుతుంది శ్రీరాంకి. రాము చెల్లెలిని అనుమానిస్తాడు, అవమానిస్తాడు. రాము బాధతో ఇల్లొదిలి వెళ్ళి పోతాడు.

వెళ్ళి పోయిన రామూని రప్పించడానికీ, రాము పేర తనే కవిగా చెలామణీ అవుతున్న శ్రీరాం బండారం బయట పెట్టడానికీ రాధ ఒక పోటీ ఏర్పాటు చేస్తుంది. జానకీబాయి అనే ప్రఖ్యాత నాట్యకత్తె నాట్యానికి అనువుగా కవిత్వం చెప్పగలగాలి అని. తనే శ్రీరాం పక్కన కూచుని ఆ జానకీబాయి ఎవరో తెలివితక్కువది మీరున్నారని తెలియక పోటీ పడుతోంది అని శ్రీరాం ని వేదిక మీదకి పంపుతుంది.

పోటీ ప్రారంభం అవుతుంది. జానకీబాయి కాళ్ళు కదిపితే శ్రీరాం కాళ్ళూ , గజ్జెలూ, గజ్జెల కాళ్ళూ , గజ్జి కాళ్ళూ అంటాడు. చేతులు కదిపితే చేతుల గాజులూ, గాజుల చేతులూ అని అవకతవక మాటలు పేలుతాడు.

సభలో కలవరం రేగుతుంది. అందరూ మహాకవిగా భావించే శ్రీరాం కవి కాదని తేలిపోతుంది. అప్పుడు పోటీ నిర్వాహకుడు ఇంతటి రసిక రాజధానిలో పోటీకి నిలిచే ఒక్క కవి పుంగవుడు కూడా లేడా అని ఎద్దేవా చేస్తాడు. దానికి సమాధానంగా ఉన్నాడు అంటూ రాము వేదిక మీదకి వస్తాడు. తన అద్భుతమైన కవిత్వంతో పోటీ గెలుస్తాడు. కథ సుఖాంతం అవుతుంది.

చిత్రం రెండో భాగంలో దర్శకులు రెండు సందేశాలు సూచిస్తారు.

ఒకటి. మోసం ఎంతో కాలం నిలపడదు. రాము కవిత్వం తను రాసినట్లు చలామణీ అవుతున్న శ్రీరాం బండారం బయట పడుతుంది.

రెండు. నిజమైన ప్రేమకి కావల్సింది బాహ్య సౌందర్యం కాదు. అంతః సౌందర్యం. రాము నిర్మలమైన మనస్సుని చూసే రాధ శ్రీరాంని కాదని రామూని ప్రేమిస్తుంది.

ఈ రెండో సందేశాన్ని నాట్యకత్తె రాధ చేసిన ఒక నృత్యనాటిక ద్వారా ముందే చూపించారు దర్శకులు. నీలాకృష్ణ నృత్యనాటికలో కథానాయిక నీల నల్లది. నల్లనయ్య కోసం ఎదురుచూస్తోంటే చెలులు ఆట పట్టిస్తారు. అప్పుడు కృష్ణుడు స్వయంగా వచ్చి నీలతో -

నీ చెలులు చూసేది నీ బాహ్య మూర్తి
నేను వలచేది నా నీలలో దీప్తి
- అని అంటాడు. అనడమే కాకుండా నీలని దగ్గరకి తీసుకుంటాడు.

నీలాకృష్ణ నృత్యనాటిక ప్రధానాంశమే చెల్లెలి కాపురం చిత్ర సారాంశం. నాటికలో నీల అందగత్తె కాదు. ఐనా కృష్ణుడు నీల హృదయంలోని అందానికి ముగ్ధుడౌతాడు.

చిత్రంలో రాము అందగాడు కాదు. ఐనా రాధ రామూని వలచింది. అందుకు కారణం రాము మంచితనం. అంతకు మించి రాము కవిత్వం.

నాట్యకత్తెగా, కవిత్వాభిమానిగా వాణిశ్రీ చిత్రం అంతా సొగసులు కురిపిస్తూనే ఉంటారు. కవి కాని కవిగా నాగభూషణం నవ్వులు పూయిస్తూనే ఉంటారు. ప్రచురణాధినేతగా అల్లు రామలింగయ్య హాస్యం పండిస్తూనే ఉంటారు.

హీరోగా శోభన్ బాబు అమాయకత్వం, అభిమానం, అనురాగం, ఆగ్రహం అన్నీ సమపాళ్ళలో చక్కగా చూపించారు. అప్పుడప్పుడే చిత్రపరిశ్రమలో పెద్ద హీరోగా పేరు తెచ్చుకుంటున్న అందాలనటుడు శోభన్ బాబు నల్లగా, అందవిహీనంగా తెరమీద కనిపించడానికి ఒప్పుకునే సాహసం చేసింది విశ్వనాథ్ గారి కథ మీదా, దర్శకత్వం మీదా ఉన్న నమ్మకంతోనే అని అనిపిస్తుంది నాకు.

ఈ చిత్రానికి శోభన్ బాబుకి నంది అవార్డు వచ్చింది. ఆ తర్వాత కూడా విశ్వనాథ్ గారి చిత్రాలే ఐన కాలం మారింది, శారద, జీవన జ్యోతి చిత్రాలకు కూడా శోభన్ బాబుకి ఉత్తమ నటుడిగా నంది అవార్డులు వచ్చాయి.

ఈ నాలుగు చిత్రాలకి ఉత్తమ చిత్రాలుగా కూడా నంది అవార్డులు వచ్చాయి. 1970 దశకం తొలి సగం విశ్వనాథ్ శోభన్ జంట మంచి చిత్రాలకి మారు పేరయింది. దానికి నాంది పలికింది చెల్లెలి కాపురం చిత్రమే.

# కాలం మారింది

కాలం మారింది చిత్రం ఉద్దేశం కులవివక్ష అనే దురాచారం మీద ధ్వజమెత్తడం. కులంపేరిట అంటరాని వాళ్ళని దూరంగా ఉంచడాన్ని సహేతుకంగా ప్రశ్నించడం.




అందుకే ఈ చిత్రాన్ని అంటరానితనమనే అంటువ్యాధికి వైద్యుడైన గాంధీకి అంకితం ఇచ్చారు. గాంధీ శతజయంతి జరిగిన 1969 కి రెండేళ్ళ తరవాత ఈ చిత్ర నిర్మాణం జరిగింది. విచిత్రం ఏమిటంటే కులవ్యవస్థ ఇంకా ఇప్పటికీ పోయినట్లు లేదు. అంటరానితనం మాత్రం కొంత తొలగినట్లే అనిపిస్తోంది. ఏ దురాచారాన్నైనా సమాజం నుండి దూరం చెయ్యాలంటే ఎందరో నడుం కట్టి పనిచెయ్యాలి. విశ్వనాథ్ గారి కాలం మారింది అలాంటి ఒక ప్రయత్నం.

కాలం మారింది చిత్రంలో పాత్రలు కొన్ని తరతరాలుగా తమ నరనరాలలో ప్రవహిస్తున్న అంటరాని తనాన్ని వదిలించుకోలేక తాము చేస్తున్నదే సరైనదని నమ్మేవి. ఐతే అవేం దుష్ట పాత్రలు కావు.

మరి కొన్ని పాత్రలు ఆ ఆచారం వల్ల కష్ట నష్టాలు అనుభవించే అనాథలకీ అభాగ్యులకీ అండగా నిలవడానికి నడుం కట్టినవి. సమాజంలో మార్పు కోసం నిరంతరం కృషి చేస్తూ ఉండేవి.

ఐతే వారిద్దరి మధ్య దౌర్జన్యాలూ, కొట్లాటలూ ఉండవు. ఎవరూ ఎవరినీ ద్వేషించరు. ఎవరూ ఎవరినీ కావాలని హింసించరు. అందరిలోనూ మంచితనం ఉంటుంది. అన్ని పాత్రలూ మంచివే.

అందుకే ఈ చిత్రాన్ని పాత్రల పరంగా అవలోకిద్దాం.

**లక్ష్మీపతి:** నిత్యం భగవద్గీత లోని చాతుర్వర్ణ్యం మయాసృష్టం పారాయణం చేసుకునే గాంధేయవాది. తన దగ్గర పని చేసే కోటీసు తన పంట కాపాడడానికి ప్రాణాలు వదిలేస్తే కోటీసు పిల్లని తన పిల్లగా పెంచగల మానవతావాది. సమాజం మొత్తం అడ్డం వచ్చినా తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నిలబడగల మనోధైర్యం ఉన్నవాడు. కోటీసు పిల్ల శాంతిని పెంచి మంచి బుద్ధులు నేర్పించిన ఆదర్శవంతుడు.

**అన్నపూర్ణ:** భర్త లక్ష్మీపతి ఆదర్శంలో పాలు పంచుకుంటుంది. కానీ మనస్సులో తను చేస్తున్నది తప్పేమో అన్న శంక వదలనిది. అలాగని శాంతి అంటే అయిష్టం ఏ కోశానా లేనిది. స్వంత పిల్ల గీతతో శాంతిని సమంగా చూస్తున్నా మనస్సు మూలలో ఎక్కడో శాంతి అంటరాని పిల్ల అన్న భావాన్ని వదలలేనిది.





**శాంతి:** స్వంత తండ్రి త్యాగగుణాన్నీ, పెంచిన తండ్రి ఆదర్శగుణాన్నీ పుణికి పుచ్చుకున్న యువతి. అందరికీ మంచి చెయ్యాలనే మనస్సు ఉన్నది. అక్క పెళ్ళి చూపులకి వచ్చిన శ్రీనివాస్ తనని ప్రేమిస్తే అక్క జీవితం గురించి ఆలోచించగల సంస్కారవంతురాలు. ఆ పెళ్ళి మాటల సందర్భంలో తన పుట్టుక విషయం తెలుసుకుని బాధపడ్డ అభాగ్యురాలు. శ్రీనివాస్ బలవంతం మీద వాళ్ళింటికి పనిపిల్లగా వెళ్ళి ఆచారాలలో కొట్టు మిట్టాడే శ్రీనివాస్ అమ్మమ్మ అభిమానాన్ని సంపాదించడమే కాక, ఆవిడకి రక్తదానం చేసి ఆవిడకి కనువిప్పు కలిగించిన చిత్ర కథానాయిక.

**శ్రీనివాస్:** చిత్ర కథానాయకుడు. గాంధీ మార్గంలో నడిచేవాడు. అంటరాని తనాన్ని సహించనివాడు. దాని నిర్మూలనకై నడుం కట్టిన వాడు. శాంతి కులం తెలిసిన అమ్మమ్మ ఆ పిల్లతో పెళ్ళి కుదరదని చెప్తే ఆ శాంతినే అమ్మమ్మకి చెప్పకుండా ఇంటికి పనిమనిషిగా తీసుకొచ్చిన వాడు. శాంతి చేతే ఇంట్లో దేవుడికి దీపం వెలిగింప చేసిన వాడు. అమ్మమ్మకి ప్రసాదాలు తినిపించిన వాడు. చివరికి అమ్మమ్మకి శాంతి మంచి తనం విలువ తెలిసి వచ్చేలా చేసిన వాడు. ధైర్యంగా శాంతిని వివాహం చేసుకున్న వాడు.

**శ్రీనివాస్ అమ్మమ్మ:** భోళా మనిషి. మనవడు అంటే ఎంతో అభిమానం ఉన్న మనిషి. శాంతి పెళ్ళి సంబంధం మాట్లాడడానికి వచ్చిన లక్ష్మీపతి దంపతులు శాంతి జన్మ గురించి చెప్తే వాళ్ళతో సంబంధమే వద్దని పంపించేసిన ఆచారపరురాలు. అంతే కాకుండా ఇంటిని పవిత్రం చేయించడానికి ఒక పూజారిని పిలిపించిన మడిమనిషి. శ్రీనివాస్ శాంతిని పని మనిషిగా తీసుకొచ్చి ఆ అమ్మాయి ఎవరోనే అమ్మమ్మా అంటే - ఒక్కసారి చూస్తే నాకు కులం గోత్రం తెలిసిపోతుంది, ఆ అమ్మాయి మొహంలో లక్ష్మీ కళ ఉట్టిపడుతోందని సంబరపడిపోయిన వెర్రి బాగులది. ఆ శాంతే తన దేవుడి విగ్రహాన్నీ, తననీ కాపాడిందని తెలిసి ఏ మాత్రం సందేహం లేకుండా మనవడితో పెళ్ళి చెయ్యడానికి సిద్ధపడిన అభ్యుదయవాది. ఒక రకంగా ఈ చిత్రానికి అసలైన నాయిక!

ఈ ముఖ్యమైన పాత్రలు పోషించిన నటీనటులు అందరూ అద్భుతమైన నటన ప్రదర్శించారు. గుమ్మడీ, అంజలీదేవిలకి ఈ పాత్రలు కొత్త కావు. ఇలాంటి నటనా కొత్త కాదు.

శోభన్ బాబు అమ్మమ్మతో సరదాగా మాట్లాడుతున్నప్పుడూ, వీర హరిజనుడిలా పాట పాడినప్పుడూ, తనని దధ్యోదనం అని వెక్కిరించబోయిన గీతని ఆట పట్టించినప్పుడూ, శాంతితో తన ప్రేమ గురించి చెప్పినప్పుడూ, ఇంటి నుండి వెళ్ళి పోయే శాంతికి ధైర్యం చెప్పి తనింటికి తీసుకెళ్ళినప్పుడూ, శాంతి చేత తన మడి ఇంట దైవ కార్యం చేయించినప్పుడూ చాలా చక్కగా నటించారు. ఆ సంవత్సరం ఉత్తమ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు.

శారద నటన అత్యద్భుతం. తను కోటీసు కూతుర్నని తెలుసుకున్నప్పుడు శారద చూపించిన బాధ అనితరసాధ్యం. బాధ ఎంత చూపించగలరో మమతా, ప్రేమా, వేళాకోళం అన్నీ చక్కగా చూపించగల నటి శారద. తన అక్కని పెళ్ళి చేసుకుంటాడన్న



ఉద్దేశంతో శ్రీనివాసుని బావగారూ అని పిలుస్తూ చెప్పిన సంభాషణలు చాలా బావుంటాయి. శారద గొంతుతో మాయ చేసే ఐంద్రజాలికురాలు.

శోభన్ అమ్మమ్మగా సూర్యకాంతం నటన చాలా చాలా బావుంటుంది. ఎన్ని రకాల సంభాషణలో. అన్నింటినీ అతి సహజంగా సూర్యకాంతానికి మాత్రమే సాధ్యమయ్యేలా చెరిగేసారు. ఎడం చెయ్యి తిప్పుతూ, నోటితో పాటు మొహమంతా డైలాగులు చెప్పేస్తూ, అందరి మీదా ఆప్యాయత కురిపిస్తూ సూర్యకాంతం చూపిన నటన చిత్రమంతా మనల్ని కట్టి పడేస్తుంది.

ఒక ప్రత్యేకమైన ప్రయోజనంతో తీసిన ఈ చిత్రంలో బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణలు ఎంతో శక్తిమంతమైనవి. మచ్చుకి కొన్ని.

ఇంటి నుండి వెళ్ళి పోతున్న శాంతితో శ్రీనివాస్ –

ఈ సృష్టిలో, దేవుని దృష్టిలో అంటరానితనం అంటూ ఏమీ లేదు
మార్చవలసింది మీవాళ్ళ ను కాదు, మావాళ్ళ ను
– అని చెప్పి తన ఇంటికి తీసుకెళ్తాడు

తన ఇంటికి వచ్చిన శాంతి తను అమ్మమ్మ కళ్ళు కప్పి తప్పు చెయ్యడంలేదు కదా అని అనుకుంటూ ఉంటే శ్రీనివాస్ –

కళ్ళు కప్పడం కాదు, కళ్ళు తెరిపించడం
దేవుడు దేవుడు ఎందుకయ్యాడో తెలుసా, శబరి ఎంగిలి తిన్నందుకు
– అని సమాధాన పరుస్తాడు.

తనని పెంచిన తండ్రి తన అసలు తండ్రి కాదని తెలిసాక శాంతి –

ఇంక నేను మిమ్మల్ని నాన్నా అని పిలవచ్చా నాన్నా
– అని అడుగుతుంది, అతి దీనంగా.

ఈ చిత్రాంశం విశ్వనాథ్ గారు తరవాత తీసిన శంకరాభరణం, సప్తపది చిత్రాలకి కూడా ముఖ్యాంశం. కాలం మారిందిలో కొంచెం గట్టిగా చెప్పిన విషయాన్ని శంకరాభరణం, సప్తపదిలలో కాస్త మృదువుగా, సున్నితంగా కొనసాగించారు.

శంకరాభరణం చిత్రంలోని కొన్ని సన్నివేశాలకి ఈ చిత్రంలో సన్నివేశాలు మూలాలేమో అని అనిపిస్తాయి.

పెళ్ళి చూపులకి వచ్చినప్పుడు సూర్యకాంతం తన మనవడు చద్దన్నం తింటాడని చెప్తోంటే శోభన్ బాబు సిగ్గు పడతాడు. అలాగే శంకరాభరణంలో పెళ్ళి చూపుల సన్నివేశంలో నిర్మల తన మనవడు చద్దన్నం తింటాడని చెప్తే చంద్రమోహన్ సిగ్గు పడతాడు.

శారద సూర్యకాంతం ఇంటికెళ్ళినప్పుడు వంటింట్లోకీ, పూజగదిలోకీ వెళ్ళడానికి సందేహిస్తోంటే శోభన్ బాబు కులాలు మనుషులు సృష్టించుకున్నవే అని వివరించి శారదని పూజా, వంటా చెయ్యడానికి ప్రోత్సహిస్తాడు. శారద స్నానం చేసి పొయ్యి వెలిగిస్తుంది.

శంకరాభరణం చిత్రంలో మంజుభార్గవి అదే సందిగ్ధంలో ఉన్నప్పుడు సోమయాజులు అలాంటి మాటలే చెప్పాక మంజుభార్గవి స్నానం చేసి పొయ్యి వెలిగిస్తుంది.

# నేరము శిక్ష

న్యాయస్థానాల నుండి తప్పించుకున్నా తన నేరానికి తన సాటి మనుషుల జీవితాలలో కలిగిన పరిణామాలని చూసి సానుభూతితో అర్థం చేసుకోగలిగిన నేరస్థుడు తప్పకుండా తన తప్పుని తెలుసుకుని మంచివాడుగా మారుతాడన్నదే నేరము శిక్ష చిత్రం వెనక ఉన్న సూత్రం. మనిషికి అసలు శిక్ష మనస్సాక్షి విధించేదే. పశ్చాత్తాపపడే మనిషి ప్రాయశ్చిత్తంగా తన నేరానికి బలైన వాళ్ళ కి తను స్వయంగా సాయం చెయ్యడమే తనకి తాను విధించుకునే శిక్ష.




చాలా వైవిధ్యం ఉన్న చిత్రాలు దర్శకత్వం వహించే విశ్వనాథ్ గారి చిత్రాలలో కూడా ఇది విభిన్నమైంది. ఆయన దర్శకత్వ చాతుర్యంతో చాలా మంచి సినిమాగా రూపు దిద్దుకుంది.

విజయ్ అనే బాగా డబ్బున్న అబ్బాయి నిర్లక్ష్యంగా కారు వేగంగా నడిపే సన్నివేశంతో చిత్రం మొదలవుతుంది. తండ్రి కుర్రాడిని మందలించబోతే తల్లి గారాబంగా వెనకేసుకు వస్తుంది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న విజయ్ కి తను కారు ప్రమాదం చేసినా ఏం జరిగిందో చూడాలన్న స్పృహ కూడా ఉండదన్న అతని వ్యక్తిత్వం ప్రేక్షకుల ముందుంటుంది.

అమ్మ కొనిచ్చిన కొత్త కారులో స్నేహితుడితో కారు పందెం వేసుకుని దారిలో ప్రమాదం చేస్తాడు. ఆ ప్రమాదంలో పెళ్ళి చూపులకి వెళ్తున్న చిన్నయ్య కళ్ళు కోల్పోతాడు. చిన్నయ్య అన్నయ్య మరణిస్తాడు. కళ్ళు పోగొట్టుకున్న చిన్నయ్య జీవితం అంధకారంలో పడుతుంది. అతనితో పాటు అతని అన్నయ్య కుటుంబం కష్టాల్లో పడుతుంది.

ప్రమాదం చేసిన సమయంలో కారుని విజయ్ కాకుండా తను నడుపుతున్నానని తమ నమ్మకస్తుడైన డ్రైవర్ చేత ఒప్పింపచేస్తుంది విజయ్ తల్లి. న్యాయంగా విజయ్ కి పడవలసిన శిక్ష డ్రైవరుకి పడుతుంది. డ్రైవర్ జైలు పాలవుతాడు. పెళ్ళి కావల్సిన అతని చెల్లెలు వీధుల పాలవుతుంది.

జరిగింది తెలుసుకున్న విజయ్ తండ్రి విజయ్ ని ఇంటి నుండి పంపించేస్తాడు. ఇంటి నుండి వచ్చేసిన విజయ్ రైల్లో వెళ్తూండగా అదే రైల్లో వెళ్తూ డ్రైవరు చెల్లెలు ఆత్మహత్య చేసుకోబోతోంటే విజయ్ కాపాడతాడు. డ్రైవరు చెల్లెలు విజయ్ తో తన అన్నయ్య కారు ప్రమాదం చేసాడనీ, అందుకు జైలుకి వెళ్ళాడనీ, తనకి ఏదిక్కూ లేదనీ చెప్తుంది.





విజయ్ కి తను చేసిన నేరానికి ఆ అమ్మాయి శిక్ష అనుభవిస్తోందని అర్థం అవుతుంది.

ఆ అమ్మాయిని అన్నయ్యలా ఆదరిస్తానని పట్నం తీసుకొచ్చిన విజయ్ కి కొన్నాళ్ళకి రోడ్డు మీద ప్రమాద వశాత్తూ చిన్నయ్య కనిపిస్తాడు. మాటలలో చిన్నయ్య తనకి కళ్ళు పోడానికి కారణం ఒక పొగరుబోతు కారుని వేగంగా తోలడమే అని అంటాడు.

అది తన వల్లే జరిగిందని తెలిసిన విజయ్ చిన్నయ్యతో వాళ్ళు ఉంటున్న చోటుకి వెళ్ళి అక్కడ చిన్నయ్య వదిన భర్త పోయిన దుఃఖంతో దీనంగా ఉండడం చూస్తాడు.

విజయ్ కి లోకమంటే ఏమిటో తెలుస్తుంది. తన నిర్లక్ష్యం వల్ల చిన్నయ్యకీ, డ్రైవర్ చెల్లెలికీ కలిగిన కష్టం అర్థం చేసుకుని వాళ్ళకి సాయం చేస్తూంటాడు విజయ్. వారికి సాయం చెయ్యడానికి అంత ధనవంతుల బిడ్డ నానా అవస్థలూ పడతాడు.

చిన్నయ్య తనకి కళ్ళు వస్తే తన అన్నయ్యని చంపిన వాడి ప్రాణాలు తీస్తానని చెప్తున్నా అతనికి కళ్ళు వచ్చేందుకు సాయం చేస్తాడు విజయ్. అతనికి కళ్ళు వస్తే తనని చంపేసినా ఫరవాలేదనుకునే మానసిక పరిపక్వతకి ఎదుగుతాడు.

కళ్ళు వచ్చిన చిన్నయ్య విజయే తనకీ, తన వదినకీ సాయం చేసిన వాడని తెలుసుకుని తన పగను వదిలేస్తాడు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో సామాన్యంగా మంచివాళ్ళు చెడ్డవాళ్ళు అని విడివిడిగా ఉండరు. పెంపకం వల్లో, పరిస్థితుల వల్లో, క్షణికమైన ఆవేశం వల్లో, మరే కారణంగానో ఎవరైనా చెడ్డగా ప్రవర్తించినా వారు తప్పు తెలుసుకుని మారడం జీవితాలలో ఎంత సహజమో విశ్వనాథ్ గారి చిత్రాలలో కూడా అంతే సహజం. కక్షలూ కార్పణ్యాలూ వదిలేసుకుంటారే తప్ప జీవితాంతం గుర్తుంచుకుని కొట్టుకుంటూ, చంపుకుంటూ ఉండరు.

నేరము శిక్ష చిత్రంలో విజయ్ అమ్మ గారాబంలో బాధ్యత లేకుండా పెరుగుతాడే తప్ప అవసరం, అవకాశం వస్తే తను చెయ్యగలిగిన, చెయ్యవలసిన సాయం చెయ్యడానికి వెనకాడడు.

విజయ్ మంచితనానికి లొంగిపోయిన చిన్నయ్య కూడా తన అన్నని చంపిన విజయ్ మీద పగ తీర్చుకోడు.

మనుషుల్లో సామాన్యంగా మంచితనమే ఉంటుంది. దానికి ఒక్కోసారి మసక కమ్ముతుంది. మసక తొలగిపోగానే మనిషిలో మంచితనం బయటకి వస్తుంది. ఇది విశ్వనాథ్ గారు నమ్మిన సూత్రం. ఈ సూత్రం చాలా చిత్రాలలో అంతర్లీనంగానూ, కొన్ని చిత్రాలలో బాహాటంగానూ కనిపిస్తుంది. నేరము శిక్ష చిత్రం ప్రధాన సూత్రం ఇదే.

చిత్రంలో విశ్వనాథ్ గారి దర్శకత్వ మెరుపులు విరివిగా కనిపిస్తాయి.

చిత్రం మొదట్లో చెల్లెలి కాపురం చిత్రంలోని చరణకింకిణులు పాట వినిపిస్తూ ఉంటుంది.

తన స్నేహితుడు భయపడుతోంటే నవ్వుకుంటూ కృష్ణ కారు వేగంగా నడిపే సన్నివేశమంతా చీకటిలోనే సాగుతుంది.

కళ్ళు పోగొట్టుకోడానికి ముందు చిన్నయ్య విజయ్ కి నీళ్ళు అవసరం ఐతే ఇవ్వడం, అందుకు విజయ్ డబ్బు ఇవ్వబోతే చిన్నయ్య తీసుకోక పోవడం వారి వారి పాత్రలకీ, పరిచయానికీ, జరగబోయే కథకీ పునాది.

చిన్నయ్య పెళ్ళి చూపులకి వెళ్తూ సరదాగా నల్ల కళ్ళద్దాలు పెట్టుకోవడం, దాని గురించి పరిహాసంగా మాటాడుకోవడం, ప్రమాదంలో అతనికి కళ్ళు పోవడం ఒక క్రమంలో జరుగుతాయి.

చిన్నయ్య చూసుకుందుకు వెళ్తున్న పెళ్ళికూతురు విజయ్ బదులుగా జైలుకి వెళ్ళిన డ్రైవరుకి చెల్లెలు. విజయ్ చేసిన ప్రమాదంలో ఆ ఇద్దరి బతుకులు కష్టాల పాలవుతాయి. ఇద్దరికీ సాయం చేసి ఇద్దరినీ కలుపుతాడు విజయ్.

చిన్నయ్య కళ్ళు తెప్పించడం కోసం కావల్సిన ధనాన్ని విజయ్ ఒక మోటార్ సైకిల్ రేసు లో పాల్గొని సంపాదిస్తాడు. ఏ వేగం వల్ల విజయ్ ప్రమాదం చేసాడో, అదే వేగం సాయంతో పందెం గెలిచి డబ్బు సంపాదించి, ప్రమాదంలో నష్టపోయిన వారి ఋణం తీర్చుకుంటాడు. చిత్రం ఒక విధమైన కావ్య న్యాయంతో ముగుస్తుంది.

ఫోడర్ డిస్తొవొస్కీ రాసిన క్రైమ్ అండ్ పనిష్మెంట్ నవల ఈ కథకి ఆధారం అంటారు కానీ, నవల చదివిన నాకు అలా అనిపించలేదు.

అంత కన్న శాంతారాం తీసిన దో ఆంఖేం బారహ్ హాథ్ సినిమా ప్రభావం స్వల్పంగా ఉందేమో అని నా అనుమానం.

# ఓ సీత కథ

ఓ సీత కథ చిత్రం గురించి అప్పటి ఓ సినీ పత్రికలో ఓ విమాన ప్రయాణంలో విశ్వనాథ్ గారి మస్తిష్కంలో హఠాత్తుగా మెరిసిన కథ ఓ సీత కథ అని చదివినట్లు నాకు గుర్తు. విమాన ప్రయాణం గురించి పక్కన పెడితే అలాంటి కథను ఊహించిన దర్శకుడు విశ్వనాథ్ గారి మస్తిష్కం మాత్రం మహాద్భుతం.

ఓ సీత కథ చిత్రానికి అసలు హీరో కథే. సీత జీవితం రకరకాల మలుపులు తిరుగుతుంది. ఐతే ఏ మలుపూ కృత్రిమంగా కట్టుకథలా అనిపించదు. సహజంగా ఒక జీవితంలానే సాగిపోతుంది.




పదిహేనూ పదహారేళ్ళ సీత మల్లె కన్న తెల్లనీ, వెన్నెలంత చల్లనీ సొగసుగత్తె. తన బావతో హాయిగా కబుర్లాడుతూ, పాటలు పాడుకుంటూ కాలం గడిపేస్తూ ఉంటుంది.

అలాగని అమాయకురాలో బాధ్యత తెలియనిదో కాదు. హరికథలు చెప్పి కుటుంబాన్ని పోషిస్తున్న అక్క పెళ్ళి కుదుర్చుతుంది.

సరిగ్గా ఆ సమయానికే గోపాలకృష్ణ అనే ఒక జులాయి సీత జీవితంలోకి ప్రవేశిస్తాడు. అతడి వల్ల సుందరి జీవితం పాడవుతోందని అతన్ని నిలదీస్తుంది సీత. బావ సాయంతో అతన్ని అడ్డుకుంటుంది.

ఐతే గోపాలకృష్ణ రౌడీల సాయంతో బావని చంపించడమే కాకుండా సీత వల్లే బావ ఆత్మ హత్య చేసుకున్నాడన్న అబద్ధప్రచారం చేయిస్తాడు.

దాంతో అక్క పెళ్ళి ఆగిపోతుంది. హరికథలూ ఆగిపోతాయి. కుటుంబం వీధిన పడుతుంది. తన కుటుంబ పరిస్థితులు సరి చెయ్యడంకోసం ఒక వయస్సు మళ్ళి న పెద్దాయన వివాహ ప్రకటనకి ఉత్తరం రాస్తుంది. విచిత్రం ఏమిటంటే ఆ ప్రకటన ఇచ్చిన పెద్దాయనకి ఆ ప్రకటన ఇవ్వడం ఇష్టం లేదు. అది స్నేహితుడు ఇచ్చిన ప్రకటన.

ఇంత చిన్న వయస్సులో జీవితం పణంగా పెట్టవద్దని నచ్చ చెప్పడానికి ఆ పెద్దాయన సీతనీ కుటుంబాన్నీ తన ఇంటికి తీసుకు వెళ్తాడు. సీత సాయంతో ఆ పెద్దాయన చిన్న పిల్లలు బాగు పడతారు.

ఆ పెద్దాయన సీతని తన పెద్దకొడుకుని పెళ్ళి చేసుకోమని అడుగుతాడు. ఆ కొడుకు మరెవరో కాదు. గోపాలకృష్ణే. సీత అక్కా, అమ్మా కూడా అది మంచిదే అని చెప్తారు. సీత ఏ నిర్ణయమూ తీసుకునే లోగా ఇంట్లో ఒంటరిగా ఉన్న సీతని గోపాలకృష్ణ బలాత్కరించ బోతాడు. సరిగ్గా ఆ సమయానికే సీత అక్క కీచకుడి ఉదంతాన్ని హరికథగా చెప్తూ ఉంటుంది.

చిత్రంలో అతి కీలకమైన నిర్ణయాన్ని సీత తీసుకునే సన్నివేశానికి ఈ హరికథే నేపథ్యం అవుతుంది. ఎందుకంటే కీచకుడిలో దుర్మార్గానికి అసలు కారణం ద్రౌపది అభద్రతలో ఉందని సీత నిర్ణయించుకుంటుంది. స్త్రీగా తనకి రక్షణ కావాలనుకుంటుంది. అందుకు మాంగల్యాన్ని కోరుకుంటుంది. తనకి కావల్సింది రక్షణ అని ఆ పెద్దాయనని ఒప్పించి, పెళ్ళి చేసుకుంటుంది సీత. గోపాలకృష్ణకి తల్లవుతుంది.

సీత కథ మలుపు తిరుగుతుంది.

తల్లిగా పెద్దరికం తెచ్చుకున్న సీత గోపాలకృష్ణని ముప్పుతిప్పలు పెడుతుంది. గోపాలకృష్ణ ద్వారా తల్లైన సుందరిని ఇంటికి తీసుకు వస్తుంది. గోపాలకృష్ణ పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కవుతుంది.

ఒక ప్రమాదంలో చిక్కుకున్న గోపాలకృష్ణని రక్షించి అతనిలో పశ్చాత్తాపం కలిగేలా చేస్తుంది. గోపాలకృష్ణ తన తప్పుని ఒప్పుకుని సీతని గౌరవంగా అమ్మా అని పిలవడంతో కథ ముగుస్తుంది.

ఇంత కథ రాయడం ఎందుకంటే ఈ కథ ఎంత విచిత్రమైనదో చెప్పడానికే. ఎక్కడా సీత కథ ఇలా ముగుస్తుంది అని చెప్పకుండా సన్నివేశాలు రాసుకున్న దర్శకుడు ప్రేక్షకుడికి నెమ్మది నెమ్మదిగా సీత జీవితాన్ని ప్రత్యక్షం చేస్తూ ఉంటారు.

చిత్రానికి నేపథ్యం అంతా ఆడవారిని గౌరవంగా చూడాలనే. చిత్రం మొదలే భారత నారీ చరితమూ మధుర కథా భరితమూ అన్న హరి కథతో ప్రారంభమవుతుంది. ఆదర్శవంతమైన మహిళలు ఈ నాడూ ఉన్నారూ - అలాంటి ఓ సీత కథని చూపిస్తున్నామని చిత్రం ప్రారంభిస్తారు.

చిత్రం చివరిలోనూ పని చేసుకుంటున్న మహిళలని చూపిస్తూ ఈ వాక్యాలతోనే ముగిస్తారు.

కథానాయిక పాత్రలో రోజారమణి విశ్వనాథ్ గారి మదిలో మెదలిన సీత తెరపై ప్రత్యక్షమైందా అన్నట్లు కనిపించారు. పదహారేళ్ళ ప్రాయపు రోజారమణి తన వయస్సుకి తగ్గట్లు చిత్రం మొదటి భాగంలో సరదాగా నటించారు. చిత్రం రెండవ భాగంలో పెద్దరికాన్ని తల మీద వేసుకున్న పాత్రలో రోజారమణి చాలా బావుంటారు. రోజారమణి అందం, ఆహార్యం గురించి రాసేందుకు మాటలు చాలవు.

ఈ చిత్రానికి హీరో కాని హీరో గోపాలకృష్ణ పాత్రలో కనకాల దేవదాస్, అమాయకురాలైన సుందరి పాత్రలో రమాప్రభా, కాసేపే కనిపించిన చంద్రమోహన్, హరికథలు చెప్పే శుభా, సీతని దగ్గరకి తీసుకున్న కాంతారావూ, కాంతారావు

స్నేహితుడిగా అల్లు రామలింగయ్యా - అందరూ చాలా బాగా నటించారు. చిత్రాన్ని నవరసభరితంగా తీర్చిదిద్దారు.

1. రోజారమణీ, చంద్రమోహన్ శుభ పెళ్ళి కుదురుస్తూ తమకు కూడా అన్వయించుకుంటూ పాడిన పాట సున్నిత శృంగారం.
2. తన పాడైన పాత కళ్ళ జోడుతో అల్లు రామలింగయ్య పిసినిగొట్టు ప్రహసనం సునిశిత హాస్యం.
3. ఏమీ తెలియని అమాయకురాలు రమాప్రభని లొంగదీసుకుని దేవదాస్ అనుభవించడం భయానకం.
4. దేవదాస్ తనని అనుభవించిన విషయాన్ని రోజారమణికి రమాప్రభ చెప్పడం కరుణ రసాత్మకం.
5. రమాప్రభకి దేవదాస్ చేసిన అన్యాయానికి రోజారమణి ఒంటరిగా వెళ్ళి హెచ్చరించడం వీరం.
6. చంద్రమోహన్ని చంపేసి రోజారమణి వల్లే అలా జరిగిందని అందరికీ తెలిసేలా దేవదాస్ చెయ్యడం బీభత్సం.
7. తన అక్క కీచకుడి ఉదంతాన్ని హరికథ చెప్తున్న సమయంలో తనని బలాత్కరించబోయిన దేవదాసుని రోజారమణి ప్రతిఘటించడం రౌద్రం.
8. ఏమీ తొందరపాటూ కంగారూ లేకుండా తన రక్షణకోసం రోజారమణి కాంతారావుని పెళ్ళి చేసుకోమని అడగడం శాంతం.
9. చిత్రం చివరిలో దేవదాసు రమాప్రభని భార్యగా స్వీకరించడం, రోజారమణిని గౌరవంగా అమ్మా అని పిలవడం అద్భుతం.

చివరగా రెండు ముక్కలు.

ఒకటి. రోజారమణి దేవదాసుని ప్రతిఘటించిన రెండు సన్నివేశాలలోనూ నేపథ్యంలో మహిషాసురమర్దిని స్తోత్రం వినిపిస్తుంది. అది ఆడవారు తమ పైన మగవారు జరిపే అన్యాయాల మీద మ్రోగించిన రణభేరిలా, విజయదుందుభిలా వినిపిస్తుంది.

రెండు. ఈ చిత్ర విజయం ఈ చిత్రాన్ని మలయాళ తమిళ భాషలలో పునర్నిర్మించేలా చేసింది. ఎవరి దగ్గర విశ్వనాథ్ తను సహాయ దర్శకుడిగా పని చెయ్యాలని అనుకుంటున్నానని అంటారో ఆ బాలచందర్ విశ్వనాథ్ తెలుగులో దర్శకత్వం వహించిన ఓ సీత కథ తమిళ చిత్రానికి దర్శకులు!

(ఓ సీత కథ చిత్రమే భారత నారీ చరితము మధుర కథా భరితము అన్న హరికథతో మొదలౌతుంది. వేటూరి సినీ ప్రస్థానం ఈ హరికథతోనే మొదలయ్యింది. వేటూరి విక్రమావతారానికి ఇది తొలి అడుగు. అనంతర కాలంలో వేటూరి విశ్వనాథ్ కలిసి సృష్టించిన మంచి పాటలు ఎన్నో, ఎన్నెన్నో. వేటూరి ఏ పాటకీ మాటలు వెతుక్కోనక్కరలేదు. అవే వడివడిగా పరుగిడితై, ఆయన ఎదనడుగిడితై. శబ్దాలంకారాలుగా జాలువారుతై. అచ్చెరువున అచ్చెరువున, ఆ రాధ ఆరాధనా, ఊరేగినా, ఊరేలినా వంటి చమత్కారాలు వేటూరి కలానికి అలవోకగా వచ్చేస్తాయి)



# సిరిసిరిమువ్వ

1971-75 లలో వరసగా చెల్లెలి కాపురం, కాలం మారింది, నేరము శిక్ష, ఓ సీత కథ, జీవన జ్యోతి చిత్రాలకి నంది అవార్డులు అందుకున్న విశ్వనాథ్ గారు, 1976 లో దర్శకత్వం వహించిన చిత్రం సిరిసిరిమువ్వ.

ఒక విధంగా విశ్వనాథ్ గారు అంతకు ముందు తీసిన చిత్రాలకు పూర్తి విభిన్నమైన చిత్రం సిరిసిరిమువ్వ. ఇందులో సాంఘిక సమస్యలూ, సందేశాలూ ప్రధానాంశాలు కావు.

కష్టాలూ, కలతలూ, ఆప్యాయతలూ, అనురాగాలూ ఉంటాయి.




సవతి తల్లి ఆరళ్ళు ఉంటాయి. కన్న తండ్రి నిస్సహాయత ఉంటుంది. విశ్వనాథ్ గారి చిత్రాలలో అరుదైన విలనిజం ఉంటుంది. హీరోని కట్టేసే విలన్లు ఉంటారు.

అలానే మంచితనానికి మారుపేరుగా ఆలయ పూజారీ, అర్థం చేసుకునే రాంబాబు వంటి వారూ ఉంటారు.

ఒక రకంగా చూస్తే కథ మామూలు ఫార్ములా కథే. అంతకు ముందు వరసగా ఐదు నంది అవార్డులు అందుకున్న చిత్రాలలో ఉన్న విభిన్నత కానీ, ప్రత్యేకత కానీ ఏమీ లేదు.

మరి ఈ చిత్రం గొప్పతనం ఏమిటి?

సంగీత నాట్యాలు. ఈ చిత్రానికి ప్రాణం పాటా ఆటా. చంద్రమోహనమైన పాట. జయప్రదమైన ఆట.

అందుకే ఈ చిత్రదర్శనం మనం ఆటా పాటల రూపంగానే చూద్దాం.

తెరతీయగానే మనకి కనిపించేది ప్రకృతిలో మమేకమై ఆడుతున్న హైమ. హైమకి దీటుగా డప్పు వాయిస్తున్న సాంబయ్య. వారిద్దరి మీద సిరిసిరిమువ్వలు జయప్రద చంద్రమోహన్ అని వారి పేర్లు.

హైమ మూగది. తండ్రి పక్షవాతం మనిషి. సవతి తల్లిదే ఇంటి పెత్తనం అంతా. సవతి తల్లికి హైమ పొడ గిట్టదు. హైమకి ఎంతో ఇష్టమైన నాట్యం నేర్చుకోనివ్వదు. ఐనా హైమ సవతి చెల్లెలు ఒక మాస్టారు దగ్గర నేర్చుకుంటోంటే తనూ నేర్చుకుంటూ ఉంటుంది.

సాంబయ్య డప్పు వాయించుకుంటూ ఊళ్ళో అందరికీ తలలో నాలుకలా ఉంటూ కాలం గడుపుతూ ఉంటాడు. హైమకి సాంబయ్య అంటే అభిమానం. సాంబయ్యకి హైమ అంటే ఆరాధన.

ఊళ్ళో శ్రీరాముని ఊరేగింపు సమయంలో -

ఊరేగినా వాడే, ఊరేలినా వాడే
- అని పాట పాడుతాడు సాంబయ్య.

సవతి తల్లి నిరాదరణతో నాట్యం చేసుకోలేని హైమకి ఎక్కడైనా లయాన్వితంగా సవ్వడి వినిపిస్తే మువ్వలు తొడుక్కుని నాట్యం చెయ్యాలనిపిస్తుంది. ఒక రాత్రి అలాగే సవతి తల్లీ, చెల్లీ పడుకున్నాక సాంబయ్య వాయిస్తున్న డప్పు దరువుకి మైమరచి పోయి చెల్లి గజ్జెలు వేసుకుని నాట్యం చేస్తుంది. చేస్తూ -

ఝుమ్మంది నాదం, సయ్యంది పాదం
- అని పాడుకుంటూ ఉంటుంది. అది చూసిన సవతి తల్లి హైమ కాలికి వాత పెడుతుంది.

హైమకి పెళ్ళి ప్రయత్నాలు మొదలౌతోంటే హైమ వివాహానికి మువ్వలు బహుమతిగా ఇద్దామనుకుని సాంబయ్య పట్నం వెళ్ళి డప్పు వాయించి డబ్బు సంపాదిస్తాడు. అందుకు కడుపు మాడగొట్టుకుంటాడు కూడా.

హైమ పెళ్ళి కూతురులా పల్లకిలో ఊరేగుతున్నట్లు ఊహించుకుంటూ -
అందానికి అందం ఈ పుత్తడి బొమ్మా
- అని పాడుతాడు. ఎంత అందమైన పాటో - ఎంత అందమైన జయప్రదో!

హైమకి వివాహం చేస్తున్నది ఒక దుర్మార్గుడితో అని చూసి పెళ్ళి ఆపుచెయ్యమని ప్రాధేయ పడతాడు సాంబయ్య. ఎవ్వరూ వినకపోతే దేవుడినే -

రా దిగి రా, దివి నుండి భువికి దిగిరా
- అని ఆవేశంగా డప్పు వాయిస్తూ పిలుస్తాడు. సాంబయ్య మంచితనానికీ, ఆవేశానికీ దేవుడే పంపినట్లు పోలీసులు వచ్చి పెళ్ళి కొడుకుని తీసికెళ్ళి పోతారు.

కూతురు పెళ్ళి ఆగిపోయిందన్న బెంగతో తండ్రి మరణిస్తాడు. హైమకి తనే తోడుగా ఉంటానని సాంబయ్య హైమని వేరే ఊరు తీసికెళ్తాడు. ఆ సందర్భంలో నేపథ్యంలో -

ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక
ఏ దారెటు పోతుందో ఎవరినీ అడగక

– అన్న పాట వినిపిస్తుంది. ఎంతో సమయోచితమైన, భావగర్భితమైన, వేదాంతపరమైన పాట.

ఒక నది ఒడ్డున ఆలయం మండపంలో వారికి కాలం హాయిగా గడుస్తూ ఉంటుంది. సాంబయ్య సాయంతో హైమ జీవితం సుఖంగా నడుస్తుంది. ఏ మాత్రం కల్లా కపటం లేని ఇద్దరి మనుషుల మధ్య బంధం ఆప్యాయతా-ఆరాధనలతో ముడి వేసుకుంటుంది.

ఒక రోజు కోకిలని చూసి హైమ –
ఒడుపున్న పిలుపూ, ఒదిగున్న పులుపూ
ఒక గొంతులోనే పలికిందీ
అది ఏ రాగమని నన్నడిగిందీ
– అని సంబర పడిపోతే, సాంబయ్య –

అది మన వూరి కోకిలమ్మా
నిన్నడిగింది కుశలమమ్మా
– అని సంతోషంగా సమాధానమిస్తాడు.

హైమా సాంబయ్యలు ఇద్దరూ అలా సిరిసిరిమువ్వలులా కాలం గడిపేస్తోంటే కళ్ళు కుట్టిన కాలం సాంబయ్య ఆరోగ్యంతో ఆడుకుంటుంది. డాక్టర్లు టీబీ అని నిర్ధారించి మందులు రాసిస్తారు. సాంబయ్య చెప్పకపోయినా హైమ మందుల చీటీ చూసి విషయాన్ని గ్రహిస్తుంది.

ఇద్దరూ ఒకరికి తెలియకుండా ఒకరు డబ్బు సంపాదించడానికి ఒక నాట్య ప్రదర్శనకి ఒప్పుకుంటారు. వేదిక మీదే ఒకరిని ఒకరు చూసుకుంటారు. సాంబయ్యని శ్రమపడవద్దని హైమ వారిస్తుంది. ఐనా సాంబయ్య డప్పు వాయించడం మొదలెడతాడు. హైమ అనుగుణంగా ఆడుతుంది. ఆ పాటే –

గజ్జె ఘల్లుమంటోంటే
గుండె ఝల్లుమంటుందీ
గుండె ఝల్లుమంటోంటే
కవిత్వం వెల్లువవుతుందీ
– ఇది కళల సమాహారానికి సరైన సన్నివేశం.

సాహిత్యం, సంగీతం, నాట్యం సమాగమమే పాటంతా. ఇంక చంద్రమోహన్, జయప్రదల అందం, అభినయం చూసి ఆనందించవలసినవే.





సాంబయ్య హైమకి మంచి సంబంధం చెయ్యాలని మంచి మనిషి రాంబాబుతో మాట్లాడుతాడు. ఆ విషయం విన్న హైమ ఆలోచనలో పడుతుంది. అప్పుడే గాలికి మండప స్తంభానికి వేలాడదీసిన గజ్జెలు డప్పు మీద పడతాయి. అనుకోకుండా జరిగిన ఆ సంఘటన హైమ మనస్సుకి స్పష్టతని ఇస్తుంది.

అప్పుడు హైమ సాంబయ్యని పిలుస్తున్నట్లు ఊహించుకుంటూ -
స్వామి రా రా
- అని పాట మొదలెట్టి -
రాగాలెన్నో పండిన గారాల నీ మెడలో అనురాగ మాలికలే వెయ్యాలనీ
- అని సాంబయ్య మెళ్ళో దండ వేసి -
పిలిచాను ఎదుట నిలిచాను
- అని కొనసాగిస్తుంది
సమాధానంగా హైమ తనకి వేసిన దండని తీసి మళ్ళీ హైమకే వేసి సాంబయ్య -
గంగ కదలి వస్తే కడలి ఎలా పొంగిందో
తనువూగిందీ అలాగే; మనసు పొంగింది నీలాగే
- అని పాడతాడు.

సాంబయ్య హైమల పెళ్ళి నిశ్చయమైపోతుంది. ఇద్దరూ ఒకరి దగ్గర ఒకరు డప్పూ, నాట్యం నేర్చుకుంటారు.

హైమతో తన పెళ్ళి సాంబయ్య చెడిపొడన్న కోపంతో అప్పటి పెళ్ళి కొడుకు సాంబయ్యని ఒక పెద్ద కొండరాయి మీద గుళ్ళో బంధిస్తాడు.

సాంబయ్య ఎక్కడ ఉన్నాడో తెలియక అందరూ కంగారు పడుతోంటే సాంబయ్య డప్పు తీసుకుని వాయించుకుంటూ వెళ్తుంది హైమ. హైమ డప్పు శబ్దం విని సాంబయ్య తన తలతో ఆలయంలోని గంటని బాదుతూ శబ్దం చేస్తాడు. గంటా, డప్పుల శబ్దంతో పోలీసులు సాంబయ్య ఎక్కడ ఉన్నాడో తెలుసుకుని విడిపిస్తారు.

సిరిసిరిమువ్వలు ఒక్కటవుతాయి. అవడానికి సాంబయ్య డప్పుని హైమ వాయించడమే కారణం అవుతుంది. ఒకరికి ఒకరవడానికి ఇంత కన్న కావల్సింది ఏముంది?

(కేసెట్లో గోదారల్లే ఎన్నెట్లో గోదారల్లే అని శ్రవణానందం చేసిన పాట ఎందుకో చిత్రంలో నయనానందం చెయ్యలేదు)

# సప్తపది

1981 లో శంకరాభరణం దర్శకులు విశ్వనాథ్ గారికి సన్మానం ఏర్పాటు చేసారు బొంబాయి ఆంధ్ర మహా సభ వారు. సన్మాన సభ బొంబాయికి గర్వకారణం ఐన షణ్ముఖానంద హాలులో చాలా ఘనంగా నిర్వహించారు. సన్మాన సభ అనంతరం సప్తపది చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసారు. అప్పుడు అక్కడ మొదటి సారి సప్తపది చిత్రం చూసాను నేను.




శంకరాభరణం విజయ సంరంభంలో దేశం నాలుగు మూలలా వేడుకలు ఇంకా జరుగుతూ ఉండగానే విశ్వనాథ్ గారు దర్శకత్వం వహించిన చిత్రం సప్తపది. ఆయన చిత్రాల మీద అంచనాలు ఆకాశమంత ఎత్తున ఉండడం సహజం. ఆరోజు బొంబాయిలో ఆ చిత్రాన్ని చూసిన వారందరి నోటా ఒక్కటే మాట - సప్తపది చాలా చాలా బావుందని. ప్రేక్షకుల అంచనాలకి ఏమాత్రం తగ్గకుండా సప్తపది తీసారు విశ్వనాథ్.

చిత్రమంతా నాలుగు స్తంభాల మీద నిర్మించారు.

ఒకటి. కులాల పేరిట సమాజంలో కొందరిని అంటరానివాళ్ళు గా వెలివేయడం సబబు కాదు.

రెండు. వివాహానికి ముఖ్యం మనస్సు కానీ మాంగల్యం కాదు.

మూడు. చాలా యేళ్ళ గా ఆలోచించకుండా ఆచరిస్తున్న ఆచారాలని ఒక్క సారి ఆగి ఆలోచించి మంచిచెడుల విశ్లేషణ చేసుకుని సరైన మార్గంలో నడవడానికి ప్రయత్నం చెయ్యాలి.

నాలుగు. చేసిన తప్పును సరిదిద్దుకుందుకు అవకాశం వస్తే లోకానికి భయపడక తప్పు సరిదిద్దుకోవాలి.

అమ్మవారి ఆలయ అర్చకులు యాజులు. ఆచారాలని పాటించడమే నిష్ఠగా జీవితం గడుపుతున్నవాడు. ఆయన కూతురు ఒక నాట్యాచార్యుడిని వివాహం చేసుకుందని కూతుర్ని ఇంటి నుండి పంపించేస్తాడు యాజులు. కొడుకూ, కొడుకు కొడుకూ ఆలయార్చనకి అంకితమై జీవిస్తూ ఉంటారు. కూతురు కూతురు హేమ. ఒక మంచి నాట్యకారిణిగా ఎదుగుతుంది. తమ ఊళ్ళో నే హేమ నృత్యప్రదర్శన జరుగుతుంది. హేమనీ, హేమ నాట్యాన్నీ చూసి ముచ్చటపడి యాజులు హేమకి తన కొడుకు కొడుకు గౌరీనాథంతో వివాహం చేస్తాడు. ఐతే తన నాట్యానికి వేణువు వాయించే హరిజనుడు హరిబాబుని హేమ ప్రేమిస్తుంది. ఇద్దరూ ఒకరికి ఒకరం, ఒక్కరం అని అనుకుంటారు. కానీ ఆ విషయం ఎవరితోనూ అనదు హేమ.

శోభనం రాత్రి హేమలో గౌరీనాథానికి అమ్మవారు కనిపిస్తుంది. ప్రతిరాత్రీ అదే జరుగుతూ ఉంటుంది. గౌరీనాథానికి ఎందుకు అలా అవుతోందో తెలుసుకుందుకు చేసిన ప్రయత్నంలో హరిబాబు విషయం తెలుస్తుంది. హరిబాబుని తీసుకు రాడానికి వెళ్తాడు. ఈలోగా యాజులుకి కూడా విషయం తెలుస్తుంది. ఏం చెయ్యాలా అన్న మీమాంసలో ఉన్నప్పుడు ఆయన ఆప్తమిత్రుడు రాజులు శంకరాచార్యులకి శివుడు చండాలుడి రూపంలో కనపడి చెప్పిన అద్వైతం గుర్తు చేసి, ఈసారికి ఇలా కానిచ్చెయ్యండి అంటూ సలహా ఇస్తాడు. ఊరంతా అడ్డు వచ్చినా ఆగిపోక యాజులు హేమని హరిబాబుతో పంపిస్తాడు.

కులాల కారణంగా మనుషుల మధ్య అసమానతలకీ, అన్యాయాలకీ విశ్వనాథ్ చిత్రాలు మొదటినుండీ వ్యతిరేకం. కాలం మారిందిలో అది స్పష్టంగా చెప్తారు. శంకరాభరణంలోనూ అది సూచిస్తారు. సప్తపదిలో సదాచార సంపన్నుడిగా జీవితం గడుపుతున్న యాజులుచేతే కులవ్యవస్థని ఎదిరింప చేసి పురోగతికి మార్గం స్థిరపరిచారు.

పడగ్గదిలో గౌరీనాథానికి హేమ అమ్మవారిలా కనిపించిన సన్నివేశం అనూహ్యం. శోభనం గదిలో హేమ తెల్ల చీరలో ఎదురుచూస్తూ ఉంటుంది. గౌరీనాథం గదిలోకి వచ్చి తలుపు వేసి హేమ వైపు చూస్తాడు. హేమ కిరీటంతో, ఆభరణాలతో తను గుళ్ళో అర్చించే అమ్మవారిలా కనిపిస్తుంది. హఠాత్తుగా గౌరీనాథం మహిషాసురమర్దిని శ్లోకాలు చదవడం మొదలెడతాడు. ఇది హేమ ఊహించని పరిణామం. ప్రేక్షకులకి కూడా పూర్తిగా అనుకోని సన్నివేశం.

గౌరీనాథం గుళ్ళో అమ్మవారికి ఎలా పూజ చేస్తాడో అలా హేమకి పూజ చేస్తాడు. నమస్కరిస్తాడు. ప్రదక్షిణం చేస్తాడు. పాదాలమీద వాలి ప్రణమిల్లి పువ్వులు కాళ్ళ దగ్గర పెడతాడు.

గౌరీనాథం శ్లోకాలు చదువుతున్నంతసేపూ అర్థం కాకుండా చూస్తుంది హేమ. ఈ పాట చిత్రీకరణలో చాలా విచిత్రం చూపించారు దర్శకులు. గౌరీనాథం హేమని చూస్తున్న కెమెరా కోణంలో హేమ అమ్మవారిలా కనిపిస్తుంది. అదే ప్రేక్షకులు వాళ్ళిద్దరినీ చూస్తున్న కెమెరా కోణంలో హేమ శోభనం చీరలోనే కనిపిస్తుంది.

గౌరీనాథానికి హేమ అమ్మవారిలా ఎందుకు కనిపించింది అన్న అంశానికి రకరకాల వ్యాఖ్యలు చేసుకోవచ్చు.

అమ్మవారి ఆలయంలోనే హేమ హరిబాబుతో కలిసి ఏడడుగులు నడవడం వల్ల అమ్మవారే హేమని గౌరీనాథానికి భార్యగా ఉండనివ్వక అమ్మవారిలా కనిపించిందనుకోవచ్చు.

గౌరీనాథం అనునిత్యం కొలిచే అమ్మవారు గౌరీనాథం చేత మరొకరితో సప్తపది నడిచిన హేమతో సాంగత్యమనే అపచారాన్ని చెయ్యనీయకుండా హేమలో తనే దర్శనమిచ్చిందని అనుకోవచ్చు.

ఇవేం కాకుండా హేమ తనని మనస్సులేని వివాహం చేసుకుందని గౌరీనాథానికి ఎందుకో అనిపించి హేమ దేవతలా కనిపించిందని కూడా అనుకోవచ్చు.



ఏది ఏమైనా మాంగల్యం కన్న మనస్సు ముఖ్యం అని మాంగల్యానికి మరో ముడి చిత్రంలోనే చెప్పిన విశ్వనాథ్ ఈ చిత్రంలో ఆ విషయాన్ని మరింత విపులంగా వివరంగా విశదీకరించారు.

ఒక నాట్యాచార్యుణ్ణి వివాహం చేసుకుందన్న కారణంగా తన కూతురుని వెలివేసినట్లు ఇంటికి రానియ్యడు యాజులు. ఆ యాజులే కుల వ్యవస్థనీ, వివాహ వ్యవస్థనీ ఎదిరించి తన కూతురు కూతురిని మనసుకి నచ్చిన వాడితో పంపిస్తాడు. యాజులి ప్రవర్తనలో పరివర్తనని ప్రత్యేకంగా ప్రదర్శించి చిత్రానికి సరైన కావ్య న్యాయంగా చిరస్మరణీయం చేసారు విశ్వనాథ్.

సోమయాజులు యాజులుగా, రమణమూర్తి ఆయన పుత్రుడు అవధానిగా, రవికాంత్ ఆయన మనవడు గౌరీనాథంగా వంశానుగుణంగా వస్తున్న ఆచారానికీ, ఆరాధనకీ ప్రతీకలులా నిలిచారు. నిత్యారాధనతో గొప్ప వర్ఛస్సుతో వెలిగిపోతున్న వాళ్ళు ముగ్గురూ కలిసి జాతవేదసే అని పాడుతోంటే ఒళ్ళు జలదరిస్తుంది. వారి గానానికి అనుగుణంగా సబిత ఆలయంలో చేసిన నాట్యాభినయంతో మనస్సు పులకిస్తుంది.

ఆ సన్నివేశం చూస్తోంటే - గుడిగంటల నాదం, అగరొత్తుల ధూమం, పువ్వుల పరిమళం, దీపాల కాంతీ నిండిన గర్భాలయంలో నిల్చున్న అనుభూతి కలుగుతుంది.

యాజులు-రాజుల సాన్నిహిత్యాన్ని చక్కగా మలచారు. శంకరాభరణంలోని స్నేహాన్ని సోమయాజులు-అల్లు సప్తపదిలో కొనసాగించినట్లే ఉంటుంది.

పురోగమన కథాంశం, ఆ కథాంశాన్ని హృద్యంగా చిత్రీకరించిన కథనం వల్ల ఈ చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ ఆదర్శ చిత్రంగా భారత ప్రభుత్వ గుర్తింపును పొందింది.

# శుభలేఖ

కన్యాశుల్కం అనే దురాచారం పై ధ్వజమెత్తుతూ గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగునాట చాలా ప్రసిద్ధం. అంత తీవ్రమైన సాంఘిక సమస్యని తూర్పార పట్టడానికి గురజాడ ఎన్నుకున్న శైలి వ్యంగ్యాత్మకమైన హాస్యం. ఆ నాటకాన్ని తెలుగులో చలనచిత్రంగా కూడా తీసారు.




అలాగే కాళ్ళకూరి నారాయణరావు రచించిన వరవిక్రయం నాటకం కూడా హాస్య ధోరణిలో సాగుతుంది. నాటకం ఉద్దేశం వరకట్నం మీద తిరుగుబాటు. ఈ నాటకానికి కూడా బహుళ ప్రజాదరణ లభించింది. ఈ నాటకాన్ని తెలుగు టాకీల తొలి దశకంలోనే చిత్రంగా రూపొందించారు.

టూకీగా వరవిక్రయం కథ. లింగరాజు సింగరాజు అనే పిసినిగొట్టు వడ్డీ వ్యాపారి కొడుకు బసవరాజుతో తన పెద్ద కూతురు కాళింది పెళ్ళి చెయ్యడానికి అప్పు చేసి కట్నం ఇస్తాడు పురుషోత్తమరావు పంతులు. ఆ వివాహం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకుంటుంది కాళింది. లింగరాజు కట్నం ధనం వెనక్కి ఇవ్వడానికి నిరాకరిస్తాడు. పెళ్ళిళ్ళ పేరయ్య సలహాతో తమ రెండవ అమ్మాయి కమల వివాహం బసవరాజుతో చెయ్యడానికి అంగీకరిస్తారు పురుషోత్తమరావు దంపతులు.

పెళ్ళి శుభలేఖలో సామాన్యంగా వధువుని వరుడికి ఇచ్చి వివాహం చేస్తున్నట్లు రాయిస్తారు. కమల తన శుభలేఖలో బసవరాజుని కమలకి ఇచ్చి వివాహం చేస్తున్నట్లు రాయిస్తుంది. వివాహం ఐన వెంటనే బసవరాజుని తను కట్నం ఇచ్చి కొనుక్కున్నందువల్ల బసవరాజే తన ఇంటికి రావాలని పట్టు పడుతుంది కమల. న్యాయస్థానంలో కూడా శుభలేఖని చూపించి బసవరాజుని తనకి ఇచ్చి పెళ్ళి చేసారని వాదిస్తుంది. వాదించి గెలుస్తుంది.

వరకట్న దురాచారాన్ని దుయ్యార పెట్టడానికి రాసిన తన నాటకానికి కాళ్ళకూరి వరవిక్రయం అని పేరు పెట్టడమే గొప్ప ఆలోచన. అమ్ముడు బోయే అల్లుళ్ళు అందరికీ ఇది చెప్పుదెబ్బ.

చిత్రం ఏమిటంటే ఈ నాటకాన్ని నారాయణరావు 1923 లో రాస్తే, తొలిసారి చలనచిత్రంగా 1939 లో నిర్మించారు. అప్పటికి ఇంకా వరకట్నం ఆంధ్రదేశంలో అమ్మాయిలని బలితీసుకుంటూ ఉండి ఉంటుంది. అమ్మాయిలని కన్న తల్లితండ్రులని అప్పులలో, అవమానాలలో ముంచుతూ ఉండి ఉంటుంది.



1982 లో విశ్వనాథ్ గారి శుభలేఖ చిత్రం కూడా వరకట్నం మీదే. అంటే వరవిక్రయం నాటకం రాసిన అరవై యేళ్ళ కి కూడా వరకట్నం సమసి పోలేదనే కదా! సాంఘిక దురాచారాలు రూపు మాపడానికి ఎందరో ఎన్నోసార్లు నడుం బిగిస్తూనే ఉండాలి. కులాల మీదా, అస్పృశ్యత మీదా, వివాహ వ్యవస్థ మీదా సమాజ శ్రేయస్సు ధ్యేయంగా తీసినట్లే విశ్వనాథ్ వరకట్నం మీదా చిత్రం తీసారు.

శుభలేఖ చిత్రం వరవిక్రయం నాటకానికి దగ్గరగా ఉంటుంది. శుభలేఖలో పాత్రలకి కూడా వరవిక్రయం పాత్రలతో పోలిక ఉంటుంది.

| | | |
|---|---|---|
| ఆదిశేషయ్య | - | లింగరాజు సింగరాజు |
| జగన్నాథం | - | పురుషోత్తమరావు పంతులు |
| గుర్నాథం | - | వెంగళప్ప |
| మోహన్ / మురళి | - | బసవరాజు |
| సుజాత | - | కాళింది |
| లక్ష్మి | - | కమల |

వరవిక్రయంతో పోలిస్తే శుభలేఖలో వ్యత్యాసాలూ, ప్రత్యేకతలూ -

వరవిక్రయంలో అక్క కాళింది ఆత్మహత్య చేసుకుంటుంది. ఐతే శుభలేఖలో అక్క సుజాత కట్నం అడుగుతున్న ఆదిశేషయ్యని నిలదీస్తుంది. కట్నంతో అయ్యే పెళ్ళి తనకి వద్దంటుంది. తన మీద అపనింద కారణంగా తల్లితండ్రులనీ, ఇంటినీ వదిలి వెళ్ళిపోతుంది. ఇది కాలంతో వచ్చిన పెద్ద మార్పు. ఆడవారు చదువుతో, ఉద్యోగంతో తమ కాళ్ళ మీద తాము నిలబడగలుగుతున్నారు. వాళ్ళ లో నిరాశ కన్న ఎక్కువగా ధైర్యం కనిపిస్తుంది. సుజాత స్వతంత్ర నారీలోకానికి ప్రతినిధి.

వరవిక్రయం నాటకంలో లేని ముఖ్యపాత్ర నరసింహమూర్తి. చదువు సక్రమంగా సాగకపోయినా హోటల్లో సర్వరుగా పని చేస్తూ తన కాళ్ళ మీద తను నిలపడుతాడు. ఏ పని చేసినా న్యాయంగా చేస్తే తప్పే లేదని ఖచ్చితంగా చెప్పగలిగిన వాడు. సంగీతంలో, నాట్యంలో పరిణితి సాధించిన వాడు. పరోపకారానికి వెనుదియ్యని వాడు. మార్పు తీసుకు రాగలిగిన కొత్త తరానికి ప్రతినిధి.

సుజాత-మూర్తుల మధ్య సంభాషణలూ, సంఘటనలూ, సన్నివేశాలూ శుభలేఖ చిత్రాన్ని వరవిక్రయం నుండి పూర్తిగా వేరు చేస్తాయి. ఒకరి మీద ఒకరికి గౌరవం, ఇద్దరికీ వరకట్నం వంటి దురాచారాల నుండి సమాజాన్ని రక్షించాలన్న ఆలోచనలూ, ఒకరికి ఒకరు సహాయం చేసుకోవడం - సుజాత మూర్తులను దగ్గర చేస్తాయి. వారి వివాహానికి దారి తీస్తాయి.

జగన్నాథం రెండో కూతురు లక్ష్మి ఆదిశేషయ్యని మార్చడానికి వరవిక్రయంలో కమల ఆడిన శుభలేఖ నాటకం ఆడుతుంది. ఐతే లక్ష్మి అక్క నిరాకరించిన ఆదిశేషయ్య పెద్ద కొడుకు మోహన్ని కాకుండా రెండో కొడుకు మురళిని ప్రేమిస్తుంది. పెళ్ళి చేసుకుంటుంది.

వధువుని వరుడికి ఇచ్చి వివాహం చేయిస్తున్నారన్న మాటని మార్చి, మురళిని లక్ష్మికి ఇచ్చి వివాహం చేస్తున్నారన్న శుభలేఖ వరవిక్రయం నాటకంలోని ఆలోచనే.

కథలో ఇంత సామీప్యం ఉన్నా కథనంలో శుభలేఖకీ వరవిక్రయానికీ సంబంధం లేదు. అసలు చిత్రానికి కీలకమైన మూర్తి పాత్ర నాటకంలో లేదు. అంతకు మించి సుజాతా మూర్తుల నడుమ నడిచిన రమణీయ ప్రేమ కథ నాటకంలో లేదు. అది ఈ చిత్రానికి పెద్ద హైలైట్.

చిరంజీవి చిత్రంలో కూచిపూడి, కథాకళి, కథక్ నృత్యాలు శాస్త్రీయ రీతిలో చాలా బాగా చేసారు. రాగాలతో సంభాషణలు చెయ్యడం, సంభాషణలలో అనురాగం చూపడం ఈ చిత్రంలో చిరంజీవి ప్రత్యేకత.

అసలే సున్నితంగా, నాజూకుగా, అందంగా ఉండే సుమలత సులోచనాలతో, చిరుదరహాసంతో, చీరకట్టులో ఇంకా ఎంతో అందంగా కనించారు. తన అభినయంతో సుమలత సుజాత ఐపోయారు. చిత్రమంతా సాత్వికమైన మొహంతో, మృదువైన వాక్కుతో ఉండే సుమలత సందర్భానుసారం అవసరమైన ఆగ్రహం, గాంభీర్యం, బాధా చాలా చక్కగా ప్రదర్శించారు.

చిత్రం పేరునే తన ఇంటి పేరు చేసుకున్న సుధాకర్ నటన తొలి చిత్రంలోనే ఆకట్టుకుంది. ఐ లవ్ హర్ అని అనడంలో చాలా ఈజ్ ఉంటుంది. తండ్రితో ఆత్మహత్య చేసుకుంటానంటున్న బెదరింపు సన్నివేశాలని అద్భుతంగా పండించారు.

సుధాకర్ తండ్రిగా సత్యనారాయణ విభిన్నమైన హాస్యాన్ని అందించారు. వరవిక్రయంలో లోభ గుణం వల్ల లింగరాజు పాత్రలో హాస్యం కనిపిస్తుంది. ఆదిశేషయ్య పాత్రలో తన ప్రత్యేకమైన సంభాషణా చాతుర్యంతో సత్యనారాయణ నవ్వులు పూయించారు. సత్యనారాయణకి తోడుగా రాళ్ళ పల్లి సరిగ్గా జత కుదిరారు.

చిత్రంలో ఎక్కువ సేపు కనిపించకపోయినా కనిపించినంత సేపూ అలవోకగా నటించారు తులసి. శంకరాభరణంలో శంకరంగా నటించిన మూడేళ్ళ కి తులసిలో పూర్ణ పరివర్తన కలిగింది. పదహారేళ్ళ అల్లరి పిల్లగా, మావగారిని ముప్పుతిప్పలు పెట్టిన గడుగ్గాయిగా తులసి నటన అభినందనీయం.

చిత్రం చివర సీన్లలో చిత్రం ప్రధానాంశమైన కట్నం గురించి చెప్పడానికి లాయర్ పాత్రకి తన చిరకాల సహ కళాకారుడు అల్లు రామలింగయ్యని ఎంచుకున్నారు విశ్వనాథ్. హాస్యరసం ఒక్కటే కాక, మరెన్నో రసాలు చక్కగా అభినయించగల అల్లు వరకట్నం కోరుకునే వారికి రాబోయే మార్పుల గురించి స్పష్టంగా వివరిస్తారు.

చిత్రమంతా ఒక్కటే అంశం. వరకట్నం వల్ల స్త్రీ జాతి పడే కష్టాలూ, బాధలూ. ఆ అంశాన్ని అతి సున్నితంగా చిత్రీకరించారు విశ్వనాథ్.



# స్వాతి ముత్యం

తన కథ చెప్పమని అడిగిన మనవరాలితో -

నాకంటూ వేరే కథ లేదు, మీ నానమ్మ కథే నా కథ
- అని అంటాడు శివయ్య స్వాతిముత్యం చిత్రం ప్రారంభంలోనే.

స్వాతి ముత్యం చిత్రానికి ఆయువుపట్టు మాటలు. విశ్వనాథ్ గారి చిత్రాలకి మంచి సంభాషణలు రాసిచ్చే తోటపల్లి సాయినాథ్ స్వాతిముత్యం చిత్రానికి మాటల రచయిత. ఒక చిత్ర గమనానికి మాటలు ఎంత దోహదం చేస్తాయో తెలుసుకుందుకు స్వాతిముత్యం చిత్రం ఒక ఉదాహరణ.




అందుకే ఈ చిత్రాన్ని నేను పది సంభాషణల ద్వారా పునర్దర్శిస్తున్నాను. అందులో మొదటి సంభాషణ శివయ్య కథ రాద్దామనుకుంటున్న మనవరాలితో శివయ్య చెప్పిన పై మాటలు.

అక్కడ నుండి విశ్వనాథ్ తనకెంతో ఇష్టమైన, తనదైన శైలిగా స్వీకరించిన, తను అద్భుతంగా అమలు చేస్తున్న ఫ్లాష్ బాక్ విధానంలో నానమ్మ లలిత కథని ఆరంభిస్తారు.

లలిత ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్తని కోల్పోతుంది. అత్తింట ఆదరణ దొరకదు. పుట్టింట వదిన ఆరడులు. పిల్లాడితో కష్టాలు పడుతూ ఉంటుంది.

చిన్న తనంలో జరిగిన ప్రమాదంలో మెదడుకి దెబ్బ తగలడంతో అమాయకుడిలా ఉండిపోతాడు శివయ్య. లలిత కష్టాలు తీరడానికి శివయ్య ఆలయం మెట్లు కడుగుతాడు. నిప్పుల్లో నడుస్తాడు.

శివయ్య కాళ్ళ గాయానికి వైద్యం చెయ్యడానికి వచ్చిన డాక్టర్ తన మనవణ్ణి చూసి బాధ పడుతున్న శివయ్య నాయనమ్మతో -

ఏ ప్రతిఫలం ఆశించకుండా పరోపకారం చెయ్యాలంటే ఎంతో దీక్ష ఉండాలి.
సాధన చెయ్యాలి
వాడు దుమ్మూ ధూళీ అంటని స్వాతిముత్యం. యోగి. మహాజ్ఞాని

- అని శివయ్య గురించి చెప్తాడు. చిత్రమంతా శివయ్యకి ఈ మాటలే అన్వయిస్తాయి. మెదడుకి ఉన్న చిన్న లోపానికి బదులుగా పెద్ద హృదయం ఉంటుంది శివయ్యకి. అందుకే లలిత కష్టాలు తీరాలంటే -

గజేంద్రుణ్ణి రక్షించడానికి ఆ విష్ణుమూర్తి తరలి వచ్చాడు చూడు
అలాగే లలితమ్మని ఈ ఊబిలోంచి బయటకి లాగడానికి
ఎవరో మహానుభావుడు ముందుకు రావాలి.
ధైర్యంగా మెళ్ళో తాళి కట్టాలి

– అని నాయనమ్మ అన్న మాటలకి శివయ్య అమాయకత్వం, మనోవైశాల్యం కలిసిపోయి అతనిచేత గుళ్ళో సీతారాముల కళ్యాణానికి సిద్ధం చేసుకుంటున్న తాళిని లలిత మెళ్ళో కట్టేలా చేస్తాయి.

అలాంటి సన్నివేశాన్ని తియ్యడానికి విశ్వనాథ్ గారికి ఎంత ధైర్యం, ఎంత తెగింపు కావాలో!

పెళ్ళై ఇంటికి వచ్చిన లలితనీ శివయ్యనీ ఆనందంగా ఆహ్వానిస్తుంది నాయనమ్మ. అంతే కాదు. లలితతో –

వదలకమ్మా, అలాగే ఆ చెయ్యి పట్టుకునే అన్నీ నేనే ఐ ఇన్నాళ్ళూ నడిపించాను.
నా చెయ్యి పట్టు తప్పే సమయానికి భగవంతుడు నిన్ను పంపించాడు

– అని శివయ్యని లలితకి అప్పగించి తను ఆఖరి శ్వాస తీస్తుంది.

తన నాయనమ్మ చనిపోయినందుకు విలపిస్తున్న తన మరదలుతో –
చిట్టీ ఆకలేస్తోంది అన్నం పెట్టవా
– అని అడుగుతాడు శివయ్య. శివయ్య అమాయకత్వాన్ని చూపించడానికి సాయినాథ్ రాసిన ఈ చిన్ని సంభాషణ చాలు.

నాయనమ్మ మరణంతో శివయ్య బాధ్యతని లలిత తీసుకుంటుంది.

లలిత కష్టపడకుండా తను సంపాదించి లలితని సుఖపెట్టాలన్న మంచి ఆలోచనతో శివయ్య పిల్లవాడిచేత భిక్షం ఎత్తుకునేలా చేస్తాడు. అదంతా ఇంటి యజమాని పన్నిన పన్నాగమని కూడా తెలియని మంచితనం శివయ్యది.

తనూ, పిల్లవాడూ ఇంట్లో లేని సమయంలో లలితతో దుర్మార్గంగా ప్రవర్తించిన ఇంటి యజమానిని చితక్కొడతాడు శివయ్య. ఆస్పత్రిలో శివయ్య కొట్టాడని చెప్తే గొడవ అవుతుందని లలిత యజమాని మెట్ల మీదనుండి పడ్డాడని సర్దిచెప్తుంది. లలితకి అడ్డొస్తూ నేనే కొట్టానని చెప్తున్న శివయ్య నోరు మూసేస్తుంది లలిత. ఆ రాత్రి పడుకునే ముందు శివయ్య లలితతో –

తెల్లారే లోపల నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో చెప్పే సెయ్యండి, అంతే
– అని అడిగి పడుకుంటాడు.

ఎంత స్వచ్ఛమైన మనస్సో శివయ్యది, ఎంత నిర్మలమైన మనిషో శివయ్య అని చెప్పడానికి ఇంత కన్న వేరే ఋజువేం కావాలి?

అర్థ రాత్రి పిల్లవాడి పక్క నుండి లేచి వచ్చి లలిత పక్కన పడుకున్న శివయ్యని ఏంటీ ఇక్కడకి వచ్చి పడుకున్నారు అని

అడుగుతుంది లలిత. అందుకు బదులుగా నిజం చెప్పాలా అబద్ధం చెప్పాలా అని అడుగుతాడు శివయ్య. నిజమే చెప్పమంటుంది లలిత. నిద్రలోనే మత్తుగా –

బాబు పక్కంతా తడిపేసాడు, అందుకని, ఇక్కడ
– అని సమాధానం చెప్తాడు శివయ్య.

తన భర్త అర్ధరాత్రి తన పక్కమీదకి వచ్చి పడుకుని బాబు పక్క తడిపి వెయ్యడం వల్ల వచ్చానని చెప్పినప్పుడు లలిత శివయ్యని చూసిన చూపుల్లో ఎన్ని అర్థాలో కనిపిస్తాయి. అందులో ఆశ్చర్యం, ఆశాభంగం, అభిమానం, ఆనందం అన్నీ చూపిస్తారు లలిత పాత్రధారిణి రాధిక తనకి మాత్రమే సాధ్యమైన రీతిలో.

తనకి తెలిసిన సంగీతం పాఠాలు చెప్పి ఇంటిని నడుపుకొస్తూ ఉంటుంది లలిత.

శివయ్యకి ఉద్యోగం చెయ్యమని చెప్పడానికి చాకలి సుబ్బులు తన భర్త ఉద్యోగం చెయ్యకపోవడం వల్ల తను బాధ పడతున్నట్లు నటిస్తుంది. సుబ్బులు మాటలకి స్పందిస్తూ –

నేను కూడా ఏమీ చెయ్యకుండా కూచునుంటే లలితమ్మ నీలాగే బాధ పడుతుందా?
– అని అడుగుతాడు శివయ్య. పెద్దింటి పిల్లైన లలితమ్మ ఇంకా ఎక్కువ బాధ పడుతుందని చెప్తుంది సుబ్బులు.

శివయ్య అప్పటి నుండి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ ఉంటాడు. శివయ్య ఉద్యోగం ఏం చెయ్యగలడని లలిత సందేహపడితే చాకలి సుబ్బులు –

> అప్పుడే పుట్టిన లేగదూడని ఏట్లో పారేస్తే ఈదుకుంటూ బయటకి రాదా?
> ఈత దానికి ఎవరు నేర్పారని? అలాగే శివయ్య బాబు కూడా నెగ్గుకొస్తాడు

– అని లలితకి ధైర్యం చెప్తుంది, చాలా పనులు సహజంగా వచ్చేస్తాయన్న జీవితసత్యం చెప్తున్నట్లు.

సుబ్బులు అన్నట్లుగానే శివయ్య ఉద్యోగం సాధిస్తాడు. అలా సాధించడానికి లలిత గురువుగారిని నా ఉద్యోగం అంటూ ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ సాధిస్తాడు.

తన మొదటి జీతంతో లలితకి కొత్త చీర కొని తీసుకొస్తాడు. అది కట్టుకోడానికి లలిత సందేహిస్తుంది. అప్పుడు సుబ్బులు లలితతో –

> ఇంకా ఏమిటమ్మా ఆలోచన? శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు.

సీతమ్మ వారి తాళిబొట్టు ఈ శ్రీరాముడు నీ మెళ్ళో కట్టాడంటే
ఆ దేవుడు చేసిన తప్పుని దిద్దుకుని మళ్ళీ నీకో బతుకిచ్చాడన్న మాట.
పద, చక్కగా పండించుకోమ్మా

– అని లలితకి శివయ్య తెచ్చిన కొత్త చీర కట్టి బాబుని తనతో తీసికెళ్ళిపోతుంది లలితకీ, శివయ్యకీ ఆరాత్రి ఏకాంతం ఇవ్వడానికి.

అప్పుడు వచ్చే మనసు పలికే అన్న మధురమైన పాటతో లలిత శివయ్యకి శృంగార పాఠాలు నేర్పుతుంది. ఆ సన్నివేశం సాంతం సౌందర్య భరితం.

ఆ తరవాత వాళ్ళిద్దరూ పిల్లా పాపలతో సంసారం సాగిస్తారు.

ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన విశేషాలు –

ఆస్కార్ అవార్డుకి దేశం నుండి అఫీషియల్ ఎంట్రీగా వెళ్ళి న ఒకే ఒక్క తెలుగు చిత్రం స్వాతిముత్యం.

చిత్రంలో లలితా శివయ్యల సంసారం సజావుగా సాగేందుకు ఇవ్వవలసిన సలహాలు అన్నింటినీ చాకలి సుబ్బులు చేత ఇప్పించారు విశ్వనాథ్.

కమల్ రాధికల నటనకి ఒకే ఒక్క మాట – అత్యద్భుతం.

విచిత్రమేమిటంటే విశ్వనాథ్ గారి చిత్రాలలో అల్లు రామలింగయ్య నటించకపోవడం అరుదు. అందుకేనేమో ఆయనకి బదులుగా ఆయన మనవడు అల్లు అర్జున్ కమల్ మనవడుగా కనిపిస్తారు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో తరచుగా కనిపించే కాంతారావు ఈ చిత్రంలో కనిపించపోయినా ఆయన మనవడు కార్తిక్ ఈ చిత్రంలో రాధిక కొడుకు బాలసుబ్రహ్మణ్యంలా నటించారు.



# సిరివెన్నెల

ఒక రైలు చుక్ చుక్ మంటూ నడుస్తూ ఉంటుంది. ప్రకృతి అందంగా వెనక్కి పరుగులు తీస్తూ ఉంటుంది. ఒక పెట్టెలో కూచున్న ఒక యువకుడు కిటికీ లోంచి బయటకి చూస్తూ ఉంటాడు. వెనక సన్నగా వేణుగానం వినిపిస్తూంటుంది. అతను వేళ్ళ తో కిటికీ మీద తాళం వేస్తూ ఉంటాడు.




అతని ఎదురుగా కూచున్న ఒకమ్మాయి పేపర్ చదువుతూ ఉంటుంది. పేపర్లో ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు హరిప్రసాద్ కార్యక్రమం ప్రకటన కనిపిస్తుంది. ఆ ప్రకటనలో ఉన్న హరిప్రసాదే తన ఎదురుగా ఉన్న యువకుడని గ్రహిస్తుంది.

ఆ ప్రకటన కింద మీ ఆటో గ్రాఫ్ ఇవ్వండి అని రాసి అతని పక్కన పేపరూ, పెన్నూ పెడుతుంది. అతను పక్కకి తిరుగుతూండగా పేపరూ, పెన్నూ కింద పడిపోతాయి.

ఆ అమ్మాయి అన్నయ్య వచ్చి ఆ పేపరూ, పెన్నూ తీసి ఆ యువకుడితో మా చెల్లెలు మీ ఆటో గ్రాఫ్ అడుగుతోంది అని చెప్తాడు. ఆ యువకుడు తనే అడగవచ్చు కదా అంటే అన్నయ్య మా చెల్లెలు మూగది అని చెప్తాడు.

అప్పుడే ఆ యువకుడు ఆ పేపర్ని అందుకోబోతూ తడబడతాడు. అతనికి కళ్ళు కనపడవని ఆ అమ్మాయికీ, అన్నయ్యకీ అర్థం అవుతుంది.

ఇదీ సిరివెన్నెల చిత్రంలో మొట్ట మొదటి సన్నివేశం.

కథా నాయకుడు హరిప్రసాద్ కి చూపు లేదు. కథా నాయిక సుభాషిణికి మాట లేదు. వారిద్దరి మధ్య ప్రేమని ఊహించారు విశ్వనాథ్.

హరిప్రసాద్ గాన, వేణుగాన విద్వాంసుడు. సుభాషిణి కవయిత్రి, చిత్రకారిణి, శిల్పి. అతని గానం ఆమె వినగలదు. ఆమె శిల్పాన్ని అతను స్పృశించగలదు. వారిద్దరి మధ్య పరస్పర కళాభిమానం సృష్టించారు విశ్వనాథ్.





కళ్ళు లేని హరిప్రసాద్ గొప్ప సంగీత విద్వాంసుడు అవడానికి వెనక ఉన్న బలమైన శక్తి జ్యోతిర్మయి. హరిప్రసాద్ సంగీతం నేర్చుకున్నది కాదు. స్వయంగా అబ్బినది. అది అతను ప్రకృతిలో విన్న శబ్దాల నుండి పుట్టినది.

హరిప్రసాద్ ప్రకృతిని కళ్ళతో చూడలేదు. జ్యోతిర్మయే తన శరీర స్పర్శతో హరిప్రసాద్ మనస్సుకి ప్రకృతిని చూడడం నేర్పిస్తుంది. సూర్యోదయం, ఆకాశం, మెరుపులూ, ఉరుములూ, చినుకులూ, పక్షులూ, నెమళ్ళూ , ఆఖరికి హరివిల్లుని కూడా అతి నిర్మలమైన మనస్సుతో ఏ విధమైన కల్మషం లేకుండా తన అవయవ స్పర్శతో, ముద్దులతో, కౌగిళ్ళతో హరిప్రసాద్ మనస్సుకి జ్యోతిర్మయి నేర్పిస్తుంది. ఆ సన్నివేశాలు తెలుగు చలనచిత్ర చరిత్రలో అత్యుత్తమ స్థాయిలో ఊహించి చిత్రీకరించబడినవి.

ఆమె శరీరం అతనిలో కామ వాంఛ కలిగించదు. ప్రేమకీ, కామానికీ అతీతమైన ఆప్యాయతా, ఆరాధనా నిండిపోతాయి హరిప్రసాద్ మనస్సులో జ్యోతిర్మయి పట్ల. అది ఎంత అమలినమైన భావమంటే నా శరీరం దక్కకపోతేనో, నన్ను పెళ్ళి చేసుకోకపోతేనో నువ్వు బాధ పడతావా అని జ్యోతిర్మయి అడిగితే నాకు కావల్సింది నీ మనసూ, నీ మనసులో స్థానం, అంతే అని హరిప్రసాద్ చెప్పగలిగేంత.

చిత్ర ప్రారంభ సన్నివేశం ఎంత అందంగా సుకుమారంగా ఉంటుందో, చిత్ర పతాక సన్నివేశం అంత అనూహ్యంగా, విషాదంగా ఉంటుంది.

తన గతంలో గడిపిన చెడు జీవితం దృష్ట్యా తను తనని ఆరాధించే హరిప్రసాద్ భార్య కాకూడదని నిశ్చయించుకున్న జ్యోతిర్మయి తనకి ఒక కళ్ళ డాక్టర్ తో వివాహం జరుగుతోందని చెప్తుంది. వివాహానికి పెళ్ళి కూతురిలా తయారౌతుంది.

తన అసలు ఉద్దేశం పెళ్ళి కూతురిలా చనిపోవడమే తప్ప, వివాహం కాదని సుభాషిణి పేర ఒక ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ ఉత్తరంలోనే హరిప్రసాద్ కి తన ఆత్మహత్య గురించి తెలియనివ్వవద్దనీ, తను పెళ్ళి చేసుకుని వెళ్ళి పోయినట్లే అతను అనుకోవాలనీ కోరుతుంది. అంతే కాకుండా తన కళ్ళ ని నేత్ర దానం చేస్తుంది.

జ్యోతిర్మయి కోరిక మన్నించడానికి సుభాషిణి తో పాటు అందరూ తమ దుఃఖాన్ని దిగమింగుకుని, జ్యోతిర్మయి పార్థివ దేహాన్ని, పెళ్ళి కూతురిని సాగనంపుతున్నట్లు సాగనంపుతారు. ఆస్పత్రిలో కళ్ళు ఇచ్చి ఆమె దేహాన్ని దహనం చేస్తారు.

అప్పుడు చెల్లెలితో నడుస్తూ నేనొకసారి శ్మశానానికి వెళ్ళి వస్తానమ్మా అని అంటాడు హరిప్రసాద్. ఆశ్చర్య పోతున్న చెల్లెలితో మనసుతో నాకు ప్రకృతిని చూసే శక్తినిచ్చిన జ్యోతి, ఆ ప్రకృతిలో తాను కలిసిపోయినప్పుడు నా మనసు తెలుసుకోలేదా అని అడుగుతాడు. అద్భుతమైన చిత్రానికి అత్యద్భుతమైన ముగింపు ఈ సన్నివేశం.

ఇంక ఈ చిత్రంలో ఎంత తలచుకున్నా తనివి తీరని విచిత్రాలని ఎన్నింటినో చూపించారు దర్శకులు. మచ్చుకి కొన్ని ప్రస్తావించుకుందాం మనం.



హరిప్రసాద్ వేణుగానంతో తన ఊరికి వచ్చే పర్యాటకులని అబ్బురపరిచి ధనం సంపాదిస్తూ ఉంటాడు. అతనికి ఎక్కడనుండో వేణువులు తెచ్చి ఇచ్చే రైలు డ్రైవరు ఒక క్రిస్టియన్. అతని పక్కన తబలా వాయించే గుర్రబ్బండి అబ్బాయి ముస్లిం. మతాలకతీతమైన అభిమానం వారి ముగ్గురిదీ.

చిత్ర నాయిక పేరు సుభాషిణి. ఐతే ఆమెకి మాటలు రావు.

ఆమె హరిప్రసాద్ బొమ్మ గియ్యడానికి వాడిన ప్రతీకలు - కళ్ళ కి సూర్యచంద్రులు, ముక్కుకి మురళి, నోటికి ఓంకారం. ఇంక నుదుటన జ్ఞానసేత్రం.

సుభాషిణి హరిని తనని వివాహమాడుతావా అని అడగడానికి వచ్చినప్పుడు హరి తన చెల్లెలిని సుభాషిణి అన్నయ్య వివాహమాడతాడా అని అడుగుతాడు.

జ్యోతిర్మయి రూపాన్ని చూడలేని హరి జ్యోతిర్మయి రూపురేఖలని సుభాషిణి రూపురేఖలని తాకుతూ వివరిస్తే సుభాషిణి జ్యోతిర్మయి శిల్పాన్ని తయారు చేస్తుంది.

ఆ శిల్పాన్ని నాలుగు గోడల మధ్యా కాకుండా ప్రకృతిలో ఉంచమంటాడు హరిప్రసాద్. తనకి జ్యోతిర్మయి ప్రకృతే అన్నట్లు.

జ్యోతిర్మయి సుభాషిణితో హరిప్రసాద్ ని పెళ్ళి చేసుకోమని చెప్తే హరిప్రసాద్ మనస్సులో నువ్వే ఉన్నావని చెప్తుంది సుభాషిణి.

ఆ మాటే హరిని అడుగుతుంది జ్యోతిర్మయి. అప్పుడు వారిద్దరి మధ్య సంభాషణ పాట రూపంలో నడుస్తుంది. వారిద్దరిలోనూ దాగున్న మనోభావాలనీ, ఒకరి మీద మరొకరికి ఉన్న ఆదరాభిమానాలనీ వేదాంతపరంగా రాయించుకుని చిత్రీకరించారు విశ్వనాథ్.

జ్యోతిర్మయి తను గతంలో గడిపిన జీవితాన్ని గుర్తు చేసుకుంటూ హరికి తను తగనని మథన పడుతుంది. ఆ అంతర్మథనంలోంచి తనేం చెయ్యాలో తీర్మానించుకుంటుంది.

జ్యోతిర్మయి ఆత్మహత్య చేసుకున్న సమయంలో అలా జరుగుతోందని తన ఆత్మకి తెలిసినట్లు హరి చేతులు కర్ర మీద బిగుసుకుంటాయి.

పెళ్ళి కూతురు అంటూ అందరూ బాధపడుతూ జ్యోతిర్మయి మృతదేహం పైన అక్షతలు వేస్తున్నా హరి వెయ్యడు.

వాటిని చివరగా జ్యోతిర్మయి చితిమీద చల్లుతాడు.

ఇలా తలచుకుంటే చిత్రంలో ప్రతి సన్నివేశాన్ని తలచుకోవాలి.





ఈ చిత్రంలో కూడా కొంత కథ విశ్వనాథ్ గారు తనకి ప్రియమైన ఫ్లాష్ బాక్ పద్ధతిలోనే నడిపిస్తారు.

సాగరసంగమం చిత్రంలో మాధవి పాత్రధారిణి జయప్రద బాలకృష్ణ పాత్రధారి కమల్ హాసన్ నాట్యకళని అభిమానించి అతని కళని లోకానికి పరిచయం చెయ్యాలని ప్రయత్నిస్తుంది. వారిద్దరి మధ్యా చిత్రంలో ఏ విధమైన శారీరక సంబంధం ఉండదు.

అలానే సిరివెన్నెల చిత్రంలో జ్యోతిర్మయి పాత్రధారిణి మున్ మున్ సేన్ హరిప్రసాద్ పాత్రధారి సర్వదమన్ బెనర్జీ సంగీత కళని అభిమానించి ఆ కళని అతనిలో మెరుగు పరిచి అతన్ని లోకం గుర్తించేలా చేస్తుంది. వీరిద్దరి మధ్య కూడా ఏ కోశానా కామ వాంఛ లేదు.

తన హీరోయిన్లని మూగ వారిగా నటింపచెయ్యడం విశ్వనాథ్ గారికి కొత్త కాదు. పదేళ్ళ కు ముందే సిరిసిరిమువ్వలో జయప్రద చేత చేయించుకున్నారు. పదేళ్ళ లో మూగ పాత్ర పోషింప చెయ్యడంలో ఆయన ఆలోచనల్లో కూడా మార్పు వచ్చిందేమో అనిపిస్తుంది ఆ రెండు చిత్రాలూ చూస్తోంటే.

ఈ చిత్రంలో సుహాసిని  మూగ పిల్లగా అత్యద్భుతంగా నటించారు. సిరివెన్నెల విడులైన 1986 లోనే సింధుభైరవిలో నటనకి సుహాసినికి ఉత్తమ నటిగా జాతీయ పురస్కారం లభించింది. నటన సుహాసినికి వంశ పారంపర్యంగా వస్తున్న కళ. ఈ చిత్రంలో విశ్వనాథ్ గారు సుహాసినికి తొడిగిన ఆభరణం కళ్ళ జోడు.

శంకరాభరణం చిత్రంలో పాము గద్ద బొమ్మ ప్రతీకలా ఈ చిత్రంలో వెన్నెల్లో బృందావనం ప్రస్తావన ఒక గొప్ప ప్రతీకగా అనిపిస్తుంది నాకు. కళ్ళు కనిపించని మీనా ఎన్నో సార్లు వెన్నెల్లో బృందావనం చూపించమని అడుగుతూ ఉంటుంది. చూపిస్తానని వాగ్దానం చేస్తాడు హరిప్రసాద్.

జ్యోతిర్మయి వచ్చాక హరిప్రసాద్ వేణువు వాయిస్తోంటే విని మీనా వెన్నెల్లో బృందావనం చూసానని అనుకుంటుంది.

జ్యోతిర్మయి పునరాగమనంతో హరిప్రసాద్ వెన్నెల్లో బృందావనం చూడగలిగాడు. చూపించగలిగాడు. అతని వేణువు ఆనందంతో పరవశించి బృందావన దర్శనం చేయించగలిగింది.

(సిరివెన్నెల చిత్రంతో తెలుగు సినీ వినీలాకాశంలో ప్రభవించిన కవిచంద్రుడు సీతారామశాస్త్రి. చిత్రం పేరునే ఇంటి పేరుగా మలచుకున్న సార్థకనాముడు. నా ఉచ్ఛ్వాసం కవనం అంటూ సినీ రంగ ప్రవేశం చేసిన వాడు.

సీతారామశాస్త్రి తన తొలిచిత్రం సిరివెన్నెలలోనే విశ్వనాథ్ గారు తనమీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా, ఆయన ఇచ్చిన స్వేచ్ఛను సంపూర్ణంగా వాడుకుంటూ, ఆయన కోరుకున్నట్లు భాషా, భావం భాసిల్లే పాటలు రాసారు. ఒక్కో పాట ఒక్కో రత్నం.



సంగీతాన్ని విధాత తలపున ప్రభవించిన అనాది జీవన వేదంతో పోలుస్తూ -

ప్రాగ్దిశ వీణియ పైనా దినకర మయూఖ తంత్రుల పైనా
జాగృత విహంగ సఖులే వినీల గగనపు వేదిక పైనా
పలికిన కిలకిల స్వనముల స్వరగతి జగతికి శ్రీకారము కాగా
విశ్వకావ్యమునకిది భాష్యముగా
- అని విశ్వమనే పెద్ద కాన్వాస్ మీద చిత్రాన్ని గీసారు.

అదే సీతారామశాస్త్రి స్వర్ణకమలం చిత్రంలో అందెల రవమిది పాట ద్వారా నాట్యాన్ని విశ్వవేదిక మీద అందమైన తైలవర్ణ చిత్రంగా ఆవిష్కరించారు)

# స్వాతికిరణం

విశ్వనాథ్ గారు సృష్టించిన పాత్రలన్నింటిలోనూ అతి క్లిష్టమైనదీ, సంక్లిష్టమైనదీ స్వాతికిరణం చిత్రంలో అనంతరామశర్మ పాత్ర. శర్మ అందరి మన్ననలూ అందుకుంటున్న సంగీత విద్వాంసుడు. సద్గుణ సంపన్నుడుగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నవాడు.

ఇదంతా గంగాధరం అనే బాలగంధర్వుడు ఆయన దగ్గర శిష్యరికానికి ఆయన సహధర్మచారిణి శారద చేత రప్పింపబడడానికి పూర్వం. గంగాధరం సంగీత ప్రతిభ శర్మలో ఇష్టానికి బదులు ఈర్ష్యని కలిగిస్తుంది.

అరిషడ్వర్గాలు సర్వనాశకాలని సనాతన ధర్మం చెప్తూనే ఉంది. అవి ఉన్న వారినే కాక వారి పక్కన ఉన్న వారిని కూడా దహించివేస్తాయి అని వివరిస్తుంది. ఆధునిక మానసిక శాస్త్రం కూడా వాటి నుండి ఎంత నష్టపోతామో స్పష్టంగా చెప్తూనే ఉంది.

శారీరక అనారోగ్యం అందరికీ కనిపిస్తుంది. అలాగే రోగికి కూడా. అరిషడ్వర్గాల పీడ అనుభవిస్తున్న మనిషికే అర్థం కాదు. ఇంక ఆ వ్యక్తి పక్కవారికి తెలియడం దాదాపు అసంభవం.




అరిషడ్వర్గాలు అన్నింటిలోనూ ఈర్ష్య ప్రమాదకరమైనది. కామక్రోధాదులని కొంచెమైనా గుర్తించవచ్చు. ఈర్ష్యని గుర్తించడం చాలా చాలా కష్టం. గుర్తించినా అందులోంచి బయటపడడం మరీ కష్టం.

గంగాధరం రాకతో శర్మని ఆవహించిన ఈర్ష్యని అతనితో అన్నేళ్ళు కాపురం చేసిన శారద కూడా గుర్తించలేకపోయింది. శర్మ మొహంలో కానీ, మాటలో కానీ అతని మనస్సులో రగులుతున్న మాత్సర్యం అణువంత కూడా కనిపించదు.

ఈ చిత్రంలో అతి ముఖ్యమైన పాత్ర శర్మ కాదు, శారద కాదు, గంగాధరం కూడా కాదు. అది ఈర్ష్య.

కొందరికి ఈర్ష్య పుట్టుకతోనే ఉంటుంది. దుర్యోధనుడు ఆ కోవకి చెందినవాడే. పాండవుల మీద ఈర్ష్యతో అతను బాల్యం నుండి బాధ పడ్డాడు. బాధ పెట్టాడు. చివరికి మహాసంగ్రామానికీ, మారణహోమానికీ అందరినీ నడిపించాడు.

కొందరికి పరిస్థితుల ప్రభావంతో పుడుతుంది. ఐతే అది పుట్టడానికి కూడా ఆ మనిషిలో ఏదో ఒక గుణం ఉండాలి. మాత్సర్యం పుట్టడానికి మూలం మదం. మదం అంటే అహంకారం. నేను గొప్ప అన్న భావం చాలా మందికి సహజంగా ఉన్నదే. ఐతే అది నేనే గొప్ప అన్న స్థాయికి చేరితే అది మదం అవుతుంది. అది మాత్సర్యానికి దారి తీస్తుంది.

శర్మలో తాను గొప్ప సంగీత విద్వాంసుడిననీ, తనకు మించిన వారెవ్వరూ లేరనీ, అసలు ఉండనేకూడదన్న ఆలోచనా విషబీజాలు ముందు నుండే ఉన్నాయి. ఆ బీజాలని పోషించి పెద్ద చేసారు ఆయన అభిమానులు. అది వారు తెలిసి చెయ్యకపోయినా వారి పోషణ వల్ల మొక్కలుగా, మానులుగా శర్మలో పెరిగాయి.

ఈర్ష్య అనే పూర్తి వ్యతిరేక భావంతో చిత్రాన్ని తియ్యాలన్న ఆలోచన సామాన్యం కాదు. అలా తియ్యడం వల్ల చిత్రమంతా కథానాయకుడి చెడు ఆలోచలనలపైనే కేంద్రీకృతమవుతుంది. అది ప్రేక్షకులు ఎంత వరకూ అంగీకరించ గలుగుతారో తెలియదు.

విశ్వనాథ్ గారు అంతకు ముందు తీసిన శంకరాభరణం, సాగరసంగమం, శ్రుతిలయలు, స్వర్ణకమలం చిత్రాలలో శిష్యులని దగ్గరకి తీసుకుని వారి ద్వారా సంగీత నాట్య పరంపరని కొనసాగించడానికి ప్రయత్నం చేస్తారు గురువులు. ఆ చిత్రాలలో శిష్యులలో లోపాలూ, గురువుల మీద చిరుకోపాలూ ఉన్నాయేమో కానీ గురువులకు శిష్యులంటే ప్రేమా, అభిమానం. శిష్యులు ఎదుగుతోంటే చూసి ఆనందిస్తారు.

ఆ చిత్రాలకి పూర్తి వ్యతిరేకం స్వాతికిరణం. సంగీతంలో ఎంతో పేరున్న శర్మ తన కన్న వయస్సులో చాలా చిన్నవాడైన గంగాధరాన్ని చూసి అసూయ పడడం పూర్తిగా కొత్త కథాంశం. సినిమాని మూసపద్ధతిలోనే చూసే వారు ఆ ఆలోచనని అంగీకరించడం అంత సులభం కాదు. ఆమోదించడానికి కష్టమైన అసూయ ప్రధానాంశంగా అద్భుతమైన చిత్రాన్ని తీసారు విశ్వనాథ్.

ఈ చిత్రాన్ని విశ్వనాథ్ తనకి ఎంతో ఇష్టమైన తానెంతో పరిపక్వత సాధించిన ఫ్లాష్ బాక్ పద్ధతిలోనే తీసారు. చిత్రం మొదలు శర్మ మానసిక స్థిరత్వం పోగొట్టుకొని ఎదురుగా గంగాధరాన్ని ఊహించుకుంటూ ఉంటాడు. ఎవరీయన, చిన్నపిల్లాడిని ఈయన ఏం చేసి ఉంటాడు అని ప్రేక్షకులకి కుతూహలం కలుగుతుంది.

అప్పుడు గతాన్ని చూపిస్తారు.

సంగీత సామ్రాట్టు అనంతరామశర్మ భార్య శారద. పిల్లలు లేని శారద బాగా పాడుతున్న గంగాధరాన్ని స్వంత పిల్లాడిలా చూసుకుంటూ ఉంటుంది. ఐతే గంగాధరం గాన కౌశలానికి శర్మ అసూయ పడతాడు. అది ద్వేషంగా మారుతుంది. ఆ ద్వేషం ఎంత వరకూ అంటే –

అందుకే వాడికి ఇంత విషం ఇచ్చి చంపేసి ఆ హత్యానేరంతో
బతకగలను కానీ వాడి కీర్తిని ఒప్పుకోలేను

అందుకే వాడు పాడకూడదు. అసలు బతికే ఉండకూడదు
– అని అనేంత వరకూ.

ఆ మాటలు ఉద్రేకంతో అన్న శర్మ గుండె నొప్పితో ఆస్పత్రి పాలవుతాడు.

ఇంటి దగ్గర అమ్మవారితో శారద –

వారు తప్పే చేసారో ఒప్పే చేసారో – ఆ శిక్షేదో నాకు వెయ్యి,
నా పసుపు కుంకుమలు దూరం చెయ్యకు
– అని వేడుకుంటూ కూచుంటుంది.

తనని స్వంత కొడుకులా చూసుకునే శారద నుదుటన కుంకుమ నిలపడానికి గంగాధరం శారద పేరన ఒక ఉత్తరం రాసి తను గంగలో కలిసిపోతాడు. గంగాధరం ఆత్మాహుతితో శారద ఏదో తెలియని భ్రాంతిలో పడిపోతుంది. శర్మ మతి స్థిమితం కోల్పోతాడు.

మళ్ళీ ప్రస్తుతంలోకి వచ్చిన కథ శర్మని శారద సంగీత పాఠాలు నేర్పించే పాఠశాల దగ్గరకి తీసుకు వెళ్తుంది. అక్కడ నేర్చుకుంటున్న పిల్లలతో కూచుని శర్మ సరిగమపదనిసలతో పాఠం మొదలెట్టడం చిత్రానికి అనూహ్యమైన అందమైన కొసమెరుపు. కొత్త సంగీత పాఠమే కాదు కొత్త జీవిత పాఠం కూడా శర్మ నేర్చుకున్నట్లు అనిపిస్తుంది. ఆ జీవిత పాఠమే అహాన్నీ, అసూయనీ జయించడం.

గంగాధరం ఆత్మహత్యతో విషాదాంతంగా ముగియాల్సిన సినిమా శారద సహకారంతో శర్మ సరికొత్త జీవితం మొదలెట్టడం అనే మంచి సన్నివేశంతో ముగుస్తుంది. చాలా సంవత్సరాల తర్వాత స్వరాలు పలకడంలో శర్మకి అపశ్రుతి వచ్చినట్లు పక్కన కూచున్న చిన్న పిల్ల చెప్పడం ప్రత్యేకమైన పతాక సన్నివేశంగా మిగిలిపోయింది.

ఈర్ష్య వల్ల ఎంత గొప్పవారికైనా ముప్పే అని చెప్పడం కోసమే విశ్వనాథ్ ఈ చిత్రం తీసి ఉంటారని నా ప్రగాఢ నమ్మకం.

ఆ చిత్రంలోని మూడు ప్రధాన పాత్రలవీ మూడు విభిన్న మనస్తత్వాలు. ఒకరు అమాయకత్వానికీ, ఇంకొకరు ఆప్యాయతకీ, మరొకరు అసూయకీ ప్రతీకలు. ఆ పాత్రలు పోషించిన నటీనటులు – మంజునాథ్, రాధిక, మమ్ముట్టి – ముగ్గురూ నటనలో అఖండులు. నటనకి భాష్యం చెప్పగలిగిన వారు. ఇంక ఈ చిత్రంలో వారి అభినయం హిమాలయ శిఖరాగ్రాలకి చేరింది.

ఉదాహరణకి ఆనతినీయరా పాట.

స్వాతి కిరణం చిత్రంలో గంగా ప్రవాహం లాంటి పాట ఆనతినీయరా. సాహిత్యం, సంగీతం ఒక దానికొకటి పోటీ పడతాయి. ఆ పాట సిరివెన్నెల-మహదేవన్-వాణీ జయరాంల త్రివేణీ సంగమం. ఆ పాట గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విన్నా, కన్నా మనస్సూ, కళ్ళూ ఆనందంతో, ఆర్ద్రతతో హర్షిస్తాయి, వర్షిస్తాయి.



ఏడు నిమిషాల ఆ పాటని పాడిన వాణీ జయరాం జాతీయ ఉత్తమ గాయని అవార్డ్ అందుకున్నారు. వాణీ జయరాం గాత్రం ఇచ్చినది బాలనటుడు మంజునాథ్ కి. ఆ చిత్రంలో మంజునాథ్ పాటలన్నీ పాడినది వాణీ జయరామే. అలాగే శంకరాభరణం చిత్రంలో తులసికి గాత్రం అందించింది వాణీ జయరామే. ఆ చిత్రానికి కూడా వాణీ జయరాంకి జాతీయ ఉత్తమ గాయని అవార్డు లభించింది.



ఆ పాట పాడుతున్నప్పుడు తనలో పొంగే ఆవేశాన్ని ప్రదర్శించిన బాలనటుడు మంజునాథ్ నటన అత్యద్భుతం. ఆ పాట వింటూ గుండె లోతుల్నుంచి తన్నుకు వస్తున్న ఆనందాన్ని కళ్ళ లో మొహంలో అందంగా చూపించిన రాధిక అభినయం అనితరసాధ్యం. తను అసూయపడే తన శిష్యుడు అద్భుతంగా గానం చేస్తోంటే తన మనస్సులోని అలజడినీ రవంతైనా పైకి కనపడనీయకుండా రాతిశిలలా కూచోగలిగిన మమ్ముట్టి తన శరీరావయవలన్నింటినీ తన అధీనంలో ఉంచుకోగలిగిన నటర్షి.



పాట వింటోంటే ఆనందంతో మన కళ్ళ లో నీళ్ళు సుళ్ళు తిరుగుతాయి.
ఆ ఆనంద బాష్పాలను రాధికా, మంజునాథ్, మమ్ముట్టి ముఖకవళికలూ, హావభావాలూ తెప్పిస్తాయి
సిరివెన్నెల కలం, మహదేవన్ స్వరం, వాణీ జయరాం గళం తెప్పిస్తాయి.

ఈ కళాకారులు ఎవ్వరూ ఎవ్వరికీ తక్కువ కాదు. అందరూ ఎన్నెన్నో జాతీయ అవార్డులు అందుకున్నవారు. తమ తమ కళలలో చిరంజీవులు.

ఆ కళాచిరంజీవుల చేత చిరంతరంగా నిలిచిపోయే పాటను సృష్టించిన విశ్వనాథ్ గారు తెలుగు ప్రేక్షకుల మనస్సుల్లో అసలు సిసలైన చిరంజీవి.

# పది చిత్రాలు - పది పాటలు



# పది చిత్రాలు - పది పాటలు

నా చిన్నప్పుడు సినిమా చూస్తూ చూస్తూ పాట వస్తే సినిమా హాలు బయటకి వెళ్ళి టీ తాగడమో సిగరెట్ కాల్చడమో చేసే వారిని నేను చూసాను. కొన్ని సినిమాలలో పాటలు విశ్రాంతి సమయాలు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో పాటలు చిత్రానికి ఆయువు పట్టులు. అవి కథను నడిపిస్తాయి. కథలో పాత్రల భావాలని చెప్తాయి. పాటల రచయితలూ, సంగీత దర్శకులూ, గాయనీ గాయకులూ, నటీ నటులూ - అందరూ ఆ పాటలని ప్రేక్షకులు చూసి తీరేలా చేస్తారు.

విశ్వనాథ్ గారి చిత్రాలు కొన్ని ప్రజలని రంజింపలేకపోయినా, ప్రభుత్వాల గుర్తింపు పొందకపోయినా, అన్ని చిత్రాలలో పాటలు మాత్రం బావుంటాయి.

ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలు అన్నింటి గురించీ రాసుకుంటూ పోతే అదో పుస్తకం అవుతుంది.

అందుకని ఒక పది పాటలు మాత్రం ఎంచుకుని వాటి గురించి చర్చించుకుందాం. ఒక పది పాటలు అంటే ఏ పది పాటలు? మనం ఇప్పటి వరకూ చర్చించుకున్న పది చిత్రాలనుండి - ఒక్కో చిత్రంలోంచి ఒక్క పాటను తీసుకుని ముచ్చటించుకుందాం.

ఒక చిత్రంలోంచి ఒక్క పాటనే ఎన్నుకోడం కూడా కష్టమైన కార్యమే.

పది చిత్రాలలోని పది పాటలు -

★ చెల్లెలి కాపురం - చరణకింకిణులు
★ కాలం మారింది - మారలేదులే ఈ కాలమూ
★ నేరము శిక్ష - చేసిన పాపం నీదీ
★ ఓ సీత కథ - భారతనారీ చరితము
★ సిరిసిరిమువ్వ - ఝుమ్మందినాదం
★ సప్తపది - ఏ కులమూ నీదంటే
★ శుభలేఖ - మరుగేలరా
★ స్వాతిముత్యం - మనసు పలికే
★ సిరివెన్నెల - మెరిసే తారలదే రూపం
★ స్వాతి కిరణం - జాలిగా జాబిలమ్మ

# చెల్లెలి కాపురం

## చరణకింకిణులు

తెలుగు చలన చిత్రాల పాటలలో సంస్కృత సమాసాలు చెల్లెలి కాపురం చిత్రానికి ముందు లేవని కాదు. అడపా దడపా కొన్ని పాటలలో, అదీ కొన్ని చరణాలలో ఉండేవి. ఆ చిత్రాలు కూడా ఎక్కువ పౌరాణికాలో జానపదాలో అవడం వల్ల సమాసాలు ఆ చిత్రాలకి తగినట్లుగానే ఉండేవి.

చెల్లెలి కాపురం చిత్రం సాంఘికం. సాంఘిక చిత్రాలలో సామాన్య జనం వాడే చిన్న చిన్న మాటలతోనే పాటలు రచించడం పరిపాటి ఐపోయింది. అలాంటి సమయంలో చెల్లెలి కాపురం చిత్ర దర్శకులు చేసిన దుస్సాహసం సి నారాయణరెడ్డిగారి చేత సంపూర్ణ సంస్కృత సమాస భూయిష్ట గీతాన్ని రాయించుకోవడం. నారాయణరెడ్డిగారికి అలాంటి కవిత్వం రాయడం కొత్తా కాదు, కష్టమూ కాదు.

చెల్లెలి కాపురం పతాక సన్నివేశం అసలైన కవి శ్రీరాం కాదని, అది రామూయే అని ప్రపంచానికి తెలియచెప్పడానికి రాధ ఏర్పాటు చేసిన పోటీ. అది తన నాట్యానికి అనువుగా కవిత్వం చెప్పగలగడమే. రాధ అనుకున్నట్లుగానే శ్రీరాం చెప్పలేకపోతాడు. రామూ వేదిక మీదకి వస్తాడు.

రాధని నువ్వా అన్నట్లు రాము చూస్తాడు. అవునన్నట్లు తలూపుతుంది రాధ. మొదలు పెట్టమన్నట్లు నిలబడతాడు రాము.
రాధ కదిపిన గజ్జెల కాళ్ళ కి – చరణకింకిణులు ఘల్లుఘల్లుమన – అని అంటాడు.
రాధ కదిపిన గాజుల చేతులకి – కర కంకణములు గలగలలాడగ – అని అంటాడు.
అలాగే అడుగులకు కలహంసలాడగా అనీ, నడుముకు తరంగమ్ములూగగా అని పాడతాడు.
రాధ శరీరం కదలికలకు స్పందిస్తూ – వినీల కచభర విలాస బంధుర తనూలతిక చంచలించి పోగా – అని ఆలపిస్తాడు.

ఈ వాక్యాలు జనానికి అర్థం కావని విశ్వనాథ్ గారు అనుకోలేదు. ఆయన అలా అనుకుని ఉంటే ఇంత శబ్దార్థాలంకార భూయిష్టమైన కవిత్వం తెలుగు సినిమా పాటలలో మిగిలేది కాదు. సినారె కానీ, మరో కవి కానీ రాయలేక కాదు. రాయించుకునే దర్శకుడు లేక.

నాకు గుర్తు. ఈ పాట ఆ రోజుల్లో శ్రోతలు కోరిన పాటలలో నిరంతరం వినిపిస్తూనే ఉండేది. అంత ప్రజామోదాన్నీ, ప్రజాదరణనీ సంపాదించుకుంది. ఈ పాటని తెలుగువారికి అందించిన ఘనత పూర్తిగా విశ్వనాథ్ గారిదే.

పాటకి పల్లవి ఆడవే మయూరీ నటనమాడవే మయూరీ.

ఐతే ఆ పల్లవిలోని తరవాత రెండు వాక్యాలు మొదటి చరణానికీ రెండో చరణానికీ ఒకటి కాదు.

పల్లవి మొదటి సారి వచ్చినప్పుడు రాము -

నీ కులుకుని గని నా పలుకు విరియగా
నీ నటనని గని నవకవిత వెలయగా
- అని అంటాడు, రాధ నాట్యానికి తను కవిత చెప్తానని అర్థం వచ్చేటట్లుగా.

పాటకి రెండు చరణాలు. మొదటి చరణం బృందావనంలో మధురంగా సాగే రాధా కృష్ణుల రాసకేళి. రాధ నాట్య భంగిమలను అర్థం చేసుకుని వాటికి అనువైన - యమునా తీరమూ, బృందావనమూ, పున్నమి వెన్నెలా, తెమ్మెర ఊయలా, సైకత వేదికా, విరహిణి రాధికా వంటి అంత్యానుప్రాసల మాటలు పొదుగుతాడు రాము.

రాధ చివర చూపించిన అభినయానికి అనువుగా అది రాధ మనసులో మాధవుడూదిన రసమయ మురళీ గీతిక అని పాడి మళ్ళీ పల్లవి పాడుతాడు. ఈ సారి -



ఆడవే మయూరీ, నటనమాడవే మయూరీ
నా పలుకులకెనయగు కులుకు చూపీ
నా కవితకు సరియగు నటన చూపీ
- అని అంటాడు. ఇది రాధ ఊహించనిది. రాధ తన నటనకి కవిత్వం చెప్పమంటుంది. అది దిగ్విజయంగా ముగించిన రాము అంతటితో ఆగక తన కవితకి అనుగుణంగా రాధని నాట్యం చెయ్యమంటాడు.

మొదటి చరణంలో రాధాకృష్ణుల గురించి ఎంతో లలితంగా రాసిన సినారె రెండో చరణానికి ఎన్నుకున్న అంశం పరమశివుడు ప్రసవశరుని సంహరించడం.

సామాన్యంగా కృష్ణుడి నాట్యానికి మాటలూ, పాటలూ మార్దవంగా ఉంటాయి. అదే శివుడి తాండవానికి గంభీరంగా ఉంటాయి. సినారె రెండో చరణానికి వాడిన భాషా, భావం గగుర్పు కలిగించేవి.

తన తపస్సుని భగ్నం చెయ్యడానికి వచ్చిన మన్మథుడి మీద శివుడి ఆగ్రహం ఆ మాటల్లో ధ్వనిస్తుంది. సమాసాలు దీర్ఘంగా, పదాలు కఠినంగా నడుస్తాయి. కవికి స్వేచ్ఛ ఉంటే తన మాటలకు ఎంత శక్తిని ఇవ్వగలడో నిరూపించారు నారాయణ రెడ్డి.

కె వి మహదేవన్ సంగీతం కవిత్వానికి సరిపోయినట్లు మొదటి చరణానికి వేణుగానంలా మృదువుగా సాగితే రెండో చరణానికి డమరుక నాదంలా మోగింది. వెనక వినవచ్చిన వాయిద్యాలు పాటకి కావల్సిన, రావల్సిన అనుభూతిని తెప్పించాయి.

బాలూ తనే వేదిక మీద నిలబడి పాడుతున్నట్లు పాడారు. తనకి దొరికిన సువర్ణావకాశాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్నారు. భాష మీద పట్టున్న గాయకుడు అవడం వల్లనే అటువంటి పద ప్రయోగాలని అవలీలగా పాడేసారు. స్పష్టమైన ఉచ్చారణ బాలూ ఆస్తి.



తను స్వయంగా శాస్త్రీయ నాట్యం నేర్చుకోకపోయినా ఈ పాటకి తగినట్లు అభినయించారు వాణిశ్రీ.

శోభన్ నటనకి చెల్లెలి కాపురం చిత్రమే ఒక సవాల్. అంత కన్న పెద్ద సవాల్ ఈ పాటకి కవిలా ఉద్రేకంగా పాడడం. ఆ సవాలుకి దీటుగా నటించారు శోభన్.



# కాలం మారింది

## మారలేదులే ఈ కాలమూ

కాలం మారింది చిత్రానికి సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు. అది ఆయన సంగీత దర్శకత్వం వహించిన నూరవ చిత్రం. అన్ని చిత్రాలలోనూ ఆయన సృజించిన ప్రతిపాటా ప్రత్యేకమే. ఆయన నూరవ చిత్రానికి ఆయన ప్రత్యేకంగా అందించిన సంగీతం మరీ మరీ ప్రత్యేకం.

కాలం మారింది చిత్రంలో గుండెను పిండేసే రెండు ఆణిముత్యాల వంటి పాటలున్నాయి.

మొదటిది. ఏ తల్లి ఊపేను జోలా. ఈ పాట రచయిత దేవులపల్లి. గానం ఘంటసాలా, సుశీలా. శోకాన్ని తన కలంతో చెక్కడంలో దేవులపల్లీ, చెక్కిన శిల్పానికి తన గళంతో ప్రాణం పొయ్యడంలో ఘంటసాలా అనవద్యులూ, అనితరసాధ్యులూ.

రెండవది. మారలేదులే కాలమూ. రచన దాశరథి గారు . గానం రాజేశ్వరరావు గారు . తన స్వరానికీ, గళానికీ సరిపోయేలా దాశరథి గారి చేత రాజేశ్వరరావు గారు రాయించుకున్నట్లు ఉంటాయి స్వరం, గానం. రాజేశ్వరరావు గారి కంఠంలో బాధ స్రవిస్తుంది. ఆ బాధా స్రవంతి ప్రేక్షకుల గుండెలకి చేరి తడి ఉబికిస్తుంది. ఆ పాటను రాజేశ్వరరావు గారు పాడడం మనకు దక్కిన భాగ్యం.

శాంతి అంటరాని కులంలో పుట్టినా పెరిగింది మాత్రం ఒక అగ్రకులస్తుల ఇంట్లో. తనని పెంచి పెద్దచేసిన ఒక గాంధేయవాది దగ్గర మంచి గుణాలు అలవరచుకుంటుంది.

శాంతి వివాహ ప్రస్తావనలో శాంతి పుట్టుక గురించి శాంతికి తెలుస్తుంది. అది శాంతిని బాధిస్తుంది. కలవర పరుస్తుంది. మనస్సు అల్లకల్లోలం అవుతుంది. శాంతి అంతరంగపు ఆక్రందనే పాట పల్లవిగా వినిపిస్తుంది -



మారలేదులే ఈ కాలమూ
మారలేదులే ఈ లోకమూ
- పల్లవికి కొనసాగింపుగా మారనిది ఎవరికో అనుపల్లవిలో వినిపిస్తుంది -

దీనులకూ, హీనులకూ తీరలేదులే ఈ శోకమూ

- సామాన్యంగా శ్రీశ్రీ వాడే మాటలూ, భావాలూ దాశరథి రాసిన ఈ పాటలో ఉంటాయి. కారులో షికారుకెళ్ళే అన్న ఆత్రేయ పాట శ్రీశ్రీ పాటలానూ, మనసున మనసై అన్న శ్రీశ్రీ పాట అత్రేయ పాటలానూ అనిపిస్తాయి. అవసరం, అవకాశం వస్తే ఏ కవి ఏ భావాన్నైనా రాయగలరనడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఈ పాట వస్తున్నంత సేపూ శాంతి మనస్సులోని అనిశ్చితి, గందరగోళం మొహంలో కనిపిస్తాయి. శాంతి తన ఇంట్లో తయారు చేసుకున్న బొమ్మల కొలువు లోని బొమ్మలే చుట్టూ సమాజంలా అనిపిస్తాయి.

అదే సమయంలో సమాజంలో ఉండే దురాచారాలూ, వాటిలో ఇరుక్కున్న అమాయకులూ, వాటి వల్ల కష్టాలు అనుభవిస్తున్న సామాన్య జనం కనిపిస్తూ ఉంటారు. వారిని చూపిస్తూ మొదటి చరణం వస్తుంది -

అందరిలో ఉండేది ఒకే రక్తమైనా
అందరినీ సృష్టించింది ఒకే దైవమైనా
కులం పేరుతో మతం ముసుగులో
ప్రాణమున్న మనిషినే సమాధి చేసారు

- కులం మతం సాగిస్తున్న నియంతృత్వం శారద నటనతో కళ్ళ ముందు కనిపిస్తుంది. రాజేశ్వరరావు స్వరంలో మనస్సుకి వినిపిస్తుంది.

శాంతి తను ఎక్కడ నుండి వచ్చిందీ, తను ఏంచెయ్యాలీ అన్న సందిగ్ధంలో ఉంటుంది. దానికి సమాధానం రెండవ చరణం స్పష్టం చేస్తుంది.

వారే నీవారూ అనాథలూ, అభాగ్యులూ
వారే నీ బంధువులూ బాధితులూ, పీడితులూ
కంటి నీటితోనే తమ కడుపులు నింపుకునే అంటరానివారూ

- అని శాంతి ధర్మ సంకటానికి దారి చూపుతుంది. అంటరాని వారుగా సమాజం చేత దూరంగా ఉంచబడుతున్న అనాథలతో, అభాగ్యులతో, బాధితులతో, పీడితులతో ఉండమని సాగనంపుతుంది.

ఇంక బయల్దేరమని -

ఈ కోవెలలో ఇక నీకు చోటు లేదమ్మా
ఈ లోగిలిలో ఇక నిలవ నీడ లేదమ్మా
- అని పాడిన రాజేశ్వరరావు గారి జీర స్వరం శాంతిని చెయ్యి పట్టుకుని ఇంటి బయటకి తీసుకు వస్తుంది.

కట్టు బట్టలతో శాంతి తనని పెంచి పెద్ద చేసిన పెద్దింటి నుండి బయటకి నడుస్తుంది.
ఈ పాట శాంతి పుట్టింటి వారి కష్టాలు చూస్తున్నప్పుడు మళ్ళీ వినిపిస్తుంది.



# నేరము శిక్ష

## చేసిన పాపం నీది

ఒక పాట ఒక చిత్రంలో ఉందంటే దానికి ఒక ప్రయోజనం ఉండాలి. యుగళ గీతాల ప్రయోజనం నాయికా నాయకుల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యం చూపించడమే. యుగళ గీతాలు కాని పాటలు కథా గమనానికో, సన్నివేశానికి సరైన అనుభూతిని కలిగించడానికో ఉపయోగపడాలి. ఆ అనుభూతి విన్నవారిలో మిగిలిపోవాలి.

విశ్వనాథ్ గారి చిత్రాలలో పాటలు సన్నివేశానికి బలాన్ని ఇస్తాయి. కథని నడిపిస్తాయి. నేరము శిక్ష చిత్రంలో చేసిన పాపం నీదీ, చితికిన బతుకింకొరిదీ అన్న పాట మూడు సందర్భాలలో వస్తుంది. వచ్చిన ప్రతీసారీ సన్నివేశ వేగాన్ని పెంచుతుంది. పాత్రల భావోద్వేగాన్ని చూపించుతుంది.

ఈ పాటని రాసిన దేవుల పల్లి కృష్ణశాస్త్రిగారికి బాధా, దైన్యం పాటలలో అందంగా రాయడం పుట్టుకతో అబ్బిన విద్య. ఆయన ఊర్వశి, కృష్ణపక్షం పద్యాలలో కరుణ రసం ప్రవహిస్తుంది. మాటలు ఆయన మాట వింటాయి. భావకవికి భావం అలవోకగా పలకడంలో ఆశ్చర్యమే లేదు.

పాటకి స్వరబ్రహ్మ కె వి మహదేవన్ కూర్చిన బాణీ పాట భావానికి అతికినట్లుంటుంది. బాలసుబ్రహ్మణ్యం తన స్వరంలో ఆ భావాన్ని అద్భుతంగా పలికించారు.

ధనవంతుడైన విజయ్ చేసిన కారు ప్రమాదం తర్వాత రెండు కుటుంబాలు కష్టాల్లో పడతాయి. అందులో ఒకరు విజయ్ బదులు జైలుకి వెళ్ళి న డ్రైవరు చెల్లెలు. ఇంకొకరు ప్రమాదంలో కళ్ళ నీ, అన్నయ్యనీ పోగొట్టుకున్న చిన్నయ్య.

విజయ్ చేసిన కారు ప్రమాదానికి విజయ్ తల్లి విజయ్ బదులుగా డ్రైవరుని జైలుకి పంపించడం నచ్చని విజయ్ తండ్రి విజయ్ ని ఇంటి నుండి పంపించేస్తాడు.

విజయ్ రైల్లో వెళ్తూండగా అదే రైల్లో వెళ్తూ డ్రైవరు చెల్లెలు ఆత్మహత్య చేసుకోబోతోంటే విజయ్ కాపాడతాడు. చెల్లెలు విజయ్ తో తన అన్నయ్య కారు ప్రమాదం చేసాడనీ, అందుకు జైలుకి వెళ్ళా డనీ, తనకి ఏదిక్కూ లేదనీ చెప్తుంది.

విజయ్ కి తను చేసిన నేరానికి ఆ అమ్మాయి శిక్ష అనుభవిస్తోందని అర్థం అవుతుంది. అప్పుడు విజయ్ అంతరాత్మ ఘోష పాటలా మొదలవుతుంది –

చేసిన పాపం నీదీ
చితికిన బతుకింకొకరిదీ



ఒకరిదా నేరం?
వేరొకరికా శిక్ష?
- అన్న పల్లవితో.

మొదటి చరణం డ్రైవర్ చెల్లెలి దీనమైన కథ గురించి వస్తుంది. రెక్క తెగిన, గూడు లేని, తోడు లేని పక్షిగా ఆ అమ్మాయిని వర్ణిస్తారు కృష్ణశాస్త్రి.

ఆ అమ్మాయిని అన్నయ్యలా ఆదరిస్తానని పట్నం తీసుకొచ్చిన విజయ్ కి కొన్నాళ్ళకి రోడ్డు మీద ప్రమాద వశాత్తూ చిన్నయ్య కనిపిస్తాడు. మాటలలో చిన్నయ్య తనకి కళ్ళు పోడానికి కారణం ఒక పొగరుబోతు కారుని వేగంగా తోలడమే అని అంటాడు.

అది తన వల్లే జరిగిందని తెలిసిన విజయ్ ఆవేదన మళ్ళీ పాట రూపంలో వస్తుంది. చిన్నయ్యని కన్నుల వెలుగారిపోయిన వాడిగా, ఉన్న ఊతం పోయిన వాడిగా రెండవ చరణంలో వర్ణిస్తారు దేవులపల్లి. మళ్ళీ చేసిన పాపం నీదీ, చితికిన బతుకింకొకరిదీ అన్న పల్లవి వస్తుంది.

చిన్నయ్యతో వాళ్ళు ఉంటున్న చోటుకి వెళ్ళి అక్కడ చిన్నయ్య వదిన భర్త పోయిన దుఃఖంతో దీనంగా ఉండడం చూసాక మళ్ళీ విజయ్ అంతరాత్మ మథన పడుతూ మళ్ళీ ఒకరిదా నేరం వేరొకరికా శిక్ష అని గట్టిగా అడుగుతుంది.

ఈ పాటతో విజయ్ చేసిన ప్రమాదం వల్ల ముగ్గురు అనుభవిస్తున్న బాధనీ, ఆ బాధకి విజయ్ లో రగిలిన మౌలికమైన ప్రశ్నలనీ చక్కగా చిత్రీకరించారు విశ్వనాథ్.

# ఓ సీత కథ

## భారత నారీ చరితము

విశ్వనాథ్ గారి చిత్రాలలో హరికథలకి చాలా ప్రాముఖ్యం ఉంటుంది. హరికథలతోనే చిత్రకథ నడుస్తూ ఉంటుంది. చిత్రంలో ముఖ్యమైన మలుపులకి హరికథలు నేపథ్యం అవుతాయి.

ఓ సీత కథ చిత్రమే భారత నారీ చరితము మధుర కథా భరితము అన్న హరికథతో మొదలౌతుంది. ఈ హరికథని రాసినది వేటూరి సుందరరామమూర్తిగారు. సినీ ప్రపంచంలో వేటూరి విక్రమావతారానికి అది తొలి అడుగు. అనంతర కాలంలో వేటూరి విశ్వనాథ్ కలిసి సృష్టించిన మంచి పాటలు ఎన్నో, ఎన్నెన్నో.



హరి కథ మొదటి చరణంలో సీతా, ద్రౌపదీ, సుమతీ, సావిత్రీ వంటి పతివ్రతల ప్రస్తావన ఉంటుంది.

రెండవ చరణంలో సంసారీ, వయ్యారీ, దేవేరీ, కావేరీ అంటూ నారి బహుముఖ పాత్రల సూచన ఉంటుంది.

వీటిని ప్రస్తావించి చివరికి ఈ నాడు అటువంటి నారీమణులు ఉన్నారని చెప్పడానికే ఈ కథ అని ఓ సీత కథ అన్న టైటిల్ పువ్వులతో చూపిస్తారు.

పాట వస్తున్నంతసేపూ చిత్రంలో సీత పాత్ర వేసిన రోజారామణి ముద్దు అమాయకం మొహాన్నే చూపిస్తూ ఉంటారు.

హరికథ చిత్రారంభంలో మాత్రమే ఉండదు. చిత్రంలోని ఒక కీలకమైన సన్నివేశానికి నేపథ్యంగా హరి కథే వస్తుంది.

సీతని చేరదీసి ఆదరిస్తున్న మాధవరావు సీతని తన కొడుకు గోపాలకృష్ణని పెళ్ళి చేసుకోమని అడుగుతాడు. సీత అక్కా, అమ్మా కూడా అది మంచిదే అని చెప్తారు. సీత ఏ నిర్ణయమూ తీసుకునే లోగా ఇంట్లో ఒంటరిగా ఉన్న సీతని గోపాలకృష్ణ బలాత్కరించ బోతాడు. సరిగ్గా ఆ సమయానికే సీత అక్క కీచకుడి ఉదంతాన్ని హరికథగా చెప్తూ ఉంటుంది –

ఖలుడు సింహబలుడు ముష్కరుడు కఠిన చిత్తుడు
– అంటూ కీచకుడు ద్రౌపది దగ్గరకి వెళ్తున్నట్లు హరికథ వస్తోంటే గోపాలకృష్ణ సీత దగ్గరకి వస్తున్నట్లు చూపిస్తారు –

మగువను పెనగొనబోయెను కదలి మదోన్మత్తుడు
- అన్న హరికథ వాక్యానికి గోపాలకృష్ణ సీతని బలాత్కారం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నట్లు చూపిస్తారు.



అప్పుడు హరికథలో భాగంగా లీల తనదైన గంభీర గళంతో మహాభారతంలోని దుర్వారోద్యమ బాహువిక్రమ అనే తిక్కన పద్యం పాడుతుంది. శుభ హరికథ చెప్తూ రౌద్ర రసం అభినయిస్తుంది. అదే సమాయనికి ఇంట్లో సీత గోపాలకృష్ణ బలాత్కారాన్ని ప్రతిఘటిస్తుంది.

ఆ సన్నివేశం జరిగాక సీత ఏ మాత్రం సందేహం లేకుండా తనని తాను రక్షించుకోవడం కోసం మాధవ రావుని వివాహం చేసుకుంటుంది.

చిత్రంలో అతి కీలకమైన నిర్ణయాన్ని సీత తీసుకునే సన్నివేశానికి ఈ హరికథే నేపథ్యం అవుతుంది. ఎందుకంటే కీచకుడిలో దుర్మార్గానికి అసలు కారణం ద్రౌపది అభద్రతలో ఉందని సీత నిర్ణయించుకుంటుంది. స్త్రీగా తనకి రక్షణ కావాలనుకుంటుంది. అందుకు మాంగల్యాన్ని కోరుకుంటుంది. సీత కథ మలుపు తిరుగుతుంది.

హరికథ చిత్రం చివరలో కూడా వినిపిస్తుంది. భారతనారీ చరితము అంటూ చదువులకీ ఉద్యోగాలకీ వెళ్తున్న స్త్రీలని చూపించడంతో ఓ సీత కథ ముగుస్తుంది.

హరికథ కి అభినయం చేసిన శుభ అసలు సిసలైన హరికథాకారిణిలా నటించారు. హరికథ పాడిన నేపథ్య గాయని లీల తన కంచు కంఠంతో హరికథలోని అన్ని రసాలని మన హృదయాలకి అందించారు. కె వి మహాదేవన్ సంగీతం గురించి చెప్పాలంటే - ఆయన విశ్వనాథ్ గారి చిత్రాలకి స్వరపరిచిన పాటలు అన్నింటి గురించీ చెప్పగలిగిన, చెప్పవలసిన మాట ఒక్కటే. అది వహ్వా!

# సిరిసిరిమువ్వ

## ఝుమ్మంది నాదం

నాట్యమే తన సర్వస్వం అని బతుకుతూ ఉంటుంది హైమ. ఐతే సవతి తల్లి హైమని నాట్యం నేర్చుకోనివ్వదు. తన స్వంత కూతురికి మువ్వలు కొనిచ్చి, మాస్టారుని పెట్టి, నాట్యం నేర్పిస్తుంది కానీ హైమని మువ్వలు ముట్టుకోనివ్వదు. మాస్టారు తన సవతి చెల్లెలికి చెప్తున్నప్పుడే హైమ నాట్యం నేర్చుకుంటూ ఉంటుంది. స్వతస్సిద్ధంగా నాట్యం హైమ తనువులో మనసులో ఉండడం వల్ల నాట్యం బాగా వస్తూంటుంది.

ఒకరోజు రాత్రి పూజారి కోరిక మేరకు ఆలయ ప్రాంగణంలో డప్పు వాయిస్తుంటాడు సాంబయ్య. ఆ లయకి హైమ మనస్సు పులకిస్తుంది. అప్పుడే గోడకి వేలాడుతున్న చెల్లెలి మువ్వల శబ్దం వినిపించి మురిపిస్తుంది.

సవతి తల్లీ, చెల్లీ నిద్ర పోతూండడంతో ఇంక ఆగలేక మువ్వలు తీసుకుని ఆరుబయట నాట్యం చెయ్యడానికి వెళ్తుంది.

నేల మీద అందమైన ముగ్గు. కొబ్బరి ఆకుల చాటుగా ప్రకాశిస్తూ వెన్నెల. ఆ ప్రశాంత ప్రకృతిలో హైమ నాట్యం మొదలెడుతుంది.

నాట్యం చేస్తూ హైమ ఊహలలో తేలిపోతుంది. కొండలూ, లోయలూ, ఝరులూ మధ్యన నాట్యం చేస్తున్నట్లు తలచుకుంటుంది.

నేపథ్యంలో ఝుమ్మంది నాదం అని పల్లవి వినిపిస్తుంది.

ఝుమ్మంది నాదం
సయ్యంది పాదం
తనువూగింది ఈ వేళ
చెలరేగింది ఒక రాసలీల



వేటూరి కలం చెలరేగింది.
కె వి స్వరం సయ్యంది.
సుశీల గళం ఝుమ్మంది.
జయప్రద తనువూగింది.

**మొదటి చరణం.**

యెదలోని సొదలా ఎలదేటి రొదలా
కదిలేటి నదిలా కలల వరదలా
చలిత లలిత పద కలిత కవిత లెద
సరిగమ పలికించగా
స్వరమధురిమ లొలికించగా
సిరిసిరి మువ్వలు పులకించగా

వేటూరి పద ప్రయోగమెంత లలితం!
కె వి వరసలు ఎంత శ్రావ్యం!
సుశీల గానమెంత మధురం!
జయప్రద కదలికలెంత సుందరం!

మొదటి చరణం అయ్యేసరికి ఊహల్లోకి డప్పు వాయించే సాంబయ్య కూడా వస్తాడు.

**రెండవ చరణం**



నటరాజ ప్రేయసి నటనాల ఊర్వశి
నటియించు నీవని తెలిసి
ఆకాశమై పొంగె ఆవేశం
కైలాసమే వంగె నీకోసం

**మూడవ చరణం**

మెరుపుంది నాలో; అది నీ మేని విరుపు
ఉరుముంది నాలో; అది నీ మువ్వ పిలుపు
చినుకు చినుకులో చిందు లయలతో
కురిసింది తొలకరి జల్లు
విరిసింది అందాల హరివిల్లు
ఈ పొంగులే ఏడు రంగులుగా

ఈ చరణం హైమా సాంబయ్యల మధ్య సంభాషణలా సాగుతుంది.

ఈ పాట చూస్తోంటే సాహిత్య, సంగీత, నాట్యాల హరివిల్లు ప్రేక్షకుల ముందు ఆవిష్కరిస్తుంది.

రకరకాల ఆహార్యాలలో జయప్రద కూడా అందమైన హరివిల్లులానే కనిపిస్తారు.

ఈ పాట ద్వారా తన గాత్రంతోనే ఇంద్రధనుస్సుని చూపించిన పి సుశీలని ఉత్తమ నేపథ్య గాయని అవార్డు వరించింది. అందులో ఆశ్చర్యం ఏముంది?

# సప్తపది

## ఏ కులమూ నీదంటే

పాటల చిత్రీకరణలో విశ్వనాథ్ గారు నిష్ణాతులు. సమయానికీ సందర్భానికీ సరిపోయేటట్లు పాటలు రాయించుకుని, వరస కట్టించుకుని, పాడించుకుని, నటీనటులకి చెప్పి చేయించుకుంటారు. అటువంటి విశ్వనాథ్ గారు సప్తపదిలో పాటల చిత్రీకరణలో తనని తానే మించిపోయారనిపిస్తుంది నాకు.

జాతవేదసే అన్న దుర్గాసూక్తాన్ని తాతా, కొడుకూ, మనవడూ రాగయుక్తంగా పాడుతోంటే అందమైన నాట్యకత్తె హేమ గుళ్ళో అభినయిస్తున్నట్లు ఊహించడం, ఆ ఊహించినదాన్ని తెర మీద ఆవిష్కరించడం విశ్వనాథ్ గారికే చెల్లింది.

అలాగే మహిషాసుర మర్దిని స్తోత్రాన్ని గౌరీనాథశాస్త్రి పడగ్గదిలో శోభనం రోజు భార్య ఎదురుగా పాడుతూ సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లు తియ్యడం విశ్వనాథ్ గారి అపూర్వ సృజన.

హేమ నృత్యం చేసిన నెమలికి నేర్పిన నడకలివీ, భామనే సత్యభామనే పాటలు అమోఘం.

ఇన్ని పాటలలో ఏ పాట గురించి రాద్దామని ఆలోచిస్తే నాకు ఈ చిత్ర కథకి సరైన పాట ఏ కులమూ నీదంటే అని అనిపించింది.

హేమ హరిజనుడు హరిబాబు మీద మనస్సు పడుతుంది. తాతయ్య యాజులి ఆశీర్వచనానుసారం గౌరీనాథశాస్త్రితో పెళ్ళికి తలొంచుతుంది. మొదటి రాత్రి నుండి గౌరీనాథం హేమని అమ్మవారిలానే చూస్తూంటాడు. అందుకు కారణం తెలుసుకుని హరిబాబుని తీసుకు వచ్చి హేమకిచ్చి పెళ్ళి చెయ్యడానికి బయల్దేరుతాడు. ఆ విషయం తెలిసిన గౌరీనాథం తల్లిదండ్రులు యాజుల్ని ఎలాగైనా గౌరీనాథం ఆ పని చెయ్యకుండా ఆపమని అడుగుతారు.



అప్పుడు యాజులుకి కృష్ణానది ఒడ్డున పని చేసుకుంటున్న రకరాకల వృత్తుల వారు -

ఏ కులమూ నీదంటే గోకులమూ నవ్విందీ
మాధవుడూ యాదవుడూ మాకులమే లెమ్మందీ
- అన్న పాట పాడుకుంటూ కనిపిస్తారు.

ఎంత అర్థవంతమైన వాక్యాలు! గోకులంలోనే శ్రీకృష్ణుడి బాల్యం గడిచింది. శ్రీకృష్ణుడంటే శ్రీ మహావిష్ణువు అవతారం. అంటే సాక్షాత్తూ భగవంతుడే. మాధవుడే. గోకులంలో నందుడి తనయుడిగా పెరిగిన మాధవుడిది యాదవకులమేగా!



భగవంతుడికే కులం ఆపాదిస్తూ పాట మొదటి రెండు వాక్యాలు కులాల అసంబద్ధతని ప్రతిపాదిస్తాయి.

యాజులు మనస్సులో ఇంకా అనుమానం ఏదైనా ఉంటే మొదటి చరణంతో పటాపంచలైపోవాలి -

ఏడూ వర్ణాలు కలిసి ఇంద్రధనుస్సవుతాదీ
అన్నీ వర్ణాలకూ ఒకటే ఇహమూ పరముంటాదీ

- వర్ణం అన్న మాట మీద చమత్కారం. ఇంద్రధనుస్సులో రంగులుంటాయి. సమాజంలో జాతులుంటాయి. రెండూ వర్ణాలే. రంగులైనా జాతులైనా కలిసుంటేనే ఇహమైనా, పరమైనా.

యాజులు కుటుంబాన్ని చూసి జనం తప్పుగా తక్కువగా మాట్లాడుకుంటూ ఉంటారు. అదేం పట్టించుకోకూడదన్నట్లు -

ఆది నుండి ఆకాశం మూగదీ
అనాదిగా తల్లి ధరణి మూగదీ
నడుమ వచ్చి ఉరుముతాయి మబ్బులూ
నడమంత్రపు మనుషులకే మాటలూ
ఇన్ని మాటలూ

- అని పాట ముగుస్తుంది.

ఆకాశానికీ, భూమికీ లేని గొడవలు మనుషులకే కావాలి, వారి మాటలని పట్టించుకోవద్దు అన్న సందేశం స్పష్టంగా వినిపిస్తుంది.

పాట ముగిసే సరికి యాజులికి కర్తవ్యం అర్థం అవుతుంది. ఐనా ఒక్క సారి తన ఆప్తమిత్రుడు రాజులుతో ముచ్చటిస్తాడు. అన్నీ విని హరిజనులంటే ఎవరు - ఆ హరి జనులు అని బోధపరుస్తాడు రాజులు.

వేటూరి సుందరరామమూర్తి విశ్వనాథ్ గారి చిత్రాలకి రాసిన పాటలన్నీ రత్నాలే. ఆయన మనస్సనే తరగని గనిలోంచి ఆయన అనంతంగా పాటలను తవ్వి తీస్తూనే ఉండగలరు. అలా తీసిన ఒక అనర్ఘ రత్నం ఈ పాట.

వేటూరి ఇచ్చిన రత్నాలను మహదేవన్ అందమైన సువర్ణాభరణాల వంటి బాణీలలో బహు చక్కగా పొదుగుతారు. ఈ పాటనీ అలానే పొదిగారు.

బాలూ జానకమ్మల గళాలలో ఆ రత్నాభరణం విరాజిల్లింది.

కృష్ణా నదీ, అమరేశ్వరాలయం, తీరాన ప్రజలూ, నిలువెత్తు సోమయాజులూ, ఒదిగున్న సబితా - వినడానికి ఎంత బావుంటుందో చూడ్డానికి అంత బావుండేలా చేసారు ఆ పాటని.

# శుభలేఖ

## మరుగేలరా

రచన : త్యాగరాజస్వామి

సంగీతం : కె వి మహదేవన్

గానం : ఎస్ జానకి



**పల్లవి**

మరుగేలరా ఓ రాఘవా

**అనుపల్లవి**

మరుగేల చరాచరరూప పరాత్పర సూర్యసుధాకరలోచన

**చరణం**

అన్ని నీవనుచు అంతరంగమున తిన్నగా వెదకి తెలిసి కొంటినయ్య
నిన్నే కాని మదిని ఎన్నుజాలను ఒరుల నన్ను బ్రోవవయ్య త్యాగరాజనుత

విశ్వనాథ్ తన చిత్రాలలో ప్రఖ్యాత వాగ్గేయకారుల గీతాలు విరివిగా వాడుతూ ఉంటారు. అవి సమయోచితంగా సందర్భానికి సరిపోయేలా ఉంటాయి. కానీ అవి సామాన్యంగా సంగీత ప్రధానమైన చిత్రాలలో ఉంటాయి. పాడే పాత్రలు కూడా సంగీతజ్ఞులై ఉంటారు.

ఒక్క శంకరాభరణం చిత్రంలోనే మైసూరు వాసుదేవాచార్ బ్రోచేవారెవరురా, సదాశివ బ్రహ్మేంద్ర మానస సంచరరే, భద్రాచల రామదాసు పలుకే బంగారమాయెనా, ఏ తీరుగ నను దయ చూచెదవో వంటి పాటలని వినియోగించుకున్నారు. త్యాగరాజస్వామి సామజవరగమనా, దొరకునా ఇటువంటి సేవ కీర్తనల పల్లవులను కూడా ఉపయోగించుకున్నారు.

సప్తపది చిత్రంలో మహిషాసుర మర్దిని స్తోత్రం, శ్రీదుర్గా సూక్తంతో పాటు త్యాగరాజస్వామి మరుగేలరా ఓ రాఘవా కీర్తన కూడా ఉంది. దాన్ని హేమ హరిబాబు కోసం ఆలయంలో ఎదురు చూస్తూ పాడడం మొదలెడుతుంది. ఆ పాటే హరిబాబు వచ్చాక హేమ అతనికి పువ్వులిచ్చి తీసుకున్నంత వరకూ ఉంటుంది. పాడిన హేమ నాట్య సంగీతాలు నేర్చిన పిల్ల.

అదే త్యాగరాజ స్వామి కీర్తనని శుభలేఖ చిత్రంలో సుజాత మూర్తిల మీద చిత్రీకరించారు. ఈ కీర్తన సుజాత పాడదు. చిత్రంలో సుజాత పాత్ర సంగీతం నేర్చినది కాదు. అందుకే సుజాత అంతరంగం పాడుతున్నట్లు చిత్రీకరించడం చిత్రానికీ, సన్నివేశానికీ సరిగ్గా సరిపోయింది.

అన్నమయ్య సంకీర్తనలలో అక్కడక్కడా శృంగారం తొంగి చూస్తూ ఉంటుంది. ఆయన కీర్తనలలో అలమేలు మంగకీ వేంకటేశ్వర స్వామికీ మధ్య సరసాలు ఉంటాయి.

త్యాగరాజస్వామి కీర్తనలలో అటువంటి శృంగారాలూ, సరసాలూ కనిపించవు. ఈ కీర్తన కూడా జానకి రాఘవుడితో పాడింది కాదు. త్యాగరాజస్వామే తన భక్తి భావాలని రాముడితో విన్నవించుకున్నారు.

అలాంటి కీర్తనని ఒక అమ్మాయి అబ్బాయితో తన మనస్సు విప్పి చెప్తున్నట్లు పాడించడం విశ్వనాథ్ గారి ఊహ. కీర్తనలోని మార్దవం ఒక ప్రియురాలు ప్రియుడితో పాడితే అతిమధురంగా వినిపించేలానే ఉంటుంది.

సప్తపది చిత్రంలో హేమా, హరిబాబు ఒకరి మనస్సులో ఒకరు ఉంటారు. ఆ విషయం ఒకరికొకరికి తెలుసు. అందుకే హేమ ఆ పాట బాహాటంగా పాడగలిగింది.

ఐతే శుభలేఖ చిత్రంలో మూర్తికి సుజాత మీద ఉన్నది గౌరవం, అభిమానం. అంతకు మించి ఏదైనా ఉందో లేదో సుజాతకి తెలియదు. అలాగే సుజాత మనస్సులో మూర్తి మీద కృతజ్ఞతా, అభిమానం ఉన్నాయి. అవి అంతకు మించి ప్రేమగా మారుతున్నాయేమో అని సుజాతకి అనిపిస్తున్న సందర్భంలో వస్తుంది ఈ కీర్తన.

ఆ పాట నేపథ్యంలో వస్తోంటే వారిద్దరి మధ్య సన్నివేశాలు నడిచిపోతూంటాయి. సుజాత మెట్లు దిగడం, మూర్తి సుజాత స్నానానికి కావల్సినవన్నీ సమకూర్చడం, సుజాత మూర్తిని చదువుకోమని మందలించడం ఎంతో సహజంగా జరిగిపోతాయి. ఐతే అవి సుజాత మనస్సులో తెలియకుండా మూర్తి పట్ల సాన్నిహిత్యం పెంచుతాయి.

త్యాగరాజస్వామి కీర్తన గురించి మనం చెప్పుకోవల్సిందీ, చెప్పుకోగలిగిందీ ఏముంటుంది? మనం చెయ్యగలిగింది ఆ మహానుభావుడికీ, ఆయన కీర్తనలకీ మనసారా నమస్కరించుకోవడం ఒక్కటే.

మహదేవన్, జానకిలు సప్తపదిలోనూ, శుభలేఖలోనూ ఈ కీర్తనకి చెయ్యవలసిన మాయంతా చేసేసారు.

చిరంజీవి నటన బావుంది.

ఈ కీర్తన ఎంత నాజూకుగా ఉంటుందో అంత నాజూకుగా ఉంటారు సుమలత.





# స్వాతిముత్యం

## మనసు పలికే

విశ్వనాథ్ గారు తన చిత్రాలలో అశ్లీలతకీ, అసభ్యతకీ ఆస్కారం ఇవ్వరన్నది జగమెరిగిన సత్యం. కొన్ని చిత్రాలలో కొన్ని సన్నివేశాలలో నవరసాలలో ఒకటైన శృంగారాన్ని చూపిస్తూంటారు. ఐతే అది ఎప్పుడూ మితిమీరదు. అది దాంపత్య జీవితంలో భాగంగానే ఉంటుంది.

స్వాతి ముత్యంలో శివయ్య లలితల సంసార జీవితం ఒక విచిత్రం. లలిత అంతకు ముందే నచ్చిన వాడిని పెళ్ళి చేసుకుని ఒక కొడుకుని కూడా కంటుంది. తల్లైన తర్వాత విధివశాత్తూ భర్తని కోల్పోతుంది.

శివయ్యకి ఒక ప్రమాదంలో మతి కొంచెం చెడుతుంది. తెలివితేటలు కాస్త లోపిస్తాయి. ఐతే అతని మంచితనం ముందు ఆ లోటు అసలు కనిపించదు. అతని అమాయకత్వం, మంచితనం కలిసి అతని చేత లలిత మెళ్ళో తాళి కట్టిస్తాయి.

శివయ్య అమాయకుడు. అతనికి సాంసారిక జీవితం అంటే తెలియదు. ఎంత తెలియదంటే చాకలి సుబ్బులు స్నానం చేస్తూ తన వీపు రుద్దమంటే ఏ విధమైన కామోద్దేశమూ లేకుండా రుద్దుతాడు. శివయ్యలో ఉన్న అమాయకత్వం తెలిసే సుబ్బులు అతన్ని రుద్దమని అడగగలుగుతుంది.

అదే సుబ్బులు పెళ్ళైన లలితకి శివయ్యతో సాంసారిక జీవితం హాయిగా గడపమని సలహా ఇస్తుంది. నువ్వే నీ జీవితాన్ని పండించుకో అని చెప్తుంది.

దాంపత్య జీవితం అంటే తెలియని శివయ్యకి లలితే శృంగారాన్ని నేర్పుకోవలసి వస్తుంది. భార్య భర్తకి సంసార జీవితం నేర్పించే సన్నివేశాన్ని ఎంత మృదువుగా, సున్నితంగా, సుమధురంగా సహజంగా చిత్రీకరించారో విశ్వనాథ్. ఆ సన్నివేశంలోని పాట పల్లవే -

మనసు పలికే మౌనగీతం నేడే
మమతలొలికే స్వాతిముత్యం నీవే
అణువు అణువు ప్రణయ మధువు
తనువు సుమధనువూ

– ఈ పల్లవిలోని మాటలని ఒక్కటొక్కటే లలిత పాడుతోంటే శివయ్య ఆమె వెనకే పాడుతూంటాడు.

మొదటి చరణం ఇద్దరూ కలిసి కాలవలో స్నానం చేస్తున్నప్పుడు వస్తుంది -

శిరసు పైనా గంగనై మరుల జలకాలాడనీ
సగము మేనా గిరిజనై పగలు రేయీ ఒదగనీ
హృదయ మేళనలో మధుర లాలనలో
వెలిగిపోనీ రాగదీపం వేయిజన్మలుగా
- స్నానం చేస్తూ లలిత శివయ్యని దగ్గరకి తీసుకోవడం, కితకితలతో కవ్వించడం శివయ్యని లలిత దగ్గరకి చేరేలా చేస్తాయి. అతనిలో ఇష్టాన్నీ, కోరికలనీ కలిగిస్తాయి.

రెండవ చరణం వచ్చే సరికి శివయ్యే లలిత దగ్గరకి వస్తాడు -



కానరానీ ప్రేమకై ఓనమాలు దిద్దనీ
పెదవిపైనా ముద్దునై మొదటి తీపి అద్దనీ
- అన్న వాక్యాలలో ఓనమాలు దిద్దనీ అన్న మాటలు లలిత శివయ్యకి ప్రేమ పాఠాలు నేర్పించడాన్ని స్ఫురిస్తాయి. ఇంక పెదవి పైన తొలి ముద్దు తీపి ఎంత మధురంగా సూచించారో, చూపించారో.

రెండవ చరణాన్ని పూర్తి చేస్తూ -

లలిత యామినిలో కలల కౌముదిలో
ఒదిగిపోనీ కాలమంతా కౌగిలింతలుగా

- లలిత లలిత యామినిలో అని అనడంలో ఎంత లాలిత్యం!

పాఠం సంపూర్ణంగా సఫలీకృతమైనట్లు - పల్లవి మళ్ళీ పాడుతున్నప్పుడు ముందుగా శివయ్య మాటలు అంటూ ఉంటాడు. లలిత అతన్ని అనుసరిస్తూ పాడుతుంది.

పాట చివరన ఇద్దరూ పక్క పక్కనే పడుకున్నప్పుడు శివయ్య తన భుజాన్ని లలిత శిరస్సుకి ఆధారంగా ఇస్తాడు. ఆ పాటకి ఎంత చక్కటి ముగింపో. వారి దాంపత్య జీవితానికి ఎంత చక్కటి ఆరంభమో.

ఇటువంటి పాటలని కడు రమ్యంగా రాయడంలో సిద్ధహస్తులు సి నారాయణరెడ్డి. ఆయన పాటలు వింటోంటే ప్రబంధాలు చదువుతున్న అనుభవం కలుగుతుంది. ఈ సన్నివేశానికి ఈ పాట రాయడం ఆయనికి వెన్నతో పెట్టిన విద్య. విశ్వనాథ్ నారాయణరెడ్డిల అనుబంధం ఏ నాటిదో.

ఇళయరాజా సంగీతం వింటోంటే మనమొక శృంగార యాత్రలో విహరిస్తున్న అనుభూతి కలుగుతుంది.

జానకినీ, బాలూనీ వాయిస్ యాక్టర్స్ అనచ్చు. తెర మీద కనిపించకుండా తమ గానంతో పాటకీ, పాటలో నటించిన వారికీ, పాట చిత్రీకరణకీ కావల్సినంత గాత్రనటన వాళ్ళు ముందే చేసేస్తారు. ఈ పాట వారి గొప్పతనానికి గొప్ప ఉదాహరణ.

కమల్ ఏ చిత్రంలోనో ఏ సన్నివేశంలోనో బాగా చేశారని చెప్పడం సూర్యుడికి దివిటీ పట్టడం లాంటిదే. నవరసనాయకుడు కమల్.

అతనికి దీటుగా నటించగల నటి రాధిక. ఈ చిత్రంలో చాలా అందంగా, నిండుగా, హుందాగా ఉంటారు. చిత్రం అంతా ఉన్నతంగా నటించిన రాధిక ఈ పాటకి అత్యుత్తమ నటనని ప్రదర్శించారు.

కమల్, రాధికలు ఇద్దరూ కలిసి –
అణువు అణువు ప్రణయ మధువు తనువు సుమ ధనువు
– లాగే కనిపిస్తారు.

# సిరివెన్నెల

## మెరిసే తారలదే రూపం

విధాత తలపున ప్రభవించినది అన్న గీత, సంగీతాల సంగమ గీతమైనా, ఆది భిక్షువు వానినేమి కోరేది అని శివుడి నిందాస్తుతి ఐనా, ప్రకృతి కాంతకు ఎన్నెన్ని హొయలో అంటూ ప్రకృతి విన్యాసమైనా - తన మొదటి చిత్రంలోనే తన విరాట్రూపం చూపించారు సిరివెన్నెల సీతారామశాస్త్రి.

ఇన్ని పాటలని పక్కన పెట్టి మెరిసే తారలదే రూపం పాటని నేను ప్రస్తావించడానికి కారణాలు - ఆ పాట జ్యోతిర్మయి, హరిప్రసాద్ మనోభావాలని విశదీకరించడం. చిత్రంలో అతి కీలకమైన ఘట్టంలోని సన్నివేశాన్ని మాటే పాటగా వివరించడం. అంతర్లీనంగా విశ్వ వేదాంతం వినిపించడం.

జ్యోతిర్మయిని హరిప్రసాద్ ఇష్టపడుతున్నాడనీ, పెళ్ళి చేసుకుంటాడనీ సుభాషిణి జ్యోతిర్మయితో చెప్తుంది.

జ్యోతిర్మయి హరిప్రసాద్ ని నన్ను పెళ్ళి చేసుకుంటావా అని నవ్వి, నా గురించి నీకేం తెలుసు అని అడిగి, నేనెలా ఉంటానో, నా రూపం ఏమిటో తెలవాలిగా అని అంటుంది.

ఆ ప్రశ్నకి సమాధానంగా -
మెరిసే తారలదే రూపం?
విరిసే పువ్వులదే రూపం?



- అని ప్రశ్నకి సమాధానంగా ప్రశ్నలనే పాటగా అడుగుతాడు.
అడిగి -
అది నా కంటికి శూన్యం
- అని నిర్ధారిస్తాడు. అక్కడితో ఆగకుండా -

మనసున కొలువై
మమతల నెలవై
వెలసిన దేవిది ఏ రూపం?

అని తనకి తానే సమాధానం చెప్పుకుంటున్నట్లు జ్యోతిర్మయికీ ప్రేక్షకులకి కూడా సమాధానం చెప్తాడు. చెప్పి -

నా కన్నులు చూడని రూపం
గుడిలో దేవత ప్రతిరూపం

నీ రూపం అపురూపం
- అని అంటాడు, అంతకు మించిన రూపంతో నాకు పనేంటి అన్నట్లు.

రూపం తెలియకపోతే సరే కులం, గుణం ఐనా తెలియాలిగా అని జ్యోతిర్మయి ప్రశ్నిస్తే, మళ్ళీ ప్రశ్నలతోనే సమాధానం పాటగా చెప్తాడు -

వసంత మాసపు కులగోత్రాలను
ఎల కోయిల అడిగేనా?
తొలకరి మేఘపు గుణగణాలకై
నెమలి వెదుకులాడేనా?

తను కోయిల. తను నెమలి. జ్యోతిర్మయి వసంతకాలం. జ్యోతిర్మయి తొలకరి మేఘం. జ్యోతిర్మయే తనని పాట పాడమని పిలిచింది. ఆడమని అడిగింది.

చక్కని ఉపమానాలతో ప్రశ్నలే సమాధానంగా సమాధానాలు ఇస్తాడు. ఇంక ఏం అడగాలో తెలియక నా పుట్టు పూర్వోత్తరాలైన తెలుసుకోవాలిగా అని అన్న జ్యోతిర్మయికి -

ప్రాణం పుట్టుక ప్రాణికి తెలియాలా?
గానం పుట్టుక గాత్రం చూడాలా?
- అన్న వేదాంత పరమైన ప్రశ్నలతో జవాబు చెప్తాడు.

చివరికి నిస్సందేహంగా నువ్వు నాకెవరివో నాకు తెలుసునన్నట్లు -

వెదురును మురళిగ మలచి
నాలో జీవననాదం పలికిన
నీవే నా ప్రాణ స్పందన
నీకే నా హృదయ నివేదన
- అని స్పష్టం చేస్తాడు.

వెదురును మురళిగ మలవడం అనే ఉపమానం ఈ చిత్రానికి పూర్తిగా సముచితమైనది. తనకి తాను పాడుకుంటూ వేణువు ఊదుకుంటూ కాలం గడిపే హరిప్రసాద్ కి ప్రకృతిని పరిచయం చేసి, హరిప్రసాద్ ని ప్రపంచానికి పరిచయం చెయ్యడం వెదురును వేణువుగా మలవడమే. అది చేసిన జ్యోతిర్మయికే హరిప్రసాద్ హృదయ నివేదన చేస్తున్నానని అనడం వారిద్దరి సంబంధానికి సరైన నిర్వచనం.

ఈ పాటని పాడిన బాలూ గురించి చెప్పాల్సింది ఏముంది? బాణీ కట్టిన మహదేవన్ మహత్తుని గురించి పొగడాల్సింది ఏముంది? అభినయించిన సర్వదమన్, మున్ మున్ సేన్ ఆ పాత్రలలో పాటలో ఒదిగిపోయారు.

రాసిన సీతారామశాస్త్రీ, రాయించుకున్న విశ్వనాథ్ చిరస్మరణీయులు.

వారిద్దరి బంధం విశ్వనాథ శాస్త్రీయం!





# స్వాతి కిరణం

## జాలిగా జాబిలమ్మ

స్వాతి కిరణం చిత్రంలో మరువలేనిదీ, మరపురానిదీ జాలిగా జాబిలమ్మ అన్న పాట. ఈ పాటని ఉత్తమ గాయనిగా జాతీయ అవార్డు అందుకున్న ఇద్దరు గాయనీ మణులు గానం చేసారు. రాధిక పాత్రకి చిత్ర. మంజునాథ్ పాత్రకి వాణీ జయరాం.

సంగీత సామ్రాట్టు అనంతరామశర్మ భార్య శారద. పిల్లలు లేని శారద బాగా పాడుతున్న గంగాధరాన్ని స్వంత పిల్లాడిలా చూసుకుంటూ ఉంటుంది. ఐతే గంగాధరం గాన కౌశలానికి శర్మ అసూయ పడతాడు. అది ద్వేషంగా మారుతుంది. ఆ ద్వేషం అయన హృదయాన్ని దహించివేస్తుంది. అంతటి ఉన్నతమైన వ్యక్తి ఉద్రేకానికి లోనవుతాడు. గుండె నొప్పితో ఆసుపత్రి పాలవుతాడు.

ఇంటిదగ్గర అమ్మవారిని వేడుకుంటూ కూర్చున్న శారదని చూసిన గంగాధరం, బాధతో పాట రూపం లో

జాలిగా జాబిలమ్మా రేయి రేయంతా
రెప్పవెయ్యనేలేదు ఎందు చేతా

- అని శారదని జాబిలమ్మ తో పోలుస్తూ రాత్రంతా నిద్ర ఎందుకు పోలేదని అడుగుతాడు.



సమాధానంగా శారద -

పదహారు కళలనీ పదిలంగా ఉంచని
ఆ కృష్ణపక్షమే ఎదలో చిచ్చు పెట్టుట చేత

- అని కృష్ణపక్షం తన మనస్సులో చిచ్చు పెట్టడం వల్ల నిద్ర పట్టడం లేదని చెప్తుంది శారద.

శారదా గంగాధరంల సంభాషణ అంతా కవిత్వ ధోరణిలా సాగుతుంది.

శారదని సముదాయిస్తూ గంగాధరం -
కాటుక కంటినీరు పెదవులనంటనీకు
చిరునవ్వు దీపకళిక చిన్నబోనీయకు
నీ బుజ్జి గణపతిని బుజ్జగించి చెపుతున్నా

నీ కుంకుమ కెపుడూ పొద్దు గుంకదమ్మా
– అని నీ నవ్వును చెరిగి పోనీకు, నీ కుంకుమ చిరకాలం నిలుస్తుంది అని బుజ్జగించి చెప్తాడు.

పాటంతా ఉపమాన, దృష్టాంత, రూపకాలంకారాలతో నిండి ఉంటుంది.

గంగాధరం ఎంత బుజ్జగించినా శారద దుఃఖం ఆగదు –

సున్ని పిండిని నలిచీ, చిన్నారిగా మలిచీ
సంతసాన మునిగింది సంతులేని పార్వతి
సుతుడన్న మతి మరిచీ, శూలాన మెడ విరిచీ
పెద్దరికం చూపే చిచ్చుకంటి పెనిమిటి

– అటు పార్వతి తయారు చేసుకున్న వినాయకుడి తల నరికిన పశుపతి. ఇటు శారద పెంచుకుంటున్న గంగాధరాన్ని చంపడానికి సిద్ధపడుతున్న శర్మ.

సంతులేని పార్వతి, చిచ్చుకంటి పెనిమిటి అన్న మాటలు అటు పార్వతి కథకీ, ఇటు శారద కథకీ సంబంధం ఉన్నవే.

అక్కడితో ఆపకుండా శారద –
కాలకూటం కన్న ఘాటైన గరళం
– అని అంటుంది. తనున్న పరిస్థితిని వివరించడానికి అంత కన్న బలీయమైన పద ప్రయోగం ఉండదేమో.

తను మాతగా, జగన్మాతగా ఆరాధించుకునే శారదని ఓదార్చడానికి గంగాధరం –

ఆటుపోటు ఘటనలివీ,
ఆటవిడుపు నటనలివీ
ఆదిశక్తివి నీవూ, అంటవు నిన్నేవీ
– అని లోక వినాశాన్నీ, విశ్వ విన్యాసాన్నీ శివపార్వతుల విలాసంగా వివరిస్తాడు. అంతే కాకుండా అవేం ఆదిశక్తివైన నిన్నంటవు అంటాడు. ఎంత విశాలమైన ఆలోచన.

ఇంక చివరగా -

కంచికి వెళ్ళి పోయేవే కథలన్నీ
- అని చెప్తాడు, తన కథ కంచికి వెళ్ళి పోతుందని సూచిస్తున్నట్లు.

పాట వింటోంటే మన కళ్ళ లో నీళ్ళు సుళ్ళు తిరుగుతాయి.

ఆ కంటి నీటిని శారదా, గంగాధరం అన్యోన్యానురాగాలు తెప్పిస్తాయి. వారి బాధ తెప్పిస్తుంది.

రాధికా, మంజునాథ్ ముఖకవళికలతో, హావభావాలతో చూపించిన పరస్పరాభిమానాభినయం తెప్పిస్తుంది.

సిరివెన్నెల పాట తెప్పిస్తుంది. మహదేవన్ రాగం తెప్పిస్తుంది.

అన్నింటి కన్న చిత్రా, వాణీలు పలికించిన భావం తెప్పిస్తుంది.

# మరపురాని సన్నివేశాలు





# మరపురాని సన్నివేశాలు

ఏ చిత్రమైనా సన్నివేశాల క్రమబద్ధమైన కలయిక. ప్రతి సన్నివేశం బావుండాలి. అది ముందువెనకల సన్నివేశాలతో కలిసిపోవాలి. సన్నివేశాలు రంగురంగుల పువ్వులైతే సినిమా వాటితో కట్టిన దండ.

అసలు చిత్రాన్ని సన్నివేశాలుగా ఊహించుకుంటారని నాకు నిర్మాత మురారి ద్వారా తెలిసింది. మురారి విశ్వనాథ్ గారితో సీతామాలక్ష్మి చిత్రం తీసిన నిర్మాత. స్వాతి మాసపత్రిక అనుబంధంలో నేను రాసిన ఎరుపు తెల్లపోతోంది నవల చదివి సినిమా తియ్యడం గురించి చర్చించడానికి మురారి నన్ను పిలిచారు. ఒక దర్శకుడు ఎవరో కూడా ఆయనతో అక్కడ ఉన్నారు. అప్పుడు మురారి నవలని సినిమా తియ్యాలంటే 60-70 సీన్స్ కావాలి అని, వాటి గురించి ఆలోచించాలి అని అన్నారు.

రెండు సిట్టింగులు ఐన తర్వాత నా ఆఫీసు బాధ్యతలకీ సుదీర్ఘ చర్చలకీ లంకె కుదరదని అర్థం అయింది నాకు. నేను రాలేనని మురారికి కబురుపంపి మళ్ళీ అటువెళ్ళలేదు. ఐతే చిత్రాన్ని సన్నివేశాలుగా ఊహించుకోవాలన్న పాఠం మాత్రం నేర్చుకున్నాను.

సన్నివేశం కొద్ది నిమిషాల పాటు నడిచే చిత్రభాగం. ప్రతీ సన్నివేశం ద్వారా కథ కొంత ముందుకు నడవాలి. చూడ్డానికి ఆసక్తికరంగా ఉండాలి. ఏం జరుగుతుందో అన్న కుతూహలం కలిగించేలా ఉండాలి. జరుగుతున్న సన్నివేశం మీద ఆసక్తి తగ్గిపోకుండా రాబోయే సన్నివేశం మీద కుతూహలం కలిగించడం దర్శకుడి నైపుణ్యానికి పెద్ద పరీక్ష.

సన్నివేశాలన్నీ సక్రమంగా రాసుకున్నదే స్క్రిప్ట్. సినిమాలకి రాసిన స్క్రిప్టుని స్క్రీన్ ప్లే అని అంటారు. దాన్ని తెలుగులో చిత్రానువాదం అనో దృశ్యరచన అనో అంటారు.

ప్రఖ్యాత దర్శకులు సత్యజిత్ రాయ్ తను రాసుకున్న సన్నివేశాలకి పక్కనే బొమ్మలు గీసుకునేవారు. ఆ బొమ్మల్లో సన్నివేశ చిత్రీకరణకి ఉండవలసిన నేపథ్య వాతావారణం గీసుకునేవారు. అంటే ఒక గదిలో తియ్యవలసి వస్తే, ఆ గదిలో ఉండవలసిన సామగ్రి అంతా సమగ్రంగా బొమ్మలో ఉంటుంది. అలాగే పాత్రలు ఎవరెవరు ఉండాలీ, ఎక్కడెక్కడ నిల్చోవాలీ, ఎటు నుండి రావాలీ, కెమెరా ఏ పక్కనుండి ఏ షాట్ తియ్యాలీ అంతా బొమ్మల రూపంలో గీసుకునేవారు. స్వయంగా చిత్రకారుడు అవడంవల్ల చిత్రదర్శకుడు బాపు ఈ పద్ధతి అవలంబించేవారు.

తెలుగులో ప్రజారంజక చిత్రాలకి మారుపేరైన విజయా సంస్థ సాఫీగా సజావుగా సాగిపోయే స్క్రీన్ ప్లేలకి ప్రసిద్ధి. వాటి వెనక చక్రపాణి గారి అదృశ్య హస్తం ఉందన్నది జగమెరిగిన రహస్యం. మాయాబజారు స్క్రీన్ ప్లేని ఫిల్మ్ ఇన్స్టిట్యూట్లలో రచయితలకీ దర్శకులకీ పాఠ్యాంశంగా పెడుతున్నారుట.

ఆ సినిమాలో ఏ సన్నివేశమూ అతికినట్లు ఉండదు. ప్రతి సన్నివేశం కథాగమనానికీ వేగానికీ దోహదం చేస్తూనే ఉంటుంది. ఎన్ని సార్లు చూసినా ఎక్కడా కుదుపు ఉండదు. ఒడిదుడుకులు లేని రహదారి మీద మెర్సిడెస్ కార్లో కూచుని ప్రయాణం చేస్తున్నట్లు ఉంటుంది ఆ సినిమా చూస్తున్నంతసేపూ. అది కె వి రెడ్డి మాయజాలం.

స్క్రిప్ట్ ఎంత బాగా రాసుకున్నా షూటింగ్ చేస్తున్నప్పుడు అప్పటికప్పుడు కొన్ని మార్పులూ చేర్పులూ చేసుకుంటూ మెరుగులు దిద్దుతూనే ఉంటారు దర్శకులు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో చాలా వాటికి తనే స్వయంగా కథా, స్క్రీన్ ప్లే రాసుకున్నారు. ఆయన స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది. అలాగే అప్పటికప్పుడు కూర్చిన మార్పులూ చేర్పులూ అందంగా అమరిపోతాయి. అందుకే ఆయన చిత్రాలలో సన్నివేశాలు అనితరసాధ్యంగా పండుతాయి.

ప్రతిచిత్రానికీ తెర తీయగానే కనిపించే సన్నివేశం చాలా ముఖ్యం. ప్రారంభం బావుంటే చిత్రం చూడాలి అన్న ఉత్సుకత కలుగుతుంది.

అలాగే పతాక సన్నివేశం. ఆ సన్నివేశంలో కలిగే ఆలోచనలతో, అనుభూతులతో ప్రేక్షకులు సినిమా హాలు నుండి బయటకి నడుస్తారు. ఆ సన్నివేశం మనస్సుకి హత్తుకుని పోయేలా ఉంటే చిత్రం ప్రేక్షకులకి గుర్తుండిపోతుంది. మళ్ళీ మళ్ళీ చూసేలా చేస్తుంది. పతాక సన్నివేశాల చిత్రీకరణలో విశ్వనాథ్ గారికి తిరుగే లేదు.

ప్రారంభ, పతాక సన్నివేశాలే కాకుండా చిత్రంలో ఆకట్టుకునే సన్నివేశాలు ఉంటాయి. కొన్ని పాటల సన్నివేశాలు ఐతే, మరి కొన్ని భావోద్వేగపు సన్నివేశాలు ఉంటాయి.

ఏ సన్నివేశమైనా అలా అవుతుందని ప్రేక్షకులు అసలు ఊహించ లేకపోతే అది బాగా పండుతుంది. విశ్వనాథ్ గారి చిత్రాలలో ఎన్నో సన్నివేశాలు ప్రేక్షకులని ఉలిక్కి పడేలా చేస్తాయి. ఉక్కిరిబిక్కిరి చేసేస్తాయి. కన్నీళ్లని తెప్పిస్తాయి. గుండె తడి చేస్తాయి. ఆ సన్నివేశాలని మళ్ళీ ఎప్పుడు చూసినా, మళ్ళీ అదే పులకింత, అదే గుండెసవ్వడి, అదే కంటతడి, అదే ఆర్ద్రత అనుభవంలోకి వస్తాయి!



ఈకింది పది చిత్రాలలో సన్నివేశాలని ఒకసారి చూద్దాం.

- ★ ఉండమ్మా బొట్టు పెడతా - పతాక సన్నివేశం
- ★ చిన్ననాటి స్నేహితులు - ఎందుకయ్యా నవ్వుతావు పాట
- ★ శారద - పతాక సన్నివేశం
- ★ జీవనజ్యోతి - పతాక సన్నివేశం
- ★ సాగరసంగమం - తకిట తధిమి తకిట తధిమి తందానా పాట
- ★ స్వర్ణకమలం - పతాక సన్నివేశం
- ★ స్వయంకృషి - పతాక సన్నివేశం
- ★ సూత్రధారులు - రెండు సన్నివేశాలు
- ★ శుభసంకల్పం - పాత్రలూ, సంబంధాలూ, సన్నివేశాలు
- ★ స్వరాభిషేకం - ఒక్క క్షణం పాట

# ఉండమ్మా బొట్టు పెడతా

## పతాక సన్నివేశం

లక్ష్మి తన పురిటికోసం పుట్టింటికి వెళ్ళిన సమయంలో మెట్టింట్లో పరిస్థితులు అంతకు ముందు కన్న దిగజారిపోతాయి. బావగార్ల అన్యాయాలూ, తోటికోడళ్ళ కలహాలూ ఇంకా మితిమిరిపోతాయి. నిస్సహాయంగా భర్తా, మావగారూ తన రాక కోసం ఎదురు చూస్తూంటారు. అలాంటి సమయంలో లక్ష్మి పుట్టిన బిడ్డతో పుట్టింటి నుండి మెట్టింటికి తిరిగి వస్తుంది.

మెట్టింట్లోకి అడుగుపెడుతున్న లక్ష్మికి ఇంట్లోనుండి లక్ష్మీదేవి వెళ్ళిపోతూ కనిపిస్తుంది. వారిద్దరి మధ్యా సంభాషణ ఇలా సాగుతుంది.

ఎందుకమ్మా వెళ్ళిపోతున్నావని లక్ష్మి అడిగితే ఈ నరకంలో ఉండలేనమ్మా అని లక్ష్మీదేవి సమాధానం ఇస్తుంది.

ఇది నరకమా అని లక్ష్మి ప్రశ్నిస్తే భక్తిశ్రద్ధలు లేని అన్నదమ్ములూ, తోటికోడళ్ళూ ఉన్న ఇల్లు నరకం కాక ఇంకేం అవుతుందని ఎదురు ప్రశ్న వేస్తుంది.

చిన్నప్పట్నుంచీ నిన్ను కొలుచుకున్నందుకు నాకు నీవిచ్చేది ఇదేనా అని లక్ష్మి ఆవేదన ప్రదర్శిస్తే అందుకే నువ్వు నాతో వచ్చెయ్యి అని ఆప్యాయంగా పిలుస్తుంది లక్ష్మీదేవి.

నీకు నా మీద అంత ఆదరం ఉంటే నువ్వు నా కోసం నా ఇంట్లోనే నా వాళ్ళతో ఉండచ్చు కదా అని లక్ష్మి అర్థిస్తుంది.

ఈ యిల్లు నీది కానీ నీ యిల్లు ఇది కాదు. ఇంట్లో వాళ్ళు నీ వాళ్ళు కానీ నువ్వు వాళ్ళ దానివి కాదు అని లక్ష్మి ఇంట్లో ఉన్న వాళ్ళు తన్నే కాకుండా తన భక్తురాలైన లక్ష్మిని కూడా నిరాదరణతో చూస్తున్నారన్న నిజం నిక్కచ్చిగా చెప్తుంది.



నువ్వన్నా నీ భక్తి శ్రద్ధలన్నా నాకు ప్రీతి. నేను నీతో ఉండాలని అనుకుంటున్నాను, నువ్వు నాతో రా అని అంటుంది లక్ష్మీదేవి.

ఎవరి కారణంగా తన్నెంతో అభిమానించే లక్ష్మీదేవి ఇల్లు వదలి వెళ్ళిపోతానంటోందో ఆ లక్ష్మీదేవితోనే ఏ తోటికోడళ్ళు తనని అష్టకష్టాలు పెట్టారో వాళ్ళని తన వాళ్ళని అంటుంది లక్ష్మి. నా వాళ్ళతో విడిపోయి రమ్మంటావా అని అడుగుతుంది.



ఇప్పుడు మాత్రం కలిసున్నారా అని నిలదీస్తుంది లక్ష్మీదేవి.

ఈ కుటుంబం నాది, నేను రాలేను, నువ్వు ఉండిపో అని ప్రార్థిస్తుంది లక్ష్మి.

నేను ఈ నరకంలో ఉండలేను. నువ్వంటే నాకు అభిమానం. నాతో వచ్చెయ్యి అని బయల్దేరబోతుంది లక్ష్మీదేవి.

ఐతే ఆగు, ఈ రోజు శుక్రవారం, నిండు ముత్తయిదువవి, బొట్టు పెట్టించుకుని వెళ్ళమని అడుగుతుంది లక్ష్మి.

సరే అంటుంది లక్ష్మీదేవి.

ఈ సంభాషణ చాలు జరిగిన కథంతా తెలియడానికి. అసలీ సినిమా అంతా ఈ పతాక సన్నివేశమే. లక్ష్మీదేవిని తన ఇంట్లో ఉంచేసుకుందుకు లక్ష్మి చేసిన త్యాగమే.

ఎవ్వరూ ఇలా జరుగుతుందని ఊహించలేని ముగింపు. చూసేవారి కళ్ళలో కన్నీళ్ళు తెప్పించే లక్ష్మి మంచితనం. గుండెల్ని చిప్పించే త్యాగగుణం. లక్ష్మి వ్యక్తిత్వాన్ని హిమాలయ శిఖరం ఎక్కించిన సన్నివేశం.

బొట్టు పెట్టి పంపిస్తాను అంతవరకు ఆగమని లక్ష్మీదేవిని అభ్యర్థించిన లక్ష్మి తన బిడ్డని ఉయ్యాలలో పడుకోపెట్టి ముద్దాడుతుంది. ఇంటి గడపకి బొట్టు పెడుతుంది. గోమాతని ప్రేమగా చూస్తుంది. తులసి కోటకి బొట్టు పెడుతుంది. ఇంటి బావికి కూడా బొట్టు పెడుతుంది. బావి దగ్గర నిల్చుంటుంది. ఏదో జరగబోతోందని అర్థం చేసుకున్న ఆవు బాధగా తల ఊపుతుంది.

బావిలో ఏదో పడ్డ శబ్దం వినిపించి ఇంట్లో అందరూ పరిగెత్తుకుని వస్తారు. బావిలో పడి లక్ష్మి ఆత్మహత్య చేసుకుంటుంది.

తను బొట్టు పెట్టి పంపించకపోతే లక్ష్మీదేవి ఇంట్లోంచి వెళ్ళదని లక్ష్మి నమ్ముతుంది. లక్ష్మి నమ్మకాన్ని లక్ష్మీదేవి వమ్ము చెయ్యదు.

ఆత్మత్యాగం చేసుకున్న లక్ష్మి తిరిగి వచ్చి తనకి ఇంక బొట్టు పెట్టలేదని గ్రహిస్తుంది లక్ష్మీదేవి. లక్ష్మి చేసిన త్యాగానికి ఆనందిస్తుంది. తను లక్ష్మికి ఇచ్చిన మాటకి కట్టుబడి ఆ ఇంట్లో ఉండిపోతుంది.

ఈ పది నిమిషాల పతాక సన్నివేశం అసామాన్యమైన ఆలోచన. ఆ సన్నివేశం కేంద్రంగా చిత్రాన్నీ, కథనీ, సన్నివేశాలనీ అల్లుకున్నారేమో అనిపిస్తుంది.

చలనచిత్రం చూసిన వారి మనస్సులలో పతాకసన్నివేశమే నిలిచిపోతుంది. జమున త్యాగమే గుండెల నిండా నిండిపోతుంది.

# చిన్ననాటి స్నేహితులు

## ఎందుకయ్యా నవ్వుతావు పాట

చిన్ననాటి స్నేహానికి జీవితాంతం విలువను ఇచ్చే స్నేహితులు శ్రీధరరావు, శ్రీనివాసరావులు.

శ్రీనివాసరావు భార్య లలిత. ఆ దంపతులకి పిల్లలు లేరు. శ్రీనివాసరావు తల్లికి కళ్ళు కనిపించవు. చిత్రానికి ఆవిడ అంధత్వం కీలకం.

శ్రీధరరావు కూతురు అరుణ. అరుణ చిన్నప్పుడే తల్లిని కోల్పోతుంది. అప్పటి నుంచీ శ్రీధరరావు ఆస్తినీ, అరుణనీ కంటికి రెప్పలా చూసుకుంటున్నది శ్రీనివాసరావే.

శ్రీధరరావుకి హఠాత్తుగా గుండె పోటు వస్తుంది. నెమ్మదిగా కోలుకుంటున్న శ్రీధరరావుకి బాధ కలిగించే ఏ విషయమూ చెప్పవద్దంటారు డాక్టర్లు. మనస్సుకి కష్టం కలిగితే గుండెకి అపాయం అని హెచ్చరిస్తారు.

అరుణ ఎయిర్ ఫోర్స్ లో పైలట్ గా పనిచేస్తున్న రవిని ప్రేమిస్తుంది. వారిద్దరూ దగ్గరవడంతో అరుణ గర్భవతి అవుతుంది. శ్రీధరరావుకి గుండె నొప్పి వచ్చిన సమయానికే విమాన ప్రమాదంలో రవి చనిపోయినట్లు వార్త వస్తుంది.

అరుణ అన్ని విధాలా కృంగిపోతుంది. తన గర్భం గురించీ, రవి మరణం గురించీ తండ్రితో చెప్పుకోలేక శ్రీనివాసరావుతో చెప్పుకుని ఏడుస్తుంది. శ్రీనివాసరావు అరుణని ఓదార్చి, నచ్చచెప్పి తన ఇంటికి తీసుకు వెళ్తాడు. అరుణ స్నేహితురాళ్ళతో కలిసి సంఘ సేవ చెయ్యడానికి దేశాటనకి వెళ్తోందని శ్రీధరరావుకి చెప్తాడు.

తన భార్య లలితని తానే గర్భవతి ఐనట్లు నటించమంటాడు శ్రీనివాసరావు. భర్తంటే గౌరవం ఉన్న లలిత ఒప్పుకుంటుంది. నెల తప్పిన లలితకి సహాయం చెయ్యడానికి అరుణ వచ్చిందని కళ్ళు కనిపించని శ్రీనివాసరావు తల్లికి చెప్తారు భార్యాభర్తలు.

మనం ముచ్చటించుకోబోయే పాట సన్నివేశానికి ఇది పూర్వ రంగం.

ఇక్కడ అనుకోని సంఘటన ఒకటి జరుగుతుంది. లలిత గర్భవతి అవుతుంది. అరుణ పిల్లవాడిని రహస్యంగా ఉంచడమే కష్టం అవుతోంటే, అప్పుడే పిల్లవాడిని కన్నదని చెప్తున్న లలిత గర్భాన్ని దాచడం మరెంత కష్టం అవుతుందో!

తొమ్మిది నెలలు నిండి నొప్పులు పడుతున్న లలితని ఆస్పత్రిలో చేర్చి, లలిత పిల్లాడిగా చెలామణీ అవుతున్న తనపిల్లాడిని ఉయ్యాలలో ఊపుతూ అరుణ –

ఎందుకయ్యా నవ్వుతావు, ఎవరు సుఖపడినారనీ

– అని పాడుతుంది. ఎంత విషాదకరమైన పరిస్థితి!

తను ప్రేమించిన రవి చనిపోతాడు. రవి ద్వారా అరుణకి పుట్టిన వాడు లలితా శ్రీనివాసరావుల పిల్లవాడిగా పెరుగుతూ ఉంటాడు. ఇప్పుడింక తన కోసం కష్టాలు పడుతున్న లలితకే ప్రసవం. అదీ గర్భం ఆలస్యంగా రావడం వల్ల కష్టమయ్యే కానుపు.

విశ్వనాథ్ గారి ఊహాశక్తికీ, కథా రచనకీ, చిత్రానువాదానికీ, సన్నివేశ కల్పనా చాతుర్యానికీ, దర్శకత్వ ప్రతిభకీ ఈ చిత్రం, ఈ పాటా, ఈ సన్నివేశం నిదర్శనాలు.

ఏ తల్లైనా తన చిన్నారి బాబు నవ్వాలని కోరుకుంటుంది. ఏడుస్తున్న కొడుకుని ఆహారంతో, ఆటలతో నవ్విస్తుంది. అటువంటిది అరుణ తన కన్న కొడుకుని ఎందుకయ్యా నవ్వుతావు అని అడుగుతోంది. అంతే కాదు -



నవ్వుకోరా తనివితీరా ఎవ్వరేమైతేనేమని
- అని నిష్ఠూరంగా అంటుంది. ఆ నిష్ఠురంతోనే -

నువ్వు కడుపున పడిన నాడే నిండు కుంకుమ చెరిపినావే
నిండు వెన్నెల బాటలో కన్నీటి చీకటి నింపినావే
- అని అంటుంది.

అరుణ మనస్సుని బాధాగ్ని ఎంత దహిస్తోంటే మాటలు ఇంత వేడిగా వస్తాయి? గుండెలో ఎన్ని శోకాశ్రువులు పొంగితే ఇంత బాధ పెల్లుబుకుతుంది? ఒక సన్నివేశంలో ఉండవలసిన ఆవేశం, ఆవేదనా ఒక పాట రూపంలో వినిపించి, కనిపిస్తాయి. ఎంత నాటకీయత నిండిన సన్నివేశం!

రెండవ చరణంలో -
చావు బతుకుల ఉందిరా నిను చల్లగా కాపాడు దేవతా
ఆమె నీడయె లేనినాడు ఆగిపోవును మన కథా

- అని తల్లీ కొడుకుల జీవన్నాటకానికి ఆధారం లలిత అని చెప్తున్న సమయానికే ఆస్పత్రిలో లలిత చావుబతుకుల మధ్య ఉన్నట్లు చిత్రీకరిస్తారు. ఆఖరి చరణంలో అరుణ -

నిన్ను పెంచిన కల్పవల్లీ నిండుగా బతకాలనీ
వేడుకోరా వేంకటేశునీ, వేడుకోరా విశ్వనాథునీ
- అని లలిత కోసం వేడుకొమ్మని చంటిపిల్లవాడిని వేడుకుంటుంది.

విశ్వనాథ్ గారి ఊహలో ఉన్న సన్నివేశం వెండితెరపై విజయవంతమైంది.

# శారద

## పతాక సన్నివేశం

శారద చిత్రంలో పతాక సన్నివేశం సుమారు పదిహేను నిమిషాల పొడవు. ఆ పదిహేను నిమిషాలలో ప్రేక్షకులు భిన్న విభిన్నమైన భావోద్వేగాలకి లోనవుతారు. అంత వరకూ ఆ చిత్రం నడక ఒక తీరు. ఆ పదిహేను నిమిషాలూ మరో తీరు.

తన భర్త పోయాడని ఒప్పుకోలేని మానసిక స్థితిలో ఉన్న శారదని తన ఊరికి వైద్యానికి తీసుకు వస్తాడు ఒక మానసిక వైద్యుడు. విషయం అర్థం చేసుకున్న వైద్యుడి భార్య పద్మ శారదని తమ ఇంటికే తీసుకు వస్తుంది. తనని తాను వైద్యుడి మరదలుగా పరిచయం చేసుకుంటుంది. తన భర్త సంవత్సరంగా దూరంగా ఉన్నాడని చెప్తుంది.

శారద ఆ మానసిక వైద్యుడినే తన భర్త అనుకుంటుంది. అలా అనుకుంటున్న శారదని మామూలు మనిషిని చెయ్యడమే ఆ వైద్యుడి ఆశయం. ఆ పనిలో వైద్యుడి భార్య పూర్తిగా సహకరిస్తుంది. ఎన్ని ఇబ్బందులు కలుగుతున్నా ఆ దంపతులు శారదని స్వంతమనిషిగా చూసుకుంటూంటారు.

చిత్రం చివరి పావుగంట ప్రారంభం అయ్యే సమయానికి పద్మ గర్భవతి అని తెలుస్తుంది. అది పతాకసన్నివేశానికి మొదటి మలుపు. భర్త దగ్గర లేని పద్మ గర్భవతి అయిందంటే అందులో అనుమానించవలసింది ఏదో ఉందని పద్మని ఇంటి నుండి పంపించెయ్యడానికి సిద్ధపడుతుంది శారద.

విషయం తెలిసిన శారద అన్నయ్యా, బాబయ్యా వైద్యుడి దగ్గరకి వచ్చి క్షమాపణ అడుగుతారు. శారద పద్మనే అనుమానించడం, ఇంటి నుండి పంపించెయ్యడం భరించలేమంటారు. తనకి సాయం చేస్తున్న దంపతులని శారద ఇంకా కష్టాలలోకి నెట్టెయ్యకుండా శారదకి నిజం చెప్పేద్దాం అని అంటారు. శారదకి ఏం ఐపోయినా పరవాలేదంటారు.

వైద్యుడు తను ఇన్నాళ్ళు గా చేస్తున్న వైద్యం ఫలితంగా శారద నిజాన్ని తట్టుకోగలదని భరోసా ఇస్తాడు.

వాళ్ళు నిజం చెప్పేలోపుగానే పద్మ పిన్ని ఆవేశంలో జరిగినదంతా చెప్పి పద్మ చేస్తున్నది సరైన పని కాదని నిలదీస్తుంది. పక్కగదిలో ఉన్న శారద ఆ మాటలు వినడం పతాక సన్నివేశంలో ఉత్కంఠని కలిగించే రెండవ మలుపు.

తన భర్త పోయాడన్న నిజం విన్న శారద గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంటుంది. వైద్యుడూ, పద్మా, శారద అన్నయ్యా, బాబయ్యా చాలా కంగారు పడతారు. శారద తలుపు వేసుకుని ఏం ఘోరం చేసుకుంటుందో అని భయపడతారు.

గది తలుపులు నెమ్మదిగా తెరచుకుంటాయి. శారద నీడ కనిపిస్తుంది. తర్వాత శారద కనిపిస్తుంది. బొట్టు లేని నుదుటితో, తెల్ల చీరలో.

ఇది ప్రేక్షకులు ఊహించని మలుపు. శారద సత్యాన్ని గ్రహిస్తుంది. పిచ్చిదానిలా ప్రవర్తించదు. చాలా పరిణితి చెందిన మనిషిలా శాంతంగా మాట్లాడుతుంది. శారద ఏం అయిపోతుందో అని భయపడ్డ వాళ్ళందరికీ ఉపశమనం కలుగుతుంది.

ఎక్కడో గుడిలో ఉన్నవాడిని దేవుడనుకుని పూజించేదాన్ని,
కానీ ఇక్కడే మనుషుల మధ్య ఉన్న దేవుళ్ళ ని గుర్తించలేకపోయాను
- అని తనని బాగుచేసిన మానసిక వైద్యుణ్ణి చూస్తూ అంటుంది శారద .

పార్వతీ పరమేశ్వరుల వంటి మీ దంపతుల్ని అనుమానించాను.
నీ శీలాన్నే శంకించాను - అప్పుడు నేను పిచ్చిదాన్ని అక్కా
- అని పద్మతో అంటుంది.

బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణలు నటి శారద కంఠంలో వింటోంటే శారద పాత్ర మీద జాలీ, అభిమానం, ఆప్యాయతా కలుగుతాయి. అనుకోకుండా కళ్ళు చెమరుస్తాయి.

శారదని మామూలు మనిషిని చేసిన మానసిక వైద్యుడు -



నీలాంటి దేవత కారణజన్మురాలు. అందుకే
ఐన వాళ్ళూ , కాని వాళ్ళూ , ఊరూ వాడా
నూరేళ్ళు వాళ్ళ మధ్య నువ్వు
ఆడపడుచుగా ఉండాలని కోరుకున్నారు

- అని శారద వ్యక్తిత్వం గురించి చెప్తాడు.

శారద అన్నయ్యా, బాబయ్యలతో కలిసి తన ఊరికి వెళ్ళడానికి గోదావరి నది మీద పడవలో ప్రయాణం చేస్తూ ఉంటుంది. అప్పుడు ఆ ప్రాంతంలోనే తన భర్త తనతో పాడిన శారదా నను చేరగా అన్న పాట గుర్తుకు వస్తుంది.

పడవ శారద ఊరి దగ్గరకి చేరేసరికి ఊరి వారంతా శారద కోసం ఎదురు చూస్తూ ఒడ్డు మీద నిలపడి ఉంటారు. ఆనందంతో వాళ్ళందరినీ చూస్తుంది శారద. చూస్తూ కళ్ళు మూసేస్తుంది శారద.

శారద మరణం పతాక సన్నివేశానికి తుది మలుపు.

పతాక సన్నివేశంలో శారద నటన, శారద మూడు సార్లు జాతీయ ఉత్తమ నటిగా ఎందుకు ఎంపిక అయ్యారో, ఋజువు చేస్తుంది.

# జీవన జ్యోతి

## పతాక సన్నివేశం

కూతురు తన తల్లికి తన కూతురుని కూతురుగా ఇవ్వడమనే అనూహ్య సన్నివేశం జీవన జ్యోతి చిత్ర పతాక సన్నివేశం. ఈ సన్నివేశంలో కావల్సినంత నాటకీయత (దీన్నే కొందరు మెలోడ్రామా అంటారేమో) ఉంది. సాధ్యాసాధ్యాల సందేహం ఉంది. ఇన్ని ఉన్నా సన్నివేశంలో ఉత్కంఠ ఉంది. ఉద్వేగం ఉంది. చూస్తున్నప్పుడు మనల్ని మనం మర్చిపోయి మునిగిపోయేంత ఆకర్షణ ఉంది.

తోటికోడలు కొడుకుని తన కన్న కొడుకులా చూసుకుంటున్న లక్ష్మి (తల్లి వాణిశ్రీ) ఆ పిల్లవాడు తన కళ్ళెదుటనే చనిపోవడం చూసి మతి పోగొట్టుకుంటుంది. వాడు బతికే ఉన్నాడన్న ధ్యాసలో తన లోకంలో తను ఉంటుంది. తనకొక కూతురు పుట్టిన సంగతి కూడా తెలుసుకోలేక పోతుంది. ఆ కూతుర్ని తమ కూతురిలా పెంచి పెద్ద చేస్తారు, తోటికోడలూ, బావగారు. తను వాళ్ళ కూతురిని అనుకునే పెరుగుతుంది శోభ (కూతురు వాణిశ్రీ). ఇదంతా ఫ్లాష్ బాక్ కథ.

వర్తమానంలో అమెరికా నుండి కొడుకుతో భారతదేశం వచ్చిన శోభ తను తల్లిదండ్రులు అనుకుంటున్న తన పెద్దమ్మా, పెద్దనాన్నలతో - తను బాబయ్య అని అనుకుంటున్న తన తండ్రి వాసు దగ్గరకి మొక్కుబడిగా వస్తుంది. వాసు తాగుతాడని వాసు అంటే శోభకి అయిష్టం.

వాసు దగ్గర ఉంటున్నప్పుడు అనుకోకుండా తన తల్లితండ్రులు లక్ష్మీ, వాసూలే అని తెలుసుకుంటుంది.

తన తల్లి ఒక మానసిక ఆస్పత్రిలో ఉండడం శోభని బాధ పెడుతుంది. ఒక బొమ్మనే తన కొడుకుగా అనుకుంటూ ముద్దుల నా బాబు నిద్దరోతున్నాడు అని తల్లి పాడుకోవడం శోభని కృంగతీస్తుంది. తనేం చెయ్యగలదో ఏం చెయ్యాలో అని ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వస్తుంది.



తన నిర్ణయాన్ని అమలు పరచే ప్రక్రియలో భాగంగా ఒక సారి పది తలల రావణాసురుడి వేషం వేసి తన కొడుకుని భయపెడుతుంది. కొడుకు భయపడుతోంటే వేషం తీసేస్తుంది. వేషం తీసేసిన అమ్మని చూసి వాడు తెలిసిందిలే తెలిసిందిలే నువ్వు మా అమ్మవే అని తెలిసిందిలే అని ఆనందంతో పాడుతాడు.

మరో సారి పులి వేషం వేస్తుంది. మళ్ళీ పిల్లాడు భయపడతాడు. పులి వేషం తీసేస్తే వాడు మళ్ళీ సంతోషంగా నువ్వు మా అమ్మవే అని తెలిసిందిలే అని పాడతాడు.

ఇలాంటి సంఘటనలతో అమ్మే రకరకాల వేషాలు వేస్తోందన్న ఆలోచన వాడి మనస్సులో స్థిరపడుతుంది. వాడిలో ఆ ఆలోచన నాటుకు పోయిందని తెలిసాక ఒక రోజు శోభ తన తల్లి లక్ష్మి వేషం వేస్తుంది. పిల్లాడు వెంటనే తన తల్లిని గుర్తు పట్టినట్లు సంతోషంగా తెలిసిందిలే అని పాడేస్తాడు.

అప్పుడు తన ఆలోచనని అమలు చేస్తుంది శోభ. మానసిక ఆస్పత్రిలో ఉన్న లక్ష్మితో నీకు భర్తనూ, పిల్లాడినీ చూపిస్తానని వాసు ఇంటికి తీసుకు వస్తుంది. తను దూరంగా నిల్చుంటుంది.

లక్ష్మిని చూసి ఆ వేషంలో ఉన్న శోభే అనుకుని అమ్మా అని పిలుచుకుంటూ వచ్చి లక్ష్మిని వాటేసుకుంటాడు శోభ కొడుకు. లక్ష్మి తను పోగొట్టుకున్న తోటికోడలు కొడుకే తన దగ్గరకి వచ్చేశాడని వాడిని ముద్దెట్టుకుని ఆడించడం మొదలెడుతుంది.

లక్ష్మి ఆనందంగా ఉండడం చూసి ఆనందంగా అమెరికాకి ప్రయాణం అవుతుంది లక్ష్మి కూతురు శోభ.



వెళ్తూ తండ్రికి చేతులు జోడిస్తుంది శోభ. అందులో తను అంతకు ముందు అసలు విషయం తెలియక వాసు పట్ల సరిగ్గా ప్రవర్తించలేదన్న పశ్చాత్తాంతో పాటు తల్లితండ్రుల ఔన్నత్యాన్ని గుర్తించిన భావం కనిపిస్తుంది.

వాసు కూడా తన కూతురికి చేతులు జోడిస్తాడు. అందులో తన కూతురి అవగాహనకీ, తల్లికోసం చేసిన త్యాగానికీ తండ్రి చూపిస్తున్న బాధా, కృతజ్ఞతా కనిపిస్తాయి.

ఈ పతాక సన్నివేశంలో రెండు పాటలు వినిపిస్తాయి. ఒకటి ముద్దుల నా బాబు నిద్దరోతున్నాడు. ఈ పాట చిత్రంలో మధ్య మధ్యలో వచ్చి కలవరపరుస్తుంది. రెండో పాట తెలిసిందిలే తెలిసిందిలే నువ్వు మా అమ్మవే అని తెలిసిందిలే. ఈ పాట తోనే శోభ రకరకాల వేషాలు వేసుకుని తన కొడుకుని తన తల్లి కొడుకుగా మార్చేందుకు సిద్ధం చేస్తుంది.

వాణిశ్రీ తల్లీకూతుళ్ళు గా ద్విపాత్రిభినయం చిత్రానికి వన్నె తెచ్చింది. పతాక సన్నివేశానికి మరింత ఆకర్షణ అయ్యింది.

వరలక్ష్మిది కూడా ఒక రకంగా ద్విపాత్రాభినయమే. శుభా, సత్యనారాయణల కొడుకుగా వేసారు వరలక్ష్మి. కూతురు వాణిశ్రీ కొడుకుగా కూడా వరలక్ష్మి నటించారు.

ఇద్దరూ ఒకేలా ఉండడం చిత్రానికి చాలా అవసరం. ఏ బాబు బతికి ఉన్నాడని తల్లి వాణిశ్రీ అనుకుంటోందో అలాంటి రూపమే ఉన్న బాబుని చూస్తేనే తను అనుకుంటున్న బాబని అనుకోడానికి ఆస్కారం ఉంది.

ఈ చిత్రం లో శోభన్ బాబు నటనకి మరో నంది పురస్కారం లభించింది.





# సాగర సంగమం

## తకిట తధిమి తకిట తధిమి తందానా పాట

కమల్ విశ్వనాథ్ కాంబినేషన్లో వచ్చిన మూడు చిత్రాలలో తొలి చిత్రం సాగరసంగమం. కమల్ స్వతహాగా శాస్త్రీయ నృత్య కళాకారుడు. రకరకాల పాత్రలలో రాణించిన నటుడు.

సాగరసంగమం ఒక విఫల నాట్యకారుడి జీవనయాత్ర. ఆ విఫలతలోనే ఒక శిష్యురాలిని తనకి వారసురాలిగా తీర్చి దిద్ది విజయం సాధించిన మనిషి కూడా ఉన్నాడు. విఫలాన్నీ, విజయాన్నీ నాట్యంతో, నటనతో ప్రదర్శించగల కమల్ ఈ చిత్రానికి విశ్వనాథ్ ఎంపిక చేసుకున్న కథానాయకుడు. కథానాయిక అందాల తార జయప్రద.

సాగరసంగమం చిత్రంలో ఏ సన్నివేశం గురించి రాయాలి అని ఆలోచిస్తున్నప్పుడు - శంకరాభరణం చిత్రంలో తులసి తన కొడుకుని శంకరశాస్త్రి ఇంట్లోకి పంపిస్తూ ఆ యింట్లో ఎక్కడ తాకినా సప్తస్వరాలు వినిపిస్తాయి అని చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అలాగే సాగరసంగమం చిత్రంలో ప్రతి సన్నివేశం రస మధురిమలు కురిపిస్తుంది.

చిత్రకథకి ఎంతో కీలకమైన తకిట తధిమి తకిట తధిమి తందానా పాట సన్నివేశం సవిస్తరంగా స్మరించుకుంటున్నాను.

అనుకోకుండా తల్లినీ, మాధవి అండనీ, నాట్యంలో పురోగతినీ పోగొట్టుకున్న బాలకృష్ణ తాగుడికి బానిస అవుతాడు. తన భర్తనీ, మాంగల్యాన్నీ, పసుపు కుంకుమలనీ పోగొట్టుకున్న మాధవి కూతురు శైలజని మంచి నాట్యకత్తె చేసే ప్రయత్నంలో ఉంటుంది.

విశ్వనాథ్ గారి చిహ్నమైన ఫ్లాష్ బాక్ విధానంలో ఈ గడచిపోయిన కథ వస్తుంది. ప్రస్తుతంలో -

భర్త పోయిన మాధవి బాలకృష్ణ ఎక్కడ ఉన్నాడో తెలుసుకుని అతన్ని కలవాలనుకుంటుంది. అందుకు బాలకృష్ణ స్నేహితుడు రఘుపతి సాయం తీసుకుంటుంది. బాలకృష్ణ మాధవిని వితంతువుగా చూసి తట్టుకుని బతకలేడని అంటాడు రఘుపతి.

బాలకృష్ణని కలవకుండా దూరంగా ఉంటుంది మాధవి. కానీ రఘుపతి సాయంతో బాలకృష్ణని అలవాట్ల నుండీ, అనారోగ్యం నుండీ రక్షించడానికి తన దగ్గరకి రప్పించుకుంటుంది.

తన కూతురు శైలజని బాలకృష్ణ దగ్గర నాట్యం నేర్చుకోమని చెప్తుంది. నేర్చుకోడం ఇష్టంలేని శైలజ స్నేహితుడితో కలిసి షికారుకి వెళ్తుంది. శైలజ మాధవి కూతురని తెలియని బాలకృష్ణ ఎప్పటిలాగే తాగి వస్తాడు.

వాళ్ళి ద్దరి కోసం ఎదురుచూస్తున్న మాధవి బాలకృష్ణని చూస్తుంది. అతన్ని జాగ్రత్తగా తీసుకురమ్మని నౌకరుని పంపిస్తుంది. బాలకృష్ణ నౌకరుని బెదరగొట్టి తాగుడు మైకంలో పాట పాడుతూ నాట్యం చెయ్యడం మొదలు పెడతాడు. అప్పుడు వచ్చిన పాట చరణమే –



తకిట తధిమి తకిట తధిమి తందానా
హృదయ లయల జతుల గతుల తిల్లానా
తడబడు అడుగుల తప్పని తాళానా
తడిసిన పెదవుల రేగిన రాగానా
శ్రుతిని లయను ఒకటి చేసి

తాగి పాడుతూ నాట్యం చేస్తున్న బాలకృష్ణ అక్కడున్న బావి మధ్యన అడ్డంగా ఉన్న గొట్టాల మీదకి ఎక్కుతాడు. చూస్తున్న మాధవి కంగారు పడుతుంది.

ఆ గొట్టాల మీదే అటూ ఇటూ తిరుగుతూ బాలకృష్ణ నాట్యం కొనసాగిస్తాడు. అసలే తాగి ఉన్న బాలకృష్ణ. ఆ పై బావి మీద గొట్టాల మీద నిలబడ్డం. దాని పైనే అడుగులు వెయ్యడం. దానికి తోడు అప్పుడే వాన కురవడం. కాలు జారితే బావిలోకే పడిపోవడమే.

ఇంక ఆగలేకపోతుంది మాధవి. ఎలాగైనా బాలకృష్ణని బావిలో పడిపోకుండా ఆపాలనుకుంటుంది. ఐతే తను బొట్టు లేకుండా బాలకృష్ణ కంటపడితే అతను ఏమైపోతాడో అని భయపడుతుంది.

అందుకే అప్పటికప్పుడు ఒక నిర్ణయం తీసుకుంటుంది. సాగరసంగమం చిత్రానికి కీలకమైన నిర్ణయం. ప్రేక్షకులు ఎవ్వరూ ఊహించలేని నిర్ణయం. తను ఎంతో అభిమానించే బాలకృష్ణని కాపాడడం ఒక్కటే లక్ష్యంగా మాధవి తీసుకున్న నిర్ణయం.

భర్త పోయి బొట్టు పెట్టుకోవడం మానేసిన మాధవి తనకు తాను తన నుదుటన సింధూరం పెట్టుకుంటుంది. బావి మీద గొట్టాల మీద పడిపోబోతున్న బాలకృష్ణ పడిపోకుండా చెయ్యి అందిస్తుంది. అనుకోకుండా కనిపించిన మాధవిని ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తాడు బాలకృష్ణ. గొట్టాల మీద నుండి నెమ్మదిగా దిగుతాడు.



పట్టు చీరలో, ఎర్రని బొట్టుతో ముత్తైదువులా కనిపించే మాధవి చుట్టు ఆరాధనా పూర్వకంగా తిరిగి ఎదుట నిలబడతాడు. వాన నీటికి భ్రుకుటి మధ్యనుండి నాసిక మీదకి కారుతున్న బొట్టు కారకుండా తన చెయ్యి అడ్డుపెడతాడు.

అక్కడ నుండి సాగర సంగమం కథ మలుపు తిరుగుతుంది. మాధవి కూతురు అని తెలియగానే శైలజకి తన విద్యనంతా ధారపోస్తాడు బాలకృష్ణ.

ముందు కథకీ, తరవాత కథకీ మధ్య బలమైన బంధం ఈ పాటా, ఈ సన్నివేశం.

(ఈ పాటలోని - నరుని బతుకు నటన, ఈశ్వరుని తలపు ఘటన, ఆ రెంటి నట్ట నడుమ నీకెందుకింత తపన - వాక్యాలను శుభసంకల్పం చిత్రంలో వాడుకున్నారు. ఆ వాక్యాలు ఒక పాత్రకో, ఒక సన్నివేశానికో, ఒక చిత్రానికో, పరిమితం కావు. అవి స్థలకాలాలికి అతీతాలు)

# స్వర్ణకమలం

## పతాక సన్నివేశం

స్వర్ణకమలం పతాక సన్నివేశం అర్థం అవాలంటే ఆ సన్నివేశంలో మీనాక్షి అంతరంగం అర్థం అవాలి. అంటే మీనాక్షి ఆలోచనల్లో వచ్చిన మార్పు అర్థం అవాలి. అంటే మీనాక్షిలో జరిగిన అంతర్మథనం అర్థం అవాలి.

మీనాక్షి ప్రఖ్యాత కూచిపూడి నాట్యకారుడు వేదాంతం శేషేంద్ర శర్మ రెండవ అమ్మాయి. శర్మ పేరు సంపాదించుకున్నంతగా ఆస్తి సంపాదించుకోలేదు. దానికి తోడు కంటి చూపు మందగించడంతో ఆదాయమూ లేదు. తండ్రి దగ్గర మొక్కుబడికి బలవంతంగా నాట్యం నేర్చుకుంటుంది కానీ మీనాక్షి మనస్సు శాస్త్రీయ నృత్యం మీద లగ్నమవదు. ఎప్పుడూ సినీ రంగుల కలల్లో తేలుతూ ఉంటుంది.

అలాంటి సమయంలోనే చిత్రకారుడు చంద్రశేఖర్ మీనాక్షిలోని కళను గుర్తించి నాట్యం మీద మనస్సు లగ్నం చెయ్యమని రకరకాలుగా చెప్పి చూస్తాడు. మీనాక్షి వినదు.

ఐనా తన ప్రయత్నం మానడు. అంతే కాకుండా మీనాక్షి కుటుంబానికి సాయం చేస్తాడు. అందులో భాగంగా శర్మకి కంటి వైద్యం చేయించి చూపు వచ్చేలా చేస్తాడు.

మీనాక్షి నాట్య ప్రదర్శన ఏర్పాటు చేస్తాడు. మీనాక్షి చెయ్యనని మొండికేస్తే బలవంతంగా తీసుకు వెళ్తాడు. వేదిక మీద తండ్రి నట్టువాంగానికి, అక్క గానానికి నాట్యం చెయ్యడం మొదలెట్టి కావాలని అభాసు పాలు చేస్తుంది మీనాక్షి.



అది నాట్యకళకి జరిగిన అవమానంగా బాధపడి అంత పెద్ద వయస్సులో తనే వేదిక మీద నాట్యం చెయ్యడం మొదలెడతాడు శర్మ. చెయ్యలేక గుండెపోటుతో మరణిస్తాడు.

తండ్రి మరణం కూడా మీనాక్షిలో మార్పు తేదు. తనని అనవసరంగా వేదిక ఎక్కించాడని చంద్రశేఖరాన్ని ఆడిపోసుకుంటుంది. నాట్యం మీద అంత విముఖత. రంగుల జీవితం మీద అంత మోహం.

తను పని చేస్తున్న హోటల్ వాళ్ళు ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మీనాక్షి శాస్త్రీయ నృత్యం చెయ్యవలసి వస్తుంది. ఆ ప్రదర్శనకి ప్రత్యేకంగా వచ్చిన ప్రఖ్యాత భారతీయ నృత్యకారిణి, పాశ్చాత్య మహిళా షరోన్ లోవెన్ మీనాక్షి నాట్యంతో

తాదాత్మ్యం అవడం లేదని చెప్తుంది. నాట్యమంటే తనువూ, మనసూ, ఆత్మా ఐక్యం ఐ భావావేశంతో చెయ్యాలి కానీ కాళ్ళూ , చేతులూ కదపడం కాదని స్పష్టం చేస్తుంది. తను మళ్ళీ వచ్చేసరికి మీనాక్షి నాట్యంలో తను కోరుకున్న మార్పు వస్తే తనతో అమెరికా తీసుకు వెళ్తానని చెప్తుంది.

మీనాక్షి అమెరికా వెళ్ళ డానికి సన్నద్ధమవుతుంది. సరిగ్గా ఆ సమాయనికే చంద్రశేఖర్ మీనాక్షిని శేషేంద్రశర్మ శిష్యుడు రామకృష్ణ గురుపూర్ణిమ రోజున గురువుకి చేస్తున్న గురుపూజా కార్యక్రమానికి తీసుకు వెళ్తాడు. తండ్రి పటానికి జరుగుతున్న పూజకి మీనాక్షి చలించి పోతుంది.

తన తండ్రి ఎంత గొప్ప కళాకారుడో అర్థం చేసుకుంటుంది. తండ్రి పేర శిష్యులు చేస్తున్న గురుపూజకి కన్నీళ్ళు కారుస్తుంది. తన వల్లే తన తండ్రి చనిపోయాడని బాధ పడుతుంది. తన తండ్రి వారసత్వాన్ని తను నిలపాలని నిశ్చయించుకుంటుంది. ఆ నిశ్చయ ఫలితంగా అంతరంగపు లోతుల్లోంచి పొంగుకొస్తున్న ఆవేశాన్ని అభినయిస్తుంది.



అందెల రవమిది పదములదా
అంబరమంటిన హృదయముదా
అమృతగానమిది పెదవులదా
అమితానందపు ఎదసడిదా

అంబరమంటిన హృదయంతో, అమితానందపు ఎదసడితో నాట్యం చేస్తుంది. షరోన్ లోవెన్ చెప్పిన తాదాత్మ్యం తన అణువణువునా ఆవిష్కరిస్తుంది. తుహిన గిరులు కరిగేలా తాండవమాడుతుంది.

నటరాజస్వామి జటాజూటిలోకి చేరకుంటే
విరుచుకు పడు సురగంగకు విలువేముంది

అన్న విషయాన్ని ఆకళింపు చేసుకున్న దానిలా తన నాట్యాన్ని ప్రకృతికీ, పరమేశ్వరుడికీ అంకితం చేసుకుంటుంది.

సీతారామశాస్త్రి తన తొలి చిత్రం సిరివెన్నెలలో సంగీతాన్ని విధాత తలపున ప్రభవించిన అనాది జీవన వేదంతో పోలుస్తూ విశ్వమనే పెద్ద కాన్వాస్ మీద చిత్రాన్ని గీసారు.

అదే సీతారామశాస్త్రి స్వర్ణకమలం చిత్రంలో అందెల రవమిది పాట ద్వారా నాట్యాన్ని విశ్వవేదిక మీద అందమైన తైలవర్ణ చిత్రంగా ఆవిష్కరించారు.

మువ్వలు ఉరుముల సవ్వడులై - మెలికలు మెరుపుల మెలకువలై
మేను హర్షవర్ష మేఘమై - వేణి విసురు వాయువేగమై
అంగభంగిమలు గంగపొంగులై హావభావములు నింగిరంగులై
లాస్యం సాగే లీలా రసఝురులు జాలువారేలా
జంగమమై జడమాడగా
జలపాతగీతముల తోడుగా
పర్వతాలు ప్రసరించిన పచ్చని ప్రకృతి ఆకృతి పార్వతి కాగా

ఆ నడయాడే తైలవర్ణచిత్రం భానుప్రియ. మంచుకొండల ముందు తపస్సు చేసే పార్వతీ దేవి. అందం, ఆహార్యం, అభినయంతో పరమేశ్వరుడిని కొలిచిన స్వర్ణకమలం.

ఈ పాటని మళ్ళీ మళ్ళీ చూస్తూనే ఉండాలనిపిస్తుంది.





# స్వయంకృషి

## పతాక సన్నివేశం

చేసే పని ఏదైనా దాన్ని తక్కువగా అనుకోకూడదు.

ఆ పని ఎవ్వరికీ హాని చెయ్యనిదైతే, పది మందికీ ఉపయోగించేదైతే అది ఎంతో తృప్తి ఇస్తుంది.

ఎవరైనా చేసే పని మీద శ్రద్ధతో కృషి చేస్తే విజయం సాధించవచ్చు.

విజయం సాధించినా తన మూలాలని మర్చిపోని మనిషే నిజమైన విజయాన్ని సాధించినట్లు.

ఎవరి సాయం వల్లో సాధించిన విజయం కన్న స్వయంకృషితో సాధించిన విజయం ఎంతో గొప్పది.

స్వయంకృషి చిత్రం పై మానవ విలువల మీద నిర్మించిన చిత్రం.

చిత్రానికి ఉన్న నాలుగు స్తంభాలలో మూడు స్తంభాలను కాచే పాత్రలు మానవతా విలువల కోసమే పుట్టినవి. విలువల్ని స్థిరంగా కాపాడుతున్నవి. ఆ పాత్రలు సాంబయ్య, శారద, గంగ.

ఎంత లలితమైన అనుబంధమో వారి ముగ్గురిదీ. ఒకరిని ఒకరు పూర్తిగా అర్థం చేసుకుని, ఒకరిమీద మరొకరికి అపోహలు లేకుండా, అందరూ ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ ఉంటే బంధాలు ఎంత బావుంటాయో అనడానికి వారు ముగ్గురూ ఉదాహరణలు.

నాల్గవ స్థంభం దగ్గర ఉన్న నలుగురూ రకరకాల కారణాలుగా విలువలకి దూరంగా జరిగిన వారు. వాళ్ళు - చిన్నా, చిన్నా తండ్రి గోవింద్, శారద భర్త భాస్కర్, గంగ తండ్రి.

కన్న కొడుకు చిన్నాని చెడు మార్గం పట్టిస్తున్న గోవిందుకి తాగుబోతైన గంగ తండ్రి సహాయం చేస్తూ ఉంటాడు. అది ఎంత వరకూ వెళ్తుందంటే కోర్టులో తన కొడుకుని తనకి ఇప్పించమని గోవిందు దావా వేసేవరకూ. అది ఎక్కడకి దారి తీస్తుందంటే కోర్టులో చిన్నా తను తన నాన్న గోవిందు దగ్గర ఉంటానని చెప్పేటంతవరకూ.

అక్కడ నుండి పది నిమిషాల పతాక సన్నివేశం ప్రారంభమవుతుంది.

చిన్నా తనని కాదని గోవిందు దగ్గర ఉంటాననడం సాంబయ్యని బాధిస్తుంది. ఆస్తి అంతా చిన్నా పేరన రాసేసి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళి పోడానికి సిద్ధపడతాడు.

వెళ్ళబోతూ చిన్నా స్నేహితులకి చిన్నా చేస్తున్న తప్పుడు పనుల విడియో చూపిస్తాడు. వాళ్ళు చిన్నాని అసహ్యించుకుని వెళ్ళి పోతారు. శారద చిన్నాకి సాంబయ్య దేవుడని నచ్చ చెప్తుంది. అలాగే గోవిందు దౌర్భాగ్యుడని కూడా చెప్తుంది.



చిన్నా ఒక గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంటాడు. ఆ గదిలోంచి పొగ వస్తూండడం చూసి కంగారు పడతారు సాంబయ్యా, గంగా, శారదా.

చిన్నా తను చేసింది తప్పని గ్రహించి ఏం అఘాయిత్యం తలపెట్టాడో అని అందరూ ఆ తలుపు చుట్టూ తిరుగుతారు. బలవంతంగా తలుపులు బద్దలు కొట్టి చూస్తే లోపల చిన్నా హాయిగా సిగరెట్లు కాల్చుకుంటూ ఉంటాడు. చిన్నా తనని తాను ఏంచేసుకోలేదు కదా అని అందరికీ ఒక్క క్షణం ఉపశమనంగా అనిపిస్తుంది. ఐతే అంతలోనే చిన్నాలో మార్పు వచ్చిందేమో అని అనుకున్న అందరికీ, ప్రేక్షకులతో సహా, నిరుత్సాహం కలుగుతుంది.

చిత్రంలోని పాత్రలు అనుభవిస్తున్న అనుభూతిని ప్రేక్షకులకి కూడా కలిగేటట్లు తియ్యడంలోనే దర్శకుని ప్రతిభ కనిపిస్తుంది. ఆ ప్రక్రియలో విశ్వనాథ్ పరిణతి చెందిన దర్శకులు.

చిన్నా నిర్లక్ష్యం చూసి కోపంతో చెంప మీద బలంగా కొడతాడు సాంబయ్య. చిన్నా చీదరించుకోడు. చిరాకు పడడు. బాధ కూడా పడడు. హాయిగా, నిర్మలంగా చిరునవ్వు నవ్వుతాడు. ఆ చిరునవ్వులో తన మనస్సులో వస్తున్న పరివర్తనని అందంగా చూపిస్తాడు చిన్నా. సాంబయ్య చెంప దెబ్బ తప్పు దారిలో వెళ్తున్న తనని మంచి మార్గంలో పెట్టడం కోసమే అన్న అవగాహనా, ఆనందం కనిపిస్తుంది చిన్నా మొహంలో.

కంపెనీలో పని చేసేవాళ్ళ కి సాంబయ్య మంచితనం గుర్తుచేస్తుంది శారద. గోవిందు దుర్మార్గుడని హెచ్చరిస్తుంది. కష్టాల్లో ఉన్న సాంబయ్య వెంట ఉండమని చెప్తుంది.

శారద మాటలకి ప్రభావితులై వాళ్ళు గోవిందుని కొట్టి బుద్ధి చెప్పి తను చేసిన తప్పుకి క్షమాపణ అడిగేందుకు సాంబయ్య దగ్గరకి తీసుకు వస్తారు. గోవిందు తప్పొప్పుకొని ఆస్తిని తీసుకోమంటాడు. సాంబయ్య ఆస్తినీ, క్షమాపణనీ స్వీకరించడు. శారద వద్దంటున్నా వినకుండా తను ఇన్నాళ్ళూ ఎంతో పవిత్రంగా దాచుకున్న చెప్పులు కుట్టే సామగ్రినీ, కృషితో నాస్తి దుర్భిక్షం బోర్డునీ తీసుకుని బయల్దేరుతాడు.




శారద చిన్నాతో సాంబయ్యని ఆపమని అడుగుతుంది. చిన్నా గోవిందుని ఆస్తి నువ్వు భయపడి వదిలేస్తున్నావా ఇష్టపడి ఇస్తున్నావా అని అడుగుతాడు. గోవిందు ఇష్టపడే అని అంటాడు. చిన్నా గోవిందు మొహం మీద కాండ్రించి ఉమ్మేస్తాడు.

సాంబయ్యా, గంగా రోడ్డు మీద చెట్టు పక్కన తమ తొలి వృత్తిని చేసుకుంటూ కనిపిస్తారు.

గంగ అటు తల తిప్పి చూస్తే ఎదురుగా ఒక చెట్టు కింద, అదే బోర్డుతో, అదే సరంజామాతో చిన్నా కనిపిస్తాడు.

స్వయంకృషిలో విలువని తెలుసుకున్న చిన్నాని చూసి సాంబయ్య సంతోషిస్తాడు.

# సూత్రధారులు

## రెండు సన్నివేశాలు

## 1

ఐదు పదులు దాటిన ఒక భార్య తన ఇంటి ముందు పెరట్లో బట్టలు ఆరవేస్తున్న ఆరు పదుల భర్త దగ్గరకి ఎంతో సంతోషంగా వస్తుంది.

వచ్చి భర్తని దగ్గరగా పట్టుకుని నెమ్మదిగా ఇంట్లోకి ప్రేమగా తీసుకెళ్తుంది.

తీసికెళ్ళి ఇంటి ముందు తలుపులు మూస్తుంది.

మూసి ఇంటి వెనక తలుపులు తెరిచి ఉన్నాయని చూసి అవి కూడా మూసేస్తుంది.



మూసేసి భర్త దగ్గరకి వచ్చి -

ఎంత మంచి కొడుకుని ఇచ్చావయ్యా?

- అంటూ ఆనందబాష్పాలు కారుస్తుంది.

కారుస్తూ భర్తని ముద్దు పెట్టుకుని దగ్గరకి తీసుకుంటుంది.

తమ పిల్లలు పెరిగి పెద్దవారై గొప్పవారవడం చూస్తున్న తల్లితండ్రులకి ప్రతిరూపాలు ఆ భార్యాభర్తలు.

గంగిరెద్దుని ఆడించి జీవితం పోషించుకునే హనుమద్దాసు భార్య దేవమ్మ తమ కొడుకు తిరుమలదాసు కలెక్టరుగా తమ ఊరికి వస్తున్నాడని విని ఆ ఆనందాన్ని మొయ్యలేక భర్తతో పంచుకుందుకు చేసిన చేతలూ, ఆడిన మాటలూ ఆతల్లి మనసుకి ప్రతిబింబం. ప్రేక్షకుల మనస్సులకి ఆనందరసాస్వాదం.

వాళ్ళిద్దరి దగ్గరకూ దేవమ్మ అన్నయ్య రంగదాసు వచ్చి తిరుమలదాసుకి జరుగుతున్న ఆహ్వాన మహోత్సవానికి రమ్మని పిలుస్తాడు. ఆయన అక్కడకి రారుట అంటుంది దేవమ్మ. ఎక్కడికో చెప్పకుండా సన్నాయి వాయిస్తూ బయల్దేరుతాడు హనుమద్దాసు. వెనకే డోలుతో అయిష్టంగా వెళ్తాడు రంగదాసు. ముగ్గురూ గుడి దగ్గరకి చేరేసరికి అక్కడ మరో సన్నాయి వాయిద్యం వినిపిస్తుంది.



మరదలు సీతాలు పక్కన నడుస్తూ వస్తోంటే తిరుమలదాసు తను సన్నాయి వాయించుకుంటూ ఆ గుడికే వస్తాడు. తండ్రీకొడుకులు ఇద్దరూ కలిసి ఆనందంగా జోడు సన్నాయిలని వాయించుకుంటారు.

కలెక్టరైన తిరుమలదాసు మరదలు సీతాలుని వదిలెయ్యలేదు. తల్లితండ్రులకి దూరం కాలేదు. తను చిన్నప్పట్నుంచీ నేర్చుకుంటున్న సన్నాయిని మర్చిపోలేదు. ఆనందంగా తండ్రితో కలిసి సన్నాయి వాయించడం తక్కువగానో, తప్పుగానో అనుకోలేదు.

## 2

తిరుమలదాసు కలెక్టరై తమ ఊరికి వస్తే తమని అన్ని విధాలా బాధపెడుతున్న నీలకంఠం బారి నుండి కాపాడి తమని కష్టాల నుండి గట్టెక్కిస్తాడని ఆశపడుతూ ఉంటారు ఊళ్ళో ని సామాన్య జనం.

ప్రభుత్వ బంజరు భూములని తను లాగేసుకోడానికి నీలకంఠం కలెక్టరు తిరుమలదాసుతో మంతనాలు చేస్తాడు. ప్రలోభ పెడతాడు. లంచం ఇస్తాడు.

లంచం పుచ్చుకున్న తిరుమలదాసు నీలకంఠానికి సాయం చెయ్యడం చూసిన సీతాలు బాధపడుతుంది. తిరుమలదాసుని పెళ్ళి చేసుకోకూడదని నిశ్చయించుకుంటుంది. సీతాలు తండ్రి రంగదాసు కూడా అదే నిర్ణయం తీసుకుంటాడు.

ఊరి జనం అంతా తిరుమలదాసు ప్రవర్తనకి తండ్రి హనుమద్దాసుని తప్పు పడతారు. తండ్రీకొడుకులు కుమ్మక్కై జనాన్ని మోసం చేస్తున్నారని నింద వేస్తారు.

తనని అనుమానించినా, అవమానించినా హనుమద్దాసు అందరికీ మంచి చెయ్యడానికే ప్రయత్నిస్తూ ఉంటాడు.

ఒక్క నీలకంఠం దగ్గరే కాకుండా ఇంకో ముగ్గురు ధనవంతుల దగ్గర కూడా ఆ బంజరు భూమిని ఇప్పిస్తానని ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర లంచం తీసుకుంటాడు తిరుమలదాసు.

బంజరు భూముల వేలం సమయంలో ఏ పేద ప్రజలకి ఆ భూమి చెందాలో వాళ్ళ కి ఆ భూమి చెందేలా చేస్తాడు. అందుకు తను లంచం తీసుకున్న డబ్బునే ఆ పేద ప్రజలకి వేలం పాడేందుకు ఇస్తాడు.

ఊరు ఊరంతా తిరుమలదాసు మంచితనం గుర్తిస్తారు. తిరుమలదాసుకి నీలకంఠాన్ని మోసంతోనే జయించాలని సలహా ఇచ్చి నాటకాన్ని నడిపించింది హనుమద్దాసే అని అందరికీ తెలుస్తుంది.

తండ్రీ కొడుకులు కలిసి ఆడిన నాటకం చివరిదాకా ఊరిజనానికీ, ప్రేక్షకులకీ తెలియదు. తెలిసాక అందరికీ ఊరట. సంతోషం.

ఈ సుఖాంత నాటకానికి సూత్రధారులు – తండ్రీ కొడుకులూ, వారితో పాటుగా దేవమ్మ.

# శుభ సంకల్పం

## పాత్రలూ, సంబంధాలూ, సన్నివేశాలు

శుభసంకల్పం చిత్రంలో ముఖ్యపాత్రలు - దాసు, రాయుడు, సంధ్య, గంగ. చిత్రమంతా వీరి చుట్టూనే తిరుగుతుంది. వీరి మధ్య ఉన్న సంబంధాల మీదే ఆధారపడి ఉంటుంది.

1. గంగా దాసులకి ఒకరంటే ఒకరికి ప్రాణం

రాయుడు అప్పగించిన బాధ్యతలో భాగంగా రాయుడి డబ్బుని తనింట్లో భద్రంగా దాస్తాడు దాసు. ఒక రాత్రి దాసు పడవ మీద సముద్రం మీదకి చేపలు పట్టేందుకు వెళ్ళినప్పుడు, దొంగలు డబ్బు కాజెయ్యడానికి దాసు ఇంట్లో చొరపడతారు. రాయుడి డబ్బుని కాపాడుతూ గంగ సముద్రంలో మునిగిపోతుంది.

అదే సమయానికి వలవేసిన దాసు వలలో గంగ దొరుకుతుంది. గంగని పట్నంలో ఆస్పత్రికి తీసుకు వెళ్తాడు దాసు. గంగకి జరిగిన ప్రమాదం గురించి విన్న రాయుడికి గుండె నొప్పి వస్తుంది. గంగని ఆస్పత్రిలో వదిలిపెట్టి రాయుడిని చూసి మళ్ళీ ఆస్పత్రికి దాసు వెళ్ళే సరికి గంగ తిరిగి రాని దూరాలకి వెళ్ళి పోయిందని డాక్టర్లు చెప్తారు.



గంగ చని పోయిందని చెప్తే రాయుడికి ఏం అయిపోతుందో అని ఎవ్వరికీ చెప్పడు దాసు. తన ప్రాణంలో ప్రాణం ఐన గంగ శరీరంపై తనే కొత్త చీర కప్పి, నుదుటున కుంకుమ బొట్టు పెట్టి, నిండు ముత్తైదువలా సాగనంపడానికి సిద్ధమవుతాడు.

గంగా దాసుల జీవితాలు కడలితో ముడిపడ్డవి. పడవే వారి జీవనాధారం. గంగ మృతదేహాన్ని ఒళ్ళో పెట్టుకుని పడవ మీద నీళ్ళ లోకి తీసికెళ్ళి స్నానం చేయిస్తాడు. తనకి తాను తన కన్నీళ్ళ తోనే స్నానం చేస్తాడు.

ఎవరు లేకుండా తన జీవితమే లేదనుకున్నాడో ఆ గంగని కడసారిగా చూసుకుని కడలి పక్కన దహనం చేసేస్తాడు.

2. రాయుడికి గంగంటే వల్లమాలిన అభిమానం

ఏ ముహూర్తాన రాయుడు గంగని చూసాడో కానీ అప్పటి నుండి గంగంటే రాయుడికి వల్లమాలిన అభిమానం. దాసుకి గంగనిచ్చి పెళ్ళి చేస్తాడు. వారిద్దరూ సంతోషంగా ఉంటే తనూ సంతోష పడతాడు. గంగ పిల్లవాడిని తన దగ్గరే ఉంచుకుని మురిసిపోతాడు.

అలాంటి గంగ తన ధనాన్ని కాపాడుతూ ప్రమాదంలో చిక్కుకుందని తెలిసి తల్లడిల్లిపోతాడు. గుండె నొప్పితో మంచం పడతాడు.

గంగ చనిపోయినా ఆమె మరణం గురించి రాయుడికి తెలియనివ్వడు దాసు. అంతే కాకుండా రాయుడి ఆరోగ్యం బాగు పడడం కోసం గంగ ఆరోగ్యం బాగు పడిందని చెప్తాడు.

గంగ ప్రమాదం నుండి బయట పడినందుకు ఊరంతా పండగ చెయ్యాలని నిశ్చయించుకుంటాడు రాయుడు. పల్లెలోని అందరికీ పడవలూ, ఇళ్ళూ ఇవ్వాలన్న తన సంకల్పాన్ని నెరవేరుద్దామనుకుంటాడు. అలాగే ఊళ్ళో ఒక స్కూలూ, హాస్పిటలూ కూడా కట్టించడానికి ఏర్పాట్లు చేస్తాడు. ఈ ఉత్సవమంతా దాసూ గంగలు పీటల మీద కూచుని నిర్వహించాలని దాసుకి చెప్తాడు.

రాయుడు సంకల్పానికి కావల్సిన ఏర్పాట్లు శుభప్రదంగా చేసిన దాసు ఒక్కడే పీటల దగ్గరకి వస్తాడు. గంగేదిరా అని రాయుడు అడిగితే పీటల మీద గంగ అస్తికల కలశం పెడతాడు. తను ఎంతగానో అభిమానించే గంగ ఇంక లేదని గ్రహించిన రాయుడు తన వ్యాపారమంతా దాసు చేతిలో పెట్టి తను ఆశ్రమ జీవితానికి అంకితమైపోతాడు.

3. సంధ్యకి దాసు మీద మనస్సు నిండా ప్రేమ

దాసు గంగ పార్థివ శరీరానికి నిప్పంటించడం చూసిన ఒకే ఒక్క వ్యక్తి సంధ్య. తన బాధను ఎవ్వరికీ చెప్పుకోలేని దాసు బాధను పంచుకున్నది సంధ్య ఒక్కతే. దాసు కష్టంలో అతనికి అండగా నిలిచింది సంధ్యే. ఐతే దాసు మీద తనకి ఉన్న అభిప్రాయాన్ని మాటలలో కానీ చేతలలో కానీ ఎక్కడా తెలియనియ్యదు సంధ్య.

తల్లి లేని చిన్నపిల్లాడిని దాసు ఒక్కడే పెంచలేడని గంగా దాసుల కొడుకుని తనతో అమెరికా తీసుకెళ్ళి పోతుంది సంధ్య. పిల్లాడు కొంచెం పెద్దవాడయ్యాక, దాసు పెంచగలడని అనిపించాక మళ్ళీ దాసు ఊరికి వాడిని తీసుకు వస్తుంది. అప్పటికి దాసు వ్యాపారవేత్తగా ఎదుగుతాడు. రాయుడి వ్యాపారాన్ని ఎన్నో రెట్లు పెద్దది చేస్తాడు.

చూసి ఆనందిస్తుంది సంధ్య. పిల్లవాడిని దాసుకి అప్పచెప్తుంది. ఆశ్రమ జీవితం గడుపుతున్న తాతయ్య దగ్గర కూచుని తన మనస్సులోని ప్రేమని తాతయ్యకి చెప్తుంది. చెప్పి దాసు మనస్సు నిండా గంగే ఉంది, దాసు మనస్సులోనో జీవితంలోనో నాకు స్థానం అక్కరలేదు. ఐతే నా మనస్సులో మాత్రం దాసే ఉంటాడు. లేని గంగను మనస్సులో ప్రతిష్ఠించుకుని దాసు బతగ్గలిగితే బతికున్న దాసుని మనస్సు నిండా ప్రేమిస్తూ నేనూ బతగ్గలనని చెప్పి అమెరికా వెళ్ళి పోతుంది.

తను దాసుని ప్రేమిస్తున్నాని సంధ్య చెప్పి వెళ్ళి పోయాక ఆ విషయాన్ని రాయుడు దాసుకి చెప్తాడు. అది విన్న దాసు సముద్రం ఒడ్డున బాధగా నడుస్తూ ఉంటాడు. అమెరికా వెళ్ళి పోతున్న సంధ్య విమానాశ్రయంలో ఆలోచనలో మునిగిపోయి ఉంటుంది.



చిత్రం చివరి రెండు నిమిషాలలో సంధ్యని విమానాశ్రయంలోనూ, దాసుని సముద్రం ఒడ్డునా మనం చూస్తాం. ఐతే ఎన్నో చిత్రాలలో జరిగేలా సంధ్య వెనక్కి వచ్చెయ్యదు. దాసు విమానాశ్రయానికి వెళ్ళడు.

చిట్ట చివరి సన్నివేశంలో దాసూ, పిల్లాడూ సముద్రం ఒడ్డున నిలబడి సంధ్య ఎక్కి వెళ్ళి పోతున్న విమానానికి చేతులు ఊపుతారు.

# స్వరాభిషేకం

## ఒక్క క్షణం పాట

చిత్రం పేరు స్వరాభిషేకం. చిత్ర కథానాయకుడు పేరు ప్రఖ్యాతులున్న సంగీతజ్ఞుడు శ్రీనివాసాచారి. చిత్రం సంగీతప్రధానం. అలాంటి చిత్రంలో మ్యూజిక్ థెరపీ ద్వారా సుఖప్రసవం చేయించినట్లు చూపించారు విశ్వనాథ్.

ఆ సన్నివేశంలో ఉన్న బలం వల్లా, అందం వల్లా ఆ సన్నివేశాన్ని ప్రస్తావిస్తున్నాను.

రైల్లో ప్రయాణం చేస్తున్న గర్భవతికి నొప్పులు వస్తున్నాయని ఆ అమ్మాయి పక్కన కూచుని శ్రీనివాసాచారి -



ఒక్క క్షణం ఒక్క క్షణం
గరిమల నీ మురిపెపు ముద్దుల మొలకొచ్చేదిక
ఒక్క క్షణం ఒక్క క్షణం
అమ్మ కడుపు చల్లగా అయ్య కలలు పండగా
ఇమ్మనరే ఇమ్మనరే దేవతల ఈ తల్లికి వరము
ఈ లాలికి స్వరమూ ఇహమూ పరమూ

- అన్న పల్లవిని పాడుతాడు. ఆయనతో పాటు భార్యా, తమ్ముడూ కూడా పాడుతూ ఉంటారు. రైల్లో ప్రయాణం చేస్తున్న వారు మధ్య మధ్యలో రాముణ్ణీ, కృష్ణుణ్ణీ తలచుకుంటూ నాట్యం చేస్తూ ఉంటారు.

నీకొక్క దానికే కాదు, ప్రసవ వేదన రాముడి తల్లి కౌసల్యకీ, కృష్ణుడి తల్లి దేవకికీ తప్పలేదన్న చరణంలోని మొదటి రెండు వాక్యాలూ పాడుతాడు శ్రీనివాసాచారి -

కౌసల్యకు తప్పని అమ్మ వేదన మన రామ కీర్తన
దేవకికే తప్పని చెరసాల వేదన నవరసాల నర్తన

- ఆ రెండు వాక్యాల తర్వాత శ్రీనివాసాచారి కనబోయే తల్లి చేత సంగీత స్వరాలు అనిపిస్తాడు -

గ గ ప రి రి గ సా గ సా
స రి గ రి గ ద పా గ రి
గ ప ద పా ద పా స దా





ని స రి సా రి .. గ రీ
గ గ రి రి స స
రి రి స స గ గ
స గ ప ద రి స రి గ

– అలా స్వరాలు పాడుతున్న ఆ అమ్మాయి మొహంలో ఉపశమనం కనిపిస్తుంది. అంతా బాగా అవుతుందన్న ఆశాభావం కనిపిస్తుంది.

స్వరాలు పాడించిన తర్వాత ప్రకృతిలో ఏ జన్మానికైనా వేదన ఉంటుందన్న అర్థంలో ఉదయాన్నీ, మెరుపులనీ ఉదహరిస్తూ –

తూరుపు తల్లికి తప్పదు ఉదయ వేదన
మేఘాలకు తప్పదు మెరుపు వేదన

– చరణంలోని తర్వాత రెండు వాక్యాలూ పాడతారు.

అప్పుడు ఆ అమ్మాయి భర్తని దగ్గరగా రమ్మని పిలిచి నెమ్మదిగా కష్టపడుతూ –

ఒక్క క్షణం ఒక్క క్షణం
గరిమల నా మురిపెపు ముద్దుల మొలకొచ్చేదిక
ఒక్క క్షణం ఒక్క క్షణం

– అని పాడుతుంది. శ్రీనివాసాచారి కుటుంబం నీ మురిపెపు ముద్దుల మొలకొచ్చేదిక అని అంటోంటే ఆ అమ్మాయి నా మురిపెపు అని మార్చి పాడుతుంది. వచ్చేది తన అంకురం అన్న మాటని వొత్తిపలుకుతూ. భర్తకి వంశాకురాన్ని ఇస్తున్నానని ఆనందిస్తూ చెప్తున్నట్లు.

ఆ తర్వాత రెండవ చరణం –

కల్లోలపు కడలి మీద తాను తేలగ వటపత్ర శాయిగ
తొమ్మిది మాసాల యోగి కెవ్వు కెవ్వున తొలి కేక పెట్టగా
శోకంలో పుట్టెనంట రామాయణము
శ్లోకంగా పెరుగునంట జన్మల ఋణము
ఆ ఋణానుబంధమే ఈ శిశు జననం
– వస్తుంది. శిశు జననం అన్న మాట వస్తున్నప్పుడు జన్మించిన తొమ్మిది మాసాల యోగి తొలి కేక కెవ్వుమని వినిపిస్తుంది.

అప్పుడు జన్మనిచ్చిన తల్లి భర్త చేత శ్రీనివాసాచారి జోల పాడిస్తాడు -

జో అచ్యుతానంద, జో జో ముకుందా, లాలి పరమానంద, రామ గోవిందా, జో జో

ఈ సన్నివేశం మనల్ని వేరో లోకంలోకి తీసుకెళ్తుంది. శిశుజననంలోని అందం, శిశువుని కనే జనని మొహంలోని ఆనందం కళ్ళ కి కట్టినట్లు కనిపిస్తాయి.

సంగీత జనిత శిశూదయ స్వరాభిషేకం.

# సహ కళాకారులు



# సహ కళాకారులు

ఒక చిత్ర విజయానికైనా అపజయానికైనా దర్శకుడిదే పూర్తి బాధ్యత. తన సహ కళాకారులలో ఎవరో సరిగ్గా చెయ్యలేదని దర్శకుడు తప్పించుకునే అవకాశమే లేదు. ఎందుకంటే ప్రతి సహ కళాకారుడు చిత్రానికి ఏం ఇవ్వాలో, ఎంత ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో నిర్ణయించుకుని రాబట్టుకో వలసింది దర్శకుడే.

ఏ దర్శకుడికి చిత్రానికి సంబంధించిన ప్రతి శాఖలోనూ పరిచయం ఉంటుందో ఆ దర్శకుడు చిత్రాన్ని చక్కగా తీర్చిదిద్దగలడు. విశ్వనాథ్ గారి చిత్రాలు చూస్తోంటే ఆయనకి అన్ని శాఖలతోనూ పరిచయమే కాకుండా ప్రావీణ్యం కూడా ఉన్నట్లు అనిపిస్తుంది.

ఏ చిత్రానికైనా కథ ముఖ్యం. అసలు చిత్రం నడిచేదే కథతో. విశ్వనాథ్ గారి చిత్రాలలో పాతిక వరకూ ఆయన కథ సమకూర్చుకున్నవే. చిన్ననాటి స్నేహితులు, ఓ సీత కథ, శంకరాభరణం, స్వాతిముత్యం, స్వాతి కిరణం వంటి భిన్న విభిన్న కథా వస్తువులు ఆయన మెదడు నుండి ఉద్భవించినవే.

తన చిత్రాలు సుమారు అన్నింటికీ స్క్రీన్ ప్లే రాసుకున్నది ఆయనే. అంటే తన కథని చిత్రంగా మలిచే నైపుణ్యం ఆయనదే.

ఐనా ఎందరో కళాకారులతో పని చెయ్యాలి. వారి చేత తనకి కావల్సింది చెప్పి చేయించుకోవాలి. అందులో కొందరు లబ్ధప్రతిష్ఠులూ, బాగా అనుభవం ఉన్న వారూ ఉంటారు. కొందరు కొత్తవాళ్ళూ , ఉత్సాహవంతులూ ఉంటారు. అందరి నుండీ తన చిత్రానికి కావల్సింది సాధించుకోవాలి.

అన్ని శాఖలనీ, అందరు కళాకారులనీ తలచుకోలేం. అందుకని కింద శాఖలలో పనిచేసిన కొందరు కళా కారుల గురించి ప్రస్తావించుకుందాం.

- ★ సహాయ / సహకార దర్శకులు
- ★ సంభాషణల రచయితలు
- ★ గీత రచయితలు
- ★ సంగీత దర్శకులు
- ★ గాయనీ గాయకులు
- ★ నృత్య దర్శకులు
- ★ ఛాయాగ్రాహకులు
- ★ హీరోలు
- ★ బాల నటీనటులు
- ★ లబ్ధప్రతిష్ఠులు





# సహాయ / సహకార దర్శకులు

ఒక దర్శకుడి ప్రతిభ తను తీసిన చిత్రాల మీదే కాక తన దగ్గర శిష్యరికం చేసి విజయం సాధించగల సహాయకులను తయారు చెయ్యడంలో కూడా ఉంటుంది. మంచిమనసులూ, మూగమనసులూ వంటి ఉత్తమ చిత్రాలు తీసిన ఆదుర్తి సుబ్బారావు దగ్గర విశ్వనాథ్ సహాయ / సహకార దర్శకుడిగా పనిచేసారు. విశ్వనాథ్ గారి దగ్గర శిష్యరికం చేసిన కొందరి దర్శకులని గురించి ప్రస్తావిస్తున్నాను.



విశ్వనాథ్ గారి దగ్గర శంకరాభరణం, శుభోదయం వంటి చిత్రాలకి సహాయ దర్శకుడిగా పనిచేసిన వంశీ తరవాత కాలంలో ఎన్నో మంచి చిత్రాలకి దర్శకత్వం వహించారు. సితార వంటి కొన్ని తొలి చిత్రాలలో తన గురువైన విశ్వనాథ్ ప్రభావం కొంచెం అక్కడక్కడా కనిపిస్తుంది కూడా. నా జ్ఞాపకం సరైతే వంశీ సితార చిత్రంలో కనిపించే కిన్నెరసాని వచ్చిందమ్మా అన్న పాట సాగరసంగమం చిత్రం పాటల కేసెట్లో వినిపించేది.

విశ్వనాథ్ గారి దగ్గర సాగరసంగమం, స్వాతిముత్యం చిత్రాలకి సహాయ దర్శకుడిగా పనిచేసిన గీతాకృష్ణ సంకీర్తన వంటి చిత్రాలు తీసారు.

ఓ సీత కథ మొదలుకుని ఓ ఇరవై సంవత్సరాలు ఓ ఇరవై దాకా విశ్వనాథ్ గారి చిత్రాలకి సహాయ దర్శకుడిగా పనిచేసిన ఘనుడు నందూరి విజయ్.

ఏ ఆదుర్తి సుబ్బారావు దగ్గర తను సహాయ దర్శకుడిగా పనిచేసారో ఆ ఆదుర్తి సుబ్బారావు కొడుకు ఆదుర్తి భాస్కర్ని తన చిత్రాలు సప్తపది, శుభలేఖలకు సహాయ దర్శకుడిగా పని చేయించుకున్నారు విశ్వనాథ్. ఇటువంటి గురుశిష్య పరంపర అరుదైనదే.

(ఒక విధంగా జంధ్యాల విశ్వనాథ్ గారి స్కూల్నుండి వచ్చిన దర్శకుడనే అనుకోవాలి. తనదైన హాస్య ధోరణిలో చిత్రాలు తీస్తూ సంగీత నాట్య ప్రధానమైన ఆనందభైరవి చిత్రం కూడా తీసారు)

# సంభాషణల రచయితలు

విశ్వనాథ్ గారి చిత్రాలకి సంభాషణలు రాసిన రచయితలు చాలా మంది ఉన్నారు. అందులో ముగ్గురి గురించి ముచ్చటించుకుందాం.

## గొల్లపూడి మారుతీరావు



విశ్వనాథ్ గారు 1970 లలో దర్శకత్వం వహించిన చెల్లెలి కాపురం, ఓ సీత కథ, ప్రేమబంధం చిత్రాలకి సంభాషణలు రాసింది గొల్లపూడి మారుతీరావు. చెల్లెలి కాపురంలో నాగభూషణం జల్లిన హాస్యానికీ, ఓ సీత కథలో దేవదాస్ కురిపించిన విసుర్లకీ వెనక నున్న కలం గొల్లపూడిదే. ప్రేమబంధం తర్వాత శుభలేఖకీ, శుభసంకల్పం చిత్రాలకీ సంభాషణల రచయిత గొల్లపూడే. ఈ చిత్రాలు అన్నింటిలోనూ మాటల్లో ఉండాల్సిన విరుపూ, బరువూ, మెరుపూ గొల్లపూడి సంభాషణల్లో పుష్కలంగా కనిపిస్తాయి. విశ్వనాథ్ దర్శకత్వంలో స్వాతిముత్యం చిత్రంలో తనదైన శైలిలో చిన్న విలన్ పాత్ర పోషించారు. శుభసంకల్పం చిత్రంలో విశ్వనాథ్ గారి సన్నిహితుడిగా నటించారు గొల్లపూడి.

## జంధ్యాల



విశ్వనాథ్ జంధ్యాలల కలయిక తెలుగు సినీలోకానికి అపురూప కానుక. సీతామాలక్ష్మితో మొదలైంది విశ్వనాథ్ గారి చిత్రాలకి జంధ్యాల సంభాషణలు రాయడం. ఆ తర్వాత శంకరాభరణం చిత్రానికి జంధ్యాల సంభాషణలు అలంకారాలూ, ఆభరణాలూ అయ్యాయి.

చిత్రం చివరలో శంకర శాస్త్రి రెపరెపలాడుతున్న ఈ సంగీత జ్యోతిని అని మొదలెట్టి మాట్లాడిన మాటలు పాటలా సాగిపోయి తరవాత వచ్చే దొరకునా ఇటువంటి సేవ అన్న పాటతో కలిసిపోయాయి. ఆ సంభాషణలు అజరామరంగా నిలిచిపోయాయి.

శంకరాభరణం తర్వాత 1980 దశకం మొదటి సగంలో వచ్చిన అల్లుడు పట్టిన భరతం, శుభోదయం, సప్తపది, సాగరసంగమం చిత్రాలకి జంధ్యాల సంభాషణలు అత్యద్భుతం. ఆపద్బాంధవుడు చిత్రానికి సంభాషణలు రాయడమే కాకుండా ముఖ్యపాత్ర పోషించారు కూడా. అది ఒక కవి పాత్ర అవడం యాదృచ్ఛికం కాదు.

## తోటపల్లి సాయినాథ్



1980 దశకం రెండో సగంలో విశ్వనాథ్ గారి చిత్రాలలో ఎక్కువ వాటికి సంభాషణలు రాసింది తోటపల్లి సాయినాథ్. స్వాతిముత్యం, సిరివెన్నెల, శ్రుతిలయలు, స్వయంకృషి, స్వర్ణకమలం చిత్రాల విజయానికి తోటపల్లి చక్కని చిక్కని సంభాషణలు చాలా దోహదం చేసాయి. తను స్వయంగా సంభాషణలు రచించడానికి ముందు సాయినాథ్ వంశీకి సంభాషణల రచనలో సహాయకుడు.

(విశ్వనాథ్ గారు తన దర్శకత్వంలో సంభాషణలు రాసిన ఒకే ఒక్క చిత్రం కలిసొచ్చిన అదృష్టం)

# గీత రచయితలు

చిత్రాలకి ప్రాణం పాటలు. పాటలకి ప్రాణం మాటలు. వినసొంపైన మాటలతో భావయుక్తంగా సందర్భానికి సరిపోయేలా పాటలు రాయించుకోవడం విశ్వనాథ్ గారి ప్రత్యేకత. ఆయన చిత్రాలకి రాసిన రచయితలు సాహితీ సరస్వతులు. వారు రాసిన పాటలు విని ఆనందించడమే కానీ వాటి బాగోగుల గురించి విమర్శించడం నేను చెయ్యగలిగిన పని కాదు. అందుకే ఆయన పాటలు రాయించుకున్న నాలుగు తరాల రచయితలను ఎన్నుకుని, వారు రాసిన వాటిలో పదేసి పాటల పట్టిక ఇస్తున్నాను.

## దేవులపల్లి కృష్ణశాస్త్రి



- ★ శ్రీశైలం మల్లన్నా శిరసొంచేనా (ఉండమ్మా బొట్టు పెడతా)
- ★ ఎందుకే సందెగాలి (ఉండమ్మా బొట్టు పెడతా)
- ★ అడుగడుగున గుడి ఉంది (ఉండమ్మా బొట్టు పెడతా)
- ★ మరి మరి విన్నానురా (నిండు హృదయాలు)
- ★ నీలాకృష్ణ నృత్యనాటిక (చెల్లెలి కాపురం)
- ★ ఏ తల్లి పాడేను జోలా (కాలం మారింది)
- ★ ఓం నమో నారాయణాయ (కాలం మారింది)
- ★ చేసిన పాపం నీది (నేరము శిక్ష)
- ★ శ్రీశైలభవనా మేలుకో (అమ్మ మనసు)
- ★ మావి చివురు తినగానే (సీతామాలక్ష్మి)

## సి నారాయణరెడ్డి



- ★ అద్దం లాంటి చెక్కిలి చూస్తే (నిండు హృదయాలు)
- ★ ఎందుకయ్యా నవ్వుతావూ (చిన్ననాటి స్నేహితులు)
- ★ కనుల ముందు నీవుంటే (చెల్లెలి కాపురం)
- ★ చరణ కింకిణులు (చెల్లెలి కాపురం)
- ★ వ్రేపల్లె వేచెనూ (శారద)
- ★ శారదా నను చేరగా (శారద)
- ★ మల్లె కన్న తెల్లన (ఓ సీత కథ)
- ★ ముద్దుల మాబాబు నిద్దరోతున్నాడు (జీవన జ్యోతి)
- ★ వటపత్రశాయికీ (స్వాతిముత్యం)
- ★ శ్రుతి నీవు గతి నీవు (స్వాతి కిరణం)

## వేటూరి సుందరరామమూర్తి



- ★ భారత నారీ చరితము (ఓ సీత కథ)
- ★ అంజలిదె గొనుమా (ప్రేమ బంధం)
- ★ అందానికి అందం (సిరిసిరిమువ్వ)
- ★ ఝుమ్మంది నాదం (సిరిసిరిమువ్వ)
- ★ నటనం ఆడెనే (శుభోదయం)
- ★ రాగాలా పల్లకిలో (శుభలేఖ)
- ★ సీతమ్మ అందాలు (శుభసంకల్పం)
- ★ ఒక్క క్షణం (స్వరాభిషేకం)
- ★ అనుజుడై పుట్టి (స్వరాభిషేకం)
- ★ శంకరాభరణం, సప్తపది, సాగరసంగమం చిత్రాలలో అన్ని పాటలు

## సీతారామశాస్త్రి



- ★ ఇన్ని రాసుల యునికి (శ్రుతిలయలు)
- ★ తన వర సత్వమును (శ్రుతిలయలు)
- ★ సిగ్గూ పూబంతీ (స్వయంకృషి)
- ★ శివపూజకు చివురించిన (స్వర్ణకమలం)
- ★ అందెల రవమిది పదములదా (స్వర్ణకమలం)
- ★ ఘల్లు ఘల్లు (స్వర్ణకమలం)
- ★ కొత్తగా రెక్కలొచ్చెనా (స్వర్ణకమలం)
- ★ నిన్న చూసిన ఉదయం (చిన్నబ్బాయి)
- ★ ఓరిమి చాలమ్మా (శుభప్రదం)
- ★ సిరివెన్నెల, స్వాతి కిరణం చిత్రాలలో అన్ని పాటలు

(తన చిత్రాలలో కొన్ని పాటలకి పల్లవులు విశ్వనాథ్ అందిస్తారని వినికిడి.

నిండు హృదయాలు చిత్రంలో చిలకా ఓ రామ చిలకా పాట విశ్వనాథ్ జూనియర్ సముద్రాలతో కలిసి రాసారుట.

స్వరాభిషేకం చిత్రంలో కుడి కన్ను అదిరెనే పాట రచయితగా విశ్వనాథ్ గారి పేరు కనిపిస్తుంది.

తెలుగు సినిమా పాటలకి నాలుగున్నర దశాబ్దాలకి పైగా ప్రాణం పోస్తున్న వేటూరినీ, సిరివెన్నెలనీ చలనచిత్రాలకి పరిచయం చేసింది విశ్వనాథ్ గారే.

ఒక్క పరిచయం చెయ్యడమే కాకుండా వారికి కావల్సిన స్వేచ్ఛను ఇచ్చి, వారి చేత కావ్య గౌరవం దక్కించుకున్న పాటలు రాయించుకున్నది కూడా విశ్వనాథ్ గారే)

# సంగీత దర్శకులు

ఎన్నో చిత్ర విజయాలకి సంగీతమే కారణం. ఆ సంగీతాన్ని సృష్టించే సంగీత దర్శకులు అపరబ్రహ్మలు. వారు తమ బాణీలతో శృంగారాన్నీ, హాస్యాన్నీ, విషాదాన్నీ, భక్తినీ, బాధనీ, భయాన్నీ, విప్లవాన్నీ, వినోదాన్నీ వినిపిస్తారు.

విశ్వనాథ్ గారి చిత్రాలకి సంగీతం ప్రాణం. ఆయన తన చిత్రాలలో సంగీతాన్ని ప్రజా రంజకంగా సృష్టించుకుంటారు. అలాగని సంగీతం స్థాయిని కొంచెం కూడా దిగజారనియ్యరు. అది ఆయనకే చెల్లింది.

ఆయనతో చాలా మంది సంగీత దర్శకులుగా పనిచేసారు. అందులో ముగ్గురి పేర్లు ప్రస్తావిస్తాను.

## రాజేశ్వరరావు



మల్లీశ్వరి చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలో అజరామరమైన సంగీతాన్ని అందించిన రాజేశ్వరరావు తెలుగు లలిత గీతాల ప్రాచుర్యానికి ప్రథముడు. ఆయన బాణీలు వింటే చిత్రంలో సన్నివేశం మన కళ్ళ ముందు కదులుతుంది. ఉదాహరణకి మలీశ్వరి లో ఊరు చేరాలి అన్న పాట. అందులో పరిగెత్తే ఎద్దులూ, మేఘాలూ, బండీ కనిపిస్తాయి. అదే చిత్రంలో ఆకాశవీధిలో అన్న పాట వింటే విరహం, మేఘసందేశం కళ్ళ కి కట్టినట్లవుతాయి.

రాజేశ్వరరావు విశ్వనాథ్ గారి మూడు చిత్రాలకి సంగీతం సమకూర్చారు. విశ్వనాథ్ తొలిసారిగా దర్శకత్వం వహించిన ఆత్మగౌరవం చిత్రానికి సంగీతం రాజేశ్వరరావే. కాలం మారింది, నేరము శిక్ష చిత్రాలకి కూడా సంగీతం ఆయనే.

కాలం మారింది చిత్రంలో ఏ తల్లి పాడేను జోలా, నేరము శిక్ష చిత్రంలో చేసిన పాపం నీదీ అన్న పాటలూ రెండూ రాజేశ్వరరావు అపూర్వ సృష్టి. చిత్రాలలో చాలా అరుదుగా పాడే రాజేశ్వరరావు కాలం మారింది చిత్రంలో తన స్వీయ దర్శకత్వంలో మారలేదులే కాలమూ అన్న పాటను అద్భుతంగా గానం చేసారు.

కాలం మారింది రాజేశ్వరరావు సంగీత దర్శకత్వం వహించిన నూరవ చిత్రం.

రాజేశ్వరరావుని స్వర రాజేశ్వరరావు అని అంటారు. అలానే ఆయన ఇంటి పేరు సాలూరి తో కలిపి రసాలూరి రాజేశ్వరరావు అని కూడా అంటారు. ఆయన సంగీత దర్శకుల సంగీత దర్శకుడు.

## కె వి మహదేవన్



అందరిచేతా ఆప్యాయంగా మామ అని అనిపించుకునే కె వి మహదేవన్ కె విశ్వనాథ్ చిత్రాలు ఎన్నింటికో సంగీత దర్శకుడు. 1968 లో తీసిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రం నుండి 1992 లో తీసిన స్వాతికిరణం వరకూ సుమారు ఇరవై విశ్వనాథ్ గారి చిత్రాలకి మహదేవనే సంగీత దర్శకుడు. వారిద్దరి సాన్నిహిత్యం అంతటిది.

విశ్వనాథ్ గారి చిత్రాలకి మామ తయారు చేసిన పాటలన్నీ బావుంటాయి. మహదేవన్ సంగీతంతో సాహిత్యం జీవం పోసుకుంటుంది. భావం హృదయాలను కదిలిస్తుంది.

నేపథ్యంలో మహదేవన్ వినిపించే సంగీతం మహాద్భుతం. ఆ సన్నివేశానికి ఉండే భావోద్వేగాలను సంగీత వాయిద్యాలు ప్రాణాలు పోసుకుని వినిపిస్తాయి. వీణ, వేణువూ, వాయులీనం, మృదంగం, డప్పు - ఏదైనా మహదేవన్ మస్తిష్కంలోని ఆలోచనలని ఆదేశాలుగా అందుకని అవలీలగా ఆవిష్కరిస్తాయి.

పుహళేందిని తలచుకోకుండా మహదేవన్ గురించి రాసింది అసంపూర్ణం అవుతుంది. వాళ్ళిద్దరూ తనువు మనసు లాగా ఒకరితో ఒకరు ముడిపడిపోయి ఉంటారు. కలిసి రాగాలు సృష్టిస్తారు. మనల్ని తన్మయుల్ని చేస్తారు. వారిదో అద్వైతం.

## ఇళయరాజా



తమిళంలో ఇళయరాజాని ఇసైరాజా అని అంటారు. ఇసై అంటే సంగీతం. సంగీతానికి రాజు ఇళయరాజా.

ఇళయరాజా విశ్వనాథ్ గారి చిత్రాలు నాలుగింటికి సంగీతం అందించారు. అవి సాగరసంగమం, స్వాతిముత్యం, స్వర్ణకమలం, చిన్నబ్బాయి.

చిన్నబ్బాయి అనే చిత్రానికి విశ్వనాథ్ గారు దర్శకత్వం వహించారన్న విషయం ఆయన వీరాభిమానులకి కూడా గుర్తుండి ఉండకపోవచ్చు. ఐతే ఇళయరాజా కూర్చిన నిన్న చూసిన ఉదయం కాదిది వంటి పాటలు మాత్రం మరిచిపోలేరు.

సాగరసంగమం, స్వాతిముత్యం, స్వర్ణకమలం చిత్రాలు గొప్ప మ్యూజికల్ హిట్స్. మూడింటికీ ఇళయరాజా చేసిన పాటలు ప్రజలలో చిరకాలం నిలిచిపోయేవి. అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించుకున్న ఇసైజ్ఞాని ఇళయరాజా.

# గాయనీ గాయకులు

ముగ్గురు గాయకులని, ముగ్గురు గాయనులని ఎంచుకున్నాను. గాయనీ గాయకులు ఒక్కొక్కరి గురించి చిన్ని పరిచయం రాసి, విశ్వనాథ్ గారి చిత్రాలలో వారు పాడిన పాటలలో నాకు నచ్చిన ఒక పాటని సూచన ప్రాయంగా ప్రస్తావించాను.

## ఘంటసాల



తెలుగు సినిమా పాటకీ, పద్యానికీ దిశానిర్దేశం చేసినవారు
తెలుగు సినిమా పాటకి లాలిత్యం, మాధుర్యం, గాంభీర్యం దిద్దిన వారు
భక్తి, విషాద, శృంగారాది నవరసాలు అవలీలగా పలికించిన వారు
తెలుగు సినీ నేపథ్యగానాన్ని చెయ్యి పట్టుకుని మూడు దశాబ్దాలు నడిపించిన వారు.
విశ్వనాథ్ గారి చిత్రాలలోని పాటలని అమృతమయం చేసిన వారు

ఉండమ్మా బొట్టు పెడతా చిత్రంలో శ్రీశైలం మల్లన్నా శిరసొంచేనా

## బాలసుబ్రహ్మణ్యం



ఘంటసాల వారసులు
ఐదున్నర దశాబ్దాలు తెలుగు నేపథ్య గానానికి పుష్టినీ, పరిపుష్టినీ అందించిన వారు
ఏ నటుడి గాత్రాన్నైనా అవలీలగా అనుకరణ చేసి పాడగలిగిన వారు
విశ్వనాథ్ గారి చిత్రాలన్నింట్లోనూ పాడిన వారు
పాడి ఆ పాటలకు సొగసులు దిద్దినవారు

శంకరాభరణం చిత్రంలో శంకరా నాదశరీరా పరా

## రాజేశ్వర రావు

తెలుగు చిత్ర పరిశ్రమలో సంగీత దర్శకుల మార్గదర్శకులు
తెలుగులో లలిత సంగీతానికి ఆద్యులు
పాట పాడుమా కృష్ణా వంటి పాటలతో ప్రఖ్యాతులు
విశ్వనాథ్ గారి చిత్రాలలో పాడిన ఒకే ఒక్క పాట
స్వీయ దర్శకత్వంలో

కాలం మారింది చిత్రంలో  మారలేదులే కాలమూ



## సుశీల



మృదు మధురంగా వినిపించే కమ్మని కంఠం సుశీల స్వంతం
ఏ పాటనైనా అందరికీ స్పష్టంగా అర్థం అయ్యేలా పాడడం సుశీల ప్రత్యేకత
ఎన్నో భాషలలో ఎన్నో వేల పాటలని ఎంతో అందంగా పాడిన గాయని సుశీల
విశ్వనాథ్ గారి చిత్రాలలో సుశీల పాడని చిత్రాలు అరుదు
పాడిన పాటలలో కమ్మగా లేనివి మరీ అరుదు

సిరిసిరిమువ్వ చిత్రంలో ఝుమ్మంది నాదం

## జానకి



జానకి గొంతులో పలకని స్వరం లేదు, వినిపించని భావం లేదు
పసిపిల్ల కంఠాన్నైనా ముసలావిడ గొంతునైనా పలికించ గల సత్తా జానకిది
ఆ గొంతు గారాలు పోతుంది, మారాము చేస్తుంది
విశ్వనాథ్ గారి చిత్రాలలో జానకి గళం గారడీ చేస్తూనే ఉంటుంది
ఎన్నో రకాల భావాలు పలికిస్తూనే ఉంటుంది

సప్తపది చిత్రంలో గోవుల్లు తెల్లనా

## వాణీ జయరాం



ఏ చిత్రంలోనైనా శాస్త్రీయ సంగీత ప్రాధాన్యత ఉన్న పాటకి గాయని అవసరమైనా
ఏ పాటకైనా గంభీర భావాన్ని పలికించే కంఠం కావాలన్నా
ఎవరి మనస్సులోనైనా మెదిలే పేరు వాణీ జయరాం
తక్కువ పాటలు పాడి, పాడిన ప్రతి పాటనీ ప్రజారంజకం చేసిన ఘనత ఆవిడదే
విశ్వనాథ్ గారి సంగీత భరిత చిత్రాలలో వాణీ బాణీ తప్పనిసరి

స్వాతికిరణం చిత్రంలో ఆనతినీయరా





# నృత్య దర్శకులు

విశ్వనాథ్ గారి చిత్రాలలో నృత్యదర్శకుల పాత్ర చాలా ఎక్కువ. నృత్య ప్రధానమైన చిత్రాలలోనే కాదు. ఇతర చిత్రాలలో కూడా నృత్యానికి తగినంత స్థాయిని కల్పిస్తారు ఆయన. ఉదాహరణకి శుభలేఖ చిత్రంలో చిరంజీవి చేత చేయించిన శాస్త్రీయ నృత్యాలు.

కానీ శాస్త్రీయ నృత్యంలో ఓనమాలు కూడా నేర్వని నేను వెంపటి సత్యం, గోపీకృష్ణ, ఉమా రామారావు వంటి వారి గురించి ఏం రాయగలను? అందుకే విశ్వనాథ్ గారి చిత్రాలకి నృత్య దర్శకత్వం చేసిన పది మంది పేర్లని రాస్తున్నాను.

- ★ పసుమర్తి కృష్ణమూర్తి
- ★ చిన్ని
- ★ సంపత్
- ★ రాజు
- ★ శేషు
- ★ తార
- ★ కె వి సత్యనారాయణ
- ★ వెంపటి సత్యం
- ★ గోపీకృష్ణ
- ★ ఉమా రామారావు



# ఛాయాగ్రాహకులు

కెమెరా చేసే మాయ గురించి చెప్పడానికి ఏముంది? ఏ సన్నివేశానికైనా సంపూర్ణత్వం తీసుకొచ్చేది కెమెరాయే.

గృహ వాతావారణం చూపించ వలసి వచ్చినా, కొండలూ, నదులూ, ఆకాశం, పక్షులూ, పువ్వులూ, చంద్రుడూ ఏం చూపించవలసి వచ్చినా ఛాయాగ్రహకుడి నైపుణ్యమే ముఖ్యం.

మాయాబజారు చిత్రంలో లాహిరి లాహిరి లాహిరిలో పాటని నలుపు తెలుపుల రోజులలోనే వెన్నెలలో పడవ మీద విహారంలా అందంగా చిత్రీకరించడం కెమేరామేన్ మార్కస్ బార్ట్లే మాయే కదా! అలాగే తనే స్వయంగా దర్శకుడైన బాలూ మహేంద్ర శంకరాభరణం చిత్రంలో టోగ్రఫీ దర్శకుడుగా చూపించిన ప్రతిభ ఫలితమేగా ప్రతి ఫ్రేం సౌందర్యం.

ఏ హీరోయిన్ అందమైనా సరైన కోణం నుండి సరిపోయే కాంతిలో చక్కని భావ ప్రకటనతో చూపించ గలిగేదీ, చూపించేదీ కెమేరామేన్ పనితనమే.

ఐతే వాళ్ళ సాంకేతిక పరిజ్ఞానం గురించి రాసేంత పరిజ్ఞానం నాకు లేదు.

అందుకే విశ్వనాథ్ గారి చిత్రాలకి ఛాయాగ్రాహకులుగా గా పని చేసిన కొందరి పేర్లు తలచుకుంటున్నాను.

- ★ బాలూ మహేంద్ర
- ★ ఎస్ ఎస్ లాల్
- ★ జి కె రాము
- ★ లోక్ సింగ్





# హీరోలు

విశ్వనాథ్ గారి తొలి చిత్రం ఆత్మగౌరవంలో హీరో అక్కినేని నాగేశ్వరరావు. ఆత్మగౌరవం తర్వాత మరో పాతికేళ్ళ కి కానీ విశ్వనాథ్‌గారు అక్కినేని కలిసి పనిచెయ్యలేదు. 1989 లో విశ్వనాథ్ గారు తీసిన సూత్రధారులు చిత్రానికి హీరో అక్కినేని.

ఆత్మ గౌరవం తర్వాత విశ్వనాథ్ గారి నాలుగు చిత్రాలకి హీరో నందమూరి తారక రామారావు. అవి కలిసొచ్చిన అదృష్టం, నిండుహృదయాలు, నిండుదంపతులు, చిన్ననాటి స్నేహితులు. ఆ చిత్రాల తర్వాత విశ్వనాథ్ రామారావు కలిసి పనిచేసిన చిత్రాలు లేవు.

అప్పుడప్పుడే పైకి వస్తున్న శోభన్ బాబు రామారావు హీరోగా నటించిన నిండుహృదయాలు, చిన్ననాటి స్నేహితులు చిత్రాలలో నటించారు. 1970 లలో విశ్వనాథ్ శోభన్ బాబు హీరోగా తీసిన చిత్రాలు ఏడు. అందులో 71, 72, 73, 75 లలో తీసిన చెల్లెలి కాపురం, కాలం మారింది, శారద, జీవనజ్యోతి చిత్రాలకి ఉత్తమ నటుడిగా ప్రభుత్వ నంది అవార్డులు వచ్చాయి. 1970 దశకం తొలి సగం విశ్వనాథ్ - శోభన్ కాంబినేషన్ వరస విజయాలు సాధించింది. ఆ విజయపరంపర తర్వాత వచ్చిన చిత్రాలు - ప్రేమబంధం, జీవితనౌక, కాలాంతకులు.

శంకరాభరణం, సప్తపది చిత్రాలలో విశ్వనాథ్ తన కథకి అనుగుణంగా సోమయాజులుని హీరోగా పెట్టుకున్నారు. వారిద్దరి కాంబినేషన్ చరిత్ర సృష్టించింది. సోమయాజులుకి స్వాతిముత్యంలో కూడా చిన్న పాత్ర ఉంది.

అప్పటికే పెద్ద హీరోగా పేరు తెచ్చుకున్న చిరంజీవితో విశ్వనాథ్ తీసిన మొదటి చిత్రం శుభలేఖ. మంచి పాత్ర. దానికి తోడు నృత్యానికి కూడా అవకాశం ఉండే పాత్ర. చిరంజీవి హుందాగా సరదాగా నటించి ఫిల్మ్ ఫేర్ అవార్డ్ కూడా సంపాదించుకున్నారు. శుభలేఖ తర్వాత చిరంజీవితో విశ్వనాథ్ తీసిన చిత్రం స్వయంకృషి. చాలా ప్రత్యేకమైన పాత్ర. రోడ్డు మీద చెప్పులు కుట్టే స్థాయి నుండి పెద్ద పారిశ్రామికవేత్తగా మారినా మూలాలనూ, నియమాలనూ మర్చిపోకుండా జీవితం గడిపిన ఉదాత్తమైన పాత్ర చిరంజీవిది. వారిద్దరూ కలిసి చేసిన మరో చిత్రం ఆపద్బాంధవుడు.

అంతర్జాతీయ స్థాయిలో నటుడిగా పేరుప్రతిష్ఠలున్న నటుడు కమల్ హాసన్. కమల్ విశ్వనాథ్ కలిసి చేసిన చిత్రాలు మూడు. మూడూ అత్యుత్తమ స్థాయిలో ఉన్నవే. సాగరసంగమం చిత్రం కమల్ నృత్యాభినయనానికీ, వైవిధ్యభరితమైన నటనకీ పరాకాష్ట. స్వాతిముత్యం చిత్రంలో మానసికంగా ఎదగని పాత్రలో తన నట విశ్వరూపాన్ని చూపించారు కమల్. శుభసంకల్పంలో కమల్ తను నటించడమే కాకుండా దర్శకుడు విశ్వనాథ్ చేత నటింపచేసారు కూడా. ఆ తరవాత విశ్వనాథ్ గారు చాలా చిత్రాలలో నటించారు. ఆయన నట జీవితానికి శుభారంభం శుభసంకల్పం చిత్రం.

విశ్వనాథ్ గారు దర్శకత్వం వహించిన చిత్రాలలో నటించిన ఇతర ప్రముఖ హీరోలు - కృష్ణ, బాలకృష్ణ, కృష్ణంరాజు, చంద్రమోహన్, సర్వదమన్, వెంకటేష్, రాజశేఖర్, మమ్ముట్టి, శ్రీకాంత్, అల్లరి నరేష్.

# బాల నటీనటులు

విశ్వనాథ్ తన చిత్రాలలో పిల్లలచేత ముఖ్యపాత్రలు ధరింపచేస్తారు. కొన్ని చిత్రాలలో ఐతే పిల్లలే కథలకి మూలం అవుతారు.

అంత ముఖ్యపాత్రలకి ఆయన ఎంచుకున్న బాలనటీనటులు చాలా చక్కగా చేస్తారు. అలా అనడం కన్న ఆయన వాళ్ళ చేత బాగా చేయించుకుంటారు అనడం సరేమో. పిల్లలకి నటనానుభవం ఉండే అవకాశం తక్కువ. వాళ్లకి శ్రద్ధ, ఏకాగ్రత కూడా కాస్త తక్కువే ఉండచ్చు. అలాంటి వారిచేత తనకి కావల్సింది రాబట్టుకుంటారు విశ్వనాథ్.

సీతామాలక్ష్మి చిత్రంలో పదేపదే పాడుతున్నా, ఏపాట నేపాడనూ పాటలకి అత్యద్భుతమైన అభినయం చేసారు బాలనటి తులసి. ఆ తులసే శంకరాభరణంలో చిన్న శంకరంగా అందరి మనస్సులనూ దోచేసుకున్నారు. బాలనటి తులసి విశ్వనాథ్ స్కూల్లో నగిషీలు దిద్దించుకున్న చైల్డ్ ప్రోడిజీ. ఆ బాలనటే విశ్వనాథ్ శుభలేఖ చిత్రంలో కట్నం కోసం ఆశపడే మావగారిని హడలు గొట్టేసిన లక్ష్మి అయ్యారు.

తులసి లానే ఇంకో చైల్డ్ ప్రోడిజీ షణ్ముఖ శ్రీనివాస్. శ్రుతిలయలులో అభినయం, నృత్యాభినయం, సంగీతాభినయం అన్నీ చక్కగా చూపించిన శ్రీనివాస్ తెర వెలుపల కూడా నాట్యం, సంగీతంలో దిట్టట. విశ్వనాథ్ గారి రెండు చిత్రాలలోనూ అతని పేరు శ్రీనివాసే. రెండు చిత్రాలకీ, అతనికి ఉత్తమ బాలనటుడిగా నంది అవార్డు వచ్చింది.

బాలనటుడిగా దేశమంతా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న మంజునాథ్ స్వాతికిరణంలో చూపించిన ప్రతిభ అద్వితీయం. అసామాన్యం. అతి క్లిష్టమైన ఆ పాత్రని ఆవిష్కరించడానికి అవసరమైన నైపుణ్యం ఆ బాల మేధావి స్వంతం.

తులసీ, షణ్ముఖ శ్రీనివాస్, మంజునాథ్ కాకుండా డాలీ (శారద), వరలక్ష్మి (జీవనజ్యోతి, శంకరాభరణం) మీనా (సిరివెన్నెల), చక్రి తోలేటి (సాగరసంగమం), కార్తీక్ (స్వాతిముత్యం), అర్జున్ (స్వయంకృషి) వంటి బాల నటులు విశ్వనాథ్ గారి చిత్రాలలో ముఖ్యమైన పాత్రలు చక్కగా పోషించారు.

(సులక్షణ పేరుతో విశ్వనాథ్ గారి శుభోదయం చిత్రంలో కథానాయికగా నటించారు డాలీ)

# లబ్ధప్రతిష్ఠులు

విశ్వనాథ్ ఎందరో గొప్ప కళాకారులతో పనిచేసారు. కొన్ని చిత్రాలకి తమ తమ కళలలో లబ్ధప్రతిష్ఠులైన వారి సహకారం తీసుకున్నారు. వారి వల్ల ఆ చిత్రాలకి ప్రత్యేకత వచ్చింది. అలాంటి వారిని ప్రస్తావించుకోవడం వారిని సన్మానించుకోవడం కోసం. వారిని తన చిత్రాల ద్వారా మనకి దగ్గరగా తీసుకుని వచ్చిన విశ్వనాథ్ గారిని గౌరవించుకోవడం కోసం.

## హరిప్రసాద్ చౌరాసియా



సిరివెన్నెల చిత్రంలో కథానాయకుడు హరిప్రసాద్ వేణు విద్వాంసుడు. తన వేణు నాదంతో అందరినీ మంత్రముగ్ధుల్ని చెయ్యగల సమర్థుడు. అందుకని అతను వాయించే వేణు గానాన్ని నేపథ్యంలో వినిపించడానికి విశ్వనాథ్ ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు హరిప్రసాద్ చౌరాసియాని వినియోగించుకున్నారు. హరిప్రసాద్ చౌరాసియా ఆ చిత్రంలో సంగీతాన్ని సుసంపన్నం చేసారు. తన వేణువుతో శ్రోతల వీనులకు విందు చేసారు. వారిని వినువీధుల్లో విహరింపచేసారు.

## షరోన్ లోవెన్



స్వర్ణకమలం చిత్రంలో ఒక విదేశీ నాట్యకత్తె పాత్రకి నిజ జీవితంలో అమెరికా నుండి వచ్చి భారతదేశం నృత్య రీతుల్ని నేర్చుకుని పేరు తెచ్చుకున్న షరోన్ లోవెన్ ని ఎన్నుకున్నారు విశ్వనాథ్. షరోన్ ఆ పాత్రకి రావల్సిన ఔన్నత్యం తేవడమే కాకుండా ఆ పాత్రకి కావల్సిన నాట్యాభినయం చేసారు. చిత్రంలో సఖిహే అన్న జయదేవుని అష్టపదికి షరోన్ అభినయించిన ఒడిస్సీ నాట్యం నయనానందకరం.

ఈ నృత్యానికి దర్శకత్వం వహించింది ప్రఖ్యాత ఒడిస్సీ నృత్య కళాకారుడు కేలూచరణ్ మహాపాత్ర.

(ఆపద్బాంధవుడు చిత్రంలో దర్శకుడు జంధ్యాల, సప్తపది చిత్రంలో నృత్య దర్శకుడు శేషు, సిరివెన్నెల చిత్రంలో డ్రమ్మర్ శివమణి, సాగరసంగమం చిత్రంలో మంజుభార్గవి కనిపిస్తారు).

# అందానికి అందాలు

# అందానికి అందాలు

విశ్వనాథ్ గారి చిత్రాలలో హీరోయిన్లు హీరోలతో పాటలు పాడి ప్రేక్షకులని అలరించేందుకు మాత్రమే ఉన్న అమ్మాయిలు కారు. వారికి స్వంత అభిప్రాయాలు ఉంటాయి. వాటిని చెప్పడానికీ, చెయ్యడానికీ వాళ్ళు జంకరు. ధైర్యంగా ముందుకు నడుస్తూ - తమతో ఉన్నవాళ్ళని కూడా నడిపిస్తారు.

ఉండమ్మా బొట్టు పెడతా, కాలం మారింది, శారద, ఓ సీత కథ, జీవనజ్యోతి, సీతామాలక్ష్మి, శుభలేఖ, సాగరసంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, శ్రుతిలయలు, స్వాతికిరణం - ఆయన చిత్రాలన్నింటిలోనూ కథానాయికలు తమకి తాముగా కథకి ముఖ్యమైన వారు. హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు అని చెప్పుకోకుండా విశ్వనాథ్ గారు తీసిన ఫీమేల్ సెంట్రిక్ చిత్రాలు అవి.

ఆ పాత్రలకి విశ్వనాథ్ గారు ఎన్నుకున్న హీరోయిన్లు అందరూ ఆ పాత్రలకి సంపూర్ణ న్యాయం చేసారు. ఆ పాత్రల పరిపుష్టిత వల్ల పాత్రలు ధరించిన హీరోయిన్లు ఎంతో పేరు సంపాదించుకున్నారు. అంత కన్న ముఖ్యంగా విశ్వనాథ్ అనే ప్రొఫెసర్ దగ్గర నటన మెలకువలు నేర్చుకున్నారు. ఈ మాటలు వాళ్ళు స్వయంగా అన్నవి. నేను విన్నవి.

ఆయన చిత్రాలలో నటించిన హీరోయిన్లు అందగత్తెలే ఐనా - వాళ్ళు ఆయన చిత్రాలలో మరింత అందంగా కనిపిస్తారు. అందం చర్మంలోతు కాదు. అది నిశితమైన బుద్ధినీ, నిర్మలమైన హృదయాన్నీ ప్రతిబింబించే వర్చస్సు. ఆ వర్చస్సు మనిషి వ్యక్తిత్వం లోని ప్రత్యేకత వల్ల పుడుతుంది. విశ్వనాథ్ గారు స్త్రీ పాత్రలకి అద్దిన వ్యక్తిత్వం వల్లా, తీర్చి దిద్దిన వర్చస్సు వల్లా పాత్రధారిణుల అందం ఇనుమడిస్తుంది.

ఆయన చిత్ర కథానాయికల ఉనికి కథానాయకుడి చుట్టూ తిరగడం కోసం కాదు. నాయకుడు ప్రతినాయకుడిని కొట్టినప్పుడు నవ్వుతూ, ప్రతినాయకుడు నాయకుడిని కొట్టినప్పుడు ఏడుస్తూ కనిపించే అబలలు కాదు. కొన్ని చిత్రాలలో కొన్ని సందర్భాలలో వారే కథానాయకులని సరైన మార్గంలో నడిపించే వివేకమహిళలూ, రక్షించే ధీరవనితలూ.

విశ్వనాథ్ హీరోయిన్ల ఆహార్యంలో ఏం చిన్న మార్పులు ఊహించుకుని మేకప్పు చేయించుకుంటారో కానీ ఆ అందగత్తెలు మరింత అందగత్తెలు ఐపోతారు.

అలాగని ఆ ఆహార్యం ప్రేక్షకులని రెచ్చగొట్టేదిగా ఉండదు. ఎక్కడా అశ్లీల ధోరణి ఉండదు. అంతెందుకు అమ్మాయి శరీరాన్ని బహిర్గతం చెయ్యడానికి అవకాశం ఉన్న సన్నివేశాలలో కూడా విశ్వనాథ్ నగ్నత్వాన్ని కప్పి పెడతారే కానీ తెరమీద ఆరెయ్యరు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో హీరోయిన్లకి ఒక నిండుదనం ఉంటుంది. వాళ్ళు దేవాలయాలలోని శిల్పాలు ప్రాణాలు పోసుకుని వచ్చినట్లు కనిపిస్తారు. రవివర్మ తైల వర్ణచిత్రాలు చలన చిత్రాలలోకి నడుచుకుని వచ్చారా అన్నట్లు అనిపిస్తారు.

అందుకే హీరోల ప్రస్తావన అంతా ఒక భాగంలో ఒక ఉపభాగంగా ముగించిన నేను - హీరోయిన్ల గురించి ముచ్చటించుకుందుకు ఒక భాగం పూర్తిగా కేటాయించుతున్నాను.

పదిమంది అందగత్తెలకి ఆయన అద్దిన అందాన్ని అవలోకిద్దాం.

- ★ జమున
- ★ వాణిశ్రీ
- ★ శారద
- ★ రోజారమణి
- ★ జయప్రద
- ★ మంజుభార్గవి
- ★ సబిత
- ★ సుమలత
- ★ భానుప్రియ
- ★ రాధిక

(ఈ పదిమందితో సమంగానో, కొంచెం ఎక్కువగానో నేను ఎక్కువగా అభిమానించే ఇద్దరిని - విశ్వనాథ్ చిత్రాలలో ఆ ఇద్దరూ నటించినా - ఈ జాబితాలో చేర్చలేకపోతున్నాను. ఒక విధంగా నా ఎంపికల నిష్పక్షపాతానికి ఇది ఋజువు.

ఒకరు సహజసౌందర్యంతో సహజంగా కనిపించే సహజనటి జయసుధ. జయప్రదం కార్యక్రమంలో జయప్రదతో ముచ్చటిస్తూ జయసుధే విశ్వనాథ్ గారు నాకు మంచి పాత్రలు ఇవ్వలేదని తనదైన నిర్మొహమాట ధోరణిలో చెప్పారు. జీవిత నౌక చిత్రంలో మంచి పాత్రే ఐనా అది సరిగ్గా హైలైట్ కాలేదు. అల్లుడు పట్టిన భరతం చిత్రం కూడా సుమారుగా అంతే. కాలాంతకులు గురించి ఎంత తక్కువ గుర్తు చేసుకుంటే అంత మంచిది.

ఇంకో హీరోయిన్ - ఎమ్మెఫ్ హుస్సేన్ వంటి విశ్వవిఖ్యాత చిత్రకారుడి ఊహాసుందరిగా విహరించిన మాధురీ దీక్షిత్. తెర మీద ఆవిడ నవ్వితే నన్ను చూసే అని ప్రేక్షకులు అందరూ అనుకునేంత సమ్మోహనమైన నవ్వుతో, అందంతో, అభినయంతో, నాట్యభంగిమలతో హిందీ చిత్ర సీమలో ఒక దశాబ్దం పాటు మహారాణిగా వెలిగిన నటి. ఆ సౌందర్యాన్ని ద్విపాత్రాభినయంతో సంగీత్ చిత్రం ద్వారా ద్విగుణీకృతంగా చూపించడానికి విశ్వనాథ్ గారు చేసిన ప్రయత్నం ఎందుకో ఎక్కడో దారి తప్పింది. ప్రమాదో ధీమతామపి!)

# జమున

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తొలి హీరోయిన్ నుండి ఇప్పటి వరకూ ఉన్న హీరోయిన్లు అందరిలోనూ ఎవరు అందంగా ఉంటారని నెట్లో జరిగిన కొన్ని సర్వేలలో జమున పేరు ముందుగా ఉంది. సర్వేలని పక్కన పెట్టేసినా జమున చాలా అందంగా ఉంటుందన్నది చాలా మంది అభిప్రాయమే.



అసలే అందమైన జమునకి పన్ను మీద పన్ను మరింత అందాన్ని ఇస్తుంది.

అందం, అల్లరి, అమాయకత్వం, ఆప్యాయత, అభిమానం కలిస్తే జమున.

నిజజీవితంలో జమున వ్యక్తిత్వానికీ, సినిమాలలో పాత్రలకీ చాలా సార్లు చాలా దగ్గర సంబంధం ఉన్నట్లే ఉంటుంది.

చలన చిత్ర పరిశ్రమలో ఎందరో నటులతో నాయికగా నటించారు జమున. కొత్త హీరోలతో నటించి వారు పేరు తెచ్చుకుందుకు కూడా దోహదం చేసారు.

మూగమనసులులో అల్లరిపిల్ల గౌరిగా, మిస్సమ్మలో అమాయకమైన సీతగా, గుండమ్మకథలో మారాం చేసే సరోజగా, మంగమ్మ శపథంలో తన మాట నిలపెట్టుకున్న మంగమ్మగా, శ్రీకృష్ణతులాభారంలో అభిమానవతి సత్యభామగా, పండంటి కాపురంలో రాణీ మాలినీదేవిగా, కలెక్టర్ జానకిగా, తాసీల్దారుగారి అమ్మాయిగా విభిన్న ఛాయలున్న పాత్రలు వేసి మెప్పించి ఎంతో అనుభవం ఎంతో మంది అభిమానం సంపాదించుకున్న జమున విశ్వనాథ్ గారి దర్శకత్వంలో నటించిన ఒకే ఒక్క చిత్రం ఉండమ్మా బొట్టు పెడతా.

ఉండమ్మా బొట్టు పెడతాలో లక్ష్మి పాత్ర చాలా ఉదాత్తమైనది.

హరిదాసు కూతురిగా, ఊళ్ళో అందరికీ మంచి చేసేదానిగా, కృష్ణ ప్రియురాలిగా, ఉమ్మడి కుటుంబంలో కొత్త కోడలిగా అణకువా, ఆప్యాయతా, అనురాగం, ఆదరణా కలబోసి నటించారు జమున. భర్తతో సమంగా కష్టపడుతూ, ఉమ్మడి కుటుంబంలో తోటికోడళ్ళ నిరాదరణని ధైర్యంగా ఎదుర్కొంటూ పాత్రకి కావల్సిన స్వాభిమానాన్ని చక్కగా అభినయించారు.

చిత్రమైన కథలో విచిత్రమైన సన్నివేశానికి దారి తీసే సన్నివేశాలన్నీ ఎక్కువ లక్ష్మి చుట్టూ అల్లినవే. తన భక్తి శ్రద్ధలతో లక్ష్మీదేవి కరుణా కటాక్షాలు సంపాదించుకుని, ఉండమ్మా బొట్టు పెడతా అని ఆ లక్ష్మీదేవిని తన ఇంట్లోనే ఉంచేసుకున్న పాత్రలో జమున అత్యద్భుతమైన ప్రదర్శన చేసారు. లక్ష్మి పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు. ప్రేక్షకుల ఆదరాభిమానాలు అందుకున్నారు.

అందం, అల్లరి, అమాయకత్వం, ఆప్యాయత, అభిమానంతో పాటు అభినయం కూడా కలిసి జమున. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో అందంగా ప్రవహించే గంగే జమున.

# వాణిశ్రీ

తన సినీ జీవితం తొలినాళ్ళ లో చాలా చిన్న పాత్రలు వేసి, తన ప్రతిభతో, కృషితో అగ్రనటిగా ఎదిగారు వాణిశ్రీ.

విశ్వనాథ్ గారి దర్శకత్వంలో వాణిశ్రీ నటించిన చిత్రాలు - నిండుహృదయాలు, చిన్ననాటి స్నేహితులు, చెల్లెలి కాపురం, జీవనజ్యోతి, ప్రేమబంధం.



నిండుహృదయాలు చిత్రంలో హీరో ఎన్టీఆర్ కి ప్రియురాలుగా వేస్తే, చిన్ననాటి స్నేహితులులో అదే ఎన్టీఆర్ స్నేహితుడి కూతురిగా నటించారు వాణిశ్రీ. చెల్లెలి కాపురం, జీవనజ్యోతి, ప్రేమబంధం చిత్రాలు మూడింటిలోనూ హీరో శోభన్ బాబు.

విశ్వనాథ్ గారి చిత్రాలు అన్నింటిలోనూ వాణిశ్రీ నటన బావుంటుంది. అందులోనూ చెల్లెలి కాపురం, జీవన జ్యోతి చిత్రాలలో నటన ఇంకా బావుంటుంది. జీవన జ్యోతిలో ఐతే చాలా చాలా బావుంటుంది. ఆ చిత్రంలో వాణిశ్రీ తల్లీ కూతుళ్ళ గా ద్విపాత్రాభినయం చేసారు. ఏ పాత్రకి ఆ పాత్రే అద్భుతంగా చేసారు.

చెల్లెలి కాపురం చిత్రంలో వాణిశ్రీ ఒక నాట్యకత్తె. మావయ్యని ఆటపట్టించే చిలిపితనం, రామూ దగ్గర ఆప్యాయతతో కూడిన ఆరాధనా, శ్రీరాం దగ్గర జాగ్రత్తతో కూడిన తెలివీ - అన్ని రసాలను బాగా పండించారు. కనుల ముందు నీవుంటే అన్న పాటలో నారాయణరెడ్డి ఉపమించిన జానకిలా, శకుంతలలా, చిత్రసుందరిలా, శిల్పమంజరిలా, రాగిణిలా, నాగినిలా కనిపిస్తారు వాణిశ్రీ.

జీవన జ్యోతి చిత్రంలో వాణీశ్రీది తలీకూతుళ్ళగా ద్విపాత్రాభినయం. చిత్రమంతా తల్లీ కూతుళ్ళ పాత్రల చుట్టూనే తిరుగుతుంది. తల్లి పేరు లక్ష్మి. కూతురి పేరు శోభ. అసలు తల్లి ఉందనే తెలియకుండా పెరిగిన శోభ అనుకోకుండా తల్లి గురించి తెలుసుకుంటుంది. లక్ష్మి మానసిక స్థితిని చూసి చలించి పోతుంది. తను అమెరికా వెళ్తూ తన కొడుకునే తల్లికి తల్లి కొడుకులా ఇచ్చేసి వెళ్ళి పోతుంది. ఆ విషయం తల్లికీ కొడుకుకీ తెలియనివ్వదు. అలా తెలియకుండా కొడుకుని తల్లి దగ్గర అప్పగించడానికి విశ్వనాథ్ తయారు చేసిన సన్నివేశం, పాటా బాగా కుదిరిపోయాయి.

తల్లి మానసిక పరిస్థితికి తల్లడిల్లిపోయే కూతురు పాత్రలో వాణిశ్రీ అత్యద్భుత నటన ప్రదర్శించారు. అంత కన్న ప్రియురాలిగా, ఇల్లాలుగా, మానసిక రోగిగా పరిణామం చెందిన తల్లి పాత్రలో వాణిశ్రీ జీవించారు.

వాణిశ్రీ చీరకట్టు అని ప్రత్యేకంగా ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయేటంత ప్రత్యేకంగా ఉండేది వాణిశ్రీ విగ్రహం. విశ్వనాథ్ గారి చిత్రాలలో ఆ ప్రత్యేకత ద్విగుణీకృతమైంది. అంతే.

# శారద

1968, 1972 లలో తులాభారం, స్వయంవరం అనే మలయాళం చిత్రాలకు జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న శారద 1972, 1973 లలో విశ్వనాథ్ గారి దర్శకత్వంలో కాలం మారింది, శారద చిత్రాలలో నటించారు. ఆ తర్వాత 1977 లో తెలుగు చిత్రం నిమజ్జనానికి మరో జాతీయ బహుమతి అందుకున్నారు శారద.



విశ్వనాథ్ గారి దర్శకత్వంలో శారద జననీ జన్మభూమి అనే చిత్రంలో 1985 లో నటించారు కానీ ఆ చిత్రంలో ఆవిడ పాత్ర ఎందుకో గొప్పగా రాణించలేకపోయింది.

కాలం మారింది చిత్రంలో శారద ఒక అంటరాని పేద వారింట పుడుతుంది. పరిస్థితుల కారణంగా ఒక పెద్దింట పెరుగుతుంది. తనని పెంచిన పెద్దాయన ఆదర్శాలనీ, మనోభావాలని పుణికి పుచ్చుకుంటుంది. అనాథలనీ, అభాగ్యులనీ ఆదరణతో చూస్తుంది.

ఒకరోజు తన జన్మ రహస్యం తెలుస్తుంది. అప్పుడు తనని పెంచుతున్న తల్లితండ్రులు తన వారు కారని కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంది. అసలు విషయం తెలిసాక శారద సంభాషణలు పలికే తీరూ, ముఖ కవళికలలో చూపించిన భావోద్వేగాలూ చాలా బావుంటాయి. శారద తన నటనా విశ్వరూపం చూపించినట్లుంటుంది.

అలాగే తానెవరో చెప్పకుండా తనకి కాబోయే అత్తవారింటే పనిమనిషిగా ఉన్నప్పుడు తను చేస్తున్న పని తప్పేమో అని బాధపడుతూ ఉండడం కూడా శారద నటనా కౌశలానికి నిదర్శనం.

శారద విశ్వనాథ్ గారి దర్శకత్వంలో నటించిన రెండవ చిత్రం శారద. ఊరందరికీ మంచిదానిగా అందరి యోగక్షేమాలు చూసుకునే అమ్మాయిగా ఉండే శారద ఊరికి సేవ చెయ్యడానికి వచ్చిన ఒక డాక్టర్ని ప్రేమిస్తుంది. ప్రియురాలిగా చలకీగా, సరదాగా నటిస్తుంది శారద.

దురదృష్టవశాత్తూ ఆ డాక్టర్ పెళ్ళైన వెంటనే పడవ ప్రయాణంలో మరణిస్తాడు. ఆ వార్త వింటే శారద ఏం అయిపోతుందో అని ఊరు ఊరంతా ఆ విషయాన్ని శారద దగ్గర దాస్తారు. భర్త కోసం ఎదురుచూసే అమాయకురాలిలా శారద అభినయం అమోఘం.

శారద ఊరికి తన స్నేహితుడి వివాహం కోసం ఒక సైకియాట్రిస్ట్ వస్తాడు. ఆ సైకియాట్రిస్ట్ అచ్చు శారద భర్త లాగే ఉంటాడు. తననే భర్త అనుకుంటున్న శారదని ట్రీట్మెంట్ కోసం తన ఇంటికి తీసుకు వెళ్తాడు సైకియాట్రిస్ట్. అక్కడ కొన్నాళ్ళ కి అసలు విషయం తెలుసుకుంటుంది శారద. తెలుసుకుని వైధవ్యం స్వీకరిస్తుంది.

పతాక సన్నివేశంలో శారద నటన శారదకి మాత్రమే సాధ్యం.
శారద అందం శారద నటన. శారద అందం శారద కంఠం. శారద అందం శారద ఆంగిక వాచికాలు.





# రోజారమణి



1967 లో భక్తప్రహ్లాద చిత్రానికి ఉత్తమ బాలనటి(టుడి)గా జాతీయ అవార్డు అందుకున్నారు రోజారమణి. మరో ఐదేళ్ళకి 1972 లో మలయాళం చిత్రం చెంబర్తికి ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డ్ అందుకున్నారు. అదే మలయాళం చిత్రం ఆధారంగా తెలుగులో 1973 లో నిర్మించిన కన్నెవయసులో నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ముద్దమందారంలా నిలిచిపోయారు.

ఆ మరుసటి సంవత్సరమే 1974 లో విశ్వనాథ్ గారి దర్శకత్వంలో ఓ సీతకథ లో నటించారు. ఓ సీతకథ కథ విశ్వనాథ్ గారి మస్తిష్కంలో ఉదయించిన అద్భుతం. ఆ పాత్రకి రోజారమణిని ఎన్నుకోవడం మరింత అద్భుతం.

రోజారమణికి అప్పుడు పదిహేను పదహారు సంవత్సరాలు ఉంటాయేమో. ఆ చిత్రంలో రోజారమణి ధరించిన సీత పాత్ర వయస్సు కూడా సుమారుగా అంతే. తన బావతో పాటలు పాడుకుంటూ హాయిగా కాలం గడిపేస్తూ ఉంటుంది. సరదాల సరసాల తేలిపోయే కన్నె పిల్లగా రోజారమణి చాలా అందంగా ఉండడమే కాకుండా ఆ వయస్సుకి సరిగ్గా సరిపోయినట్లు ఉంటుంది.

ఐతే ఆ చిత్రంలో సీత పాత్రలో విభిన్న ఛాయలు ఉంటాయి. చిత్రంలో మొదటి భాగంలో తన బావతో సరదాగా సరసాలూ, సరాగాలూతో సాగిపోతుంది. అలా గడిచినంతసేపూ మన కళ్ళ ముందు ఒక అందమైన చిన్న పిల్లగా కనిపిస్తారు రోజారమణి.

దారుణంగా బావ చంపబడడంతో పరిస్థితులు తారుమారౌతాయి. అప్పటి నుండి సీత బాధలు అనుభవించాల్సి వస్తుంది. కారుణ్యం, దైన్యం బాధా అనుభవించే సీతగా కనిపిస్తారు రోజారమణి. సుందరిని మోసం చేసిన గోపాలకృష్ణని నిలదీస్తుంది. అదే గోపాలకృష్ణ తనని బలాత్కరించబోతే ప్రతిఘటిస్తుంది సీత. ఆ సన్నివేశాలలో అపరకాళికలా కనిపిస్తారు రోజారమణి. ఆ పరిస్థితుల నుండి బయటపడే భాగంలో ఒక వృద్ధుడికి భార్యగా తనని అన్యాయం చేసినవాడికి తల్లిలా మారుతుంది. అక్కడ నుండి చిత్రం చివరి వరకూ కుటుంబాన్ని చక్కదిద్దే తల్లిగా కనిపిస్తారు రోజారమణి.

ఒక్కొక్క భాగంలో ఒక్కో రకం మేకప్ వేయించారు విశ్వనాథ్. అన్ని మేకప్పులలోనూ అందంగా ఉన్నారు రోజారమణి. సందర్భానుసారంగా చక్కని హావభావాలు చూపించారు.

రోజారమణి గొంతులోంచి మాటలు హాయిగా జాలు వారుతున్నట్లు వస్తాయి. సుందరమైన తెలుగు భాష రోజారమణి గొంతులో అతి సుందరంగా వినిపిస్తుంది. అందుకే తెర మీద కనిపించకపోయినా నటీమణులకి తన గాత్రాన్ని అందిస్తూ వినిపిస్తూనే ఉన్నారు.

# జయప్రద



జయప్రద విశ్వనాథ్ గారి దర్శకత్వంలో నటించిన తెలుగు చిత్రాలు - సిరిసిరిమువ్వ, ప్రేమబంధం, జీవిత నౌక, సాగరసంగమం. ఆయన తీసిన హిందీ చిత్రాలు - సర్గం, కామ్ చోర్, సంజోగ్, సుర్ సంగంలలో జయప్రద హీరోయిన్. ఈ నాలుగు హిందీ చిత్రాలూ, విశ్వనాథ్ గారు అంతకు ముందు తెలుగులో తీసిన - సిరిసిరిమువ్వ, శుభోదయం, జీవనజ్యోతి, శంకరాభరణం - చిత్రాల పునర్నిర్మాణాలే.

సత్యజిత్ రాయ్ వంటి విశ్వవిఖ్యాత దర్శకుడి చేత అందగత్తెగా పొగడబడిన నటి జయప్రద. జయప్రద తొలినాళ్ళలో నటించిన సీతాకళ్యాణం, అంతులేని కథ, సిరిసిరిమువ్వ - ప్రసిద్ధ దర్శకులు బాపు-రమణ, బాలచందర్, విశ్వనాథ్ దర్శకత్వాలలోని చిత్రాలు. ఒక కొత్త నటికి అలాంటి అవకాశాలు దొరకడానికి ముఖ్యకారణం జయప్రద అందమే అని నా నమ్మకం.

విశ్వనాథ్ గారు జయప్రదతో తీసిన మొదటి చిత్రం సిరిసిరిమువ్వ. ఆ చిత్రంలో నటించే సమయానికి జయప్రద మీదకి యవ్వనం అప్పుడప్పుడే మెల్లమెల్లగా కమ్ముకొస్తోంది. ఆ వయస్సులో ఉండే అమాయకత్వం, స్నిగ్ధత్వం, ముగ్ధత్వం జయప్రదలో కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంటాయి. అందుకేనేమొ సవతి తల్లి చాటుగా నాట్యాభ్యాసం చేసుకుంటున్న మూగ హైమ పాత్రకి జయప్రదని ఎన్నుకున్నారు విశ్వనాథ్. ఆ సినిమాని హిందీలో పునర్నిర్మిస్తూ జయప్రదనే తీసుకున్నారు.

సిరిసిరి మువ్వ విడుదలైన 1976 లోనే విశ్వనాథ్ గారి దర్శకత్వంలో రూపొందిన జయప్రద చిత్రాలు ప్రేమబంధం, జీవిత నౌకలు విడుదలయ్యాయి. ఆ చిత్రాలలో వరసగా వాణిశ్రీ , జయసుధ ప్రధాన పాత్రలు పోషించారు.

సిరిసిరిమువ్వ విడుదలైన ఏడేళ్ళకి 1983 లో విడుదలైన సాగరసంగమం చిత్రంలో జయప్రద అందాన్ని మరింత అందంగా ఆకర్షణీయంగా చూపించారు విశ్వనాథ్. సిరిసిరిమువ్వలో జయప్రద ముడుచుకున్న మొగ్గైతే సాగరసంగమంలో వికసించిన విరే.

సాగరసంగమంలో మాధవి పాత్రలో రకరకాల ఛాయలు ఉంటాయి. చిలిపితనం, అభిమానం, ప్రేమా, మాతృత్వం, దయా, కరుణా, పట్టుదలా కలిసిన సంపూర్ణమైన పాత్ర మాధవిది. ఏడేళ్ళ లో జయప్రద రూపంలో, నటనలో వచ్చిన పరిపూర్ణతనీ, పరిపక్వతనీ దృష్టిలో పెట్టుకుని జయప్రద కోసమే మాధవి పాత్రని విశ్వనాథ్ అలా తీర్చిదిద్దుకున్నారా అన్నట్లుంటుంది మాధవి పాత్ర. విశ్వనాథ్ జయప్రదల కాంబినేషన్ కి సాగరసంగమం పరాకాష్ట.

జయప్రద తన సినీ జీవితాన్ని ఎప్పుడైనా ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే విశ్వనాథ్ గారి సిరిసిరిమువ్వ, సాగరసంగమం మైలురాళ్ళు గా మిగిలిపోతాయి. జీవితాంతం జయప్రదని ఆనందంతో, గర్వంతో ఉంచుతాయి.

# మంజుభార్గవి

విశ్వనాథ్ గారి దర్శకత్వంలో మంజుభార్గవి కనిపించే చిత్రాలు మూడు - ప్రెసిడెంట్ పేరమ్మ, శంకరాభరణం, సాగరసంగమం.

ప్రెసిడెంట్ పేరమ్మ చిత్రంలో మంజుభార్గవి చేత ఒక వేంప్ తరహా వేషం వేయించి శాస్త్రీయ నాట్యం ఒకటి చేయించారు విశ్వనాథ్. ఒక రకంగా అది శంకరాభరణం చిత్రంలో తులసి పాత్రకి స్క్రీన్ టెస్టులా అనిపిస్తుంది.

సాగరసంగమం చిత్రంలో బాలకనకమయచేల అని మంజుభార్గవిచేత ప్రత్యేకమైన శాస్త్రీయ నృత్యం చేయించుకున్నారు విశ్వనాథ్. అది తులసి పాత్రలో మంజుభార్గవి విజయానికి గుర్తింపులా అనిపిస్తుంది.



ఆ రెండు పాత్రలూ చాలా చిన్నవి. ఆ రెండింటి మధ్య నిరంతరం గుర్తుండిపోయే ఉదాత్తమైన పాత్ర శంకరాభరణంలో తులసి.

తులసి తులసి అంత పవిత్రం. గోదావరంత దైవతం. పంకజమంత నిర్మలం.

మంజుభార్గవిది నిండైన విగ్రహం. ప్రశాంతమైన వదనం. నృత్యాభినయానికి అనువైన శరీరం.

విశ్వనాథ్ తులసి పాత్రని ఎంత అందంగా కల్పన చేసుకున్నారో. ఆ పాత్రకి మంజుభార్గవిని ఎలా ఎంచుకున్నారో. ఎంచుకున్న మంజుభార్గవిని ఎంత చక్కగా మలచుకున్నారో తులసిగా.

గుండ్రంగా పెద్ద బొట్టూ. చెవులకి రవ్వల దుద్దులు. ముక్కుకి వజ్రాల ముక్కుపుడక. చేతులకి గాజులు. మెడలో హారాలు. నిండుగా కప్పుకున్న చీర కొంగు. అంత అలంకరణలో కూడా ఏమీ లేనట్లు కనపడే నిరాడంబరతా, సరళతా.

మంజుభార్గవి మొహంలో సంగీత-నాట్యాల మీద రక్తీ, శంకరశాస్త్రి మీద భక్తీ, కొడుకు శంకరం మీద అనురక్తీ నిరంతరం తాండవిస్తాయి. ఆ చిత్రంలో అన్ని సన్నివేశాలలోనూ ఈ భావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తూనే ఉంటాయి. వీటన్నిటికీ తోడుగా నిరంతరం నాట్యం చేస్తూనే ఉండే పెదవులూ, కళ్ళూ , చేతులూ, కాళ్ళూ .

శంకరాభరణం ఒక దృశ్య కావ్యం ఐతే అందులో అన్నివిధాలా సరైన కథానాయిక మంజుభార్గవి.

ఆ చిత్రానికి కావల్సినది తన శక్తినంతా ధారపోసి సమర్పించుకున్నారు. ప్రసాదంగా చిరంతర కీర్తి సంపాదించుకున్నారు.

# సబిత

వన్ మూవీ వండర్ సబిత. సప్తపదికి ముందు నటించలేదు. ఆ తర్వాతా నటించలేదు. నటించిన ఆ ఒక్క సినిమాతో చిరంతరం గుర్తుండిపోయే హేమ పాత్రలో ఒదిగిపోయారు. మన మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.



తన చిత్ర దర్శకత్వ తొలినాళ్ళ లో విశ్వనాథ్ గారు నాట్యాభినయం ఉన్న పాత్రలకి నాట్యం బాగా వచ్చిన వారినే పెట్టుకోవాలనే నియమం పెట్టుకోలేదు. శంకరాభరణం చిత్రం ఆదిగా ఆ లోటు లేకుండా చూసుకుంటూనే ఉన్నారు. సప్తపదిలో హేమ నాట్యకత్తె. సబిత మంచి నాట్యకారిణి కావడంతో హేమ పాత్రకి సబితని ఎంచుకుని ఉంటారు. ఆయన తన చిత్రంలో ప్రతిపాత్రకి ఎవరు సరిపోతారో సరిగ్గా అంచనా వేస్తారు. ఒక్క నాట్య పరంగానే కాకుండా అన్ని విధాలా హేమగా సబిత ఇమిడిపోయారు.

విశ్వనాథ్ గారి చిత్రాలలో అశ్లీలతకి తావు లేదు. సప్తపదిలో అసలు శృంగారానికే ఆస్కారం ఇవ్వలేదు విశ్వనాథ్ గారు . హేమ పాత్ర చిత్రమంతా పవిత్రంగా ఉంటుంది. తన నాట్యం మీద అంకిత భావం. పెద్దల మాట మీద గౌరవం. తన మనస్సులోని భావాలని తనలోనే దాచుకునే నిగ్రహం. వెరసి హేమ.

సబిత చిత్రంలో చేసిన నృత్యాలన్నీ రసగుళికలే. భామనే సత్యాభామనే, నెమలికి నేర్పిన నడకలివి, అఖిలాండేశ్వరి నృత్యగీతాలు దివ్యమైతే జాతవేదసే కి చేసిన అభినయం దివ్యాతిదివ్యం. ఇంక తన భర్త తనని దేవతలా ఆరాధిస్తున్నాడని తెలిసి చేసిన శివతాండవం - విశ్వనాథ్ గారు తనని ఆ చిత్రానికి ఎందుకు ఎంచుకున్నారో తెలుసుకుని ఆయన కలని నిజం చేసిన విజయతాండవమే. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో అది చిరస్థాయిగా నిలిచిపోయే నాట్యాభినయం.

నాట్యం సబిత ఎప్పటినుండో నేర్చుకుంటున్న విద్య. నటన సప్తపది చిత్రం కోసం విశ్వనాథ్ గారి దగ్గర నేర్చుకున్నది. ఎక్కడా ముఖకవళికలలో హెచ్చుతగ్గులు లేవు. పూర్తి సంయమనంతో హేమ ఎలా ఉండాలో అలా ఉన్నారు సబిత.

నాట్యానికి వేసిన అన్ని రకాల వేషాలలోనూ అందంగా కనిపిస్తారు. భర్త మహిషాసుర మర్దిని స్తోత్రం చదువుతోంటే అమ్మవారిగా కనిపించినప్పుడు దివ్యమైన సౌందర్యంతో ప్రేక్షకులకి కూడా అమ్మవారి లానే ప్రత్యక్షమయ్యారు.

సబిత సప్తపదిలో నటించే సువర్ణావకాశాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్నారు. ఆ పాత్రకి పూర్తి న్యాయం చేసారు. నాట్యకారిణిగా మంచి పేరూ, అభిమానం సంపాదించుకున్నారు. జన్మ ధన్యం చేసుకున్నారు.

# సుమలత

విశ్వనాదామృతంలో మాట్లాడుతూ సుమలత - మనం చేసిన పాపాలు పోగొట్టుకుందుకు మనం దేవాలయాలకి వెళ్ళి నట్లు - రకరకాల సినిమాల్లో చేసే పాత్రల తాలూకు పాపం ఏదన్నా అంటుకుంటే అది విశ్వనాథ్ గారి చిత్రాలలో నటించి పోగొట్టుకోవచ్చు - అని అన్నారు. అక్షరాలా అవే మాటలు కాకపోవచ్చు. అర్థం మాత్రం అదే.



విశ్వనాథ్ గారు దర్శకత్వం వహించిన చిత్రాలలో సుమలత నటించిన చిత్రాలు నాలుగు. అవి శుభలేఖ, జననీ జన్మభూమి, శ్రుతిలయలు, స్వయంకృషి. జననీ జన్మభూమి చిత్రంలో సుమలత పాత్రకి ప్రాముఖ్యం లేదు. ఈ వాక్యం ఆ చిత్రంలో నటించిన శారద పాత్రకి కూడా వర్తిస్తుందని ముందే రాసాను నేను.

విశ్వనాథ్ సుమలత కాంబినేషన్లో వచ్చిన మొదటి చిత్రం శుభలేఖ. ఆ చిత్రంలో సుమలత ధరించిన సుజాత పాత్ర నారీశక్తికి ప్రతీక. ఏ నాడూ తన స్వాభిమానాన్ని వదిలి పెట్టదు. వక్రమార్గంలో నడవదు. అందుకు ఎవరిని ఎదిరించడానికైన జడవదు. అలాగని తన స్వభావం దుడుకు కాదు. మృదు స్వభావురాలు.

సుమలత మొహంలో మృదు స్వభావం స్వతస్సిద్ధంగా కనపడుతుంది. సుజాత పాత్రలో ఆ మృదుత్వంతో పాటు తనమీద తనకు ఉన్న విశ్వాసం చూపిస్తారు సుమలత. అలాగే సుమలత కంఠంలో ఒక లాలిత్యం వినిపిస్తుంది. శుభలేఖ చిత్రంలో ఆ లాలిత్యంలో పాటు తన వ్యక్తిత్వంలో ఒక స్థిరత్వం ధ్వనింపచేస్తారు సుమలత.

శుభలేఖ చిత్రంలో నటించేనాటికి సుమలతకి వయస్సు ఇరవై దాటలేదుట. ఆ లేతవయస్సులో సుజాత పాత్రకి విశ్వనాథ్‌గారి ఊహల్లో ఉన్న పరిపక్వత కాస్త లోపించిందేమో సుమలతకి సులోచనాలు ఆభరణంగా తొడిగించారు.

శ్రుతిలయలులో సీత పాత్ర చిత్రానికి అతి కీలకమైన పాత్ర. సుమలత అత్యద్భుతంగా సీతగా మారిపోయారు. తలుపు చాటున నిల్చుని తను తను అని తెలియని భర్తతో తమ కుమారుడి భవిష్యత్తు గురించి సలహాలు అడుగుతున్న సన్నివేశంలో సుమలత రవివర్మ చిత్రం ప్రాణం పోసుకుని తెరమీదకి వచ్చి అభినయిస్తోందా అన్నట్లు కనిపించారు.

శుభలేఖ విడుదలైన ఐదేళ్ళ కి వచ్చింది శ్రుతిలయలు. తన కార్యం నెరవేర్చడానికి తెలివితేటలూ, ధైర్యం ఉన్నా, పరిస్థితుల ప్రభావం వల్ల కాస్త ఒదిగి ఉంటున్న మహిళ పాత్రకి కావల్సిన పరిపూర్ణత వచ్చింది సుమలతకి. కళ్ళద్దాల అవసరం రాలేదు. స్వయంకృషి చిత్రంలో చాలా ప్రాముఖ్యత ఉన్న శారద పాత్ర సుమలతది. ఎంతో నిగ్రహం, సంయమనం పాటించాల్సిన పాత్రలో సుమలత అద్భుతంగా నటించారు.

సుమలత అందగత్తె. మంచినటి. విశ్వనాథ్ గారి చిత్రాలలో మరింత అందగత్తెగా మరింత మంచినటిగా మారిపోయారు.

# భానుప్రియ



స్వర్ణకమలం చిత్రంలో మీనాక్షి వేషధారిణి భానుప్రియ. ఎన్నో చిత్రాలలో ఎన్నో పాత్రలు వేసినా తను పుట్టింది మీనాక్షి పాత్రకోసమే అన్నట్లు నటించారు భానుప్రియ.

పౌడర్ రాసుకోవడంలో ఒక నిర్లక్ష్యం తో మొదలౌతుంది మీనాక్షి పాత్ర. నాట్యం నేర్చుకోవడంలో నిరాసక్తత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సినిమాకి వెళ్ళి స్నేహితురాలికి సాయం చెయ్యడానికి వెళ్ళానని అబద్ధం మామూలుగా చెప్పేస్తుంది. స్నేహితుడిగా చంద్రశేఖర్ ఎంత చెప్పినా తన దారే తనదని మొండిగా నడుస్తుంది. ఈ తరహా పాత్రకి ఉండాల్సిన వ్యక్తిత్వం ఛాయలని చాలా చక్కగా చూపించారు భానుప్రియ. అర్థం చేసుకోరూ అని భానుప్రియ అన్న తీరు ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేసేసింది. మాటలో గారం, మొహంలో గోమూ, కళ్ళ లో మారాం ఎంత అందంగా చూపించారో భానుప్రియ!

అలాంటి మీనాక్షికి తండ్రి మరణం తర్వాత తండ్రి శిష్యులు తండ్రికి చేసే గురుపూజ చూసిన తర్వాత మనస్సులో మార్పు వస్తుంది. అంతవరకూ మొక్కుబడిగా పైపైకి చేసే నాట్యాన్ని తాను అనుభవిస్తూ ఆత్మానందం కోసం చేస్తుంది. వంశపారంపర్యంగా తనకి సంక్రమించిన నాట్యాన్ని తను ఇంతవరకూ పట్టించుకోకపోడానికి పశ్చాత్తాపం చెందుతుంది. ప్రాయశ్చిత్తంలా నాట్యానికి తన జీవితాన్ని అంకితం చేసుకోవాలనుకుంటుంది.

ఇంక నాట్యంలో భానుప్రియది అందె వేసిన చెయ్యి. అన్ని పాటలకీ చక్కని ఆహార్యంతో అభినయంతో అలరించారు. పాటలకి నాట్యం చెయ్యడమే కాదు. ప్రతి సన్నివేశంలోనూ ఒక నాట్యకత్తె నటిస్తే ఎలా చేస్తుందో అలా చేసారు. ఏ భావాన్నైనా ఎంతో అనుభవం ఉన్న నాట్యకారిణి తన ఆంగికం ద్వారా ఎలా ప్రదర్శిస్తుందో అలా ప్రదర్శించారు. భానుప్రియ అందం భానుప్రియ కళ్ళ లో ఉంటుంది. ఆ కళ్ళ లో ఏ భావమైనా అందంగా పలుకుతుంది. ఆ మొహమూ అందమైనదే. అది అన్ని భావాలనీ ప్రదర్శిస్తుంది.

విశ్వనాథ్ గారి చిత్రాలు చూస్తోంటే ఆయన కథానాయిక ఎలా ఉండాలో ఎలా నటించాలో మనస్సులో అనుకున్నాక హీరోయిన్ని ఎంచుకుంటారా లేక హీరోయిన్ని ఎంచుకున్నాక తన కథానాయిక రూపు రేఖల్ని దిద్దుకుంటారా అని అనుమానం కలుగుతుంది. ఏం చేసినా ఆయన చిత్రాలలో నటించిన హీరోయిన్లు అందరూ ఆయా పాత్రలు ఐపోతారు

స్వర్ణకమలంలో భానుప్రియ అందుకు ఏ మాత్రం భిన్నం కాదు. ఒక విధంగా విశ్వనాథ్ చిత్రాల హీరోయిన్లని అందరినీ మించిపోయారేమో అని అనిపిస్తుంది. నేను విన్నది నిజమో కాదో నాకు తెలియదు కానీ - ఆ సంవత్సరం జాతీయ ఉత్తమ నటి అవార్డు స్వర్ణకమలంలో నటించిన భానుప్రియకి తృటిలో తప్పిందిట. ఆ సంవత్సరం నంది అవార్డు, ఫిల్మ్ ఫేర్ అవార్డు రెండూ భానుప్రియకే వచ్చాయి.

# రాధిక

దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ఎంతో వైవిధ్యమున్న పాత్రలు ధరించిన హీరోయిన్లలో రాధిక ఒకరు. విషాదం, హుషారూ, అల్లరీ, ఆడరౌడీ, లైటు హ్యూమర్, ఘాటు రొమాన్స్ వంటి అన్ని రకాల ఛాయలూ ఉన్న పాత్రలని అవలీలగా చేసేసారు రాధిక.



అలాంటి రాధికకే విశ్వనాథ్ గారి దర్శకత్వంలో నటించిన చిత్రాలు రెండూ అంతకు ముందు తను చేసిన పాత్రలు అన్నింటికన్న విభిన్నమైనవి. కథా పరంగా ఆ రెండు చిత్రాలూ ఎంతో ప్రత్యేకమైనవి. విచిత్రంగా రెండు చిత్రాల పేర్లు స్వాతి తోనే మొదలౌతాయి.

ఆ రెండు చిత్రాలలోనూ హీరోలగా నటించిన నటులిద్దరూ మహానటులుగా దేశమంతా పేరు తెచ్చుకున్న వారు. స్వాతిముత్యంలో కమల్ హాసన్, స్వాతికిరణంలో మమ్ముట్టి. వారి చలన చిత్ర జీవితాలలో కూడా ఆ పాత్రలు రెండూ విశేషమైనవే. ఒకరికి పైకి కనిపించే మానసిక వైకల్యం. రెండవవారికి పైకి కనిపించని మనోవైకల్యం. అలాంటి మేటి నటులకి నటనలో దీటైన నటి రాధిక. రెండు పాత్రలకీ జీవం పోసారు. న భూతో న భవిష్యతి లా మహాద్భుతంగా నటించారు రాధిక.

స్వాతిముత్యంలో చిన్నతనంలోనే వైధవ్యం అనుభవిస్తున్న లలిత హఠాత్తుగా శివయ్య అనే మానసిక వైకల్యంతో పాటు మంచి మనసున్న మనిషి కట్టిన మాంగల్యానికి కట్టుబడుతుంది. అతనికి దాంపత్య పాఠాలు కూడా నేర్పుకుని అతని ద్వారా సంతానాన్ని కంటుంది. వారిని పెంచి పెద్ద చేసి తన భర్త చేతిలోనే ప్రాణాలు వదులుతుంది. రాధిక నటనలో ఎక్కడా తొందర కానీ, తొట్రుపాటు కానీ, ఎక్కువ తక్కువలు కానీ ఉండవు. నెమ్మదిగా, నిదానంగా, నిశ్చలంగా తన జీవితాన్ని తన పెనిమిటితో పాటు గడపడమే ఉంటుంది. అందుకు వచ్చిన అవరోధాలను తొలగించుకోవడమే ఉంటుంది.

స్వాతికిరణంలో గొప్ప సంగీత విద్వాంసుడి భార్య శారద తన భర్తలో ఈర్ష్య పెరిగి పెరిగి తన భర్త ఆరోగ్యాన్నే కాకుండా గంగాధరం ప్రాణాలు కూడా తీసేస్తుందని ఊహించలేకపోతుంది. జరిగింది గ్రహించాక తట్టుకోలేక మానసికంగా చితికిపోతుంది. అంత సంక్లిష్టమైన పాత్రని అవలీలగా అభినయించారు రాధిక.

ఆనతినీయరా అన్న పాట చూస్తూ తన్మయంతో రాధిక చూపించిన ముఖ కవళికలు నటన నేర్చుకుంటున్న వాళ్ళ కి పాఠాలుగా ఉపయోగ పడతాయని నా గాఢాభిప్రాయం. అలాగే జాలిగా జాబిలమ్మ అని హృదయవిదారకంగా గంగాధరంతో కలిసి పాడుతున్నప్పుడు రాధికతో హృదయం కలపని ప్రేక్షకుడు ఉండడు. చివరగా భర్త తను సంగీత పాఠాలు చెప్తున్న చోటుకే వచ్చి సరిగమలు నేర్చుకుంటోంటే రాధిక చూపించిన ప్రశాంతత నటనకు పెద్దబాలశిక్ష.

రెండు చిత్రాలలోనూ రాధిక పవిత్రమైన ముత్తైదువు. నిండుదనం కప్పుకున్న అందం.

# అనుబంధం



# అనుబంధం

## విశ్వనాథ్ సినీప్రస్థానం

### శబ్దగ్రహణం

తోడికోడళ్ళు (1957)

బండరాముడు (1959)

### సహకార / సహాయ దర్శకత్వం

ఇద్దరు మిత్రులు (1961)

చదువుకున్న అమ్మాయిలు (1963)

మూగ మనసులు (1964)

డాక్టర్ చక్రవర్తి (1964)

### స్క్రీన్ ప్లే

సుడిగుండాలు (1968)

## దర్శకత్వం (తెలుగు)

ఆత్మ గౌరవం (1965)

ప్రైవేట్ మాస్టర్ (1967)

కలిసొచ్చిన అదృష్టం (1968)

ఉండమ్మా బొట్టుపెడతా (1968)

నిండు హృదయాలు (1969)

నిండు దంపతులు (1971)

చెల్లెలి కాపురం (1971)

చిన్ననాటి స్నేహితులు (1971)

కాలం మారింది (1972)

శారద (1973)

నేరము శిక్ష (1973)

అమ్మ మనసు (1974)

ఓ సీత కథ (1974)

జీవనజ్యోతి (1975)

మాంగల్యానికి మరోముడి (1975)

సిరిసిరిమువ్వ (1976)

ప్రేమబంధం (1976)

జీవితనౌక (1976)

కాలాంతకులు (1978)

సీతామాలక్ష్మి (1978)

ప్రెసిడెంట్ పేరమ్మ (1979)

శంకరాభరణం (1980)

అల్లుడు పట్టిన భరతం (1980)

శుభోదయం (1980)

సప్తపది (1981)

శుభలేఖ 1982)

సాగరసంగమం (1983)

జననీ జన్మభూమి (1984)

స్వాతిముత్యం (1986)

సిరివెన్నెల (1986)

శ్రుతిలయలు (1987)

స్వయంకృషి (1987)

స్వర్ణకమలం (1988)

సూత్రధారులు (1989)

స్వాతికిరణం 1992)

ఆపద్బాంధవుడు (1992)

శుభసంకల్పం (1995)

చిన్నబ్బాయి (1997)

స్వరాభిషేకం (2004)

శుభప్రదం (2010)

(పై చిత్రాలలో సుమారు పాతిక చిత్రాలకు
కథా, స్క్రీన్ ప్లే విశ్వనాథ్ గారే సమకూర్చుకున్నారు.
మరో ఐదు చిత్రాలకి స్క్రీన్ ప్లే ఆయనదే)

## దర్శకత్వం (హిందీ)

సర్గం (సిరిసిరిమువ్వ) 1979

కామ్ చోర్ (శుభోదయం) 1982

శుభ్ కామ్నా (శుభలేఖ) 1983

జాగ్ ఉఠా ఇన్సాన్ (సప్తపది) 1984

సన్ జోగ్ (జీవనజ్యోతి) 1985

సుర్ సంగం (శంకరాభరణం) 1985

ఈశ్వర్ (స్వాతిముత్యం) 1989

సంగీత్ (1992)

ధన్వాన్ (1993)

ఔరత్ ఔరత్ ఔరత్ (1996)



## నటన (తెలుగు)

శుభసంకల్పం (1995)

వజ్రం (1995)

కలిసుందాం రా (2000)

నరసింహనాయుడు (2001)

నిన్నుచూడాలని (2001)

సీమసింహం (2002)

నువ్వు లేక నేను లేను (2002)

సంతోషం (2002)

లాహిరి లాహిరి లాహిరిలో (2002)

నీ స్నేహం (2002)

అల్లరి రాముడు (2002)

ఠాగూర్ (2003)

లక్ష్మీ నరసింహ (2004)

స్వరాభిషేకం (2004)

దోస్త్ (2004)

అతడు (2005)

శ్లోకం (2005)

ఆడవారి మాటలకు అర్థాలే వేరులే (2007)

పాండురంగడు (2008)

Mr. పర్ ఫెక్ట్ (2011)

దేవస్థానం (2012)

!కుబేరుడు (2013)

హైపర్ (2016)

## నటన (తమిళం)

కురుతి పునల్ (1995)

ముగవరి (1999)

కాక్కై సిరగినిలె (2000)

బగవతి (2002)

పుదియ గీత్తై (2003)

యారడి నీ మోహిని (2008)

రాజపాట్టై (2011)

సింగం 2 (2013)

లింగా (2014)

ఉత్తమ విలన్ (2015)

## నటన (కన్నడ)

ప్రేమ బరహ (2018)



## అవార్డులు

### భారత ప్రభుత్వం

దాదాసాహె" ఫాల్కే అవార్డ్ (2017)

పద్మశ్రీ (1992)

### ఉత్తమ చిత్రాలు

శంకరాభరణం

సప్తపది

### రాష్ట్ర ప్రభుత్వం

రఘుపతి వెంకయ్య అవార్డ్ (1992)

### నంది అవార్డులు

కథా రచయితగా

స్క్రీన్ ప్లే రచయితగా

దర్శకుడిగా

నటుడిగా

ఎన్నో






2016
DADASAHEB PHALKE AWARD










K.VISHWANATH





# అనామకుడు

(డా. ఎ. ఎస్. రామశాస్త్రి)

మద్రాస్ ఐఐటీ నుండి పీహెచ్డీ
Oxford, Kellog విద్యాలయాలలో ఉన్నత విద్య
రిజర్వ్ బేంక్ ఆఫ్ ఇండియాలో మూడున్నర దశాబ్దాలు
IDRBT Director గా ఆరున్నర సంవత్సరాలు

ఆర్థికశాస్త్రంలో ఆంగ్లపుస్తకాలు
‘Valuation of Financial Assets’
‘Quantitative Methods for Banking and Finance’
అందులో మొదటి పుస్తకం చైనీస్ లో కూడా ప్రచురితం

అనామకుడు కలంపేరుతో తెలుగులో
ఎన్నో కథలూ, నవలికలూ, శ్రవ్యనాటికలు
‘రమణీయం’, ‘శీలమా అదియేమి’ కథాసంకలనాలు
‘ఉషశ్రీ ఇంతింతై వటుడింతయై’ జీవితకథ
‘అక్షరాంజలి’ లఘుకావ్యం

web: www.asramasastri.com
email: ramasastri@hotmail.com
Telegram @ Ramasastri